The Universal human religion of scriptures

ధర్మ గ్రంథాల ఆధారిత విశ్వమానవ ధర్మం!



9 Parts

M. A. Abhilash
96664 88877

THE UNIVERSAL HUMAN RELIGION OF SCRIPTURES

First Edition: November -2026
Copies: 1000
Price: 550/-

All rights Reserved by Author
Judicial disputes are subject to Kakinada Jurisdiction.

Authored and Published by

MUSHTAKH AHMAD ABHILASH

Do 16-33-6/f Pachipala Vari Street,
Sambha Murthy Nagar,
Kakinada 533003, A.P, INDIA.

Contact +91-96664 88877
e-mail: unitymentor.com@gmail.com

ప్రతి ధార్మికుడూ తప్పక తెలుసుకోవలసిన నాలుగు విషయాలు!

1. రెండు భ్రమలు!

1. మా మత వర్గాన్ని మాత్రమే దేవుడు ప్రేమిస్తాడు.

2. ఎదుటి మతవర్గాలన్నిటినీ దేవుడు ద్వేషిస్తాడు.

ఇవే ఆ రెండు భ్రమలు!

2. రెండు వాస్తవాలు!

1. సకల మతవర్గాల్లో ఉన్న 'చిత్తశుద్ధిగల సజ్జనుల'ను దేవుడు ప్రేమిస్తాడు.

2. సకల మతవర్గాల్లో ఉన్న 'బుద్ధిపూర్వక దుర్జనుల'ను దేవుడు ద్వేషిస్తాడు.

ఇవే ఆ రెండు వాస్తవాలు!

3. ఆ దైవం కోరుకొనని ఒక మార్పు!

'ఒక మతం'లో ఉన్నవారు 'మరొక మతం'లో మారటం.
ఇదే ఆ దైవం కోరుకొనని ఆ ఒక మార్పు!

4. ఆ దైవం కోరుకొనే ఒక మార్పు!

'దుర్జనులు'గా ఉన్నవారు 'సజ్జనులు'గా మారటమే!

ఇదే ఆ దైవం కోరుకొనే ఆ ఒక మార్పు!

ఈ వాస్తవాలను తెలుసుకొని మసలుకుంటేనే
ఇహలోకంలో మనశ్శాంతి, పరలోకంలో మోక్షం లభిస్తుంది!

అతి ముఖ్యమైన విజ్ఞప్తి!

'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' సంస్థకు చెందిన Philosophy and Ideology Department 'వ్యక్తి పరివర్తన – సమాజ సంస్కరణ' అనే అంశాలపై నిరంతరం పరిశోధనలు సాగిస్తోంది. ఈ విభాగం నుండి వెలువడే ప్రతి ఆలోచన, ప్రతి మార్గదర్శకం ఎంతో లోతైనది, పరివర్తనాత్మకమైనది. కావున, 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' సకల సభ్యులూ, బాధ్యులు వీటిని లోతుగా అధ్యయనం చేసి, సంపూర్ణంగా అవగాహన చేసుకోవడం తప్పనిసరి!.

విశ్వమానవ సౌభ్రాతృత్వం, సమానత్వం గురించి
ధర్మశాస్త్రాలు చేస్తున్న విశ్వజనీన ప్రకటనలు
ఏమిటో కాస్త నిశితంగా గమనించండి!

వేద కాంక్ష:

समानी व आकूतिः समाना हृदयानि वः।
समानमस्तु वो मनो यथा वः सुसहासति॥

–ऋग्वेदं 10:191:4

वेदों में कामना है कि सबके मन सबके कल्याण में एक समान हों और ईश्वर स्मरण तथा शुभ गुणों के प्रति सबका चिंतन समान हो। सब प्राणियों के दुःखनाश और सुख वृद्धि की भावना सन्निहित हो।

May your intentions be common; may your hearts be united; may your minds be one, so that you may live together in harmony.

“మీ అందరి ఆశలు ఒక్కటిగా ఉండాలి. మీ అందరి హృదయాలు ఒక్కటిగా ఉండాలి. మీ అందరి ఆలోచనలు ఒక్క త్రాటిపై నడవాలి. మీరందరూ ఒక్కటి అయి మంచి స్నేహితులు కావాలి!”

تم سب کے ارادے ایک جیسے ہوں، تم سب کے دل ایک دوسرے سے ہم آہنگ ہوں، تم سب کی سوچ ایک ہو، تاکہ تم سب مل جل کر خوشگوار زندگی گزار سکو!

బైబిలు ఆజ్ఞ-

And now, my friends, good-bye! Strive for perfection; listen to my appeals; agree with one another; live in peace. And the God of love and peace will be with you

-2 Corinthians 13:11

अब हे भाईयों, मैं तुमसे विदा लेता हूँ। अपने आचरण ठीक रखो। वैसा ही करते रहो जैसा करने को मैंने कहा है। एक जैसा सोचो। शांतिपूर్వక रहो। जिससे प्रेम और शांति का परमेश्वर तुम्हारे साथ रहेगा।

“సహోదరులారా! సంతోషించుడి, సంపూర్ణులైయుండుడి, ఆదరణ కలిగియుండుడి, ఏకమనస్సుగలవారై యుండుడి సమాధానముగా ఉండుడి...’’ –2 కొరింథీ 13:11

تواب اے بھائیواور بہنو! میں خدا حافظ کہتا ہوں۔ کامل ہونے کی کوشش کرو۔ میں نے جن باتوں کو کرنے کے لئے لکھا ہے اس پر عمل کرنے کی کوشش کرو۔ آپس میں ایک دوسرے کے ساتھ مل جُل کر اور سلامتی سے رہو تو بے لوث محبت والا خدا اور اسکی سلامتی تم پر رہیگی۔

జైన ప్రబోధనం!

సవ్వే పాణా ఇచ్ఛంతి జీవితుమ్, న ఇచ్ఛంతి మరణం

–ఆచారాంగ సూత్రం

సకల ప్రాణులు జీవించాలనే కోరుకుంటాయి, మరణాన్ని ఏదీ కోరుకోదు. కాబట్టి అందరూ ఒకరినొకరు మిత్రులుగా భావించి, సామరస్యంగా జీవించాలి.

అలాగే జైన ప్రార్థనలోని ప్రసిద్ధ సూత్రం:

సత్తెషు మైత్రి, గుణిషు ప్రమోదం, క్లిష్టేషు జీవేషు కృపాపరత్వమ్

సమస్త జీవుల పట్ల మైత్రి కలిగి ఉండటమే నిజమైన ధర్మం.

सभी जीव जीना चाहते हैं, कोई मरना नहीं चाहता। इसलिए, सभी को एक-दूसरे को दोस्त मानना चाहिए और मिलजुलकर रहना चाहिए।

साथ ही, एक मशहूर जैन प्रार्थना का सिद्धांत:

सभी जीवों के साथ दोस्ताना व्यवहार करना ही सच्चा धर्म है।

All living beings desire to live; none seek death. Therefore, everyone should regard one another as friends and live in harmony.

Similarly, there is a well-known principle in Jain prayer:

To harbor friendship towards all living beings is the true essence of Dharma!

تمام جاندار جینے کی خواہش رکھتے ہیں، کوئی مرنے کی خواہش نہیں رکھتا۔اس لیے سب کو ایک دوسرے کو دوست سمجھنا چاہیے اور ہم آہنگی سے رہنا چاہیے۔

اس کے علاوہ، ایک مشہور جین نماز کا اصول:

تمام جانداروں کے ساتھ دوستانہ ہونا ہی سچا دھرم ہے۔!

బౌద్ధ ప్రబోధనం!

సుఖో సంఘస్స సా మగ్గీ సమగ్గానాం తపో సుఖో

–ధమ్మపదం, Buddhavagga 14:194

సంఘం యొక్క ఐక్యత ఎంతో సుఖకరమైనది; అలా ఐకమత్యంతో కలిసి జీవించేవారి తపస్సు లేదా సాధన కూడా సులభతరమై సిద్ధిస్తుంది.

మరోచోట బుద్ధుడు ఇలా అంటాడు:

ఒకరికొకరు సహాయపడుతూ, కలసికట్టుగా జీవించండి. మీ మధ్య విభేదాలు వీడి ఒకే కుటుంబంలా మెలగండి.

समाज की एकता बहुत अच्छी होती है; जो लोग एकता में साथ रहते हैं, उनकी तपस्या या साधना भी आसान और फलदायी होती है।

कहीं और बुद्ध कहते हैं:

एक दूसरे की मदद करो और साथ रहो। अपने मतभेदों को दूर रखो और एक परिवार की तरह रहो।

Unity within a community is highly conducive to well-being; for those who live together in such harmony, spiritual practice—or *sadhana*—becomes easier and more likely to reach fruition.

Elsewhere, the Buddha says:

Live together in unity, supporting one another. Set aside your differences and conduct yourselves as a single family.

برادری کا اتحاد بہت خوشگوار ہے؛ اتحاد میں رہنے والوں کی سادگی یا مشقیں بھی آسان اور نتیجہ خیز ہیں۔

دوسری جگہ مہاتما بدھ کہتے ہیں:

ایک دوسرے کی مدد کریں اور مل جل کر رہیں۔ اپنے اختلافات کو ایک طرف رکھیں اور ایک خاندان کی طرح زندگی گزاریں۔

తమిళ ప్రబోధనం!

అన్బుమ్ శివముమ్ ఇరణ్డెన్బార్ అరియార్;
అన్బుమ్ శివముమ్ అరిందార్ అన్బే శివమాయ్ ఇరుప్పార్.
తిరుమంత్రం (మంత్రం 1922)

అనజాన లోగ సోచతే హైం కి ప్యార ఔర భగవాన అలగ-అలగ హైం। జో లోగ జానతే హైం కి వే ఏక హీ హైం, వే ప్యార కే రూప మేం జీతే హైం, సభీ కే సాథ ఏక హోకర।

The ignorant say that Love and Shiva are two separate things; Those who have truly understood both, know that Love itself is Shiva.

ప్రేమ, దేవుడు వేర్వేరు అని అమాయకులు భావిస్తారు. ఆ రెండూ ఒక్కటే అని తెలుసుకున్నవారు ప్రేమ స్వరూపులుగా, అందరితో ఐక్యంగా జీవిస్తారు.

جاہل سمجھتے ہیں کہ محبت اور خدا الگ ہیں۔ جو جانتے ہیں کہ وہ ایک ہیں اور سب کے ساتھ متحد ہو کر محبت کے مجسم بن کر رہتے ہیں۔

సిక్కు ప్రబోధనం!

అవల్ అల్లాహ్ నూర్ ఉపాయా కుద్రత్ కే సబ్ బందే,
ఏక్ నూర్ తే సబ్ జగూ ఉపజ్యో కౌన్ భలే కో మందే?
–గురు గ్రంథ సాహిబ్, అంగ్ 1299

सबसे पहले, अल्लाह ने अपनी दिव्य रोशनी बनाई, और सारी दुनिया उसके लोग हैं। उसी एक दिव्य रोशनी से यह पूरी दुनिया बनी। इसमें अच्छे और बुरे कौन हैं? सभी लोग बराबर हैं और उन्हें एक होना चाहिए।

In the beginning, Allah created His divine light; all beings in creation are His people. This entire universe emerged from that single divine light. So, who among them is good, and who is bad? All human beings are equal and should live in unity.

మొదట అల్లాహ్ తన దివ్య కాంతిని సృష్టించాడు, సృష్టిలోని అందరూ ఆయన ప్రజలే. ఆ ఒక్కే దివ్య కాంతి నుండి ఈ సమస్త జగత్తు ఉద్భవించింది. ఇక అందులో మంచివారరెవరు, చెడ్డవారరెవరు? మనుషులందరూ సమానమే, ఐక్యంగా ఉండాలి.

سب سے پہلے، اللہ نے اپنا نورِ الٰہی بنایا، اور تمام مخلوقات اس کے لوگ ہیں۔ اسی ایک نورِ الٰہی سے یہ ساری دنیا نمودار ہوئی۔ اس میں اچھے اور برے کون ہیں؟ تمام لوگ برابر ہیں اور متحد ہونا چاہیے۔

ఖురాన్ హితబోధ:

يَٰٓأَيُّهَا ٱلنَّاسُ ٱتَّقُواْ رَبَّكُمُ ٱلَّذِى خَلَقَكُم مِّن نَّفْسٍ وَٰحِدَةٍ وَخَلَقَ مِنْهَا زَوْجَهَا وَبَثَّ مِنْهُمَا رِجَالًا كَثِيرًا وَنِسَآءً ۚ وَٱتَّقُواْ ٱللَّهَ ٱلَّذِى تَسَآءَلُونَ بِهِۦ وَٱلْأَرْحَامَ ۚ إِنَّ ٱللَّهَ كَانَ عَلَيْكُمْ رَقِيبًا

–ఖురాన్ 4:1

హే మానవ జాతి! అపనె పాలనహార సె సావధాన రహొ, జిసనె తుమ్హేం ఎక హీ జీవ సె పైదా కియా, ఔర ఉసీ సె ఉసకా జొడ़ా బనాయా, ఔర ఉన దొనొం సె బహుత–సె పురుష ఔర స్త్రియాఁ ఫైలా దీం। ఔర ఉస ఈశ్వర సె సావధాన రహొ, జిసకె నామ పర తుమ ఎక–దూసరె సె [అపనె అధికార] మాంగతె హొ, ఔర నాతె–రిశ్తొం కె బంధనొం కా భీ ధ్యాన రఖొ। నిస్సందేహ, ఈశ్వర తుమ పర పూరీ నజ़ర రఖతా హై।

O MANKIND! Be conscious of your Sustainer, who has created you out of one living entity, and out of it created its mate, and out of the two spread abroad a multitude of men and women. And remain conscious of God, in whose name you demand [your rights] from one another, and of these ties of kinship. Verily, God is ever watchful over you.

మానవులారా! మిమ్మల్ని ఒకే ప్రాణి నుంచి పుట్టించి, దాన్నుంచే దాని జతను కూడా సృష్టించి, ఆ ఇద్దరి ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేసిన మీ ప్రభువు పట్ల భయ–భక్తులు కలిగి ఉండండి. ఏ దేవుని పేరుతో మీరు పరస్పరం మీ హక్కులను కోరుకుంటారో ఆయన పట్ల నిష్ఠ కలిగి ఉండండి. బంధుత్వ సంబంధాలను తెంచకండి. నిశ్చయంగా ఆయన మీ (మంచి–చెడు కర్మల)పై నిఘా పెట్టి ఉన్నాడు.

اے انسانو! اپنے اُس پالنے والے کا لحاظ کرو جس نے تم کو ایک شخص سے پیدا کیا اور اُسی سے اُس کی زوجہ کو پیدا کیا۔ (حوّا کو آدمؑ کی مٹّی سے خلق فرمایا) اور اُن دونوں سے بہت سے مردوں اور عورتوں کو (دنیا میں) پھیلا دیا۔ تو تم اُس خدا سے ڈرو جس کا واسطہ دے کر تم سوال کرتے ہو۔ اور قطع رحمی سے بھی بچو۔ یقین جانو کہ اللہ تم کو نگراں کے طور پر خوب دیکھ رہا ہے۔ (اس لیے تم عورتوں، رشتے داروں اور خاندان و قوموں کی حق تلفی سے بچو اور اُن کے بارے میں اللہ کے غضب سے ڈرو) ۔

మానవ మహోపకారి ప్రవక్త ముహమ్మద్ ఆదేశం!

اللَّهُمَّ! 1) أَلِّفْ بَيْنَ قُلُوبِنَا، 2) وَأَصْلِحْ ذَاتَ بَيْنِنَا، 3) وَاهْدِنَا سُبُلَ السَّلَامِ، 4) وَنَجِّنَا مِنَ الظُّلُمَاتِ إِلَى النُّورِ...

-Saheeh Abu Dawood 969

अल्लाह के रसूल को यह सिखाया गया था-
हे अल्लाह! 1) हमारे दिलों को आपस में जोड़ दे, 2) हमारे आपसी रिश्तों में सुधार कर, 3) हमें शांति के रास्ते पर चला, 4) हमें अंधेरे से उजाले की ओर ले आ...

The Messenger of Allah was taught-
O Allah! 1) Join between our hearts, 2) Reconcile our social relationship, 3) guide us to the path of peace, 4) bring us from darkness to light!

ప్రవక్త ముహమ్మద్ ఇలా ప్రార్థించమని ప్రజలను ఆదేశించారు–
"ఓ అల్లాహ్! 1) పరస్పరం మా హృదయాలను కలుపు, 2) మా మధ్య సయోధ్య కుదుర్చు, 3) మమ్మల్ని శాంతి పథాల వైపునకు మార్గదర్శకం చెయి, 4) మాకు చీకట్ల నుండి వెలుగు వైపునకు నడిపించు!".

اے اللہ! 1) تو ہمارے دلوں میں الفت و محبت پیدا کر دے، 2) اور ہمارے درمیان صلاح فرما دے، 3) اور سلامتی کی جانب ہماری رہنمائی کر دے، 4) اور ہمیں تاریکیوں سے کر روشنی عطا کر دے!

ప్రధాన అంశాలు

1. దుర్జనులను, సజ్జనులుగా మలచే ప్రేరకాలు ఏమిటి!----------1

2. తప్పుడు ధార్మిక ఆలోచన – సరైన ధార్మిక ఆలోచన----------18

3. విశ్వాసాలూ–ఆరాధనలు
సాధనాలు మాత్రమే – సత్కర్మలే గమ్యం!----------31

4. విశ్వాసాలూ–ఆరాధనలు
సాధనాలు మాత్రమే – సత్కర్మలే సర్వోన్నతం!----------53

5. విశ్వమానవ సమానత్వం – ధర్మశాస్త్రాల సందేశం!----------89

6. దైవ ప్రసన్నతకి ఆలంబన
విశ్వాసపథమా? – వివేకపథమా?----------110

7. నైతికతా–మానవతా
విలువలు పాటించే లోకులందరూ భక్తులే!----------140

8. మధ్యేమార్గం తప్పితే నీచత్వం! క్రూరత్వం!!----------172

9. మత విభేదాలు దేవుడే పరిష్కరిస్తాడు!----------194

దుర్జనులను, సజ్జనులుగా మలచే ప్రేరకాలు ఏమిటి!



Part-1

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం---------- I

దుర్జనులను సజ్జనులుగా మలచే రహస్యం ఏమిటి?----------1

దుర్జనులను అత్యంత వేగంగా
'సజ్జనులు'గా మలచే మౌలిక ప్రేరకాలు ఎన్ని? అవి ఏమిటి?----------2

Iవ ప్రేరకం అంతర్గతంగా ప్రతి మనిషిలో ఉండే మంచి-చెడుల సహజ నైతిక స్పృహ-----3

IIవ ప్రేరకం ప్రజాస్వామ్య రాజ్యాంగం విధించే శిక్షా-బహుమానాలు
ముఖ్యంగా కఠిన శిక్షలైన కారాగాలూ, మరణ దండనలు విధించే ప్రభుత్వ వ్యవస్థ---4

చైనా అభివృద్ధి చెందటానికి 'ప్రేరకాలు' ఏమిటి?----------5

IIIవ ప్రేరకం ధర్మ గ్రంథాలు బోధించే శాశ్వత శిక్షా బాహుమానాల సమాచారం!-----6

1. వైదిక వాఙ్మయం ప్రకారం- విశ్వాసాలూ, ఆరాధనక కంటే సత్కర్మలే కీలకం!-------7

2. బైబిలు ప్రకారం- విశ్వాసాలూ, ఆరాధనల కంటే సత్కర్మలే కీలకం!----------9

3. ఖురాను ప్రకారం- విశ్వాసాలూ, ఆరాధనల కంటే సత్కర్మలే కీలకం!----------12

సారాంశం----------14

పరిచయం

మానసిక–శారీరక సామర్థ్యాల్లో జన్మతః దుర్బలు ఉండటం అనివార్యం. అలాంటి వారిని దోచుకుతినే దుర్లక్షణం పోయి, వారితో పంచుకుతినే సులక్షణం బలవంతుల్లో రావాలంటే వారి వ్యక్తిగత–సామూహిక జీవితాన్నల్లో ఈ క్రింది పది విలువలు రావటం అనివార్యం!

I. వ్యక్తిగత నైతిక విలువలు (Personal Moral Values):

1. నిజాయితీ–సత్యసంధత (Honesty and Truthfulness),
2. ఆత్మనిగ్రహం–సహనం (Self–control and Forbearance),
3. జవాబుదారీతనం–బాధ్యత భావం (Accountability and Responsibility),
4. ఆత్మవలోకనం–ఆత్మ విమర్శ (Introspection and Self–criticism)
5. వినమ్రత విధేయత (Humility and Obedience).

II. సామూహిక మానవతా విలువలు (Collective Humanitarian Values):

1. సహానుభూతి–దయ (Empathy and Compassion),
2. సమానత్వం–సమ్మిళితత్వం (Equality and Inclusivity),
3. సహకారం–సహజీవనం (Cooperation and Coexistence),
4. సఖ్యత–ఐక్యత (Harmony and Unity):
5. న్యాయము–నిష్పక్షపాతము (Justice and Fairness).

వ్యక్తిగత–సామూహిక జీవితాల్లో పై విలువలపట్ల ఎంతో బలమైన నిబద్ధత ఉంటేనేగానీ వాటిని ఎవరూ పాటించలేరు. ఆ నిబద్ధత రావాలంటే అంతే బలమైన ప్రేరకాలు ఉండాలి. అంటే ప్రేరకాలు లేకపోతే నిబద్ధత రాదు, నిబద్ధత లేకపోతే వ్యక్తిగత–సామూహిక జీవితాల్లో ఆ పది విలువల వాగాడంబరం తప్ప, ఆచరణ మాత్రం సాధ్యంకాజాలదు!

మానసికమైన, రాజ్యాంగబద్ధమైన, ధర్మశాస్త్రాల ఆధారిత బలమైన ప్రేరకలు పేర్కొనటం జరిగినది. ఇదొక చిరు పుస్తకమే అయినప్పటికీ ప్రతి ఒక్కరిలోనూ స్వీయ ఆత్మపరిశీలనా జ్వాలను రగిలించి, దుర్జనులుగా ఉన్న వారిని సజ్జనులుగా మలచే గొప్ప ప్రచోదకం కాగలదని, అలాగే సంఘ సంస్కర్తలకు ఒక బలమైన మార్గదర్శి కాగలదని ఆశిస్తున్నాను.

KAKINADA
12-02-2025

M. A. Abhilash

దుర్జనులను సజ్జనులుగా మలచే రహస్యం ఏమిటి?

ప్రియమైన సజ్జనులారా!

నేటి మానవాళి ఘోర నైతిక సంక్షోభంలో పడి సతమతమౌతోంది. మా పరిశీలన ప్రకారం దీనికి ప్రధాన కారణం– మనుషుల్లో 'నైతికత, మానవత, ఐక్యత' అనే మూడు మౌలిక విలువలు లోపించటమే! ఈ విలువల రాహిత్యానికి మూల కారణం– నిజానికి మనిషి 'భౌతిక జీవి' మాత్రమే కాదు 'నైతిక జీవి' కూడా. అలాంటి వానికి కేవలం 'భౌతిక సామర్థ్యాల'ను మాత్రమే వికసింపజేసే ఒక్క 'భౌతిక విద్య'ను మాత్రమే ఇచ్చి, ప్రతి వ్యక్తిలోనూ సహజంగా ఉండే 'నైతిక స్పృహ'ను జాగృత పరిచే 'నైతిక విద్య'ను అందించకపోవటమే!

అందుకే ఒక వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలో 'అనైతికత', వ్యక్తులు తమ సామూహిక జీవితాల్లో 'అమానవీయత', సామాజిక జీవితంలో 'అనైక్యత' వంటి దుర్గుణాలు విజృంభించి మానవ సమాజం ఘోర సంక్షోభాల సుడిగుండంలో పడి అతలాకుతలం అవుతుంది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కించాల్సిన సామాజిక, నైతిక, ధార్మిక బాధ్యత ప్రతి వ్యక్తిపైనా ఉంది.

అందులో భాగంగానే 'దుర్జనులు' అయిన ప్రజలను 'సజ్జనులు'గా మలచాలనే ధ్యేయంతో సుమారు నలభై ఐదు సంవత్సరాల నుండి i) మానవ మనస్తత్వాన్ని ii) భారత రాజ్యాంగాన్ని iii) వివిధ సంస్కరణోద్యమాలను, iv) ప్రధాన ధర్మశాస్త్రాలైన గీతా–బైబిల్–ఖురాన్ తదితర గ్రంథాలను లోతుగా అధ్యయనం చేయటం జరిగింది. ఇప్పటి

వరకూ ఈ కృషి 'అసంఘటితం'గానే సాగింది. అయితే ప్రస్తుత సమాజంలో చెడుల విజృంభణ దృష్ట్యా 'సంఘటితం'గా పనిచేయాలని సంకల్పించుకొని, 2025లో 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' మకుటంతో ఒక బృహత్తర 'వ్యక్తి సంస్కరణా యజ్ఞం' ప్రారంభించటం జరిగింది.

దుర్జనులను అత్యంత వేగంగా 'సజ్జనులు'గా మలచే మౌలిక ప్రేరకాలు ఎన్ని? అవి ఏమిటి?

మనిషి మనస్తత్వరీత్య తాను ఏ కార్యం చేసినా దానికి 'ప్రేరకం' అంటూ ఒకటి తప్పనిసరిగా ఉండాలి. ఏ ప్రేరకమూ లేనిదే ఏ మానవుడు ఏ కార్యమూ చేయజాలడన్నది జగమెరిగిన సత్యం. మనుషుల్లో ప్రధానంగా రెండు వర్గాలు: i) 'భౌతికవాదులు' (Materialists), ii) 'భావవాదులు' (Ideologists). ఈ రెండు వర్గాల్లో ఎవరి ప్రేరకంతో వారిని ప్రేరేపిస్తేనే గాని 'వ్యక్తి సంస్కరణ' సుసాధ్యం కాజాలదు. ఒక వ్యక్తిలో 'పరివర్తన' రావాలంటే ప్రధానంగా ఈ మూడు ప్రేరకాల్లో ఏదో ఒకటి తప్పనిసరి.

Iవ ప్రేరకం అంతర్గతంగా ప్రతి మనిషిలో ఉండే మంచి-చెడుల సహజ నైతిక స్పృహ

IIవ ప్రేరకం ప్రజాస్వామ్య రాజ్యాంగం విధించే శిక్షా-బహుమానాలు. ముఖ్యంగా కఠిన శిక్షలైన కారాగారమూ, మరణ దండనలు విధించే ప్రభుత్వ వ్యవస్థ

IIIవ ప్రేరకం ధర్మ గ్రంథాలు బోధించే శాశ్వత శిక్షా-బహుమానాల ధర్మబోధలు

ఈ మూడు ప్రేరకాల్లో మొదటి రెండు ప్రేరకాలు 'భౌతికవాదుల'కి బలంగా పని చేస్తాయి. ఇక, 'భావవాదుల'కి మూడవ ప్రేరకం బలంగా పనిచేస్తుంది. ప్రజలను 'సజ్జనులు'గా మలచాలంటే ఈ మూడు 'ప్రేరకాలు' తప్పనిసరి. 'వ్యక్తి'ని అత్యంత వేగంగా 'సజ్జనుడి'గా మలచే రహస్యం ఇదే!

మొదటిదైన అంతర్గత సహజ 'నైతిక ప్రేరణ'తో తప్ప, ఎలాంటి 'ఆశా-భయాల ప్రేరణ' లేకుండా 'పరివర్తన' చెందేవారు 'అత్యుత్తములు'. మిగిలిన రెండు విషయాల్లో ఉండే 'ఆశా-భయాల ప్రేరణ'తో 'పరివర్తన' చెందేవారు 'ఉత్తములు'. ఇక, ఏ ప్రేరకంతోనూ 'పరివర్తన' చెందని వారు 'అధములు' అన్నది గమనార్హం! ఇక ఒక్కొక్క ప్రేరకం ఏ విధంగా పని చేస్తుందో కాస్త నిశితంగా చూడండి.

IVవ ప్రేరకం:
అంతర్గతంగా ప్రతి మనిషిలో ఉండే మంచి-చెడుల సహజ నైతిక స్పృహ

మనుషులను పశువుల నుండి వేరు చేసే కొన్ని సహజ లక్షణాలు ఉన్నాయి వాటిలో... i) జన్మతః లభించే 'బుద్ధి', ii) 'సహజ నైతిక స్పృహ', iii) 'మనస్సాక్ష్యం'. ఈ మూడిటిలో ఏదో ఒక దాని 'ప్రేరణ'తో 'దుర్జనుడు' అయిన ఒక వ్యక్తి (భౌతికవాది)ని 'సజ్జనుడు'గా మలచటం సాధ్యమౌతుందని తెలుసుకున్నాం.

ఉదా: ఎవరైనా ఏదైనా 'దుష్కర్మ'కి పాల్పడితే "నువ్వు మనిషివా? పశువువా?" అని అప్పుడప్పుడు మీరే అంటుంటారు. మీరు అలా అనటానికి కారణం అతని వంటినిండా వెంట్రుకలు మొలవటమో, తోక రావటం వల్లనో కాదుకదా! మరేందుకు అలా అన్నారు? ఎందుకంటే అతడు 'నైతికత–మానవత' పరంగా దిగజారటమే! అంటే మీ ప్రకారం 'సత్కర్మల'తో 'మనిషితనం' మరియు 'దుష్కర్మల'తో 'పశుత్వం' కలుగుతుందని మీరు అంగీకరిస్తున్నట్లే కదా!

అంటే మీ 'బుద్ధి', 'సహజ నైతిక స్పృహ', 'మనస్సాక్ష్యం/ఆత్మసాక్ష్యం' దేనిని 'మంచి' అని చెబుతుందో, దానిని ధిక్కరించి, మీ స్వార్థం కోసమో, మీ మనోవాంఛల కోసమో 'చెడు'కు పాల్పడితే అది ఆత్మవంచనే కదా! ఒకవేళ మీకు మీరే 'ఆత్మ ద్రోహం' చేసుకుంటే అది ఎంత నీచం! ఎంత హీనం!! ఇంతకు మించిన పరమ వంచన ఇంకేముంటుంది? కాస్త ప్రశాంతంగా ఆలోచించండి!

మీతో పాటు మీతోటి వారికి కూడా మేలు చేస్తూ మీరు ఒక 'మహాత్ముని స్థానం'లో ఉన్నారా? లేదా ఇతరులకి కీడు చేయకుండా మీకు మీరే మేలు చేసుకుంటూ ఒక 'సామాన్య మనిషి స్థానం'లో ఉన్నారా? లేక మీకు మీరే మేలు పొందుతూ, ఇతరులకి కీడు తలపెడుతూ ఒక 'పశువు స్థానం'లో దిగజారిపోయారా? అన్నది మీకు మీరే ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం నేడు ఒక మనిషిగా మీపై ఎంతైనా ఉంది!

ఎందుకంటే ఈలోకం 'కార్యకారణ నియమం' (Cause and effect theory) ప్రకారం నడుస్తుంది. ఈరోజు ఒకవేళ మీరు మీ స్వార్థం కోసం ఒకరికి అన్యాయం చేస్తే అది రేపు ఏదో ఒక రూపంలో వచ్చి అతి భయంకరంగా, అతి కర్కశంగా మిమ్మల్ని కబళించదా? ఒక్కసారి ఆలోచించండి అని నిలదీస్తూ వ్యక్తుల 'బుద్ధి'ని, 'అంతర్గత నైతిక

స్పృహ'ని, 'మనస్సాక్షి'ని/ఆత్మసాక్షి'ని ప్రేరేపిస్తే 'దుర్జనులు' అయిన నాస్తికులు కచ్చితంగా 'సజ్జనులు'గా పరివర్తన చెందుతారనటంలో ఎలాంటి సందేహమూ లేదు.

IIవ ప్రేరకం: రాజ్యాంగం విధించే శిక్షా-బహుమానాలు ముఖ్యంగా కలిన శిక్షలైన కారాగాలూ, మరణ దండనలు విధించే ప్రభుత్వ వ్యవస్థ

నేడు మనం రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో జీవిస్తున్నాం. 1949 నవంబరు 26న "ఈ రాజ్యాంగాన్ని అంగీకరించి, శాసనంగా రూపొందించుకొని మాకు మేమే ఇచ్చుకుంటున్నాము!" అని ఎంతో గొప్పగా ప్రమాణం చేసిన వారిలో మీరూ ఒకరు. ఒకవేళ మీరు దానికి నిబద్ధులు కాకపోతే అది రాజ్యాంగ ద్రోహం కాదా!? ఒక్కసారి ప్రశాంతంగా ఆత్మపరిశీలన చేసుకోండి. భారత రాజ్యాంగంలో ముఖ్యమైన రెండు విషయాలు ఉన్నాయి. వాటిలో...

a. 'ఉత్తములైన పౌరుల కోసం పురస్కారాలు'– భారతరత్న, పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ వంటి సత్కారాలు

b. 'నేరస్తులైన పౌరుల కోసం శిక్షలు'– ఆస్తిజప్తు, కారాగారం, జీవిత ఖైదు, మరణదండన వంటి శిక్షలు

మీతో పాటు మీతోటి వారికి కూడా మేలు చేస్తూ మీరు ఒక 'ఉత్తమ పౌరుని స్థానం'లో ఉన్నారా? లేదా ఇతరులకి కీడు చేయకుండా మీకు మీరే మేలు చేసుకుంటూ ఒక 'సామాన్య పౌరుని స్థానం'లో ఉన్నారా? లేక మీకు మీరే మేలు పొందుతూ, ఇతరులకి కీడు తలపెడుతూ ఒక 'నేరస్తుని స్థానం'లో దిగజారిపోయారా? అన్నది మీకు మీరే ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం నేడు మీపై ఎంతైనా ఉంది!

రాజ్యాంగాన్ని గౌరవించి, దానికి నిబద్ధులైన వారు చరిత్రలో 'ఉత్తమ పౌరులు'గా నిలిచి, 'చరిత్రకారుల'ని కీర్తిని పొందుతారు. దానిని నిర్లక్ష్యం చేసినవారు రాజ్యాంగ ద్రోహులుగా, చట్ట వ్యతిరేకులుగా, నేరస్థులుగా పరిగణించబడి 'చరిత్రహీనులు'గా మిగిలిపోతారు.

నేటి అధికశాతం ప్రజలు ఆధునిక 'రాజ్యాంగబద్ధ నాగరిక సమాజం'లో జీవిస్తున్నారు. కాబట్టి వారికి రాజ్యాంగబద్ధదేశ పౌరునిగా 'విధులూ–బాధ్యతల అవగాహన'తో, వాటి

'శిక్షలూ–బహుమానాల'తో ప్రేరేపిస్తే 'దుర్జనులు' అయిన సామాన్య పౌరులు తప్పకుండా 'సజ్జనులు'గా పరివర్తన చెందుతారు.

చైనా అభివృద్ధి చెందటానికి 'ప్రేరకాలు' ఏమిటి?

ఉదా: చైనా దేశ పౌరుల్లో 'వ్యక్తిగత నిబద్ధత' (Personal commitment) రావడానికిగల ప్రధాన ప్రేరకాల్లో కొన్నిటిని చూడండి. దైవ భక్తి కంటే 'క్రమశిక్షణ' మరియు 'వ్యవస్థపట్ల భయం' ప్రధాన ప్రేరకాలుగా కనిపిస్తాయి. దీని వెనుక కొన్ని చారిత్రక, సామాజిక మరియు రాజకీయ కారణాలు ఉన్నాయి:

a. ప్రతి పాఠశాల, కార్యాలయంలో 'దేశభక్తి'ని మరియు ప్రభుత్వ లక్ష్యాలను ఒక 'క్రమశిక్షణ'గా బోధిస్తారు.

b. 'నైతిక విలువలు' మరియు 'సామాజిక బాధ్యత'కు ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. ఎందుకంటే చైనాలో చట్టం చాలా కఠినం. దీని కారణంగా శిక్షల భయం (Strict legalism) ఉంటుంది. అక్కడ భయం అనేది క్రమశిక్షణను పెంచడానికి ఒక సాధనంగా పనిచేస్తుంది.

ఉదా: అవినీతికి మరణశిక్ష. ఉన్నత స్థాయి అధికారులైనా, పెద్దపెద్ద వ్యాపారవేత్తలైనా అవినీతికి పాల్పడితే జీవిత ఖైదు లేదా మరణశిక్ష వంటి అత్యంత కఠినమైన శిక్షలు అమలు చేస్తారు.

c. కన్ఫ్యూషియస్ బోధనల ప్రకారం: అధికారాన్ని, పెద్దలను, పాలకులను గౌరవించడం వారి సంస్కృతిలో భాగం

d. సామూహిక ప్రయోజనం: వ్యక్తిగత ప్రయోజనం కంటే కుటుంబం మరియు దేశ ప్రయోజనమే ముఖ్యమని వారు భావిస్తారు. ఇది వారికి కష్టపడి పనిచేసేలా ప్రేరేపిస్తుంది

e. సామాజిక పరపతి స్కోరు (Social Credit System): చైనా ప్రభుత్వం ప్రజల ప్రవర్తనను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తుంది. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించినా, అప్పులు కట్టకపోయినా వారి 'స్కోర్' తగ్గుతుంది. స్కోర్ తగ్గితే ప్రయాణాలు, ఉద్యోగాలు, రుణాలు పొందడం అసాధ్యం

ఈ విధంగా కఠిన శిక్షలూ, కారాగారాలు 'దుర్జనులు' అయిన లౌకిక వాదులను, నాస్తికులను 'సజ్జనులు'గా పరివర్తన చెందటానికి 'బలమైన ప్రేరకాలు'గా పనిచేస్తాయి.

IIIవ ప్రేరకం:

ధర్మ గ్రంథాలు బోధించే శాశ్వత శిక్షా బాహుమానాల సమాచారం!

ధర్మ గ్రంథాలు ఇచ్చే - సందేశం చిరు పరిచయం

హిందూ, యూద, క్రైస్తవ, ముస్లిం తదితర ధార్మిక వర్గాలకి చెందిన వేదాలూ, ఉపనిషత్తులు, భగవద్గీత, బైబిలు, ఖురాన్ తదితర ధర్మగ్రంథాలు ఒకే ధర్మాన్ని ప్రతిపాదిస్తున్నాయి. దాని ఆలోచనా–ఆచరణా విధానాలు సార్వజనీనమైనవి, సార్వకాలికమైనవి. అవి ధర్మ గ్రంథాల్లో ఉన్నాయి. వాటి ప్రకారం– సత్కర్మలు లేని విశ్వాసాలు, సత్కర్మలు లేని ఆరాధనలు దేవుని వద్ద చెల్లవు అని హెచ్చరిస్తున్నాయి.

అంతేకాదు అవి– మీరు ఏ మత వర్గంలో ఉన్నారన్నది ప్రధానం కాదు, దుష్కర్మలకి దూరంగా, సత్కర్మలకి దగ్గరగా ఉండే 'భయ–భక్తులు' (తఖ్వా/అప్రమత్తత) కలిగి ఉన్నారా? లేదా? అన్నదే ప్రధానమైన ప్రశ్నలు అన్నది ధర్మ గ్రంథాల వాదన.

గమనిక: ధర్మ గ్రంథాలు ఒకవైపు– "సత్కర్మలు చేసుకున్న వారికి శాశ్వత స్వర్గం/మోక్షం/ నిత్యజీవం ఉంటుంది" అనే 'శుభవార్త' ఇస్తున్నాయి. మరోవైపు– "దుష్కర్మలకి పాల్పడిన వారికి శాశ్వతనరకం/బంధం/చీకటి లోకం తప్పదు!" అని గట్టి 'హెచ్చరిక' చేస్తున్నాయన్నది గమనార్హం!

ఈ హెచ్చరికా–శుభవార్తలు ధార్మికులను మానసికంగా 'దుష్కర్మల'కి దూరం చేసి, 'సత్కర్మల'లకి దగ్గర చేస్తాయన్నది గమనార్హం! ఇదే ధర్మ గ్రంథాల చిరుపరిచయం.

మతాలు ఇచ్చే సందేశం - చిరు పరిచయం

మతము అనగా అభిప్రాయము లేదా ఆలోచన. 'ధర్మము' అని దేని గురించి చెప్పుకున్నామో దానిని వివరిస్తూ ఆయా పండితులు వ్యక్తపరచిన వివిధ అభిప్రాయాలూ, ఆలోచనలే ఆయా మతాలుగా ఏర్పడ్డాయి. అధికశాతం పండితులు ధర్మంలో ఉన్న స్ఫూర్తిని నాశనం చేసే విధంగా 'ధర్మ ప్రబోధనల'కి పూర్తి విరుద్ధంగా 'మత భావాల'ను రూపొందించారు. ఈనాటి హిందూ, యూద, క్రైస్తవ, ముస్లిం తదితర వర్గాలకి చెందిన అధికశాతం ప్రజలు ధర్మ గ్రంథాల్లో ఉన్న 'ధర్మము'ను కాక, ఆయా మతాలను అనుసరిస్తున్నారన్నది అత్యంత గమనార్హం.

గమనిక: ఆయా మతాల బోధకులు– "మీ సత్కర్మల మాట ఎలా ఉన్నా, అంతేకాదు ఒకవేళ మీరు దుష్కర్మలకి పాల్పడినా ఫరవాలేదు. మీరు మా మత వర్గంలో ఉంటే చాలు మీకు మోక్షం గ్యారంటీ!" అన్న భరోసా ఇస్తున్నారు. ఈ తప్పుడు భరోసా మతావలంబికులను మానసికంగా 'సత్కర్మల' నుండి దూరం చేసి, దుష్కర్మలకి దగ్గర చేస్తుందన్నది గమనార్హం! ఇదే మతాల చిరుపరిచయం

ఈ విధమైన ధర్మ విరుద్ధ మత భావనలు హిందువులకంటే యూదుల్లో, క్రైస్తవుల్లో, ముస్లిముల్లో బాగా నాటుకుపోయి ఉంది. అందుకే ఆయా మతాలవారు తమతమ మత వర్గాలకి చెందిన దుర్జనులను సజ్జనులగా మలచే ప్రయత్నం మానేసి, ఒక మతవర్గంలో ఉన్న వారిని మరొక మతవర్గంలో లాగే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ధర్మ గ్రంథాలు ఒక్క 'వ్యక్తిత్వ పరివర్తన'ను తప్ప, 'మత మార్పిడి'ని ఏమాత్రమూ అంగీకరించటం లేదు. ఈ వాస్తవాన్ని ఆయా మతాల పండితులు గుర్తించాలి.

1. వైదిక వాఙ్మయం ప్రకారం- విశ్వాసాలూ, ఆరాధనక కంటే సత్కర్మలే కీలకం!

హిందూ సమాజంలో ఈ జీవితం మాత్రమే జీవితం కాదు, దీని తరువాత రెండు విధాలైన మరణానంతర జీవన భావనలు ఉన్నాయి. వాటిలో...

a. దేవుని గూర్చిన యదార్థ జ్ఞానం కలిగిన వారికి జన్మలు ఉండవు. వారు సరాసరి జన్మ రాహిత్యంపొంది, ముక్తికి వెళ్లిపోతారు. ఉదా: గీత 8:15లో– "నన్ను పొందినవారికి పునర్జన్మ లేదు!" అన్నది

b. దేవుని గూర్చిన వాస్తవ జ్ఞానం లేనివారు మాత్రమే జన్మల చక్రంలో పడి తిరుగుతుంటారన్నది (హిందూ ధర్మంలో ఈ జన్మల చక్రం (సంసారం) అన్నది స్వయంగా ఒక శిక్ష!)

అంటే ఈ జన్మలో 'సత్కర్మలు' చేసుకున్న వారికి ఒకవేళ వారి 'బహుమానం' ఇక్కడ లభించకపోతే మరోజన్మలో అయినా తప్పకుండా లభిస్తుంది. అలాగే ఈ జన్మలో 'దుష్కర్మలు' చేసుకున్న వారికి ఒకవేళ ఇక్కడ 'శిక్షలు' తప్పినా మరోజన్మలో అయినా తప్పకుండా లభిస్తాయి.

A. ఉపనిషత్తు ప్రకారం- సజ్జనులకు శాశ్వత స్వర్గం లభిస్తుంది!

ధర్మశాస్త్రం చెప్పిన విషయాలను యధాతథంగా విశ్వసించాలి. తమకు నచ్చని, తమకు ఇబ్బంది పెట్టే విషయాలను తమకి అనుకూలంగా మలచుకొనే దుర్మార్గపు ప్రయత్నం చేయకూడదు. కొందరు శాశ్వత నరకం, శాశ్వత స్వర్గం అంటే ఆ పదానికి శాశ్వతం కాదు తాత్కాలికం అనే అర్థం వస్తుంది అని అంటుంటారు. అదే నిజమైతే దేవుడు ఆ పదమే చెబుతాడు కదా! ఇక శాస్త్రం ఏమంటుందో చూడండి.

మంత్రం: కేనోపనిషద్ 4:9- యో వా ఏతామేవం వేదాపహత్య పాప్మానమ అనంతే స్వర్గే లోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి.

అర్థం: ఎవరైతే బ్రహ్మజ్ఞానాన్ని పొందుతారో, వారు సమస్త పాపాలను నశింప జేసుకుంటారు. అంతులేని, అత్యుత్తమమైన స్వర్గలోకంలో ఎల్లప్పుడూ నిలిచిపోతారు.

ఈ మంత్రంలో- 'స్వర్గే లోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతితిష్ఠతి' అంటే 'స్వర్గలోకంలో ఎల్లప్పుడూ నిలిచిపోతారు, ఎల్లప్పుడూ నిలిచిపోతారు' అని రెండుసార్లు చెప్పటం అత్యంత గమనార్హం.

B. వేదం ప్రకారం దుర్జనులకు శాశ్వత నరకం తప్పదు!

ఋగ్వేదం 7:104:3-

మంత్రం: ఇంద్రాసోమా దుష్కృతః వవ్రే అంతః అనారంభణే తమసి ప్ర విధ్యతమ్।
యథా న అతః పునః ఏకః చన ఉద్యత్ తత్ వామ్ అస్తు సహసే మన్యుమత్ శవః॥

అర్థం: హే ఇంద్రా-సోములారా! వేద విరుద్ధ కర్మలు చేసే దుర్మార్గులను (దుష్కృతః), ఎవరూ వెళ్ళలేని, ఆధారం లేని అగాధమైన చీకటిలో (అనారంభణే తమసి) పడేయండి (ప్ర విధ్యతమ్). వారిలో ఎవరూ మళ్ళీ తిరిగి రాకుండా (పునః ఏకః చన ఉద్యత్) చూడండి. మీ ఇద్దరి పరాక్రమం (శవః) దుష్టులను అణచివేసేదిగా (సహసే) ఉండుగాక.

ఈ మంత్రంలో- 'పునః ఏకః చన ఉద్యత్' అంటే 'వారిలో ఏ ఒక్కడూ తిరిగి రాకుండా' అన్నది అత్యంత గమనార్హం. అనగా దుర్జనులు చీకటి అంటే నరకం నుండి ఇక తిరిగి వచ్చే అవకాశం లేనేలేదని వేదం చాలా స్పష్టంగా హెచ్చరిస్తుంది.

మీతో పాటు మీతోటి వారికి కూడా మేలు చేస్తూ మీరు ఒక 'సురుడు అంటే దేవత స్థానం'లో ఉన్నారా? లేదా ఇతరులకి కీడు చేయకుండా మీకు మీరే మేలు చేసుకుంటూ ఒక 'సామాన్య భక్తుని స్థానం'లో ఉన్నారా? లేక మీకు మీరే మేలు పొందుతూ, ఇతరులకి కీడు తలపెడుతూ ఒక 'అసురుడు అంటే రాక్షసుని స్థానం'లోకి దిగజారిపోయారా? అన్నది మీకు మీరే ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం ఒక నిజమైన హిందువుగా నేడు మీపై ఎంతైనా ఉంది!

వేదశాస్త్రాలను కేవలం విశ్వసించి, గౌరవించటమే కాక, వాటి విధి–నిషేధాలకి నిబద్ధులైన వారు చరిత్రలో 'సురులు అంటే దేవతలు'గా కీర్తిని పొందుతారు. వాటిని నిర్లక్ష్యం చేసిన హిందువులు ధర్మ ద్రోహులై, 'అసురులు అంటే రాక్షసులు'గా మిగిలిపోతారు.

వేదోపనిషత్తుల ఈ వాస్తవాలను 'ధార్మిక, తార్కిక ఆధారాల'తో నిరూపిస్తే దుర్జనులైన హిందూ జనులు 'సజ్జనులు'గా పరివర్తన చెందటానికి 'బలమైన ప్రేరకాలు'గా పనిచేస్తాయి.

2. బైబిలు ప్రకారం- విశ్వాసాలూ, ఆరాధనల కంటే సత్కర్మలే కీలకం!

ఈ జీవితం మాత్రమే జీవితం కాదు, 'నిత్య జీవం' అనే మరణానంతరం 'భవిష్యత్తు'లో రాబోయే 'పరలోక జీవితం' కూడా ఒకటి ఉందని బైబిలు చెబుతుంది. అయితే అక్కడ 'నిత్యజీవమా–నిత్యమరణమా' అన్నది 'ఈ జన్మ'లో చేసుకున్న 'సత్క్రియలు–దుష్క్రియల'పై మాత్రమే ఆధారపడి ఉందని బైబిలు గట్టిగా చెబుతుంది.

A. దేవుని దృష్టిలో విశ్వాసాలూ, ఆరాధనల కంటే సత్కర్మలే కీలకం!

బైబిలు పాత నిబంధన యెషయా 1:16 మిమ్మును కడుగుకొనుడి శుద్ధి చేసికొనుడి. మీ దుష్క్రియలు నాకు కనబడకుండ వాటిని తొలగింపుడి.

బైబిలు క్రొత్త నిబంధన యాకోబు 2:26– ప్రాణము లేని శరీరమేలాగు మృతమో ఆలాగే (సత్) క్రియలు లేని విశ్వాసమును మృతము.

B. పాత నిబంధన ప్రకారం- సత్కర్మలు చేసుకున్న వారికి శాశ్వత స్వర్గం లభిస్తుంది!

బైబిలు కీర్తనలు 16:11– జీవమార్గమును నీవు నాకు తెలియజేసెదవు నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు నీ కుడిచేతిలో నిత్యము సుఖములు కలవు.

బైబిలు కీర్తనలు 23:6– నేను బ్రదుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంట వచ్చును చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను.

పై వాక్యాల్లో 'నిత్య సుఖములు కలవు', 'చిరకాలము... నివాసము చేసెదను' అన్న వాక్య భాగాలు గమనించదగినవి. దీని ప్రకారం– సజ్జనులకి నిత్య జీవం లభిస్తుందని పరిశుద్ధ బైబిలు చెబుతుంది.

C. క్రొత్త నిబంధన ప్రకారం- సత్కర్మలు చేసుకున్న వారికి శాశ్వత స్వర్గం లభిస్తుంది!

బైబిలు 1 కోరింథీయులకు 15:42,43– మృతుల పునరుత్థానమును ఆలాగే శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయమైనదిగా లేపబడును;। ఘనహీనమైనదిగా విత్తబడి మహిమగలదిగా లేపబడును; బలహీనమైనదిగా విత్తబడి, బలమైనదిగా లేపబడును;

బైబిలు ప్రకటన గ్రంథం 21:3,4– అప్పుడు ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది, ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడైయుండి వారికి తోడైయుండును। ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించి పోయెనని సింహాసనములో నుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని.

ఈ వాక్యాల్లో– 'అక్షయమైనది', 'మరణము ఇక ఉండదు' అన్న వాక్యభాగాలు అత్యంత గమనార్హం.

D. పాత నిబంధన ప్రకారం- దుష్కర్మలు చేసుకున్న వారికి శాశ్వత నరకం తప్పదు!

బైబిలు దానియేలు 12:2– మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలు కొనెదరు; కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు.

బైబిలు యెషయా 66:24– వారు పోయి నామీద తిరుగుబాటు చేసినవారి కళేబరములను తేరిచూచెదరు వాటి పురుగు (ఆత్మ) చావదు వాటి అగ్ని ఆరిపోదు అవి సమస్త శరీరులకు హేయముగా ఉండును.

ఈ వాక్యాల్లో– 'నిత్యముగా హేయులగుటకు', 'వాటి పురుగు అంటే ఆత్మ చావదు వాటి నరకాగ్ని ఆరిపోదు' అన్న వాక్యభాగాలు గమనార్హం.

E. క్రొత్త నిబంధన ప్రకారం- దుష్కర్మలు చేసుకున్న వారికి శాశ్వత నరకం తప్పదు!

బైబిలు మత్తయి 25:41– అప్పుడాయన యెడమవైపున ఉండువారిని చూచి శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని (అనగా–సాతనుకును) వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్ని లోనికి పోవుడి.

బైబిలు 2 థెస్సలొనికయులకు 1:9,10– ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమ పరచబడుటకును, విశ్వసించిన వారందరి యందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు। ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమ నుండియు పారదోలబడి, నిత్యనాశనమను దండన పొందుదురు. ఏలయనగా మేము మీకిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి.

ఈ వాక్యాల్లో– 'నిత్యాగ్ని', 'నిత్యనాశనము' అన్న పదాలు గమనార్హం. పాత, క్రొత్త నిబంధనలకి సంబంధించిన ప్రత్యేకమైన ఈ వాక్య భాగాలు ఒకవైపు– దుర్జనులకు "శాశ్వత నరక శిక్షలు" తథ్యమని 'హెచ్చరిక' చేస్తున్నాయి. మరోవైపు– సజ్జనులకు "శాశ్వత స్వర్గ సుఖాలు" తప్పక లభిస్తాయని 'శుభవార్త' ఇస్తున్నాయి.

మీతో పాటు మీతోటి వారికి కూడా మేలు చేస్తూ మీరు ఒక 'గొప్ప నీతిమంతుని స్థానం'లో ఉన్నారా? లేదా ఇతరులకి కీడు చేయకుండా మీకు మీరే మేలు చేసుకుంటూ ఒక 'సామాన్య మనిషి స్థానం'లో ఉన్నారా? లేక మీకు మీరే మేలు పొందుతూ, ఇతరులకి కీడు తలపెడుతూ ఒక 'అనీతిమంతుని స్థానం'లోకి దిగజారిపోయారా? అన్నది మీకు మీరే ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం ఒక క్రైస్తవునిగా నేడు మీపై ఎంతైనా ఉంది!

పరిశుద్ధ బైబిలు గ్రంథాన్ని కేవలం విశ్వసించి, గౌరవించటమే కాక, దాని విధి–నిషేధాల ఆజ్ఞలకి నిబద్ధులైన యూదులూ, క్రైస్తవులు మాత్రమే చరిత్రలో 'గొప్ప విశ్వాసులు'గా కీర్తిని పొందుతారు. వాటిని నిర్లక్ష్యం చేసినవారు వాక్య విరోధులై, 'అవిశ్వాసులు'గా మిగిలిపోతారు.

పరిశుద్ధ బైబిలు గ్రంథానికి చెందిన ఈ వాస్తవాలను 'ధార్మిక, తార్కిక ఆధారాల'తో నిరూపిస్తే 'దుర్జనులు' అయిన యూద, క్రైస్తవ ప్రజానీకం 'సజ్జనులు'గా పరివర్తన చెందటానికి 'బలమైన ప్రేరకాలు'గా పని చేస్తాయి.

3. ఖురాను ప్రకారం- విశ్వాసాలూ, ఆరాధనల కంటే సత్కర్మలే కీలకం!

ఈ జీవితం మాత్రమే జీవితం కాదు, 'నిత్య జీవం' అనే మరణానంతరం 'భవిష్యత్తు'లో రాబోయే 'పరలోక జీవితం' కూడా ఒకటి ఉంది. అయితే దాని సాధన 'వర్తమాన జన్మ'లో చేసుకున్న 'సత్కర్మలు–దుష్కర్మల'పై మాత్రమే ఆధారపడి ఉందన్నది గమనార్హం. ఈ విషయం గురించి ఖురాన్ ఏమంటుందో చూడండి.

32:12– وَلَوْ تَرَىٰٓ إِذِ ٱلْمُجْرِمُونَ نَاكِسُوا۟ رُءُوسِهِمْ عِندَ رَبِّهِمْ رَبَّنَآ أَبْصَرْنَا وَسَمِعْنَا فَٱرْجِعْنَا نَعْمَلْ صَٰلِحًا إِنَّا مُوقِنُونَ

ఖురాను 32:12– మరియు (పునరుత్థాన దినమున) ఈ అపరాధులు, తమ ప్రభువు సమక్షంలో, ఏవిధంగా తమ తలలు వంచుకొని నిలబడిఉంటారో, నీవు చూడగలిగితే! వారు: "ఓ మాప్రభూ! మేమిప్పుడు చూశాము మరియు విన్నాము, కావున మమ్మల్ని తిరిగి (భూలోకానికి) పంపించు. మేము సత్కర్మలు చేస్తాము, నిశ్చయంగా, మాకు ఇప్పుడు నమ్మకం కలిగింది" అని అంటారు.

ఈ వాక్యం ఆధారంగా పరలోకంలో బాగా చూచిన తరువాత, బాగా విన్న తరువాత అర్థమైన విషయం ఏమిటి? నిత్య నరకానికి బలి చేసే అసలైన విషయం– "దుష్కర్మలు" అని తెలుస్తుంది.

A. ఖురాన్ ప్రకారం- సత్కర్మలు చేసుకున్న వారికి శాశ్వతస్వర్గం లభిస్తుంది!

46:14– أُو۟لَٰٓئِكَ أَصْحَٰبُ ٱلْجَنَّةِ خَٰلِدِينَ فِيهَا جَزَآءًۢ بِمَا كَانُوا۟ يَعْمَلُونَ

ఖురాను 46:14– అలాంటి వారే స్వర్గవాసులౌతారు. తాము చేస్తూ ఉండిన సత్కర్మల ఫలితంగా వారు అందులో శాశ్వతంగా ఉంటారు.

ఖురాను గ్రంథంలో– స్వర్గం గురించి చెప్పి అందులో 'శాశ్వతంగా ఉంటారు' అన్నది గమనార్హం.

B. ఖురాన్ ప్రకారం-
దుష్కర్మలు చేసుకున్న వారికి శాశ్వత నరకం లభిస్తుంది!

2:81– بَلَىٰ مَن كَسَبَ سَيِّئَةً وَأَحَاطَتْ بِهِۦ خَطِيٓـَٔتُهُۥ فَأُو۟لَٰٓئِكَ أَصْحَٰبُ ٱلنَّارِ ۖ هُمْ فِيهَا خَٰلِدُونَ

ఖురాను 2:81– నిస్సందేహంగా ఎవడు పాప కార్యాలకు ఒడిగట్టాడో, అతని పాపాలు అతన్ని చుట్టుముట్టాయో అలాంటి వారే నరక వాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

కులమతాలకి అతీతంగా మీతో పాటు మీతోటి వారికి కూడా మేలు చేస్తూ మీరు ఒక 'గొప్ప మోమిన్ అంటే విశ్వాసి స్థానం'లో ఉన్నారా? లేదా ఇతరులకి కీడు చేయకుండా మీకు మీరే మేలు చేసుకుంటూ ఒక 'సామాన్య ముస్లిం స్థానం'లో ఉన్నారా? లేక మీకు మీరే మేలు పొందుతూ, ఇతరులకి కీడు తలపెడుతూ ఒక 'ఒక ఫాసిఖ్/కాఫిర్ అంటే ఒక పాపిష్టి లేదా ఒక ధర్మాధిక్కరి స్థానం'లోకి దిగజారిపోయారా? అన్నది మీకు మీరే ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం ఒక నిజమైన ముస్లింగా నేడు మీపై ఎంతైనా ఉంది!

ఖురాను గ్రంథాన్ని కేవలం విశ్వసించి, గౌరవించటమే కాక, దాని విధి–నిషేధాల ఆజ్ఞలకి నిబద్ధులైన ముస్లిములు మాత్రమే చరిత్రలో 'గొప్ప విశ్వాసులు'గా కీర్తిని పొందుతారు. వాటిని నిర్లక్ష్యం చేసినవారు ఇస్లాం ధర్మ ధిక్కారులై, 'అవిశ్వాసులు'గా మిగిలిపోతారు.

ఖురాను గ్రంథంలో– స్వర్గ–నరకాల గురించి చెప్పి వాటిలో 'శాశ్వతంగా ఉంటారు' అని ప్రకటించటం గమనార్హం. ఖురాను గ్రంథానికి చెందిన ఈ వాస్తవాలను 'ధార్మిక, తార్కిక ఆధారాల'తో నిరూపిస్తే 'దుర్జనులు' అయిన ముస్లిములు 'సజ్జనులు'గా పరివర్తన చెందటానికి 'బలమైన ప్రేరకాలు'గా పనిచేస్తాయి.

సారాంశం

a. మీరు ఒకవేళ నాస్తికులైతే మీ 'అంతరాత్మ, మనస్సాక్ష్యం, బుద్ధీవివేకాల ప్రేరణ'తో 'దుష్కర్మల'ను విడనాడి, 'సత్కర్మలు' ఆచరిస్తేనే మీరు 'మహాత్ముల' జాబితాలో వస్తారు లేదంటే 'పశువులు'గా పరిగణించబడతారు!

b. మీరు సెక్యులరిస్టులు అయితే మీరు మీ 'రాజ్యాంగం' పట్ల నిబద్ధత కలిగి అది విధించే హక్కులూ–బాధ్యతల, శిక్షా–బాహుమానాల 'ప్రేరణ'తో 'దుష్కర్మల'ను విడనాడి, 'సత్కర్మలు' ఆచరిస్తేనే మీరు 'ఉత్తమ పౌరులు'గా పరిగణించబడతారు. లేదంటే 'నేరస్తుల' జాబితాలో చేరిపోతారు!

c. మీరు హిందువులైతే మీరు విశ్వసించే మీ 'వైదిక వాఙ్మయం' ప్రబోధనల 'ప్రేరణ'తో దుష్కర్మలను విడనాడి, సత్కర్మలు ఆచరిస్తేనే మీరు 'దేవతలు'గా పరిగణించబడతారు. లేదంటే 'రాక్షసుల' జాబితాలో చేరిపోతారు!

d. మీరు యూదులైతే లేదా క్రైస్తవులైతే మీరు విశ్వసించే మీ 'బైబిలు గ్రంథ' ప్రబోధనల 'ప్రేరణ'తో 'దుష్కర్మల'ను విడనాడి, 'సత్కర్మలు' ఆచరిస్తేనే మీరు 'నీతిమంతులు'గా పరిగణించబడతారు. లేదంటే 'అనీతిమంతుల' జాబితాలో చేరిపోతారు!

e. మీరు ముస్లిములైతే మీరు విశ్వసించే మీ 'ఖురాను గ్రంథ' ప్రబోధనల 'ప్రేరణ'తో 'దుష్కర్మల'ను విడనాడి, 'సత్కర్మలు' ఆచరిస్తేనే మీరు 'ముస్లిం'గా పరిగణించబడతారు. లేదంటే 'కాఫిర్ల' జాబితాలో చేరిపోతారు!

గమనిక: ఇక్కడ అత్యంత గమనార్హమైన విషయం– ధార్మికులు 'భవిష్యత్తు జన్మ'లో రాబోయే 'సుఖ–దుఃఖాలు' ఈ 'వర్తమాన జన్మ'లో చేసుకున్న 'సత్కర్మలు–దుష్కర్మల'పై ఆధారపడి ఉంటాయన్నది సారాంశం!

అటు– భౌతికవాదుల్లో ఇటు– భావవాదుల్లో ఇలాంటి తార్కిక–ధార్మిక ప్రబోధనల 'ప్రేరకాల' ఆధారంగా ప్రచురణ, ప్రబోధనలతో 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' శాంతియుతంగా ప్రేమపూర్వకంగా ప్రజలను సజ్జనులుగా మలచటానికి స్వచ్ఛందంగా కృషి చేస్తుంది. ఎందుకంటే సజ్జనుల సారాథ్యంతోనే ప్రపంచశాంతి సాధ్యం కనుక!

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

తప్పుడు ధార్మిక ఆలోచన
సరైన ధార్మిక ఆలోచన



Part-2

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం----------1

ఏది తప్పుడు ధార్మిక ఆలోచన? ఏది సరైన ధార్మిక ఆలోచ---------1

సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్ ఎందుకు? ఏమిటి? ఎలా?---------2

దుర్జనుల నేరాలకంటే సజ్జనుల మౌనం అత్యంత ప్రమాదకరం!-----2

సంస్కరణా బాధ్యత గురించి భగవద్గీత ఏమంటుంది?----------2

సంస్కరణా బాధ్యత గురించి బైబిలు గ్రంథం ఏమంటుంది?--------3

సంస్కరణా బాధ్యత గురించి ఖురాను గ్రంథం ఏమంటుంది?-------3

కామన్ సెన్స్ మాత్రమే అంతిమ ప్రమాణం!----------4

హిందూ సమాజ తప్పుడు ధార్మిక ఆలోచన ఏమిటి?----------5

భగవద్గీత ఇచ్చే సరైన ధార్మిక ఆలోచన ఏమిటి?----------5

క్రైస్తవ సమాజ తప్పుడు ధార్మిక ఆలోచన ఏమిటి?----------6

బైబిలు చెప్పే సరైన ధార్మిక ఆలోచన ఏమిటి?----------7

ముస్లిం సమాజ తప్పుడు ధార్మిక ఆలోచన ఏమిటి?----------8

ఖురాన్ గ్రంథ సరైన ధార్మిక ఆలోచన ఏమిటి?----------8

సారాంశం----------9

పరిచయం

మనిషిని నడిపించేది అతని ఆలోచనా దృక్పథమే. వ్యక్తులను 'తప్పుడు ధార్మిక ఆలోచనల' నుండి 'సరైన ధార్మిక ఆలోచన'ల వైపు మళ్లించినప్పుడు మాత్రమే ధార్మిక సమాజంలో సజ్జన భక్తులు పెరుగుతారు.

1. భగవద్గీత: మోక్ష సాధనకు, అధ్యాత్మ సాధనను పూర్తి చేయడానికి ఈ మానవ జన్మ మాత్రమే ఏకైక అవకాశం. అనేక జన్మలు ఉన్నాయని భావించి నిర్లక్ష్యం చేయడం తప్పుడు ఆలోచన అని భక్తులను అప్రమత్తం చేస్తుంది.

2. పరిశుద్ధ బైబిలు: క్రీస్తును విశ్వసించినంత మాత్రాన ఎన్ని పాపాలు చేసినా పర్వాలేదు అనుకోవడం తప్పుడు ఆలోచన. సత్యాన్ని తెలుసుకున్న తర్వాత కూడా బుద్ధిపూర్వకంగా పాపం చేస్తే దైవశిక్ష తప్పదని బైబిల్ హెచ్చరిస్తోంది.

3. దివ్య ఖురాన్: కేవలం దేవుని ఏకత్వ విశ్వాసం ఒక్కటి ఉంటే చాలు, ఎన్ని పాపాలు చేసినా నరకం నుండి బయటపడవచ్చు అనుకోవడం తప్పుడు ఆలోచన. దేవుని హద్దులు మీరి చెడు పనులు చేసే ముస్లిములకు సైతం శాశ్వత నరకశిక్షలు తప్పనని ఖురాన్ గద్దిస్తోంది.

తప్పుడు ధార్మిక ఆలోచన: మంచి పనులు (సత్కర్మలు) లేకపోయినా, కేవలం విశ్వాసాలు, ఆరాధనలు ఉంటే మోక్షం/రక్షణ లభిస్తుందనుకోవడం.

సరైన ధార్మిక ఆలోచన: విశ్వాసాలు, ఆరాధనలతో పాటు నైతిక–మానవీయ సత్కర్మలను ఆచరిస్తేనే మోక్షం/రక్షణ లభిస్తుందనుకోవడం.

కేవలం తాను సజ్జనుడిగా ఉండిపోవడమే కాకుండా, తోటి వారిని సజ్జనులుగా సంస్కరించడం ప్రతి ఒక్కరి నైతిక, ధార్మిక, సాంఘీక బాధ్యత. పైన పేర్కొన్న విషయాలను ఈ చిరు పుస్తకం ధర్మ శాస్త్రాల బలమైన ఆధారాలతో నిరూపిస్తుంది.

ఒక నిజమైన ధార్మికునిగా పరివర్తన చెందాలనుకునే వారికి ఈ పుస్తకం చక్కటి మార్గదర్శి అవుతుంది. అలాగే సమాజంలో పరివర్తన తేవాలనే సంస్కర్తలకు ఈ పుస్తకం ఒక కరదీపిక కాగలదు.

KAKINADA
12-02-2025

M. A. Abhilash

ఏది తప్పుడు ధార్మిక ఆలోచన? ఏది సరైన ధార్మిక ఆలోచన?

ప్రియమైన సజ్జనులారా!

'దుర్జనులు' అయిన ప్రజలను 'సజ్జనులు'గా మలచాలనే ధ్యేయంతో సుమారు నలభై ఐదు సంవత్సరాల నుండి i) మానవ మనస్తత్వాన్ని ii) భారత రాజ్యాంగాన్ని, iii) వివిధ సంస్కరణోద్యమాలను, iv) ప్రధాన ధర్మశాస్త్రాలైన గీతా–బైబిల్–ఖురాన్ తదితర గ్రంథాలను లోతుగా అధ్యయనం చేయటం జరిగింది. ఇప్పటి వరకూ ఈ కృషి 'అసంఘటితం'గానే సాగింది. అయితే ప్రస్తుత సమాజంలో చెడుల విజృంభణ దృష్ట్యా 'సంఘటితం'గా పనిచేయాలని సంకల్పించుకొని, 2025లో 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' మకుటంతో ఒక బృహత్తర 'వ్యక్తి సంస్కరణా యజ్ఞం' ప్రారంభించటం జరిగింది.

మనిషిని నడిపేది అతను కలిగి ఉన్న 'ఆలోచన' లేదా 'దృక్పథము' మాత్రమే. 'సరైన ఆలోచన' సరైన మార్గంపై నడిపిస్తుంది. 'తప్పుడు ఆలోచన' తప్పుడు మార్గంపై నడిపిస్తుందన్నది ఎవరూ తిరస్కరించ లేని వాస్తవం.

కనుక ఎవరైనా వ్యక్తి సంస్కరణా యజ్ఞం విజయవంతంగా నిర్వహించాలంటే వారు ప్రప్రథమంగా వ్యక్తులను 'తప్పుడు ఆలోచనా దృక్పథాల' నుండి 'సరైన ఆలోచనా దృక్పథాల' వైపునకు మరల్చక తప్పదు. ఈ విధానంతో తప్ప, మరేవిధంగానూ ప్రజల్లో 'వ్యక్తిగత నైతిక పరివర్తన' ఎంత మాత్రమూ రాదు! అందుకే మేము 'ఏది తప్పుడు ధార్మిక ఆలోచన? – ఏది సరైన ధార్మిక ఆలోచన?' అన్న శీర్షిక మీ ముందు పెడుతున్నాం. దీని గురించి కాస్త నిశితంగా ఆలోచించవలసిందిగా సవినయంగా కోరుతున్నాం.

సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్ ఎందుకు? ఏమిటి? ఎలా?

ఎందుకు?

'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' అన్నది ఒక 'ప్రతిచర్య ఉద్యమం' కాదు. దీని స్థాపన 'వ్యక్తిగత, సామాజిక, నైతిక, ధార్మిక బాధ్యత నిర్వర్తనం' కోసం జరిగింది. 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' ప్రారంభించటానికి మూల కారణం ఇదే!

ఏమిటి?

ఇది 'వ్యక్తి సంస్కరణా ఉద్యమం' తప్ప, రాజకీయ లేదా మత ప్రచార ఉద్యమం కాదు! ఇది వ్యక్తుల మది నుండి 'అనైతికత–అమానవీయత–అనైక్యత' అనే మూడు 'ప్రతికూల లక్షణాల'ను తొలగించి, వాటి స్థానే 'నైతికత, మానవత, ఐక్యత' వంటి 'అనుకూల గుణాల'ను మనుషుల మదిలో మేల్కొల్పటానికి ప్రయత్నిస్తుంది.

ఎలా?

అది తన లక్ష్యసాధనకి వాదప్రతివాదాలు, ఘర్షణ, మతమార్పిడి వంటి అశాంతిని రగిల్చే విధానాలను కాక; ప్రబోధన, ప్రచురణ వంటి శాంతియుత పద్ధతులను మాత్రమే అవలంబిస్తుంది.

దుర్జనుల నేరాలకంటే సజ్జనుల మౌనం అత్యంత ప్రమాదకరం!

సాధారణ ఇంగితం ప్రకారం మనం వ్యక్తిగతంగా 'సజ్జనులు'గా ఉండటమే కాక, మన తోటి జనులను సైతం 'సజ్జనులు'గా మలచే ప్రయత్నం చేస్తూ ఉండాలి. ఇదొక నిరంతర సామాజిక, నైతిక, బాధ్యత. దీనిని కనుక నిర్వర్తించకపోతే సమాజం అల్లకల్లోలం కాక తప్పదన్నది అందరికీ తెలిసిందే! ఇప్పటికే మనం దీని ఘోర పరిణామాలు చూస్తూనే ఉన్నాం. ఇక, మన ధర్మ శాస్త్రాలు ఏమంటున్నాయో చూడండి.

సంస్కరణా బాధ్యత గురించి భగవద్గీత ఏమంటుంది?

18:68,69– య ఇదం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి।
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః॥
న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః।
భవితా న చ మే తస్మాదన్యః ప్రియతరో భువి॥

ఎవరైతే ఈ పరమ గోప్యమైన జ్ఞానమును నా భక్తులలో ఉపదేశిస్తారో, వారు మహోన్నత ప్రేమయుక్త సేవను చేసినట్టు. వారు నిస్సందేహముగా నన్నే చేరుకుంటారు। వారి కంటే ఎక్కువ ప్రేమయుక్త సేవ నాకు ఎవరూ చేసినట్టు కాదు; వారి కంటే ఎక్కువ ప్రియమైన వారు నాకు ఈ భూమిపై ఎవరూ ఉండబోరు.

ఈ శ్లోకాన్ని అనుకూలంగా చూశారు కదా. దీనిని ప్రతికూలంగా కూడా చూడండి. అంటే, "పరమ గోప్యమైన ఈ జ్ఞానమును నా భక్తులలో ఎవరు ఉపదేశించరో వారికంటే ఎక్కువ 'అప్రియమైన వారు' నాకు ఈ భూమిపై ఎవరూ ఉండబోరు!" అనే అర్థం వస్తుంది. సంస్కరణా కర్తవ్యాన్ని నిర్వర్తించకపోవటం అన్నది భగవద్గీత ప్రకారం మీ పట్ల ఎంతటి ప్రమాదంగా పరిణమిస్తుందో మీకు అర్థమైంది కదా!?

సంస్కరణా బాధ్యత గురించి బైబిలు గ్రంథం ఏమంటుంది?

యెహేజ్కేలు 3:18– అవశ్యముగా నీవు మరణ మవుదువని నేను దుర్మార్గుని గూర్చి ఆజ్ఞ ఇయ్యగా నీవు అతనిని హెచ్చరిక చేయకయు, అతడు జీవించునట్లు తన దుర్మార్గతను విడిచి పెట్టవలెనని వానిని హెచ్చరిక చేయకయు నుండిన యెడల ఆ దుర్మార్గుడు తాను చేసిన దోషమునుబట్టి మరణమవును గాని అతని రక్తమునకు నిన్ను ఉత్తరవాదిగా ఎంచుదును.

ఈ వాక్యం ప్రకారం– దేవుడు నిర్ధారించిన శిక్షల గురించి మీకు తెలిసినప్పుడు, ఎదుటి వానికి చెప్పకపోతే వాడికి పడిన మరణ శిక్షకి నిన్ను బాధ్యునిగా నిలబెట్టటం జరుగుతుంది! అని బైబిలు హెచ్చరిస్తుంది. దీనిని బట్టి 'దుర్జనుల'ను అప్రమత్తం చేయటం తమను తాము కాపాడుకోవటమే అవుతుందని తెలుస్తుంది. లేదంటే నేరస్థుల నేరాలకి ఉత్తములైన మీరు బాధ్యత వహించాల్సివస్తుంది. సంస్కరణా కార్తవ్యాన్ని నిర్వర్తించకపోవటం అన్నది బైబిలు ప్రకారం మీ పట్ల ఎంతటి ప్రమాదంగా పరిణమిస్తుందో మీకు అర్థమైంది కదా!?

సంస్కరణా బాధ్యత గురించి ఖురాను గ్రంథం ఏమంటుంది?

كُنتُمْ خَيْرَ أُمَّةٍ أُخْرِجَتْ لِلنَّاسِ تَأْمُرُونَ بِٱلْمَعْرُوفِ وَتَنْهَوْنَ عَنِ ٱلْمُنكَرِ وَتُؤْمِنُونَ بِٱللَّهِ – 3:110

మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరు. మీరు మంచి విషయాలకై ఆజ్ఞాపిస్తారు, చెడు నుంచి ఆపుతారు, ఇంకా మీరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు.

وَٱتَّقُواْ فِتْنَةً لَّا تُصِيبَنَّ ٱلَّذِينَ ظَلَمُواْ مِنكُمْ خَآصَّةً ۖ وَٱعْلَمُوٓاْ أَنَّ ٱللَّهَ شَدِيدُ ٱلْعِقَابِ – 8:25

ఏ ఉపద్రవమైతే మీలోని దుర్జనులకు మాత్రమే పరిమితం కాకుండా (సమాజంలోని సజ్జనులను సైతం) కబళిస్తుందో దాని బారి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. అల్లాహ్ చాలా కఠినంగా శిక్షించేవాడన్న సంగతిని తెలుసుకోండి!

5:78 – لُعِنَ ٱلَّذِينَ كَفَرُواْ مِنۢ بَنِيٓ إِسۡرَٰٓءِيلَ عَلَىٰ لِسَانِ دَاوُۥدَ وَعِيسَى ٱبۡنِ مَرۡيَمَۚ ذَٰلِكَ بِمَا عَصَواْ وَّكَانُواْ يَعۡتَدُونَ

ఇస్రాయీలు సంతతిలోని అవిశ్వాసులు దావూదు నోట, మర్యమ్ పుత్రుడైన ఈసా నోట శపించబడ్డారు. ఎందుకంటే వారు అవిధేయతకు పాల్పడేవారు. హద్దుమీరి ప్రవర్తించేవారు.

5:79 – كَانُواْ لَا يَتَنَاهَوۡنَ عَن مُّنكَرٖ فَعَلُوهُۚ لَبِئۡسَ مَا كَانُواْ يَفۡعَلُونَ

వారు, తాము చేసే చెడు పనుల నుండి పరస్పరం ఒకరినొకరు నిరోధించేవారు కారు. వారు చేస్తూ ఉండిన ఈ నిర్లక్ష్యం బహుచెడ్డది.

గీతా–బైబిల్–ఖురాన్ గ్రంథాల హెచ్చరికల ప్రకారం– కేవలం మనం సజ్జనులై సంతృప్తి పడి, ఇతరులను సంస్కరించకపోతే దైవం దృష్టిలో నేరస్తులు అయిపోతామని తెలుస్తుంది. కనుక ఒకవైపు– మనల్ని మనం 'సజ్జనులు'గా మలచుకుంటూ, మరొకవైపు– మన తోటి ప్రజలను 'సజ్జనులు'గా మలచటానికి సతతం నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి. ఇదొక సామాజిక, నైతిక బాధ్యతే కాక, వందశాతమూ 'ధార్మిక బాధ్యత' కూడా అని తేలిపోయింది!

ఈ బాధ్యతను నిర్వర్తించకపోతే అటు– భవిష్యత్తరాల శాపానికి, ఇటు– దైవ శాపానికి గురికాక తప్పదు. ఈ శాపాల బారి నుండి కాపాడుకోవటానికే నేడు మనం 'దుర్జనుల'ను 'సజ్జనులు'గా మలచే ప్రక్రియను తెలుసుకోవటం తక్షణ కర్తవ్యం.

కామన్ సెన్స్ మాత్రమే అంతిమ ప్రమాణం!

ఏ మత దృక్పథం సరైనది ఏ మత దృక్పథం సరైనదికాదు అన్నది ఎవరు తీర్మానం చేస్తారు? అన్నది ప్రధానమైన ప్రశ్న, దీనికి– "మీ కామన్ సెన్సే!" అన్నది నా సమాధానం. ఎందుకంటే మీ ధర్మ గ్రంథాల ప్రబోధనలు "వాస్తవమో కాదో మీ బుద్ధిని ఉపయోగించి చూడండి!" అని దేవుడే స్వయంగా చెబుతున్నాడు!

ఎన్ని 'దుష్కర్మల'కి పాల్పడినా కేవలం ఏదో ఒక 'ప్రత్యేక విశ్వాసం' కలిగి ఉన్నంత మాత్రాన మోక్షం లభిస్తుందనటం, అలాగే సదరు విశ్వాసం లేనంతమాత్రాన ఎన్ని 'సత్కర్మలు' చేసుకున్నా, నరకానికి పోతారనటం 'కామన్ సెన్స్'కి విరుద్ధం! ఇక, ధర్మ శాస్త్రాలు ఏమంటున్నాయో మీరే చూడండి!

ఒకప్పుడు మనుషులను మహాత్ములుగా మలచిన గీతా, బైబిలు, ఖురాన్ గ్రంథాలు ఇప్పుడు ఎందుకు ఆ పని చేయలేక పోతున్నాయి? అవి తమ శక్తిని కోల్పోయాయా? లేక మనం వాటి ప్రబోధనల పట్ల 'సరైన ఆలోచన' వదలి 'తప్పుడు ఆలోచన'కి గురయ్యామా? నా సమాధానం అయితే రెండవదే! మీ సమాధానం కూడా అదే అయి ఉంటుంది. రండి! అదెలాగో చూద్దాం.

హిందూ సమాజ తప్పుడు ధార్మిక ఆలోచన ఏమిటి?

మనిషి తన మనస్తత్వాన్ని బట్టి ఏ విషయంలో అయినా అనేక అవకాశాలు ఉన్నాయన్నప్పుడు lazy అయిపోతాడు. అలాగే ఒక్క అవకాశం తప్ప, అనేక అవకాశాలు లేవు అన్నప్పుడు active అయిపోతాడు.

ఉదాహరణకి: పై చదువులు చదవటానికి 10th single attemptలో pass కావాలి. అది తప్పితే మరొక అవకాశం లేదు అన్నప్పుడు ఒక విద్యార్థి చదువుపై strong effort పెడతాడు. దానికి బదులు అనేక అవకాశాలు ఉన్నాయంటే చదువుపై అతని effort weak అయిపోతుంది. ఇది అత్యంత సహజం.

అలాగే మోక్షం సాధించటానికి ఒక్క జన్మ మాత్రమే ఉందన్నప్పుడు మనిషి 'సత్కర్మల'పై strong effort పెడతాడు. అనేక జన్మలు ఉన్నాయంటే 'సత్కర్మల'పై అతని effort weak అయిపోతుంది.

ఈనాటి హిందూ సమాజంలో అధికులు 'సత్కర్మల'ను కోల్పోయి 'దుష్కర్మల'కి పాల్పడటానికి మూల కారణం– "మోక్షం సాధించటానికి అనేక జన్మలు ఉన్నాయి!" అనే ఒక తప్పుడు ఆలోచనే!

Bottom line/సారాంశం

"ఎలాంటి effort పెట్టకపోయినప్పటికీ ముక్తి ఏదో ఒక జన్మలో దానికదే లభిస్తుందిలే!" అన్న ఆలోచన వ్యక్తిని 'సత్కర్మల' విషయంలో weak చేసి, 'దుష్కర్మల' విషయంలో active చేసేస్తుంది.

భగవద్గీత ఇచ్చే సరైన ధార్మిక ఆలోచన ఏమిటి?

గీతా శాస్త్రం, 5:23– శక్నోతీహైవ యః సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః॥

ఎవడీశరీరమును విడుచుటకు పూర్వమే యిచ్చోటనే (ఈ జన్మయందే) కామక్రోధముల వేగమును అరికట్టగల్గుచున్నాడో, అతడే యోగియు, సుఖవంతుడునగును.

గీతా మకరందం వ్యాఖ్యాత స్వామీ విద్యా ప్రకాశనందగిరి ఈ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ– "మోక్షమునకు కావలసిన సాధనసామగ్రిని ఈజీవితమునందే సమకూర్చు కొనవలెను. మఱియొక లోకమునగాని, మఱియొక జన్మయందుగాని ఆ పని సాధ్యపడదు. భూలోకము కర్మభూమి. సాధనచేయుటకు అనువైన ప్రదేశము. స్వర్గాది ఊర్ధ్వ లోకములందుగాని, పాతాళాది అధోలోకములందుగాని పరమార్థ సాధనకు అవకాశములుండవు (ఆవి కర్మానుభవలోకములే కనుక).

కాబట్టి 'ఇహైవ' అను పదమిచట పేర్కొనబడెను. ఇంతకుముందే 19వ శ్లోకమున 'ఇహైవ తైర్జితః సర్గః' అని చెప్పబడియుండెను. ఈ ప్రకారముగ 'ఇహైవ' (ఇచ్చోటనే) అను పదము ఒకే అధ్యాయమున, ఒకే సందర్భమున రెండు పర్యాయములు వాడబడుట చూడ 'ఇచ్చోటనే' ఈ లోకమందే, ఈ జన్మమందే అధ్యాత్మసాధనను త్వరితముగ పూర్తిచేయవలెనని భగవంతుడు నొక్కి చెప్పినటైనది" అని అంటున్నారు.

Bottom line/సారాంశం

"ఒకవేళ అనేక జన్మలు ఉన్నప్పటికీ, అవన్నీ కర్మఫలాన్ని అనుభవించేవేగానీ ముక్తి సాధనకి మాత్రం ఈ ఒక్క మానవ జన్మ మాత్రమే ఏకైక అవకాశం!" అన్న ఆలోచన హిందువును 'దుష్కర్మల' విషయంలో fear కలిగించి, 'సత్కర్మల'పై strong effort పెట్టేలా చేస్తుంది.

క్రైస్తవ సమాజ తప్పుడు ధార్మిక ఆలోచన ఏమిటి?

నేటి క్రైస్తవ సమాజంలో సర్వసామాన్యంగా ఉన్న ఆలోచన– మనిషి జన్మతః పాపి. పాపాల నుండి బయట పడటం అతనికి సాధ్యం కాదు. కాబట్టి పాపుల నిమిత్తం యేసు ప్రాణం పెట్టారని విశ్వసిస్తే పాపాలన్నీ క్షమించబడతాయి. ఇక్కడ గత పాపాలా లేక తరువాతి పాపాలా అన్నది స్పష్టత లేదు!

ఇక ప్రధానమైన విషయం ఏమిటంటే– "నా పాపాల నిమిత్తం యేసు రక్తం చిందించారని విశ్వసిస్తే ఎన్ని పాపాలు జరిగిపోయినా క్షమాపణ ఉంటుంది. ఆయితే అలా విశ్వసించని వారు ఎంతటి నీతిమంతులు అయినప్పటికీ రక్షణ/మోక్షం ఉండదు!" అన్నది క్రైస్తవుల ఆలోచన.

Bottom line/సారాంశం

ఒక్క మాటలో చెప్పాలంటే– "క్రైస్తవ విశ్వాసి అయినందుకు ఎన్ని పాపాలు చేసుకున్నా ఫరవాలేదు!" అనే తప్పుడు ఆలోచన ఒక క్రైస్తవుడిని 'సత్కర్మల' విషయంలో weak చేసి, 'దుష్కర్మల' విషయంలో active చేసేస్తుంది.

బైబిలు చెప్పే సరైన ధార్మిక ఆలోచన ఏమిటి?

బైబిలు గ్రంథం క్రొత్త నిబంధన, యోహాను 5:14– అటు తరువాత యేసు దేవాలయములో వానిని చూచి ఇదిగో స్వస్థతనొందితివి; మరి యెక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుమని చెప్పగా...

2 పేతురు 2:20– వారు ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు విషయమైన అనుభవ జ్ఞానముచేత ఈ లోకమాలిన్యములను తప్పించుకొనిన తరువాత మరల వాటిలో చిక్కుబడి వాటిచేత జయింప బడినయెడల, వారి కడవరి స్థితి మొదటి స్థితికంటె మరి చెడ్డదగును.

2 పేతురు 2:21,22– వారు నీతి మార్గమును అనుభవపూర్వకముగా తెలిసికొని, తమకు అప్పగింపబడిన పరిశుద్ధమైన ఆజ్ఞ నుండి తొలగిపోవుటకంటె ఆ మార్గము అనుభవపూర్వకముగా తెలియక యుండుటయే వారికి మేలు। కుక్కతన వాంతికి తిరిగినట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను.

హెబ్రీయులకు 6:5,6– దేవుని దివ్యవాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన (మూలభాషలో–రుచిచూచిన) తరువాత తప్పిపోయిన వారు। తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువవేయుచు, బాహాటముగా ఆయనను అవమాన పరచుచున్నారు. గనుక మారుమనస్సు పొందునట్లు అట్టి వారిని మరల నూతనపరచుట అసాధ్యము.

హెబ్రీయులకు 10:26,27– మనము సత్యమునుగూర్చి అనుభవజ్ఞానము పొందిన తరువాత బుద్ధిపూర్వకముగా పాపము చేసినయెడల పాపములకు బలి యికను ఉండదు గాని । న్యాయపు తీర్పునకు భయముతో ఎదురుచూచుటయు, విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండును.

Bottom line/సారాంశం

"యేసు నా పాపాల నిమిత్తం ప్రాణం పెట్టారని విశ్వాసించే ప్రతి క్రైస్తవుడూ పాపా కార్యాలకి దూరంగా ఉండాలి. లేదంటే క్రైస్తవుడు అయినప్పటికీ దహించే అగ్నికి బలికాక తప్పదు!" అని పరిశుద్ధ బైబిలు ఇచ్చే ఆలోచన ఒక క్రైస్తస్తవుడిని 'దుష్కర్మల' విషయంలో fear కలిగించి, 'సత్కర్మల'పై strong effort పెట్టేలా చేస్తుంది.

ముస్లిం సమాజ తప్పుడు ధార్మిక ఆలోచన ఏమిటి?

"లా ఇలాహ ఇల్లాహ్ ముహమ్మద్ రసూలుల్లాహ్!" / "ఒక్క అల్లాహ్ తప్ప, మరొక ఆరాధ్యుడు లేడు. ఇంకా ప్రవక్త ముహమ్మద్ ఆయన సందేశహరుడు" అని కలిమా చదివిన వారి గత పాపాలు క్షమించబడతాయి. భవిష్యత్తులో ఎన్ని పాపాలు జరిగినా అవన్నీ క్షమించబడతాయి. ఒకవేళ 'నేరాలు-ఘోరాలు' జరిగిపోతే కొన్నాళ్ళ పాటు నరకంలో వేసి, ఆ తరువాత అల్లాహ్ తిరిగి స్వర్గంలో వేస్తాడు. ఇక, ముస్లిములు కానివారు ఎంతటి 'సజ్జనులు' అయినా సరే నరకవాసులే అవుతారు!" అన్నది అధికశాతం ముస్లిముల తప్పుడు ధార్మిక ఆలోచన.

Bottom line/సారాంశం

ఒక్క మాటలో చెప్పాలంటే- "ముస్లిము అయినందుకు ఎన్ని పాపాలు చేసుకున్నా ఫరవాలేదు!" అనే తప్పుడు ఆలోచన ఒక ముస్లిం మదిలో దిగితే అది అతడిని 'సత్కర్మల' విషయంలో weak చేసి, 'దుష్కర్మల' విషయంలో active చేసేస్తుంది.

ఖురాన్ గ్రంథ సరైన ధార్మిక ఆలోచన ఏమిటి?

నాలుగోవ అధ్యాయం (సూరయె నిసా) ముస్లిముల నేపథ్యానికి సంబంధించిందన్నది ఒక వాస్తవం. అందులో మొదటి వాక్యం నుండి పన్నెండవ వాక్యం వరకు కొన్ని 'నైతిక-మానవీయ' సత్కర్మలను-దుష్కర్మలను పేర్కొని, అల్లాహ్ చేస్తున్న హెచ్చరిక ఏమిటో చూడండి.

4:14- وَمَن يَعْصِ ٱللَّهَ وَرَسُولَهُۥ وَيَتَعَدَّ حُدُودَهُۥ يُدْخِلْهُ نَارًا خَٰلِدًا فِيهَا وَلَهُۥ عَذَابٌ مُّهِينٌ

ఎవడు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త యెడల అవిధేయుడై, ఆయన నిర్ధారించిన హద్దులను మీరిపోతాడో వాడిని ఆయన నరకాగ్నిలో పడవేస్తాడు. వాడందులో ఎల్లకాలం పడి ఉంటాడు. అవమానకరమైన శిక్ష అలాంటి వారికోసమే ఉంది. ఇలా హెచ్చరిస్తున్న వాక్యాలు అనేకం ఉన్నాయి.

ఈ వాక్యంలో "నరకాగ్నిలో పడవేస్తాడు. వాడందులో ఎల్లకాలం పడి ఉంటాడు!" అని ఖురాన్ హెచ్చరిస్తున్నది. దుష్కర్మలకి పాల్పడే ముస్లిములనే కానీ; ఏ యూదులనో, క్రైస్తవులనో కాదన్నది ఇక్కడ అత్యంత గమనార్హం. మరోక వాక్యం చూడండి.

39:19 – أَفَمَنْ حَقَّ عَلَيْهِ كَلِمَةُ ٱلْعَذَابِ أَفَأَنتَ تُنقِذُ مَن فِى ٱلنَّارِ

"ఏ వ్యక్తికి వ్యతిరేకంగా శిక్షా తీర్మానం ఖరారైపోయిందో, అగ్నికి ఆహుతి అయిపోయిన (అటువంటి) వాణ్ణి నువ్వు బయటికి తీయగలవా?" అని అల్లాహ్ ప్రశ్నిస్తున్నాడు!

ఒకవైపు – ముస్లిం అయినప్పటికీ తోటి బంధువుల హక్కులను కాజేసిన వారికి సైతం 'నిత్యనరకం' తప్పదని అల్లాహ్ హెచ్చరిస్తున్నాడు. మరొకవైపు – ఒక నేరస్తునికి వాని నేరాల కారణంగా అల్లాహ్ నరకంలో పడవేసిన వాడిని ప్రవక్త ముహమ్మద్ సైతం బయటకి తీయలేరని ఖురాన్ తెలియజేస్తుంది. ఖురాన్ ఇచ్చే ఈ ఆలోచన ముస్లిమును 'దుష్కర్మల' విషయంలో fear కలిగించి, 'సత్కర్మల'పై strong effort పెట్టేలా చేస్తుంది.

సారాంశం

గీతా, బైబిలు, ఖురాన్ గ్రంథాల అధ్యయనంతో 'సత్కర్మల'ను ఆచరిస్తూ, 'సజ్జనులు'గా 'పరివర్తన' చెందిన వారికి తప్ప, కేవలం 'విశ్వాసాలు' కలిగి, ఆరాధనలు చేస్తూ 'దుర్జనులు'గా ఉన్నవారికి రక్షణ లేక మోక్షం లభించదని సుస్పష్టం అయ్యింది. ధర్మ శాస్త్రాల సందేశం 'కామన్ సెన్స్'కి అత్యంత అనుకూలంగా ఉంది.

1. "సత్కర్మలు' లేకపోయినా కేవలం 'విశ్వాసాలూ–ఆరాధనలు' కలిగి ఉంటే రక్షణ/మోక్షం!" లభిస్తుంది అన్నది 'తప్పుడు ధార్మిక ఆలోచన'.

2. "విశ్వాసాలూ–ఆరాధనల'తోపాటు 'సత్కర్మలు' కూడా ఆచరిస్తేనే రక్షణ/మోక్షం!" లభిస్తుంది అన్నదే 'సరైన ధార్మిక ఆలోచన'.

పైన పేర్కొన్న మొదటి ధార్మిక ఆలోచన వారివారి ధర్మశాస్త్రాల ప్రకారం– 'ధర్మవిరుద్ధం' అన్నది నిరూపించి, రెండవ ధార్మిక ఆలోచన మాత్రమే 'ధర్మబద్ధం' అన్నది నిర్ధారిస్తేనే ఆయా మతస్థుల్లో 'దుర్జనులు' తరిగి, 'సజ్జనులు' పెరుగుతారని తెలుస్తుంది.

ఈ విధంగా ఆయా మత వర్గాలను 'తప్పుడు ధార్మిక ఆలోచన' నుండి 'సరైన ధార్మిక ఆలోచన' వైపునకు ఆహ్వానించవలసిన బాధ్యత ప్రతి ధార్మికునిపైనా ఉంది.

ఈ యజ్ఞాన్ని 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' శాంతియుతంగా, ప్రేమపూర్వకంగా ప్రచురణ, ప్రబోధన ద్వారా ధార్మిక ప్రజల్లో సర్వసామాన్యం చేసి, కులమతాలకి అతీతంగా ప్రజలను 'సజ్జనులు'గా మలచటానికి స్వచ్ఛందంగా కృషి చేస్తుంది. ఎందుకంటే సజ్జనుల సారధ్యంతోనే ప్రపంచ శాంతి సాధ్యం కనుక!

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

విశ్వాసాలూ-ఆరాధనలు సాధనాలు మాత్రమే

సత్కర్మలే గమ్యం!



Part-3

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం----------I

విశ్వాసాలూ–ఆరాధనలు సాధనాలు మాత్రమే సత్కర్మలే గమ్యం!----------1

'లక్ష్య సాధనాలు' – 'లక్ష్యం' నియమం ఏమిటి?----------2

దైవ ధర్మంలోనూ 'లక్ష్య సాధనము', 'లక్ష్యము' అత్యంత కీలకం!----------3

సకల ధార్మిక వ్యవస్థల్లో ఉన్న సమాంతర మౌలిక విషయాలు ఏమిటి?----------4

మనిషి మనస్తత్వము ధర్మశాస్త్రాల ప్రబోధనల మధ్య ఉన్న సంబంధం ఏమిటి?------7

విషయము మరియు దృక్పథం మధ్య తేడా ఏమిటి?----------9

విశ్వాసం పట్ల సరైన దృక్పథము అంటే ఏమిటి?----------9

ఒకవేళ విశ్వాసాల జ్ఞానం లేకపోయినా సత్కర్మలతో దైవ ప్రసన్నత!----------10

వైదిక ధర్మం ఏమంటుందో చూడండి!----------11

యూదా ధర్మం ఏమంటుందో చూడండి!----------12

క్రైస్తవ ధర్మం ఏమంటుందో చూడండి!----------16

ఇస్లాం ధర్మం ఏమంటుందో చూడండి!----------18

పరిచయం

మనిషిని సజ్జనుడిగా తీర్చిదిద్దడమే ధర్మం ప్రధాన ఉద్దేశం కావాలి. అయితే నేటి సమాజంలో అధికశాతం ధార్మికుల వ్యక్తిగత ప్రవర్తనలో అనైతికత, సామూహిక జీవనంలో అమానవీయత పెరిగిపోతుంది. అలాగే బయటి మతవర్గాల మధ్యనే కాక, ఒకే మతంలోని ఉపవర్గాల మధ్య కూడా ద్వేషాలు, విభేదాలు, హింసాత్మక ఘర్షణలు పెరుగుతున్నాయి. ఈ విధంగా నేటి మెజారిటీ భక్తులు దుర్జనులు కావటానికి మూల కారణం– Means అయిన విశ్వాసాలూ–ఆరాధనలను Ends చేసుకొని, Ends అయిన సత్కర్మలను నిర్లక్ష్యం చేయటమే!

విశ్వాసం పట్ల ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన మానసిక సంతృప్తి ఉండదనే అంశాన్ని కూడా పరిశీలిస్తుంది. కొందరు దేవునిపై, పరలోకంపై విశ్వాసంతో సత్కర్మలు ఆచరిస్తారు. మరికొందరు తమలోని సహజ నైతిక స్పృహ, మనస్సాక్షి, వివేకం ఆధారంగా సత్కర్మలు చేస్తారు. ఈ రెండు మార్గాల్లోనూ ఉమ్మడిగా ఉండవలసింది సత్కర్మల ఆచరణే! ఈ భావనను వైదిక, యూద, క్రైస్తవ, ఇస్లామీయ ధర్మగ్రంథాల ఆధారాలతో పరిశీలించడం ఈ పుస్తకంలోని ముఖ్యాంశం.

ఆయా ధర్మగ్రంథాల వచనాలను పరిశీలిస్తూ, కేవలం ఆచారాలకే పరిమితం కాకుండా నైతిక–మానవీయ ప్రవర్తనకు ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో మీరు తెలుసుకుంటారు.

విశ్వాసం ఉన్నవారు తమ విశ్వాసానికి తగినట్లుగా మరింత సజ్జనులుగా మారాలి; విశ్వాసం లేనివారు తమ సహజ నైతిక స్పృహతోనైనా సత్కర్మలు ఆచరించాలి. ఎందుకంటే మానవ సమాజానికి అత్యవసరమైనది విశ్వాసాల విభేదాలు కాదు, సత్కర్మల ఆచరణలో పోటీ!

మొత్తంగా, విశ్వాసాల పేరుతో విభజించబడుతున్న మానవ సమాజాన్ని సత్కర్మల ఆధారంగా సజ్జన సమాజంగా తీర్చిదిద్దడానికి, ధర్మంలోని సాధనాలు–లక్ష్యాల మధ్య ఉన్న సరైన సంబంధాన్ని పాఠకులకు తెలియజేయడమే ఈ పుస్తకం అంతిమ లక్ష్యం.

KAKINADA
12-02-2025

M. A. Abhilash

విశ్వాసాలూ-ఆరాధనలు సాధనాలు మాత్రమే సత్కర్మలే గమ్యం!

ప్రియ సజ్జనులారా!

నైతికత–మానవత విలువల స్పృహ సహజంగానే కలిగి ఉండే జీవి అంటేనే మనిషి. కనుక ఒకవేళ అతడు 'నాస్తికుడు' అయినప్పటికీ ఒక సజ్జనుడిగా ప్రవర్తించాలి. అయితే ఒకవేళ అతడు 'ఆస్తికుడు' అయి ఉంటే తన సజ్జనత్వంలో మరింత మెరుగ్గా ఉండాలి. ఎందుకంటే అతనికి దుష్కర్మల నుండి నిరోధించే ఒక్క 'అంతర్గత నైతిక శక్తి' మాత్రమే కాక, అదనంగా 'బాహ్య ధార్మిక శక్తి' కూడా తోడవుతుంది కాబట్టి!

అయితే సజ్జనత్వంలో ఆస్తికుల కంటే నాస్తికులే కాస్త మెరుగ్గా కనిపిస్తున్నారన్నది నేటి వాస్తవికత! దీనికి కారణం ఏమిటి? 1) "ధర్మం దుర్జనులైన తన భక్తులను సజ్జనులుగా మలచే శక్తిని కోల్పోయిందా?" లేక 2) "ధార్మికులు తమ ధర్మంలో ఎక్కడో క్రమం తప్పటం వలన సజ్జనులు కాలేకపోతున్నారా?" అని ప్రశ్నిస్తే ఒక ధార్మికునిగా మీరిచ్చే సమాధానం– "దీనికి కారణం రెండవదే కానీ, మొదటిది కాదు" అన్నదే కాదా! నా సమాధానం కూడా అదే. ధార్మికులు తమ ధర్మంలో ఎక్కడ క్రమం తప్పారో తెలియజేసి, సత్కర్మలకు ధర్మ గ్రంథాలు ఇస్తున్న సర్వోన్నత స్థానం ఏమిటో తెలియజేయటమే ఈ చిరు పుస్తకం లక్ష్యం అన్నది గమనార్హం.

'లక్ష్య సాధనాలు' - 'లక్ష్యం' నియమం ఏమిటి?

అటు– మనిషిని, ఇటు– ధర్మశాస్త్రాలను సృష్టించింది ఆ ఏకైక సృష్టికర్తే. కాబట్టి అటు– "మానవ మనస్తత్వానికి, అతని ప్రవర్తన"కు మరియు ఇటు– "ధర్మ శాస్త్రాలకి వాటి ప్రబోధనల"కి మధ్య ఒక 'తార్కిక సంబంధం' ఉంటుంది. ఉండాలి కూడా.

ఈ లోకంలో అనేక సార్వత్రిక నియమాలు ఉన్నాయి. అలాంటి వాటిలో– "సాధనము మరియు సాధ్యము" (Means and End) అన్నది కూడా ఒకటి. అంటే సాధించేవి, సాధించబడేది. ధార్మిక వ్యవస్థలో దీనికి విశేషమైన ప్రాధాన్యత ఉంది. అంటే 'సాధనము'ను సాధనముగానే చూడాలి. 'సాధ్యము'ను సాధ్యముగానే చూడాలి. తద్వారా సత్ఫలితాలు కలుగుతాయి. వాటిని గనక తారుమారు చేస్తే దుష్ఫలితాలు తప్పవు.

విభిన్న రంగాల్లో సాధనాల మరియు సాధ్యాల పాత్ర ఏమిటి?

రంగం	సాధనము (మార్గం)	సాధ్యము (గమ్యం)
1. లౌకిక జీవితం	కష్టం, పరిశ్రమ, విద్య, ఉద్యోగం, వ్యాపారం	ఆర్థిక స్థిరత్వం, సుఖ జీవనం
2. ఆధునిక విజ్ఞానం	పరిశోధన, భౌతిక సాంకేతికత	మానవ మనుగడ, సౌకర్యం, శ్రేయస్సు
3. ఆధ్యాత్మికత	విశ్వాసాలు, ఆరాధనలు ధ్యానం, ఉపవాసం	నైతికత, మానవత వంటి సత్కర్మలు

పైన పేర్కొన్న రంగము, సదరు రంగంలో చేయవలసిన 1) 'పరిశ్రమ', 2) దాని 'ఫలితము' అనే ఈ రెండు అంశాలు పూర్తిగా వేర్వేరన్నది అత్యంత కీలకమైన విషయం. దీనినే "సాధనము మరియు సాధ్యము (Means and End)" లేదా "లక్ష్య సాధనము మరియు లక్ష్యము" అని అంటారని తెలుసుకున్నారు.

మొదటి ఉదా: 'లౌకిక జీవితం'లో– "కష్టం, పరిశ్రమ, విద్య, ఉద్యోగం, వ్యాపారం" అన్నవి 'లక్ష్య సాధనాలు'. అవి తప్పనిసరి అంశాలే. అయితే వాటి ద్వారా కలగవలసిన "ఆర్థిక స్థిరత్వం, సుఖ జీవనం" అన్న 'లక్ష్యం' గనక నెరవేరకపోతే ఇక 'లక్ష్య సాధనాల' పేరిట చేస్తున్న పనులన్నీ వ్యర్థమే కదా!

రెండవ ఉదా: 'ఆధునిక విజ్ఞానం'లో– "పరిశోధన, భౌతిక సాంకేతికత" అన్నవి లక్ష్య సాధనాలు. అవి తప్పనిసరి అంశాలే. అయితే వాటి ద్వారా కలగవలసిన "మానవ మనుగడ, సౌకర్యం, శ్రేయస్సు" అన్న 'లక్ష్యం' గనక నెరవేరకపోతే ఇక 'లక్ష్య సాధనాల' పేరిట చేస్తున్న పనులు వ్యర్థమే కదా!

మూడవ ఉదా: 'ఆధ్యాత్మికత'లో– "విశ్వాసాలు, ఆరాధనలు ధ్యానం, ఉపవాసం" అన్నవి 'లక్ష్య సాధనాలు'. అవి తప్పనిసరి అంశాలే. అయితే వాటి ద్వారా కలగవలసిన "నైతికత–మానవత వంటి సత్కర్మలు" అన్న 'లక్ష్యం' గనక నెరవేరకపోతే ఇక 'లక్ష్య సాధనాల' పేరిట చేస్తున్న "విశ్వాసాలు, ఆరాధనలు ధ్యానం, ఉపవాసం" వ్యర్థమే కదా!

దైవ ధర్మంలోనూ 'లక్ష్య సాధనము', 'లక్ష్యము' అత్యంత కీలకం!

దైవధర్మం మౌలికంగా మూడు భాగాలుగా ఉంటుంది. వాటిలో... 1) విశ్వాసాలు, 2) వ్యవహారాలు, 3) ఆరాధనలు అనే ఈ మూడు విభాగాలు అత్యంత మౌలికమైనవి. వాటిని వినియోగించేటప్పుడు కూడా 'లక్ష్య సాధనము మరియు–లక్ష్యము' అన్న క్రమాన్ని ఏమాత్రమూ తప్పకూడదు. అంటే 'లక్ష్య సాధనమును 'లక్ష్య సాధనము' గానే చూడాలి. అలాగే 'లక్ష్యము'ను 'లక్ష్యము'గానే చూడాలన్నది మీరు తెలుసుకున్నారు. దీనిని గనక తారుమారు చేస్తే ప్రధానంగా రెండు భారీ నష్టాలు సంభవిస్తాయి. వాటిలో...

1) భక్తుల్లో సద్గుణాలు తగ్గిపోయి, దుర్గుణాలు పెరిగిపోతాయి. 2) భక్తుల్లో పరస్పరం ఘోరమైన విద్వేషం–వేర్పాటువాదం ఏర్పడి, హింసా–దౌర్జన్యాల నుండి ఒకరినొకరు చంపుకోవటం పుణ్యకార్యంగా భ్రమించే స్థాయికి దిగజారిపోతుంది వ్యవహారం!

ఒక మతవర్గం మరొక మతవర్గం మధ్యనే కాక, ఒకే మతవర్గంలో ఉన్న ఉపవర్గాల్లోనూ పరస్పరం ఇదే పరిస్థితి ఏర్పడుతుందన్నది ఒక చారిత్రక వాస్తవం. దీనికి సంబంధించిన కొన్ని ఉదాహరణలు చూడండి.

1. **భక్తుల్లో సద్గుణాలు తగ్గిపోయి, దుర్గుణాలు పెరిగిపోతాయి**: ఈ విషయానికి వస్తే నేటి మెజారిటీ భక్తుల్లో i) వారి భావోద్వేగాల్లో: ఈర్ష్యా–ద్వేషాలు, పగా–ప్రతీకారాలు, అహంకార–మమకారాలు పెరిగిపోతున్నాయి, ii) వారి వ్యక్తిగత ప్రవర్తనలో: అబద్ధం–మోసం, అనాచారాలు–నియమరాహిత్యం వంటివి పెరిగిపోతున్నాయి, iii) వారి మానవ సంబంధాల్లో: ఉదా– తలి–దండ్రులు, అన్నా–దమ్ములు, భార్యా–భర్తలు, బంధు–మిత్రులు, ఇరుగు–పొరుగుతో విభేదాలు పెరిగిపోతున్నాయి,

iv) వారి వ్యాపారంలో: కల్తీ–మోసం, దగా–వంచనల వంటి చెడులు పెరిగిపోతున్నాయి, v) వారు ఉద్యోగులైతే: అవినీతి–లంచగొండితనం, నిర్లక్ష్యం–క్రమరాహిత్యం వంటి దుశ్చర్యలు పెరిగిపోతున్నాయి, vi) వారు పాలకులైతే: ఆశ్రిత పక్షపాతం–బంధుప్రీతి, దర్పము–భోగలాలసత్వం ప్రజాధనం దోపిడీ–దుర్వినియోగం వంటి స్వార్థపూరిత చెడులు పెరిగిపోతున్నాయి, vii) పర్యావరణం: విషయంలో వాయు–జల, నేల–శబ్ద తదితర కాలుష్యాల విషయంలో వారు అజాగరూకత, నిర్లిప్తత వంటి ప్రతికూల చర్యలకు పాల్పడుతున్నారు.

2. భక్తుల్లో పరస్పరం ఘోరమైన విద్వేషం–వేర్పాటువాదం: ఈ విషయానికి వస్తే...

A) హిందూ–యూదా, యూదా–క్రైస్తవ, హిందూ–ఇస్లాం తదితర మతవర్గాల మధ్య పరస్పరం ఏమాత్రమూ పొసగని పరిస్థితి చారిత్రక వాస్తవం. వీరి మధ్య ఘర్షణలూ–హింసాదౌర్జన్యాలు యుద్ధాలూ–మారణహోమాలు జరిగాయి. జరుగుతున్నాయి.

B) i) హిందువుల్లో శైవులూ–వైష్ణవులు, ii) యూదుల్లో ఆర్థోడాక్స్ జుడాయిజం–రిఫార్మ్ జుడాయిజం, iii) క్రైస్తవుల్లో క్యాథలిక్కు–ప్రొటెస్టంట్, iv) ముస్లిముల్లో సున్నీ–షియా ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నెన్నో అంతర్గత మతవర్గాలు వాటి మధ్య ఘర్షణలూ–హింసాదౌర్జన్యాలు, యుద్ధాలూ–మారణహోమాలు జరిగాయి. జరుగుతున్నాయి.

గమనిక: ఆయా మతవర్గాలకి చెందిన కొందరిలో ఉన్న మతోన్మాద తీవ్రవాదానికి పరాకాష్ట ఏమిటంటే ఒకరినొకరు చంపుకోవటం పరస్పరం పుణ్యకార్యంగా భ్రమించటం! ఇంతకు మించిన అమానవీయత, రాక్షసత్వం ఇంకా ఏమైనా ఉంటుందా!? ఈ నిర్వాకాలకి పాల్పడేవారంతా ఏదో నామకార్ధ మతస్తులు కాదు, నిష్టాగరిష్టలైన దైవ భక్తులన్నది అత్యంత విద్దూరం!

ఇంతటి ఘోర విషాదానికి కారణం కచ్చితంగా ధర్మం కాదు. వివిధ ధార్మిక అంశాలను వాటి స్థానాలను మార్చి అనుసరించటమే అన్నది నిస్సందేహం. అదేమిటో చూడండి.

సకల ధార్మిక వ్యవస్థల్లో ఉన్న సమాంతర మౌలిక విషయాలు ఏమిటి?

సకల ధార్మిక వ్యవస్థల్లో శాఖా పరమైన విషయాల్లో కొన్ని వైరుధ్యాలు ఉన్నాయి. కానీ మౌలిక విషయాల్లో మాత్రం సారూప్యతలు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనవి...

1. విశ్వాసాలు.

2. సత్కర్మలు.

3. ఆరాధనలు.

వీటికి సంబంధించిన వైదిక, యూద, క్రైస్తవ, ఇస్లాం ధర్మ గ్రంథాల ఆధారాలు "సజ్జనులుగా మలచే ప్రేరకాలు ఏమిటి?" అనే మా వేరే రచనలో వివరంగా చూడగలరు.

ఆ మూడు విభాగాల్లో 'లక్ష్య సాధనాలు' ఏమిటి? & 'లక్ష్యం' ఏమిటి?

అటు– మనిషిని మరియు ఇటు– ధర్మశాస్త్రాలను సృష్టించింది ఆ ఏకైక సృష్టికర్తే. కాబట్టి అటు– "మానవ మనస్తత్వానికి, అతని ప్రవర్తన"కు మరియు ఇటు– "ధర్మ శాస్త్రాల ప్రబోధనలకి, వాటి ప్రభావాని"కి మధ్య ఒక 'తార్కిక సంబంధం' ఉందని మీకు తెలుసు.

రెండు వాస్తవాలు:

1. మనిషి కలిగి ఉండే i) 'విశ్వాసాల' వలనగాని, ii) మనిషి ఆచరించే 'సత్కర్మల' వలనగాని, iii) మనిషి చేసే 'ఆరాధనల' వలనగానీ ఒక్క మనిషికి తప్ప దేవునికి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదన్నది ఒక వాస్తవం. ఎందుకంటే దేవుడు నిరపేక్షాపరుడు కాబట్టి.

2. మనిషి మనస్తత్వాన్ని గమనిస్తే అతడు i) 'ఆశ' మరియు ii) 'భయం' అనే రెండు ప్రేరకాలు లేకుండా ఏ పనీ ఎన్నడూ చేయజాలడన్నది ఒక వాస్తవం.

ఈ రెండు వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని ఈ అంశాన్ని పరిశీలనగా చూడాలని కోరుతున్నాను. ధార్మిక విశ్వాసాల్లో అత్యంత ప్రధానమైనవి రెండు. వాటిలో...

1. "నాపై అజమాయిషీ కలిగిన సర్వశక్తి మాన్యుడు ఒకడు ఉన్నాడు. ఆయన మనసా–వాచా–కర్మణా నేనుచేసే మంచి–చెడు కర్మలపై తీక్షణమైన దృష్టి పెట్టి ఉన్నాడు. నేను 'సత్కార్యాలు' ఆచరిస్తే అపార కరుణామయుడై ఆయన నన్ను ఆదుకుంటాడు. మనసా–వాచా–కర్మణా నేను తెగబడిన నా 'దుష్కార్యాల'కి నన్ను అత్యంత కఠినంగా దండిస్తాడు!" అని మీరు కచ్చితంగా నమ్మితేనే మీకు 'దేవునిపట్ల విశ్వాసం' ఉన్నట్లు.

2. "A) ఇహంలో నేను చేసుకున్న 'సత్కర్మల'కి తగిన ప్రతిఫలం లభించకపోయినా, పరంలో శాశ్వత సుఖసంతోషాల ముక్తిధామం అయిన స్వర్గం మాత్రం లభిస్తుంది. అలాగే B) నేను పాల్పడిన 'దుష్కర్మల'కి తగిన దండన ఇహలోకంలో

తప్పించుకున్నా, పరంలో శాశ్వత యాతనల నరక కూపంలో పడక తప్పదు!" అని మీరు కచ్చితంగా నమ్మితేనే మీకు 'మరణానంతర జీవితంపట్ల విశ్వాసం' ఉన్నట్లు.

ఈ రెండు విశ్వాసాలను తార్కికంగా అంగీకరించే వ్యక్తి మస్తిష్కాన్ని అవి అత్యంత అనుకూలంగా ప్రభావితం చేస్తాయి. ఒక వ్యక్తికి శాశ్వత స్వర్గం లభిస్తుందనే 'ఆశ' అన్నది 'సత్కర్మల'ను ఆచరించటానికి ఒక బలమైన ప్రేరకమైతే, శాశ్వత నరకం తప్పదు అనే 'భయం' వ్యక్తికి 'దుష్కర్మల'ను విడనాడటానికి ఒక బలమైన ప్రేరకమౌతుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. ఎందుకంటే ఇదొక సాధారణ సహజ మానసిక ప్రక్రియ.

మనిషిని నడిపించేది అతడుకలిగి ఉన్న ఆశా–భయాల ఆలోచనే. ఒకనిని 'బాధ్యతాయుత వ్యక్తి'గా లేక 'బాధ్యతారహిత వ్యక్తి'గా చేసేది కూడా అతడు కలిగి ఉన్న ఆలోచనే.

దీనిని లౌకికంగా చూచినా ఒకడు చదువుతున్నా, ఉద్యోగం చేస్తున్నా, వ్యాపారం చేస్తున్నా, మరేది చేస్తున్నా ప్రతి ఒక్కనికీ ఆశా–భయాలే ప్రచోదకాలు అవుతాయి. అలాగే దేవుడు–పరలోకం ఉన్నాయి అన్న ఈ ఆలోచననే ధార్మిక పరిభాషలో 'విశ్వాసం' అని అంటారు. ఆ ఆలోచనను ఆచరణలో పెట్టినప్పుడు దాని వలన మానసిక, శారీరక, నైతిక ప్రయోజనాలు కలుగుతుంటే అది ఒక 'నమ్మకం'గా మారుతుంది. ఉదా:

1. "I) ఈ సృష్టికి కర్త ఎవడూ లేడు. II) నేను చేసే మంచి–చెడు కర్మలకు ఎవని ముందూ సమాధానం చెప్పుకోవలసిన అవసరం నాకు లేదు!" అన్నది ఒక 'బాధ్యతారహిత ఆలోచన' అనటంలో ఎవనికీ ఎలాంటి సందేహమూ లేదు.

2. "I) ఈ సృష్టికి కర్త ఒకడు ఉన్నాడు. II) నేను చేసే మంచి–చెడు కర్మలకు ఒకానొక రోజు ఆయన ముందు సమాధానం చెప్పుకోవలసిన అవసరం నాకు ఉంది!" అన్నది ఒక 'బాధ్యతాయుత ఆలోచన' అనటంలోనూ ఎవనికీ ఎలాంటి సందేహమూ లేదు.

ఒకవైపు– భాధ్యతరహిత విశ్వాసం కలిగిన వ్యక్తి మనస్సులో– దుశ్శీలతకు కారణాలైన i) గర్వం, ii) కామవాంఛ, iii) కఠినత్వం, iv) అహంకారం, v) విద్వేషం, vi) స్వార్థం వంటి 'దుర్గుణాలు' విజృంభిస్తాయి.

మరోవైపు– బాధ్యతాయుత విశ్వాసం కలిగిన వ్యక్తి మనస్సులో– సౌశీల్యతకి ఆధారాలైన i) అణకువ, ii) ఆత్మ నిగ్రహం, iii) నమ్రత, iv) నిరహంకారం, v) ప్రేమ, vi) త్యాగశీలత వంటి 'సద్గుణాలు' విరబూస్తాయి.

ఏది ఏమైనా ఆ రెండు నమ్మకాల పట్ల నిబద్ధత ఉన్న వ్యక్తి, తన మాటలు, చేతలపైనే కాక, చివరికి తన ఆలోచనలపై సైతం గరిష్ట స్థాయి అదుపు కలిగి ఉంటాడు. తన జీవితాన్ని అప్రమత్తతతో, జాగురుకతతో, నిష్టానియమాలతో అత్యంత క్రమశిక్షణతో గడుపుతాడన్నది నిస్సందేహం.

గమనిక: ఒకవైపు– 'అనుకూల విశ్వాసం' కలిగి ఉన్న వారితో ఉంటూ, దాని ప్రచారం చేస్తున్నప్పటకీ ప్రతికూల ప్రవృత్తి కలిగిన వారు కూడా కొందరు ఉంటారు. అలాంటి వారిని ధర్మం– 'కపటులు' అని అంటుంది. తిరస్కారుల కంటే ఈ కపటులకు ఇహంలో ఘోర అవమానం, పరంలో కఠిన శిక్షలు ఉంటాయన్నది అత్యంత గమనార్హం!

మనిషి మనస్తత్వము ధర్మశాస్త్రాల ప్రబోధనల మధ్య ఉన్న సంబంధం ఏమిటి?

మనిషి మనస్తత్వాన్ని బట్టి చూస్తే ధార్మిక వ్యవస్థకి చెందిన మూడు భాగాల్లో మొదటి భాగమైన 'విశ్వాసాల' ద్వారా రెండవ భాగం అయిన 'వ్యావహారిక జీవనం'పై అనుకూల ప్రభావం పడుతుందని తేలిపోయింది. ఇక మిగిలింది మూడవ భాగమైన 'ఆరాధనలు'. ఇక వాటి అవసరం ఏముంది? అన్న సందేహం కలుగుతుంది. సర్వసృష్టికర్త తన ధర్మంలో దేనిని విధి చేసినా దాని ఉద్దేశ్యం మనిషి మనస్తత్వానికి తగిన విధంగానే ఉంటుందన్నది ఒక వాస్తవం.

ఆరాధనల అవసరం ఏమిటి?

ఒక భక్తుడు కలిగి ఉండే విశ్వాసాలు, సత్కర్మలకి ఎలా ప్రేరకాలు అవుతాయో తెలుసుకున్నారు. ఇక 'ఆరాధనల' పాత్ర ఏమిటి? అన్నది ప్రశ్న. దీనికి సమాధానం ఏమిటంటే– మనిషికి ఉన్న సహజ పరిమితుల్లో "మరుపు" అన్నది ఒకటి. ఇది ఒకరకంగా 'వరం'. మరొక రకంగా 'శాపం'.

వరం ఎలాగంటే, మనిషి జీవితంలో ఎన్నెన్నో దురదృష్టకర సంఘటనలు సంభవించటం అనివార్యం. వాటి గురించి విన్న వెంటనే మనిషి మానసికంగా హతాశుడైపోతాడు. అయితే సమయం గడిచే కొలది ఆ సంఘంటన మరుపుకి గురై, క్రమక్రమంగా నిలదొక్కుకుంటాడు. తద్వారా అతని జీవితం తిరిగి సజావుగా సాగుతుంది. ఈ విధంగా మరుపు ఒక వరం అవుతుంది.

శాపం ఎలాగంటే– "నాపై తీక్షణమైన నిఘా పెట్టిన న్యాయాధీశుడైన సృష్టికర్త ఒకడు ఉన్నాడు. దుష్కర్మలకి పాల్పడి శాశ్వత నరక శిక్షలకి బలైపోతానా లేక సత్కర్మలను ఆచరించి శాశ్వత సంతోషాల స్వర్గాన్ని పొందుతానా అన్నది పరీక్షించటానికి ఆయన నాకు ఈ తాత్కాలిక జీవితం ఇచ్చాడు!" అన్న ఒక "గొప్ప జీవన వాస్తవికత"ను ప్రతి భక్తుడు "ఎల్లప్పుడూ జ్ఞప్తి"లో పెట్టుకోవాల్సి ఉంటుంది. అయితే మనిషిలో ఉన్న "మరుపు" అనే సహజ పరిమితి కారణంగా అతడు దానిని క్రమక్రమంగా మరచిపోతాడు. ఈ విధంగా అది శాపము.

పైన పేర్కొన్న "గొప్ప జీవన వాస్తవికత" ఎవని మస్తిష్కంలో తాజాగా ఉంటుందో అతడు బాహ్యంలో మనిషిలా కనిపించినా ప్రవర్తనలో ఒక 'దేవతల'ను తలపిస్తాడు. ఎవని మస్తిష్కంలో అది చెరిగి పోతుందో వాడు బాహ్యములో మనిషిలా కనిపించినా ప్రవర్తనలో 'రాక్షసుల'ను తలపిస్తాడు.

కాబట్టి ఒక మనిషి ఎల్లప్పుడూ "జ్ఞప్తి"లో పెట్టుకోవాల్సిన 'దేవుడు–పరలోకం' అనే ఆ "గొప్ప జీవన వాస్తవికత" అతని మరుపునకు గురై మనసులో నుండి చెరిగిపోకుండా నిరంతరం దానిని జ్ఞప్తిలో పెట్టుకోవటం అత్యంత ఆవశ్యకం, తప్పనిసరి. దానిని మాటిమాటికీ పునరుక్తం చేస్తూ జ్ఞాపకం (Recall) చేసే ప్రక్రియలే ఆరాధనలు! సత్కర్మల నిరంతర ప్రేరక ప్రక్రియను చూడండి.



ఈ విధంగా 'విశ్వాసాల' పునశ్చరణ 'ఆరాధనల'తో ఎల్లప్పుడూ పునరావృతం అవుతూ ఉంటుంది. ఈ ప్రక్రియతో దైనందిన 'సత్కర్మలు' నిత్యం బలోపేతం అవుతూ ఉంటాయి. ఇదొక నిరంతర గోలుసుకట్టు ప్రక్రియగా సాగుతూ ఉండాలి.

In this way, the reaffirmation of 'beliefs' constantly recurs through acts of 'worship'. Through this process, daily 'righteous

deeds' are continually strengthened. This must continue as a continuous, chain-like process.

ఇది మనిషి మనస్తత్వానికి తగిన అత్యంత సహజమైన ప్రక్రియ. దీనిని సక్రమంగా ఆచరిస్తే, మనిషిలో 'దుష్కర్మలు' మందగించి, 'సత్కర్మలు' వికాసమొందుతాయి. ఇదీ దైవ ధర్మం ప్రతిపాదించిన మూడు విభాగాల మధ్య ఉన్న అంతర్గత తార్కిక సంబంధం!

విషయము మరియు దృక్పథం మధ్య తేడా ఏమిటి?

మనిషి ఆలోచన బహు సున్నితమైనది. అందులో కలిగే ఒక 'తప్పుడు దృష్టికోణం' అతడిని ఒక రాక్షసునిగా తయారు చేయవచ్చు. అలాగే అందులో కలిగే ఒక 'సరైన దృష్టికోణం' అతడిని ఒక మహాత్మునిగా మలచవచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఏ విషయం పట్ల అయినా 'సరైన దృక్పథం' ఏర్పరచుకోవాలి. ఇది జీవితానికి సంబంధించిన సకల రంగాలకీ వర్తిస్తుంది.

అదే ధార్మిక విషయంలోనైతే మరీ జగ్రత్తగా ఉండాలి. "విషయము మరియు దృక్పథము మధ్య తేడా ఏమిటి?" అన్న ప్రశ్నకి సమాధానంగా ఒక ఉదాహరణ చూడండి. "విశ్వాసం అనేది మనం ఏది నమ్మాలో దానిని నిర్ణయిస్తుంది; దృక్పథం మనం నమ్మిన దానిని ఎలా చూడాలో నిర్ణయిస్తుంది". రాబోయే అంశాల్లో ఈ విషయం మరింత స్పష్టం అవుతుంది.

విశ్వాసం పట్ల సరైన దృక్పథము అంటే ఏమిటి?

ఒకప్పుడు 'సజ్జనులైన ధార్మికుల'ను తయారు చేసిన ధర్మం ఈనాడు 'దుర్జనులైన ధార్మికుల'ను ఎందుకు తయారు చేస్తోంది? అన్నది ప్రశ్న. దీనికి సరైన సమాధానం ఏమిటంటే, "విశ్వాసం" పట్ల ఆనాటి భక్తులు 'సరైన దృక్పథం' కలిగి ఉండేవారు. ఈనాటి ధార్మికులు "విశ్వాసం" పట్ల 'తప్పుడు దృక్పథం' కలిగి ఉండటం అన్నదే సరైన సమాధానం! అదెలాగంటే...

1. ఆనాటి విశ్వాసులు– "సత్కర్మలు' ఆచరించకపోతే మా 'విశ్వాసము'ను దేవుడు స్వీకరించడు!" అనే 'సరైన దృక్పథము'ను కలిగి ఉండేవారు.

2. ఈనాటి విశ్వాసులు– "సత్కర్మలు' ఆచరించకపోయినా మా 'విశ్వాసము'ను దేవుడు స్వీకరిస్తాడు!" అనే 'తప్పుడు దృక్పథము'ను కలిగి ఉన్నారు.

విశ్వాసం పట్ల రెండవ దృక్పథమును మనిషి కనీస ఇంగిత జ్ఞానం సైతం ఏమాత్రమూ

అంగీకరించదు. బుద్ధి అంగీకరించని ఏ విషయాన్నీ ఏ ధర్మ శాస్త్రమూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించదు. వాటి ప్రకారం సత్కర్మలు లేకుండా కేవలం విశ్వాసాలు ఆమోదించబడవన్నది ఒక సుస్పష్ట తీర్మానం. స్పష్టత కోసం దీనిని మరోసారి చూడండి.

విశ్వాసం పట్ల ఒకరి దృక్పథం– "సత్కర్మలు లేని విశ్వాసం దేవుడు స్వీకరించడు!" అన్నది. మరొకరి దృక్పథం– "సత్కర్మలు లేని విశ్వాసం దేవుడు స్వీకరిస్తాడు!" అన్నది.

ఈనాటి ధార్మికుల వ్యక్తిగత జీవితంలో అనైతికత, సామూహిక జీవితంలో అమానవీయత మరియు వర్గగత జీవితంలో అనైక్యత వంటి చెడులు విజృంభించటానికి మూల కారణం– అధికశాతం భక్తుల్లో విశ్వాసం పట్ల పైన పేర్కొన్న రెండవ దృక్పథం బలంగా ఏర్పడిపోవటమే!

ఒకవేళ విశ్వాసాల జ్ఞానం లేకపోయినా సత్కర్మలతో దైవ ప్రసన్నత!

"దేవుని పట్ల విశ్వాసం కలిగి ఉండాలి!" అనే ఆజ్ఞ Debatable అన్నది అందరూ అంగీకరించేదే. కానీ, "సత్కర్మలు ఆచరించాలి!" అన్న ఆజ్ఞ Indisputable అన్నది మాత్రం నిర్వివాదాంశం. కాబట్టి దేవుడు మనిషికి శాశ్వత శిక్షా–బహుమానాల తీర్పు చేయటానికి ఒక Debatable విషయాన్ని కాక, Indisputable విషయాన్నే ఆధారంగా చేసుకోవటం తార్కికం మరియు న్యాయసమ్మతం కూడా. ఒక Debatable విషయం ఆధారంగా 'శాశ్వత స్వర్గ–నరకాల తీర్పు' చేయటం అన్నది తార్కికమూ కాదు, న్యాయమూ కాదు. అందుకే ఖురాన్ 2:286వ వాక్యం ఏమంటుందో చూడండి.

لَا يُكَلِّفُ ٱللَّهُ نَفْسًا إِلَّا وُسْعَهَا ۚ

"అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం వేయడు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

అంటే ఈ వాక్యం ఎవరు ఏ విషయం ఆధారంగా "సత్కర్మల" ఆవశ్యకతను గుర్తించే శక్తి ఉందో దాని ఆధారంగానే వాటిని ఆచరించాలి. "సత్కర్మల" ఆచరణకు ఫలానా ఈ ప్రేరణే ఉండాలి. మరో ప్రేరణతో "సత్కర్మలు" ఆచరించకూడదు అన్న నిబంధన ఏదీ లేదని తెలుస్తుంది. దానికి ప్రధానంగా రెండు పద్ధతులు ఉన్నాయి. వాటిలో...

1. దేవునిపట్ల విశ్వాసం విషయంలో ఎవనికి 'ఆత్మ సంతృప్తి' (Inner satisfaction) కలుగుతుందో వారు 'విశ్వాస ప్రేరక శక్తి'తో 'సత్కర్మలు' ఆచరించాలి.
2. దేవునిపట్ల విశ్వాసం విషయంలో ఎవనికి 'ఆత్మ సంతృప్తి' (Inner satisfaction) కలుగదో వారు తమలో ఉన్న 'సహజ నైతిక ప్రేరక శక్తి'తో 'సత్కర్మలు' ఆచారించాలి.

ఈ రెండు అవకాశాలూ ఆ సృష్టికర్త తన దాసులకు ఇచ్చిన వైనం ఒక్క ఖురానులోనే కాక, సకల ధార్మిక గ్రంథాల్లోనూ కనిపిస్తుంది. ఇంగిత జ్ఞానం చెప్పేదీ అదే కదా!

అందుకే ఒకవేళ ఎవనికైనా విశ్వాసం గురించి తెలియకపోయినప్పటికీ అతడు గనక తనలోని నైతిక ప్రేరణతో కేవలం 'సత్కర్మలు' ఆచరించినా 1) వాటినీ దేవుడు ఆమోదిస్తాడు అనే దానికి లేదా 2) సత్కర్మలు ఆచరించేవాడు దైవాన్ని విశ్వాసించినట్లే అవుతుంది అనే దానికి ధర్మ గ్రంథాల్లో అనేక ఆధారాలు లభిస్తాయి!

ఇంకా ప్రజల్లో 'భావవాదులు' (Spiritualists) మరియు 'భౌతికవాదులు' (Secularists/Materialists) అనే రెండు మైండ్ సెట్స్ కలిగిన వారు ఉంటారు. మనిషికి ఒకటి 'హృదయ' కేంద్రిత ఆలోచన EQ (Emotional Intelligence)కు సంకేతం. అలాగే 'బుద్ధి' కేంద్రిత ఆలోచన IQ (Intelligence Quotient)కు సంకేతం. వారిద్దరినీ సృష్టించింది ఆ ఏకైక సృష్టికర్తే. దీని ఆధారంగా ఒకటి– 'విశ్వాస పథం' (Path of Faith/Devotion) అని, రెండు– 'వివేక పథం' (Path of Wisdom/Discrimination) ఏర్పడతాయి.

కాబట్టి ఆ రెండు 'మైండ్ సెట్స్'కి తగిన రెండు మార్గాలను చూపటం దైవానికి న్యాయ సమ్మతం అవుతుంది. ఆయన ఒక గొప్ప న్యాయకారి కాబట్టి 'భావవాదుల'కు 'విశ్వాసం' పట్ల కలిగిన 'ఆత్మ సంతృప్తి' ప్రేరణతో 'సత్కర్మలు' చేయమన్నాడు. అలాగే తమలోనే ఉన్న 'నైతిక స్పృహ' ప్రేరణతో 'సత్కర్మలు' చేసినా అంగీకరిస్తానని 'భౌతిక వాదుల'కు సృష్టికర్త హామీనిస్తున్నాడు. దీనికి సంబంధించి వైదిక, యూద, క్రైస్తవ, ఇస్లాం శాస్త్రాల నుండి కొన్ని ఆధారాలను చూడండి.

వైదిక ధర్మం ఏమంటుందో చూడండి!

వైదిక ధర్మంలో ఒకవైపు– ధార్మిక విశ్వాసాలూ–ఆరాధనాల గురించిన ప్రబోధనలు ఉన్నాయి. అవి మాత్రమే కాక, మరోవైపు– ఈ క్రింది విధమైన ప్రబోధనలు కూడా ఉన్నాయి.

భగవద్గీత 3:20– కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః।
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్కర్తుమర్హసి॥

"తమ రాజ ధర్మములను నిర్వర్తించటం ద్వారానే, జనక మహారాజు వంటి వారు సిద్ధిని పొందితిరి. ప్రపంచానికి ఒక చక్కటి ఆదర్శం చూపటానికి, నీవు కూడా నీ కర్తవ్య

నిర్వహణ చేయాలి" అని గీతా చార్యుడైన శ్రీకృష్ణుడు అర్జునికి చెబున్నారు. మరొక గొప్ప విషయం చూడండి!

భగవద్గీత 12:4– సన్నియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః॥

"i) ఇంద్రియములను నిగ్రహించి, ii) సర్వత్రా సమబుద్ధితో ఉంటూ, iii) సర్వప్రాణుల సంక్షేమం కోసం నిమగ్నమై ఉండేవారు కూడా నన్ను పొందుతారు" అని సర్వేస్వరుడే స్వయంగా ప్రకటిస్తున్నాడు.

పైన పేర్కొన్న మొదటి శ్లోకం– శంకర భాష్యం: శ్రీ ఆదిశంకరాచార్యులు "కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః" పై భాష్యం రాస్తూ, జనకుడు సన్యాసం తీసుకోకపోయినా, రాజ్యాధికారంలో ఉంటూనే బాహ్య లింగాల (మత పరమైన వేషధారణల)తో పనిలేకుండా జ్ఞానం అంటే "నేను నిత్యమైన, శాశ్వతమైన ఆత్మను!" అనే వాస్తవికతను గుర్తించటం ద్వారా ముక్తి పొందాడని ఈ మహా భారత సందర్భాన్ని ఉదహరిస్తారు.

అంటే జనక మహారాజు విశ్వాసమూ–ఆరాధనాల వంటి కర్మకాండలను ప్రత్యేకంగా ఆచరించకపోయినప్పటికీ, రాజుగా తన సుఖ భోగాలను, స్వార్థ చింతనను పరి త్యజించి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తన రాజధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించాడు. అయినప్పటికీ అతడు ముక్తికి అర్హుడు అయ్యాడని తెలుస్తుంది.

అలాగే పైన పేర్కొన్న రెండవ శ్లోకంలో ఎలాంటి కర్మకాండల ఊసు లేకుండా లోక కళ్యాణానికి దోహదమయ్యే కేవలం మూడు లౌకిక కర్మలను పేర్కొని వాటిని ఆచరించే వారు కూడా తనను పొందుతారని పరమేశ్వరుడే స్వయంగా హామీనిస్తున్నాడు.

యూదా ధర్మం ఏమంటుందో చూడండి!

బైబిలు గ్రంథలో ఆజ్ఞలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఆది "ఆజ్ఞ అతిక్రమమే పాపము, ఆ పాపమునకు వచ్చు జీతమే మరణము!" అని తీర్మానిస్తుంది. దీనిని బట్టి బైబిలులో ఆజ్ఞకి ఉన్న స్థానం ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

ఏ ఆజ్ఞలకి అధిక ప్రాధాన్యత ఉంది?

ఒక భక్తునిగా దేవుడు ఏ రకమైన ఆజ్ఞలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాడు? అన్న ప్రశ్నకి సరైన సమాధానం ఏమిటో తెలుసుకోవాలి. లేదంటే వంటకంలో ఉప్పు చాలా

ప్రాముఖ్యమైంది అని అతిశయానికి పోయి అవసరానికి మించి వేస్తే అది తినటానికి పనికి రాకుండా పోతుంది! అలాగే దేవుని ఆజ్ఞల విషయం కూడా అంతే. దేవుడు ఏ ఆజ్ఞలకి ఎంత ప్రాధాన్యత ఇచ్చాడో విశ్వాసులు కూడా వాటికి అంతే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

బైబిలు గ్రంథంలో ఉన్న ఆజ్ఞలను: 1) నైతిక ఆజ్ఞలు, 2) సామాజిక ఆజ్ఞలు, 3)ఆచారాల ఆజ్ఞలు, 4) ఆరోగ్య ఆజ్ఞలు వగైరాగా వర్గీకరించవచ్చు. ఇప్పుడు మీ ముందు రానున్న విషయాల్లో దేవుడు తన సకల ఆజ్ఞల్లో ఏ ఆజ్ఞలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నాడో జాగ్రత్తగా గమనించాల్సి ఉంది.

పాత నిబంధనలో ఒకవైపు– "ఆచార ఆజ్ఞలు" అంటే 'విశ్వాసాలూ–ఆరాధనాల'కి సంబంధించిన ఆజ్ఞలు ఉన్నాయి. అలాగే "నైతిక ఆజ్ఞలు" అంటే 'నీతి, న్యాయం, కనికరం, ప్రేమా, క్షమా, సేవా వగైరాలను గురించిన ఆజ్ఞలు ఉన్నాయి కాదా! ఈ రెండు రకాల ఆజ్ఞల్లో దేవుడు వేటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాడో చూడండి.

యెహోవా దృష్టిలో ఉత్తమ ఆజ్ఞలు!

మీకా 6:6–8– 6 ఏమి తీసికొని వచ్చి నేను యెహోవాను దర్శింతును? ఏమి తీసికొని వచ్చి మహోన్నతుడైన దేవుని సన్నిధిని నమస్కారము చేతును? దహనబలులను ఏడాది దూడలను అర్పించి దర్శింతునా?। వేలకొలది పొట్టేళ్లను వేలాది నదులంత విస్తారమైన తైలమును ఆయనకు సంతోషము కలుగజేయునా? నా అతిక్రమమునకై నా జ్యేష్ఠపుత్రుని నేనిత్తునా? నా పాపపరిహారమునకై నా గర్భ ఫలమును నేనిత్తునా?" అని ఒక భక్తుడు ఎంతో వేదనతో, ఆతృతగా ప్రశ్నిస్తున్నాడు, ఇక బైబిలు సమాధానం ఏమిటో చూడండి.

"మనుష్యుడా, యేది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది; i) న్యాయముగా నడుచుకొనుటయు, ii) కనికరమును ప్రేమించుటయు, iii) దీనమనస్సుకలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు" అని బైబిలు సమాధానం ఇస్తుంది.

ఈ వాక్యాల్లో "యేది ఉత్తమమో" అన్న వాక్య భాగం ఇక్కడ అత్యంత గమనార్హం. ఇందులో వచ్చిన మూడు విషయాల్లో నైతికతా–మానవత సంబంధిత విషయాలు తప్ప, విశ్వాసాలూ–ఆరాధనాల వంటి ఆచారాలకి సంబంధించిన విషయం ఒక్కటి కూడా లేదు!

యెహేజ్కేలు 18:5-9- "ఒకడు నీతిపరుడై i) నీతిన్యాయములను అనుసరించు వాడైయుండి। ii) పర్వతముల మీద భోజనము చేయకయు, iii) ఇశ్రాయేలీయులు పెట్టుకొనిన విగ్రహముల తట్టు చూడకయు, iv) తన పొరుగువాని భార్యను చెరపకయు, v) బహిష్టయైన దానిని కూడకయు,। vi) ఎవనినైనను భాదపెట్టకయు, vii) ఋణస్థునికి అతని తాకట్టును చెల్లించి బలాత్కారము చేత ఎవనికైనను నష్టము కలుగజేయకయు నుండువాడై, viii) ఆకలిగల వానికి ఆహారమిచ్చి ix) దిగంబరికి బట్టయిచ్చి। x) వడ్డికి అప్పియ్యకయు, xi) లాభము చేపట్టకయు, xii) అన్యాయము చేయకయు, xiii) నిష్పక్షపాతముగా న్యాయము తీర్చి। xiv) యథార్థపరుడై నా కట్టడలను గైకొనుచు xv) నా విధుల ననుసరించుచుండిన యెడల వాడే నిర్దోషియగును, నిజముగా వాడు బ్రదుకును; ఇదే ప్రభువైన యెహోవా వాక్కు". అలాగే...

యెహేజ్కేలు 18:21-22- "అయితే దుష్టుడు i) తాను చేసిన పాపములన్నిటిని విడిచి, ii) నా కట్టడలన్నిటిని అనుసరించి iii) నీతిని అనుసరించి iv) న్యాయము జరిగించిన యెడల అతడు మరణము నొందడు, అవశ్యముగా అతడు బ్రదుకును.। అతడు చేసిన అపరాధములలో ఒకటియు జ్ఞాపకములోనికి రాదు, అతని నీతినిబట్టి అతడు బ్రదుకును" ఇంకా...

యెషయా 1:11-17- "యెహోవా సెలవిచ్చిన మాట ఇదే విస్తారమైన మీ బలులు నాకేల? దహనబలులగు పొట్టేళ్లను బాగుగా మేపిన దూడల క్రొవ్వును నాకు వెక్కస మాయెను కోడెల రక్తమందైనను గొఱ్ఱపిల్లల రక్తమందైనను మేక పోతుల రక్తమందైనను నాకిష్టము లేదు.। నా సన్నిధిని కనబడవలెనని మీరు వచ్చుచున్నారే నా ఆవరణములను త్రొక్కుటకు మిమ్మును రమ్మన్న వాడెవడు?। మీ నైవేద్యము వ్యర్థము అది నాకు అసహ్యము పుట్టించు ధూపార్పణము దానినికను తేకుడి అమావాస్యయు విశ్రాంతి దినమును సమాజకూట ప్రకటనమును జరుగుచున్నవి పాపులగుంపు కూడిన ఉత్సవ సమాజమును నేనోర్చ జాలను".। మీ అమావాస్య ఉత్సవములును నియామక కాలములును నాకు హేయములు అవి నాకు బాధకరములు వాటిని సహింపలేక విసికి యున్నాను.। మీరు మీ చేతులు చాపునప్పుడు మిమ్మును చూడక నా కన్నులు కప్పుకొందును మీరు బహుగా ప్రార్థన చేసినను నేను వినను i) మీ చేతులు రక్తముతో నిండియున్నవి.। ii) మిమ్మును కడుగుకొనుడి శుద్ధి చేసికొనుడి. iii) మీ దుష్క్రియలు నాకు కనబడకుండ వాటిని తొలగింపుడి.। iv) కీడుచేయుట మానుడి v) మేలుచేయ

నేర్చుకొనుడి vi) న్యాయము జాగ్రత్తగా విచారించుడి, vii) హింసించబడు వానిని విడిపించుడి viii) తండ్రి లేనివానికి న్యాయము తీర్చుడి ix) విధవరాలి పక్షముగా వాదించుడి".

యెహోవాకి ఇష్టమైన ఆజ్ఞలు ఏమిటి?

సామెతలు 21:3– "నీతిన్యాయముల ననుసరించి నడచుకొనుట బలుల నర్పించుటకంటె యెహోవాకు ఇష్టము" అని బైబిలు చెబుతుంది.

ఒక విధమైన ఆజ్ఞలు దేవునికి ఇష్టము మరొక రకమైన ఆజ్ఞలు అయిష్టం అని కాదు. ఇక్కడ అర్థం ఏమిటంటే ప్రాధాన్యత పరంగా "నీతిన్యాయముల ననుసరించి నడచుకొనుట" Endsకి మరియు కర్మకాండలకి సంబంధించిన ఆజ్ఞలు Meansకి సంబంధించినవని తెలుస్తుంది.

యెహోవాకి సంతోషం కలిగించే ఆజ్ఞలు ఏమిటి?

1 సమూయేలు 15:22– "అందుకు సమూయేలు తాను సెలవిచ్చిన ఆజ్ఞను ఒకడు గైకొనుట వలన యెహోవా సంతోషించునట్లు, ఒకడు దహన బలులను బలులను అర్పించుట వలన ఆయన సంతోషించునా? ఆలోచించుము, బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ల క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్ఠము" అని బైబిలు ప్రకటిస్తుంది.

ఈ వాక్యంలో– "తాను సెలవిచ్చిన ఆజ్ఞను ఒకడు గైకొనుట వలన యెహోవా సంతోషించునట్లు, ఒకడు దహనబలులను బలులను అర్పించుటవలన ఆయన సంతోషించునా?" అన్నది గమనార్హం. ఇక్కడ "తాను సెలవిచ్చిన ఆజ్ఞ" అంటే "నైతిక ఆజ్ఞలు" అయిన 'నీతి, న్యాయం, కనికరం, ప్రేమా, క్షమా, సేవా వగైరాలు. నిజానికి బలుల ఆజ్ఞలు కూడా దేవుడే ఇచ్చాడు. అయితే "యెహోవా సంతోషించు" ఆజ్ఞలైతే మొదటివేనని వాక్యం చెబుతుంది.

గమనిక: పూర్తి బైబిలులో 'విశ్వాసాలూ–ఆరాధనల'కి సంబంధించిన ఆజ్ఞల విషయంలో "దేవుని దృష్టిలో i) ఉత్తమ ఆజ్ఞలు, ii) దేవునికి ఇష్టమైన ఆజ్ఞలు, iii) యెహోవా సంతోషించు ఆజ్ఞలు!" వంటి ప్రయోగాలు చేయకపోవటం అత్యంత గమనార్హం. దీనికి కారణం ఏమిటంటే అవి సాధనాలేగానీ లక్ష్యం కాదు కాబట్టి!

ఆమోసు 5:21–24 – “మీ పండుగ దినములను నేను అసహ్యించుకొనుచున్నాను; వాటిని నీచముగా ఎంచుచున్నాను; మీ వ్రత దినములలో కలుగు వాసనను నేను ఆఘ్రాణింపనొల్లను.। నాకు దహనబలులను నైవేద్యములను మీరర్పించినను నేను వాటిని అంగీకరింపను; సమాధాన బలులుగా మీరర్పించు క్రొవ్విన పశువులను నేను చూడను.। మీ పాటల ధ్వని నా యొద్ద నుండి తొలగనియ్యుడి, మీ స్వరమండలముల నాదము వినుట నాకు మనస్సులేదు.। i) నీళ్లు పారినట్లుగా న్యాయము జరుగనియ్యుడి, ii) గొప్ప ప్రవాహమువలె నీతిని ప్రవహింప నియ్యుడి”.

నిజానికి పైన పేర్కొన్న “ఆచార ఆజ్ఞలు” అంటే ‘విశ్వాసాలూ–ఆరాధనాల’కి సంబంధించిన ఆజ్ఞలు దేవుడు ఇచ్చినవే. అయినప్పటికీ వాటిని ఒకవైపు– “అసహ్యించుకొను చున్నాను; నీచముగా ఎంచుచున్నాను, మీరర్పించు క్రొవ్విన పశువులను నేను చూడను!” అని నిష్కర్షగా ప్రకటిస్తున్నాడు. మరోవైపు– “నీళ్లు పారినట్లుగా న్యాయము జరుగనియ్యుడి, గొప్ప ప్రవాహమువలె నీతిని ప్రవహింప నియ్యుడి” అని ఆజ్ఞాపిస్తున్నాడు.

ఈ పరిశీలనతో యూదుల ధర్మశాస్త్రాల ప్రకారం “ఆచార ఆజ్ఞల” (Means) కంటే “నైతిక ఆజ్ఞలు” (End) ప్రాధాన్యత కలిగి ఉన్నాయని బైబిలు (పాత నిబంధన) ఆధారంగా తెలుసుకున్నాం.

క్రైస్తవ ధర్మం ఏమంటుందో చూడండి!

నిజానికి యేసు ఒక క్రొత్త ధర్మాన్ని బోధించలేదు. మోషే బోధించిన పాత ధర్మాన్నే పునరుద్ధరించారు. దానికి సంబంధించిన ఆధారాన్ని చూడండి.

బైబిలు మత్తయి 5:17– “ధర్మశాస్త్రమునైనను ప్రవక్తల వచనములనైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు” అని ప్రకటిస్తున్నారు.

కాబట్టి యూదా, క్రైస్తవ ధర్మాల మౌలిక దృక్పథంలో పెద్దగా వ్యత్యాసం ఉండదు. ఇక్కడ కూడా మన చర్చ “ఆచార ఆజ్ఞల” (Means) కంటే “నైతిక ఆజ్ఞలు” (Ends) ప్రాధాన్యత ఉందా అన్నది పరిశీలించటమే.

క్రైస్తవ సమాజానికి చెందిన పండితులూ, ప్రచారకులు విశ్వాసం గురించి చాలా అంటే చాలా గట్టిగా నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. కానీ క్రొత్త నిబంధనలో 'విశ్వాస మార్గం'తో పాటు, 'నైతిక మార్గం' కూడా ఉందన్నది గుర్తించరు. అయితే వాక్యాన్ని పరిశీలించండి.

బైబిలు రోమీయులకు 2:9–10– "దుష్క్రియము చేయు ప్రతి మనుష్యుని ఆత్మకు, మొదట యూదునికి గ్రీసు దేశస్థునికి కూడ, శ్రమయు వేదనయు కలుగును.। సత్ క్రియ చేయు ప్రతివానికి, మొదట యూదునికి గ్రీసు దేశస్థునికి కూడ, మహిమయు ఘనతయు సమాధానమును కలుగును" అని బైబిలు ప్రకటిస్తుంది.

ఒక మనిషి దేవునికి ఇష్టుడై, రక్షణ పొందాలంటే అతడు "సత్ క్రియ చేయువాడు" అయి ఉంటే సరిపోతుందని పై వాక్యం తేటపరుస్తుంది. మరొక వాక్యాని చూడండి.

బైబిలు యాకోబు పత్రిక 2:17,18– ఆలాగే విశ్వాసము క్రియలులేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును.। అయితే ఒకడు నీకు విశ్వాసమున్నది, నాకు క్రియలున్నవి; క్రియలు లేకుండ నీ విశ్వాసము నాకు కనుపరచుము, నేను నా క్రియలచేత నా విశ్వాసము నీకు కనుపరతునని చెప్పును". ఈ వాక్యాలను చూడండి.

బైబిలు యాకోబు పత్రిక 2:19,20– "దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి.। వ్యర్థుడా, క్రియలులేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసి కొనగోరుచున్నావా?" అని బైబిలు ప్రశ్నిస్తుంది.

గోల్డెన్ రూల్ ఏమిటి?

బైబిలులో ఎన్నెన్నో ఆజ్ఞలు–ఆదేశాలు ఉన్నాయి. వాటన్నిటిలో "గోల్డెన్ రూల్" పేరిట ప్రతీతి పొందిన ఆజ్ఞ ఏమిటో చూడండి.

బైబిలు మత్తయి 7:12– "కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునైయున్నది" అని యేసు ప్రకటిస్తున్నారు. లోకులైతే దీనిని గోల్డెన్ రూల్ అన్నారు. యేసు మరొక సందర్భంలో దానికి ఇంకా ఎంతటి స్థానం ఇస్తున్నారో చూడండి.

బైబిలు మత్తయి 22: 36–39– "బోధకుడా! ధర్మ శాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏదని అడిగెను. అందు కాయన నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే.। ఇది ముఖ్య

మైనదియు మొదటిదియునైన ఆజ్ఞ.। నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింప వలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే.

ఈ వాక్యాల్లో "రెండవ ఆజ్ఞయు దాని వంటిదే!" అన్న చివరి వాక్యభాగం అత్యంత గమనార్హమైనది. ఎందుకంటే తన సృష్టికర్త అయిన దైవాన్ని ప్రేమించటం ముఖ్యమైనది మరియు ప్రాథమికమైనది. తన తోటి వారిని తనవలే ప్రేమించటం అన్నది కూడా సాక్షాత్తు దేవుడిని ప్రేమించటంతో సమానం అని చెప్పటమే!

గమనిక: ఒకవేళ ఎవరైనా తమకు దేవుని గూర్చిన జ్ఞానం లేనప్పటికీ వారుగనక తమ తోటివారికి ఎలాంటి 'కీడు' తలపెట్టకుండా, వారికి 'మేలు' చేస్తుంటే అలాంటి వారు కూడా పరోక్షంగా దైవాన్ని ప్రేమిస్తున్నట్లే అన్నది అత్యంత గమనార్హం! అయితే పూర్తి బైబిలులో ఎక్కడా అలాంటి ప్రకటన ప్రార్థనలూ–ఉపవాసలాను గురించి చేయలేదు. అందుకే అది "గోల్డెన్ రూల్" అయ్యింది.

విశ్వాసాలూ–ఆరాధనాలకి చెందిన "ఆచార ఆజ్ఞల" (Means) కంటే "నైతికతా–మానవత ఆజ్ఞలు" (End) ప్రాధాన్యత కలిగి ఉన్నదని బైబిలు (క్రొత్త నిబంధన) కూడా చెబుతుంది.

ఇస్లాం ధర్మం ఏమంటుందో చూడండి!

ఇస్లాం ధర్మంలో ఒకవైపు– ధార్మిక విశ్వాసాలూ–ఆరాధనాల గురించిన ప్రబోధనలు ఉన్నాయి. అవి మాత్రమే కాక, మరోవైపు– ఈ క్రింది విధమైన ప్రబోధనలు కూడా ఉన్నాయి. ఖురాన్ 25:70వ వాక్యం చూడండి ఇది 'భావవాదుల'కు సంబంధించినది.

إِلَّا مَن تَابَ وَءَامَنَ وَعَمِلَ عَمَلًا صَٰلِحًا فَأُو۟لَٰٓئِكَ يُبَدِّلُ ٱللَّهُ سَيِّـَٔاتِهِمْ حَسَنَٰتٍ ۗ وَكَانَ ٱللَّهُ غَفُورًا رَّحِيمًا

అయితే (ఈ దుష్కర్మల తరువాత) ఎవరు i) పశ్చాత్తాపం చెంది, ii) విశ్వసిస్తారో, iii) సత్కర్మలు చేస్తారో అలాంటి వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చి వేస్తాడు. ఎందుకంటే అల్లాహ్ క్షమాభిక్ష పెట్టేవాడు, కరుణాకరుడు.

పై వాక్యంలో ఉన్న మూడు విషయాల్లో రెండవ విషయం "విశ్వాసం" సంబంధించినది ఉంది. అలాగే 'భావవాదుల'కు సంబంధించిన 25:71వ వాక్యం చూడండి.

وَمَن تَابَ وَعَمِلَ صَٰلِحًا فَإِنَّهُۥ يَتُوبُ إِلَى ٱللَّهِ مَتَابًا

మరెవరయితే (తమ దుష్కర్మల నుండి) i) పశ్చాత్తాపం చెంది, ii) సత్కర్మలు చేస్తాడో అతడు (వాస్తవంగా) అల్లాహ్ వైపునకు మరలి వచ్చినవాడవుతాడు.

ఈ వాక్యంలో "విశ్వాసం" సంబంధిత విషయం లేదు. కానీ "పశ్చాత్తాపం" మరియు "సత్కర్మలు" గురించి మాత్రమే ఉంది. దీనిని బట్టి మొదటి వాక్యం– 'భావవాదుల'కి సంబంధించినది, రెండవ వాక్యం– 'భౌతిక వాదుల'కి సంబంధించినది అని అర్థమౌతుంది.

అటు– 'భావవాదుల'కి, ఇటు– 'భౌతిక వాదుల'కి మధ్య "సత్కర్మలు" మాత్రమే ఉమ్మడిగా ఉన్నాయి. కానీ "విశ్వాసం" ఉమ్మడిగా లేదు. దీని ప్రకారం– విశ్వాసాలూ–ఆరాధనాలకి చెందిన "ఆచార ఆజ్ఞల" (Means) కంటే "నైతిక ఆజ్ఞలు" (End) ప్రాధాన్యత కలిగి ఉన్నాయని ఖురాను గ్రంథం ఆధారంగానూ తెలుస్తుంది.

గమనిక: ఏ భౌతిక వాదులైతే ధార్మిక విశ్వాసాలూ–ఆరాధనాల పట్ల ఎలాంటి వ్యతిరేకత లేకుండా కేవలం తమలో ఉన్న 'సహజ నైతిక స్పృహ' ప్రేరణతో "సత్కర్మలు" ఆచరిస్తారో వారికి కూడా ఇహ–పరాల సాఫల్యం లభిస్తుందనే సంపూర్ణ హామీ ఖురాను గ్రంథం కూడా ఇస్తుందన్నది గమనార్హం!

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

విశ్వాసాలూ-ఆరాధనలు సాధనాలు మాత్రమే

సత్కర్మలే సర్వోన్నతం!



Part-4

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం----------I

సకల ధర్మశాస్త్రాల ప్రకారం– సత్కర్మలే సర్వోన్నతం!----------1

1. ఈ భూమ్యాకాశాల నిర్మాణ అంతిమ లక్ష్యం
విశ్వాసాలూ–ఆరాధనలా? లేక సత్కర్మలా?----------2

2. భూమండలంపై చేసిన అలంకరణ
అంతిమ లక్ష్యం విశ్వాసాలూ–ఆరాధనలా? లేక సత్కర్మలా?----------2

3. జీవన్మరణాల వ్యవస్థ అంతిమ లక్ష్యం విశ్వాసాలూ–ఆరాధనలా? లేక సత్కర్మలా?–3

4. అల్లాహ్, ప్రవక్త ముహమ్మద్'ను అత్యున్నత స్థానంలో
ఉన్నారని కొనియాడుతున్నది, విశ్వాసాలూ–ఆరాధనల్లోనా? నైతికతలోనా?----4

5. ప్రవక్త దృష్టిలో ప్రియులు ఎవరు? అసహ్యులు ఎవరు?----------5

6. సౌశీల్యత కోసం సమాజులో సైతం వేడుకోవాలి!----------6

7. విశ్వాసాలూ ఆరాధనలు అల్లాహ్ వద్ద చెల్లాలంటే సత్కర్మలు తప్పనిసరి!--------7

8. చివరికి మిగిలి ఉండేవి ఏమిటీ? విశ్వాసాలూ–ఆరాధనలా? లేక సత్కర్మలా?---23

9. హదీస్ ప్రకారం– పరలోకంలో కొందరు విశ్వాసుల దివాళాకి
కారణం విశ్వాసాలూ–ఆరాధనల రాహిత్యమా? లేక సత్కర్మల రాహిత్యమా?---23

10. తీర్పుదినం రోజున అల్లాహ్, తన దాసులకు
విశ్వాసాలూ–ఆరాధనల గురిని ప్రశ్నిస్తాడా? సత్కర్మల గురించి ప్రశ్నిస్తాడా?--24

11. కొందరు నరకానికి పోవటానికి మూల కారణం సత్కర్మల రాహిత్యం!-------26

12. అల్లాహ్ ప్రకారం– కొందరు స్వర్గం
పొందటానికి కారణం విశ్వాసాలూ–ఆరాధనలా? లేక సత్కర్మలా?---------29

సారాంశం----------31

విశ్వాసాలు లేకపోయినా సత్కర్మలు కూడా కొట్టివేయబడతాయి కదా!----------32

పరిచయం

ఒకప్పుడు 'సజ్జనులైన ధార్మికుల'ను తయారు చేసిన ధార్మిక వ్యవస్థ ఈనాడు ఆపని ఎందుకు చేయలేకపోతోంది? అన్నది ప్రశ్న. దీనికి సరైన సమాధానం "విశ్వాసం" పట్ల 'తప్పుడు దృక్పథం' కలిగి ఉండటం అన్నదే సరైన సమాధానం! అదెలాగంటే...

1. ఆనాటి విశ్వాసులు– "సత్కర్మలు' ఆచరించకపోతే మా 'విశ్వాసము'ను దేవుడు స్వీకరించడు!" అనే 'సరైన దృక్పథము'ను కలిగి ఉండేవారు.

2. ఈనాటి విశ్వాసులు– "సత్కర్మలు' ఆచరించకపోయినా కేవలం మా 'విశ్వాసము'ను దేవుడు స్వీకరిస్తాడు!" అనే 'తప్పుడు దృక్పథము'ను కలిగి ఉన్నారు.

ఏ వ్యవస్థలోనైనా విశ్వాసమన్నది అత్యంత కీలకం. కాబట్టి కేవలం విశ్వాసం కలిగి ఉంటే సరిపోదు దానిపట్ల సరైన దృక్పథం కూడా కలిగి ఉండాలి. ఉదా: పైన పేర్కొన్న మొదటి దృక్పథం– భక్తులను సజ్జనులు కావటానికి ప్రేరేపిస్తుంది. రెండవ దృక్పథం– వేషంలో మాత్రం భక్తులుగా చూపిస్తుంది. కానీ, ప్రవర్తనలో దుర్జనులుగా తయారు చేస్తుంది.

హిందువులు– "మేము పూజలు చేస్తున్నాం కాబట్టి..", యూదులు– "మేము అబ్రాహాము సంతానం కాబట్టి..", క్రైస్తవులు– "మేము యేసు రక్తంలో కడగబడ్డాము కాబట్టి..", ముస్లిములు–"మేము దేవుని ఏకత్వంలో(తౌహీద్లో) ఉన్నాం కాబట్టి.. దేవుడు మమ్మల్ని కాపాడుతాడు!" అనే భ్రాంతిలో ఉన్నారు. నిజానికి ప్రతి ధార్మికుడు– "మేము సత్కర్మలు చేస్తున్నాం కాబట్టి దేవుడు మమ్మల్ని కాపాడుతాడు!" అనే యథార్థతలో ఉండాలి. ఎందుకంటే విశ్వాసాలూ–ఆరాధనల కంటే సత్కర్మలే సర్వోన్నతం కాబట్టి.

ధార్మికుల తప్పుడు భావనను ధర్మశాస్త్రాల ప్రకారం సంస్కరిస్తేనే భక్తులు సజ్జనులుగా పరివర్తన చెందుతారు. ధార్మిక దుర్జనులను, ధార్మిక సజ్జనులుగా మలచటానికి కావలసిన హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం ధర్మశాస్త్రాల గొప్ప సమాచారం ఈ చిరు పుస్తకంలో లభిస్తుంది. సమాజ సంస్కర్తలైన మీరు నిశితంగా అధ్యయనం చేయాలని కోరుతున్నాను.

KAKINADA
12-02-2025

M. A. Abhilash

సకల ధర్మశాస్త్రాల ప్రకారం- సత్కర్మలే సర్వోన్నతం!

ఏది సుస్పష్టంగా, సులువుగా తెలుస్తుందో దానికే మనిషిని నిబద్ధుడు చేయటం సాధ్యం మరియు న్యాయం కూడా. ఉదా: సామాన్య ప్రజలను ఉద్దేశించి– "దైవాన్ని విశ్వసించటం మంచిదా చెడ్డదా?" అని ప్రశ్నించామనుకోండి అందరూ ఏకగ్రీవంగా సమాధానం ఇస్తారా? లేక విభిన్నంగా సమాధానం ఇస్తారా? విభిన్నంగానే ఇస్తారు.

దీనికి బదులుగా– "సత్కర్మలు చేయటం మంచిదా చెడ్డదా?" అని ప్రశ్నిస్తే వచ్చే సమాధానం– "ఏకగ్రీవంగా ఉంటుందా? లేక విభిన్నంగా ఉంటుందా?" ఏకగ్రీవంగానే ఉంటుంది.

దీనికి కారణం ఏమిటంటే– మత సంబంధమైన 'విశ్వాసాలూ–ఆరాధనలు వగైరా క్రతువులు' సకల జనుల సాధారణ ఊహకి ఇట్టే అందని "అభౌతిక" విషయాలు. కానీ, 'నైతికతా–మానవత వగైరా విలువలు' మనిషి ఊహకి అత్యంత సులువుగా అందే సాధారణ "భౌతిక" విషయాలు.

కాబట్టి పరలోకంలో తీర్పు తీర్చటానికి కేవలం ఒక్క 'విశ్వాసాలూ–ఆరాధనల'ను మాత్రమే ఆధారం చేసుకొని తీర్పు చేయటం సకల మానవాళిపట్ల న్యాయమా? లేక 'నైతికతా–మానవత'కి సంబంధించిన సత్కర్మలను ఆధారం చేసుకొని తీర్పు చేయటం న్యాయమా? అని ప్రశ్నిస్తే మీ ఇంగితం–అనుభవం ఇచ్చే సమాధానం ఏమిటి? "సత్కర్మలు" అన్నదే కదా!

అందుకే అల్లాహ్ 'విశ్వాసాలూ-ఆరాధనల'ను 'Means'గా పెట్టి, "సత్కర్మల"ను 'Ends'గా పెట్టాడు. కాబట్టి పూర్తి 'ఖురాను-హదీస్'లో సత్కర్మలనే సర్వోన్నతంగా పెట్టిన వైనాన్ని కాస్త నిశితంగా చూడండి.

1. ఈ భూమ్యాకాశాల నిర్మాణ అంతిమ లక్ష్యం విశ్వాసాలూ-ఆరాధనలా? లేక సత్కర్మలా?

భూమ్యాకాశాల నిర్మాణం అన్నది అత్యంత మహోన్నత విషయం. దానికి మించిన మరొక విషయం ఏదీ లేదు. అలాంటి ఆ మహాకార్యానికి కారణం- 'విశ్వాసాలూ - ఆరాధనలు' ఎవరు చేస్తారో 'పరీక్షించటమా?' లేక 'సత్కర్మలు' ఎవరు చేస్తారో 'పరీక్షించటమా?' అన్న ప్రశ్నకి ఖురాన్ ఇస్తున్న సమాధానం ఏమిటో 11:7వ వాక్యంలో చూడండి.

وَهُوَ ٱلَّذِى خَلَقَ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضَ فِى سِتَّةِ أَيَّامٍ وَكَانَ عَرْشُهُۥ عَلَى ٱلْمَآءِ لِيَبْلُوَكُمْ أَيُّكُمْ أَحْسَنُ عَمَلًا ۗ وَلَئِن قُلْتَ إِنَّكُم مَّبْعُوثُونَ مِنۢ بَعْدِ ٱلْمَوْتِ لَيَقُولَنَّ ٱلَّذِينَ كَفَرُوٓا۟ إِنْ هَٰذَآ إِلَّا سِحْرٌ مُّبِينٌ

"ఆయన ఆరు రోజుల్లో ఆకాశాలనూ, భూమినీ సృష్టించాడు. (అంతకు ముందు) ఆయన సింహాసనం (అర్ష్) నీటిపై ఉండేది. ఈ సృష్టికి కారణం ఏమిటంటే, మీలో 'సత్కర్మలు' చేసేవారెవరో పరీక్షించటం" అని ఖురాన్ చెబుతుంది.

2. భూమండలంపై చేసిన అలంకరణ అంతిమ లక్ష్యం విశ్వాసాలూ-ఆరాధనలా? లేక సత్కర్మలా?

ఇక ఈ భూమండలంపై చేసిన అలంకరణకి కారణం చెబుతున్నాడు. అది తెలియాలంటే ఇతర గ్రహాల స్థితిని ఒక్కసారి అవలోకనం చేసుకోవాలి. ముఖ్యంగా వాటిపై ప్రాణుల మనుగడ సాగటానికి కావలసిన 'జీవావరణం' (Biosphere) లేదు. కానీ అటువంటి ఏర్పాటు ఈ భుమండలంపై ఉంది.

దానినే అల్లాహ్- "భూమండలపై ఉన్న దాన్నంతటినీ భూమికి శోభాయమానంగా చేశాము!" అంటున్నాడు. అంత పెద్ద ఏర్పాటుకి కారణం- 'విశ్వాసాలూ-ఆరాధనలు' ఎవరు చేస్తారో 'పరీక్షించటమా?' లేక 'సత్కర్మలు' ఎవరు చేస్తారో 'పరీక్షించటమా?' అన్న ప్రశ్నకి అల్లాహ్ ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి.

18:7 - إِنَّا جَعَلْنَا مَا عَلَى ٱلْأَرْضِ زِينَةً لَّهَا لِنَبْلُوَهُمْ أَيُّهُمْ أَحْسَنُ عَمَلًا

"జనులలో ఎవరు 'సత్కర్మలు' చేస్తారో పరీక్షించే నిమిత్తం మేము భూ మండలంలో

ఉన్న దాన్నంతటినీ భూమికి శోభాయ మానంగా చేశాము" అని అల్లాహ్ ప్రకటిస్తున్నాడు.

3. జీవన్మరణాల వ్యవస్థ
అంతిమ లక్ష్యం విశ్వాసాలూ-ఆరాధనలా? లేక సత్కర్మలా?

దైవ సృష్టితాల్లో కెల్ల అత్యంత విశేషమైనది మానవ సృష్టి. ఆ మానవుని జీవన్మరణాలు ఎంతో ఆశ్చర్యకరమైనవి, ఎంతో అద్భుతమైనవి. అలాంటి అబ్బుర పరచే గొప్ప వ్యవస్థ ఏర్పాటుకి గల కారణం– 'విశ్వాసాలూ–ఆరాధనలు' ఎవరు చేస్తారో 'పరీక్షించటమా?' లేక 'సత్కర్మలు' ఎవరు చేస్తారో 'పరీక్షించటమా?' అన్న ప్రశ్నకి ఖురాన్ ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి.

67:2– ٱلَّذِى خَلَقَ ٱلْمَوْتَ وَٱلْحَيَوٰةَ لِيَبْلُوَكُمْ أَيُّكُمْ أَحْسَنُ عَمَلًا ۚ وَهُوَ ٱلْعَزِيزُ ٱلْغَفُورُ

"మీలో 'సత్కర్మలు' చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావు బతుకులను. సృష్టించాడు. ఆయన శక్తిశాలి, క్షమాశీలి కూడాను" అని ఖురాన్ తెలియజేస్తుంది.

ఒకవేళ 'విశ్వాసాలూ–ఆరాధనలు' మాత్రమే 'లక్ష్య కర్మలు, విశేష కర్మలు, పరాకాష్ట కర్మలు' అయి ఉంటే, పైన పేర్కొన్న ఖురాన్ వాక్యాలు ఈ క్రింది విధంగా ఉండేవి.

1. ఆయన ఆరు రోజులలో ఆకాశాలనూ, భూమినీ సృష్టించాడు. (అంతకు ముందు) ఆయన సింహాసనం (ఆర్ష్) నీటిపై ఉండేది. ఈ సృష్టి నిర్మాణానికి కారణం– మీలో 'విశ్వాసాలు కలిగి, ఆరాధనలు' చేసేవారెవరో పరీక్షించటం...

2. జనులలో ఎవరు 'విశ్వాసాలు కలిగి, ఆరాధనలు' చేస్తారో పరీక్షించే నిమిత్తం మేము భూ మండలంలో ఉన్న దాన్నంతటినీ భూమికి శోభాయ మానంగా చేశాము...

3. మీలో 'విశ్వాసాలు కలిగి, ఆరాధనలు' చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావు బతుకులను సృష్టించాడు...

అని ఉండేవి! అలాంటి వాక్యాలు పూర్తి ఖురాను గ్రంథంలో ఎకోశానా లేనేలేవు! కాబట్టి 'సత్కర్మలు' అన్నవి 'లక్ష్య కర్మలు' అంటే 'Ends' అవుతాయి. కానీ, 'విశ్వాసాలూ–ఆరాధనలు' మాత్రం 'లక్ష్య సాధనా కర్మలు' అనగా 'Means' అవుతాయని మరింతస్పష్టంగా తేలిపోయింది.

4. అల్లాహ్, ప్రవక్త ముహమ్మద్'ను అత్యున్నత స్థానంలో ఉన్నారని కొనియాడుతున్నది, విశ్వాసాలూ-ఆరాధనల్లోనా? నైతికతలోనా?

అల్లాహ్, మానవ మహోపకారి ప్రవక్త ముహమ్మద్'లో ఉన్న 'విశ్వాసాలూ–ఆరాధనల' గురించి ప్రశంసిస్తున్నాడా? లేక ఆయనలో ఉన్న 'ఉత్తమ నైతిక ప్రవృత్తి' గురించి ప్రశంసిస్తున్నాడా? అన్న ప్రశ్నలకు 68:4వ వాక్యంలో అల్లాహ్–

وَإِنَّكَ لَعَلَىٰ خُلُقٍ عَظِيمٍ

"ఇంకా, (ఓ ప్రవక్తా! ముహమ్మద్) నీవు 'నైతికం'గా అత్యున్నత స్థానంలో ఉన్నావు!" అని సమాధానం ఇస్తున్నాడు.

ఇక మహనీయ ముహమ్మద్ స్వయంగా తన గురించి తానే అల్–బైహఖీ, 21301 హదీసులో ఏమంటున్నారో చూడండి.

قال رسول الله ﷺ: إِنَّمَا بُعِثْتُ لِأُتَمِّمَ مَكَارِمَ الْأَخْلَاقِ.

ప్రవక్త ముహమ్మద్– "నిశ్చయంగా నేను 'ఉత్తమ నైతిక విలువలను పరిపూర్ణం' గావించటానికి మాత్రమే నియమించబడ్డాను!" అని ప్రకటిస్తున్నారు.

ఒకవైపు– అల్లాహ్– "ఓ ప్రవక్తా! నీవు విశ్వాసాల్లో లేదా ఆరాధనల్లో అత్యున్నత స్థానంలో ఉన్నావు అని కాక, 'నైతికం'గా అత్యున్నత స్థానంలో ఉన్నావు!" అని ప్రకటింస్తున్నాడు. మరోవైపు– మహనీయ ప్రవక్త ముహమ్మద్ స్వయంగా– "నిశ్చయంగా నేను 'ఉత్తమ నైతిక విలువలను పరిపూర్ణం' గావించటానికి మాత్రమే నియమించబడ్డాను!" అని ప్రకటిస్తున్నారు. దీనిని బట్టి ఇస్లాం ధర్మంలో నైతికతకి ఎంతటి స్థానం ఉందో అర్థం చేసుకోవచ్చు. అటు అల్లాహ్ గాని, ఇటు– ప్రవక్తగానీ ఈ రకమైన ప్రకటన 'విశ్వాసాలూ–ఆరాధనాల' విషయంలో ఎన్నడూ చేయలేదు. ఎందుకంటే అవి సాధానాలే గానీ లక్ష్యాలు కాదు కాబట్టి!

'మకారిమల్ అఖ్లాఖ్'/'ఉన్నత నైతికత' అలాగే 'ఉత్తమ నైతిక విలువలను పరిపూర్ణత' అంటే ఉదా: 1) ఏదైనా అవసరమైనప్పుడు మీకు సహాయం చేయని వ్యక్తికి సైతం మీరు సహాయం చేయటం. 2) మీకు అన్యాయం చేసిన వ్యక్తిని కూడా క్షమించడం. 3) మీకు అన్యాయం చేసిన వారి మేలు కోసమూ సహృదయంతో దైవాన్ని వేడుకోవటం. వ్యక్తిత్వ పరమైన, సైద్ధాంతికమైన భేదాభిప్రాయాలు ఉన్నవారితోనూ 'నైతికం'గా ప్రవర్తించటమే

మనిషికి కష్టం. అందులోనూ 'ఉత్తమ నైతికత' మరియు 'పరిపూర్ణ నైతికత' కలిగి ప్రవర్తించటం అన్నది మరీ కష్టం. అందుకే తన ప్రవక్తకి ఖురాన్ 41:34వ వాక్యంలో ఇస్తున్న ఆదేశం ఏమిటో చూడండి.

وَلَا تَسْتَوِى ٱلْحَسَنَةُ وَلَا ٱلسَّيِّئَةُ ۚ ٱدْفَعْ بِٱلَّتِى هِىَ أَحْسَنُ فَإِذَا ٱلَّذِى بَيْنَكَ وَبَيْنَهُۥ عَدَٰوَةٌ كَأَنَّهُۥ وَلِىٌّ حَمِيمٌ

"మంచీ, చెడు (ఎట్టి పరిస్థితిలోనూ) సమానం కాలేవు. (కనుక ఓ ప్రవక్తా!) చెడును ఉత్తమమైన మంచి ద్వారా తొలగించు. ఆ తరువాత నీతో బద్ధవిరోధం ఉన్న వాడు సైతం నీకు ప్రాణస్నేహితుడైపోవటాన్ని నీవు చూస్తావు" అని అల్లాహ్ ప్రకటిస్తున్నాడు.

ఏ వ్యక్తులతో వైరం ఉందో వారికి శాపనార్థాలు పెట్టటం, ప్రతీకారం తీర్చుకోవటం అన్నది ఒక అధమ చేష్ట, "ఓ అల్లాహ్ వారికీ నాకూ మధ్య ఉన్న వైరాన్ని తొలగించు!" అని కేవలం ప్రార్థించటం గొప్ప చర్యే అవుతుంది. ఒక నిజమైన ముస్లిం చేయవలసింది. దీనికి మించి ఉంది. అది తనతో శత్రుత్వం వహించే వారితో ప్రత్యక్షంగా కలిసి వారికి కలిగిన ఇబ్బందులను చేతనైనంత వరకు అచరణాత్మకంగా తొలగించగలగాలి. ఇది ముస్లిముల నుండి ఖురాన్–హదీస్ కోరుకుంటున్న 'ఉత్తమ నైతిక ప్రవర్తన'. దీనిని ప్రవక్త అయితే తన జీవితంలో సంపూర్ణంగా ఆచరించి చూపించారు.

ఇప్పుడు బాల్ మన కోర్టులో ఉంది. ప్రవక్త సున్నత్ అంటే ఆయన ఆచరణాత్మక ఆధర్శాలను గురించి మాట్లాడే మనం ఈ విషయంలో ఎలా ప్రవర్తిస్తున్నామన్నాదే అసలు ప్రశ్న. ప్రవక్తకి సంబంధించిన ప్రవర్తన పరమైన అసలైన ఆదర్శాలను ఆచరిచకుండా కేవలం ఆయన వేషధారణ సంబంధించిన సులువైన ఆచరణలు చేసి, సంతృప్తి పడిపోతే నేడు ప్రజల ముందు ఎంత హీనులవుతాం? రేపు అల్లాహ్ ముందు ఎంత అధములు అవుతాం!? ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి.

5. ప్రవక్త దృష్టిలో ప్రియులు ఎవరు? అసహ్యులు ఎవరు?

ప్రవక్త ముహమ్మద్, ఎవరిని తనకు ప్రియులు, సమీపులు అంటున్నారో. ఎవరిని తనకు అసహ్యులు, దూరస్తులు అంటున్నారో Musnad Ahmed sahih 17732 వ హదీసులో చూడండి.

قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ: إِنَّ مِنْ أَحَبِّكُمْ إِلَيَّ، وَأَقْرَبِكُمْ مِنِّي مَجْلِسًا يَوْمَ الْقِيَامَةِ، أَحَاسِنَكُمْ أَخْلَاقًا، وَإِنَّ أَبْغَضَكُمْ إِلَيَّ، وَأَبْعَدَكُمْ مِنِّي مَجْلِسًا يَوْمَ الْقِيَامَةِ، الثَّرْثَارُونَ، وَالْمُتَشَدِّقُونَ، وَالْمُتَفَيْهِقُونَ.
قَالُوا: يَا رَسُولَ اللَّهِ، قَدْ عَلِمْنَا الثَّرْثَارُونَ وَالْمُتَشَدِّقُونَ، فَمَا الْمُتَفَيْهِقُونَ؟ قَالَ: الْمُتَكَبِّرُونَ

మహనీయ ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు– "మీలో నాకు అత్యంత ప్రియమైనవారు, మరియు పునరుత్థాన దినాన నాకు అత్యంత సమీప స్థానంలో ఉండేవారు, మీలో ఉత్తమమైన నడవడిక గలవారే. మరియు మీలో నాకు అత్యంత అసహ్యమైనవారు, మరియు పునరుత్థాన దినాన నాకు అత్యంత దూరమైన స్థానంలో ఉండేవారు, అతివాగుడు రాయుళ్ళు, కపట వేషధారులు, గొప్పలు చెప్పుకునేవారు" అని అన్నారు. దానికి వారు– "ఓ దైవ ప్రవక్తా! అతిగా మాట్లాడేవారు, గొప్పలు చెప్పుకునేవారు ఎవరో మాకు తెలుసు, కానీ కపటవేషధారులు ఎవరు?" అని అన్నారు. అప్పుడు ప్రవక్త– "అహంకారులు" అని సమాధానం ఇచ్చారు.

ఈ హదీసు ప్రకారం– ప్రవక్త ముహమ్మద్'కి ప్రియతముడై, సన్నిహితుడు కాదలచిన ప్రతి వ్యక్తీ చెడు మాటలకు, చేష్టలకు దూరంగా ఉండి ఉత్తమ నడవడిక వంటి 'సత్కర్మలు' కలిగి ఉండాలని తెలుస్తుంది.

6. సౌశీల్యత కోసం సమాజులో సైతం వేడుకోవాలి!

సాధారణంగా వేడుకోళ్ళూ విన్నపాలు ప్రార్థన అనంతరం చేసుకోవటం ఒక ఆనవాయితీగా వస్తుంది. కానీ ప్రవక్త సాంప్రయదాయాన్ని పరిశీలిస్తే, సమాజులోనే మన అక్కరలను గురించి దైవానికి మొర పెట్టుకొనే విధానాన్నీ, అనుమతిని చూడగలం. ఇక మన చర్చనీయ అంశమైన సౌశీల్యతకి వస్తే, దాని నిమిత్తం సమాజ్ ప్రారంభంలోనే వేడుకోవాలనే ప్రవక్త సంప్రదాయం కనిపిస్తుంది. దీనినిబట్టి సౌశీల్యతకి లేదా సత్కర్మలకి ధర్మంలో ఎంతటి ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక Mishkat ul Masabih Sahih 820వ హదీసును పరిశీలనగా అధ్యయనం చేయండి.

عَنْ جَابِرِ بْنِ عَبْدِ اللهِ قَالَ: كَانَ النَّبِيُّ ﷺ إِذَا اسْتَفْتَحَ الصَّلَاةَ كَبَّرَ ثُمَّ قَالَ: «إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ لَا شَرِيكَ لَهُ وَبِذَلِكَ أُمِرْتُ وَأَنَا مِنَ الْمُسلمين اللَّهُمَّ اهدني لِأَحْسَنِ الْأَعْمَالِ وَأَحْسَنِ الْأَخْلَاقِ لَا يَهْدِي لِأَحْسَنِهَا إِلَّا أَنْتَ وَقِنِي سَيِّئَ الْأَعْمَالِ وَسَيِّئَ الْأَخْلَاقِ لَا يَقِي سَيِّئَهَا إِلَّا أَنْتَ» رَوَاهُ النَّسَائِيُّ

గౌరవ జాబిర్ ఉల్లేఖనం ప్రకారం– మానవ మహోపకారి ప్రవక్త ముహమ్మద్ ﷺ ప్రార్థన కోసం నిల్చుని 1) అల్లాహ్ ఔన్నత్యాన్ని (తక్బీర్) ప్రకటించి, 2) "నిశ్చయంగా నా ఆరాధన, 3) నా త్యాగశీలత, 4) నా జీవితం, 5) నా మరణం యావత్తూ ఉభయలోక పరిపోషకుని (ప్రసన్నత) కోసం మాత్రమే!" అని, ఇంకా "అందరికంటే ముందు నీవు విధేయుడు కావాలి! అనే ఆజ్ఞ నాకు అయ్యింది" అని ప్రకటించి, 6) "ఓ అల్లాహ్! అత్యుత్తమ సౌశీల్యత వైపునకు నీవు నాకు మార్గదర్శకం వహించు! ఎందుకంటే

సౌశీల్యతకి ఉత్తమ మార్గదర్శకుడవు నీవే! అలాగే 7) దుశ్శీలత నుండి నన్ను నీవు రక్షించు! ఎందుకంటే దుశ్శీలత నుండి రక్షించేవాడవు నీవే!" అని వేడుకొనే వారు.

దైవనామ ఘనకీర్తన చేస్తూ ఆయనను స్మరించుకొనే గొప్ప ఆరాధన. అందులో సైతం– "1) ఓ అల్లాహ్! అత్యుత్తమ సౌశీల్యత వైపునకు నీవు నాకు మార్గదర్శకం వహించు! ఎందుకంటే సౌశీల్యతకి ఉత్తమ మార్గదర్శకుడవు నీవే! అలాగే 2) దుశ్శీలత నుండి నన్ను నీవు రక్షించు! ఎందుకంటే దుశ్శీలత నుండి రక్షించేవాడవు నీవే!" అని అతి వినయంగా అనుకూలంగానూ ప్రతికూలంగానూ వేడుకునేవారంటే ఇస్లాంలో సత్కర్మలకి ఎంతటి సర్వోచ్ఛ స్థానం ఉందో మీరు గుర్తించవచ్చు.

ఆనాటి ప్రవక్త అనుయాయుల్లో ఉన్న సౌశీల్యత ఈనాటి ముస్లిముల్లో కొరవడటానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. వాటిలో...

1. లక్ష్యసాధనాలైన 'విశ్వాసమూ–ఆరాధనాల'ను లక్ష్యాలు చేసుకోవటం

2. లక్ష్యాలైన 'సత్కర్మలు' లేకపోయినా కేవలం 'విశ్వాసం' ఉంటే చాలునని భ్రమించటం

నిజానికి ఇది కొందరు భ్రష్టయూదుల కాల్పనిక భ్రమ. 'సత్కర్మల'కి ఖురాన్–హదీసుల్లో ఉన్న పరాకాష్ట ప్రాధాన్యతను మీరు ఈ అంశంలో చూశారు కదా!

7. విశ్వాసాలూ ఆరాధనలు అల్లాహ్ వద్ద చెల్లాలంటే సత్కర్మలు తప్పనిసరి!

సత్కర్మల గొప్పతనం ఏమిటో... ప్రధానంగా పది కోణాల్లో గమనించగలరు.

కొందరు ఒకవైపు– 1) షహాద, 2) నమాజ్, 3) జకాత్, 4) రోజా, 5) హజ్, ఉమ్రా లాంటి 'ఆరాధనలు' చాలా నిష్టగా చేస్తుంటారు. మరోవైపు– తమ దైనందిన జీవితంలో తప్పనిసరి "సత్కర్మల"ను సైతం పట్టించుకోకుండా ఎన్నెన్నో "దుష్కర్మల"కు పాల్పడుతూ ఉంటారు. అయినప్పటికీ తమకు ఇహ–పరాల సాఫల్యం ఉంటుందన్న బలమైన నమ్మకం కలిగి ఉంటారు!

మొదటి ఆరాధన: అష్-షహాద (సృష్టికర్త ఏకత్వపు సాక్ష్యం ఇవ్వటం) సత్కర్మలు లేని విశ్వాస సాక్ష్యం దేవుని వద్ద చెల్లదు!

ఇస్లామీయ ధార్మిక వ్యవస్థలో ప్రవేశానికి శ్రీకారం– 'అష్–షహాద (సృష్టికర్త ఏకత్వపు సాక్ష్యం ఇవ్వటం)' అంటే సృష్టికర్తతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోవటానికి చేసే ప్రతిజ్ఞ. దీనిని 'అష్–షహాద' అంటారు.

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ، وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

అష్‌హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ, వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహూ వ రసూలుహూ.

"అల్లాహ్ (అంటే సర్వసృష్టికర్త) తప్ప ఆరాధించదగిన వాడు ఎవరూ లేరని నేను సాక్ష్యమిస్తున్నాను. i) ఆయన అద్వితీయుడు ii) ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. మరియు ముహమ్మద్ i) ఆయన సేవకుడు మరియు ii) ఆయన సందేశహరుడు అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని త్రికరణ శుద్ధితో సాక్ష్యం ఇవ్వటమే 'అష్–షహాద' లేదా 'కలిమె షహాత్'. ఇది రెండు రూపాలలో ఉంటుంది. వాటిలో...

1. వ్యక్తిగతంగా ఈ ప్రతిజ్ఞ చేసిన వ్యక్తి ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తాడు.

2. ఈ ద్వైవాద్వైత లేదా దేవుని ఏకత్వ సందేశాన్ని ఇతరులకు జ్ఞాపకం చేయటం.

అనేక మతవర్గాల్లో ఉన్న భ్రష్ట భావాల్లో – "సత్కర్మలు లేకపోయినా కేవలం దేవుని పట్ల విశ్వాసం ఉంటే చాలు. ఇహ–పరాల సాఫల్యం తప్పక లభిస్తుంది!" అన్నది ఒకటి. ఇదే భావన ముస్లిం సమాజంలోనూ వేళ్లూనుకొనిపోయింది. అయితే 'సత్కర్మలు' లేకుండా కేవలం 'విశ్వాసం' కలిగి ఉంటే దానిని దేవుడు స్వీకరిస్తాడా? అన్న ప్రశ్నకు ఖురాన్ 2:93వ వాక్యం ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి.

قُلْ بِئْسَمَا يَأْمُرُكُم بِهِۦٓ إِيمَـٰنُكُمْ إِن كُنتُم مُّؤْمِنِينَ

వారితో అనండి: "మీరు విశ్వాసులే అయితే! ఈ దుష్కర్మలు చేయమని మిమ్మల్ని ప్రేరేపించే మీ ఈ విశ్వాసం చాలా చెడ్డది!" అని ఖురాన్ చెబుతుంది. అలాగే ఖురాన్ 6:158వ వాక్యం కూడా చూడండి.

لَا يَنفَعُ نَفْسًا إِيمَـٰنُهَا لَمْ تَكُنْ ءَامَنَتْ مِن قَبْلُ أَوْ كَسَبَتْ فِىٓ إِيمَـٰنِهَا خَيْرًا

"విశ్వసించి కూడా ఏ మేలునూ (ఏ సత్కర్మనూ) సంపాదించుకోని వ్యక్తికి, తన విశ్వాసం వల్ల (తీర్పుదినం రోజు) ఏ ప్రయోజనమూ చేకూరదు!" అని ఖురాన్ తీర్మానపూర్వకంగా ప్రకటిస్తుంది.

పై రెండు వాక్యాలు రెండు విషయాలు చెబుతున్నాయి. వాటిలో...

1. మీరు దుష్కర్మలు గనక చేస్తూ ఉంటే మీలో ఉన్నది 'చెడ్డ విశ్వాసమే'గాని 'మంచి విశ్వాసం' కాదన్నది. విశ్వాసం మంచిది కావాలంటే 'సత్కర్మలు' తప్పనిసరి షరతు అని అర్థమౌతుంది.

2. 'సత్కర్మలు' లేకుండా ఒట్టి 'విశ్వాసం'తో వస్తే అటువంటి విశ్వాసం అల్లాహ్ వద్ద పరలోకంలో పనికిరాదన్నది.

ఇక హదీసు విషయానికి వస్తే... Sahih Bukhari 6136వ హదీసు చూడండి.

عَنْ أَبِي هُرَيْرَةَ، عَنِ النَّبِيِّ صلى الله عليه وسلم قَالَ

గౌరవ అబూహురైరా కథనం: మహనీయ ముహమ్మద్–

1) مَنْ كَانَ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الآخِرِ فَلاَ يُؤْذِ جَارَهُ

1. "ఎవడు అల్లాహ్, అంతిమ దినంపట్ల విశ్వాసం కలిగి ఉంటాడో, అతడు పొరుగు వానికి ఇబ్బంది కలిగించకుండా ఉండటం తప్పనిసరి",

2) وَمَنْ كَانَ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الآخِرِ فَلْيُكْرِمْ ضَيْفَهُ،

2. "ఎవడు అల్లాహ్, అంతిమ దినంపట్ల విశ్వాసం కలిగి ఉంటాడో అతడు అతిథి మర్యాద చేయటం తప్పనిసరి",

3) وَمَنْ كَانَ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الآخِرِ فَلْيَقُلْ خَيْرًا أَوْ لِيَصْمُتْ

3. "ఎవడు అల్లాహ్, అంతిమ దినంపట్ల విశ్వాసం కలిగి ఉంటాడో అతడు సముచితంగా మాట్లాడాలి. లేదంటే మౌనంగా ఉండటం తప్పనిసరి" అని తాకీదు చేశారు.

నిజానికి అల్లాహ్ మరియు అంతిమ దినంపట్ల 'విశ్వాసం' అనే విషయాన్ని ఒక్కసారి ప్రస్తావించి, మూడు 'సత్కర్మల'ను గురించి చెప్పవచ్చు. కానీ ప్రవక్త మహనీయులు ప్రతి ఒక్క 'సత్కర్మ'కూ రెండు ఆ 'విశ్వాసాల'నూ ముడి పెట్టి వేర్వేరుగా చెప్పటం ఈ హదీసులో అత్యంత గమనార్హ విషయం. దీని వలన ప్రతి ముస్లిమూ తన దైనందిన జీవితంలో చేసే ప్రతి సత్కార్యాన్ని ఈ రెండు విశ్వాసాల ఆధారంగా మాత్రమే నిర్వర్తించాలన్నది ప్రవక్త అభిమతమని తెలుస్తుంది.

అంటే ఎప్పుడైనా ఎక్కడైనా ఆ రెండు 'విశ్వాసాలు' కోరని 'దుష్కర్మ' కనీసం ఒక్కటి సంభవించినా, తాను ఆ ఒక్క 'సత్కర్మ'ను కోల్పోయాను అని మాత్రమే కాక, నేను అల్లాహ్, అంతిమ దినాలపట్ల కలిగి ఉన్న నా రెండు మౌలిక విశ్వాసాలను కోల్పోయాను కదా! అని ఒక ముస్లిం హృదయం కలత చెంది, చింతాగ్రస్తమై, భయాందోళనలకి గురై లోలోన కుమిలి కుమిలి రోదించాలి. అలాంటి హృదయంలోనే 'విశ్వాసం' ఉన్నట్లు, 'దుష్కర్మల' పట్ల 'అసహ్యత', ఆందోళన' లేని హృదయంలో 'విశ్వాసం' లేనట్లేనని

తీర్మానించుకోవాలన్నది పై హదీసు సారాంశం.

దైనందిన జీవితానికి చెందిన అతి సాధారణ 'సత్కర్మల'ను సైతం అత్యంత మౌలికమైన మరెంతో కీలకమైన రెండు 'విశ్వాసాల'తో ముడిపెట్టి మానవ మహోపకారి ప్రవక్త ముహమ్మద్ అప్రమత్తం చేస్తున్న ఈ హదీసులో మరొక గమనార్హ విషయం ఉంది. అదేమిటంటే– ఒక ముస్లిం ఎప్పుడైనా, ఎక్కడైనా కనీసం ఒక సాధారణ 'సత్కర్మ'ను తప్పి, ఒక్క 'దుష్కర్మ'కి పాల్పడినా, అతని మౌలిక విశ్వాసాలు సైతం భంగమైపోతాయి అన్నది నిస్సందేహం. ఇక, పెద్దపెద్ద నేరాలకి పాల్పడే ముస్లిముల దుస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు. దానికి సంబంధించి సహీహ్ బుఖారి 2475వ హదీస్ చూడండి.

عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ، قَالَ: قَالَ النَّبِيُّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ: لَا يَزْنِي الزَّانِي حِينَ يَزْنِي وَهُوَ مُؤْمِنٌ، وَلَا يَشْرَبُ الْخَمْرَ حِينَ يَشْرَبُ وَهُوَ مُؤْمِنٌ، وَلَا يَسْرِقُ حِينَ يَسْرِقُ وَهُوَ مُؤْمِنٌ، وَلَا يَنْتَهِبُ نُهْبَةً يَرْفَعُ النَّاسُ إِلَيْهِ فِيهَا أَبْصَارَهُمْ حِينَ يَنْتَهِبُهَا وَهُوَ مُؤْمِنٌ.

ప్రవక్త ముహమ్మద్– "1) ఒక వ్యభిచారి విశ్వాసిగా ఉంటూ వ్యభిచారం చేయజాలడు. 2) ఒక తాగుబోతు విశ్వాసిగా ఉంటూ మద్యం సేవించజాలడు. 3) ఒక దొంగ విశ్వాసిగా ఉంటూ దొంగతనం చేయజాలడు. 4) ఎవరైనా ఒక వ్యక్తి విశ్వాసిగా ఉంటూ దోపిడీ, విధ్వంసాలకు బరితెగించలేడు" అని హెచ్చరించారు.

ఈ విధంగా ఒకవైపు అల్లాహ్ పట్ల విశ్వాసి అవటం, మరోవైపు షైతాన్ ప్రేరేపిత అనైతిక–అమానవీయ దుష్కర్మలకి పాల్పడటం అన్నది పరస్పరం పొసగని, పరస్పర విరుద్ధ విషయాలని అర్థమౌతుంది.

విశ్వాస పరిపూర్ణతకు కొలమానం సత్కర్మలే!

విశ్వాసం, విశ్వాసం అని ధార్మికులు ఆవేశ పడిపోతుంటారు. ధార్మిక పరిభాషలో విశ్వాసం అంటే– "ఈ సృష్టిని నిర్మించిన అద్వితీయమైన అస్తిత్వం ఒకటి ఉందని విశ్వసించి నేను చేసే 'మంచి–చెడు' కర్మలను నిత్యం గమనిస్తూ, వాటికి తగిన శిక్షా–బహుమానాలను ఇహ–పరాల్లో ఇవ్వనున్నాడు!" అని త్రికరణ శుద్ధితో అంగీకరించటం.

ఇది ఎప్పుడైతే ఒక వ్యక్తి మనస్సులో నాటుకుంటుందో ఇక అప్పటి నుండి అతడు ఒకటి–మాటల, రెండు– చేతల రూపంలో వ్యక్తం అవుతూ ఉంటుంది. ఒక వ్యక్తి ఎప్పుడైతే మంచి మాటలూ–మంచి చేతలు కలిగి ఉంటాడో అతనిలో విశ్వాసం పరిపూర్ణంగా ఉన్నట్లు.

దీనికి విరుద్ధంగా ఉంటాడో అతనిలో విశ్వాసం అపరిపూర్ణంగా ఉన్నట్లు. ఈ విషయానికి సంబంధించిన ఆధారం అస్-సిల్సిలతు సహీహా 751వ హదీసులో చూడండి.

أَكْمَلُ الْمُؤْمِنِينَ إِيمَانًا 1) أَحَاسِنُهُمْ أَخْلَاقًا، 2) الْمُوَطَّؤُونَ أَكْنَافًا، 3) الَّذِينَ يَأْلَفُونَ وَيُؤْلَفُونَ، 4) وَلَا خَيْرَ فِيمَنْ لَا يَأْلَفُ وَلَا يُؤْلَفُ.

మహనీయ ప్రవక్త ﷺ– "విశ్వాసంలో అత్యంత పరిపూర్ణమైన విశ్వాసులు ఎవరంటే: 1) ఉత్తమమైన నైతిక విలువలు గలవారు, 2) సౌమ్యంగా మరియు సులభంగా కలవ గలిగే వారు, 3) స్నేహపూర్వకంగా ఉండి ఇతరులచే ఇష్టపడబడేవారు, 4) మరియు స్నేహపూర్వకంగా ఉండని, ఇతరులచే ఇష్టపడబడని వారిలో ఏ మేలు లేదు" అని హెచ్చరిస్తున్నారు.

ఈ హదీసులో పేర్కొన్న నాలుగు సత్కర్మలు ఎవని ప్రవర్తనలో ఉంటాయో అతడు 'పరిపూర్ణ విశ్వాసం' కలిగి ఉన్నట్లు. ఎవని ప్రవర్తనలో ఆ విలువలు బలహీనం ఉన్నా లేదా అసలే లేకపోయినా అతనిలో ఉన్న 'విశ్వాసం అపరిపూర్ణం' అని తెలుస్తుంది.

దైనందిన జీవితంలో తప్పనిసరి "సత్కర్మల"ను సైతం పట్టించుకోకుండా ఒకవైపు– ఎన్నెన్నో "దుష్కర్మల"కు పాల్పడుతూ, మరోవైపు– కొందరు 1) షహాద, 2) నమాజ్, 3) జకాత్, 4) రోజా, 5) హజ్, ఉమ్రా లాంటి 'ఆరాధనలు' చాలా నిష్టగా చేస్తుంటారు. వాటివలన తమకి ఇహ–పరాల సాఫల్యం ఉంటుందన్నది బలమైన నమ్మకం కలిగి ఉంటారు. దీని ప్రకారం– సత్కర్మలు లేని విశ్వాసాలు అల్లాహ్ వద్ద చెల్లవని అటు– ఖురాన్, ఇటు– ప్రవక్త మహనీయుల హదీసులతో తేలిపోయింది.

రెండవ ఆరాధన: అస్-సలాహ్ సత్కర్మలు లేకుండా చెల్లదు!

ఇస్లాం ధర్మంలో రెండవ అతి ముఖ్యమైన ఆరాధన అస్–సలాహ్ అంటే ఒక ముస్లిం రోజుకు ఐదు పూటలు చేసే ఆరాధన. సత్కర్మలు ఆచరించక కేవలం ఈ ఆరాధన నిష్టగా చేసుకుంటూపోతే అల్లాహ్ వాటిని స్వీకరిస్తాడా? అన్న ప్రశ్నకి ఖురాన్ 20:14వ వాక్యం ఇస్తున్న సమాధానం ఏమిటో "చూడండి.

إِنَّنِيٓ أَنَا ٱللَّهُ لَآ إِلَٰهَ إِلَّآ أَنَا۠ فَٱعْبُدْنِى وَأَقِمِ ٱلصَّلَوٰةَ لِذِكْرِىٓ

"1) నిశ్చయంగా నేనే అల్లాహ్‌ను. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. 2) కాబట్టి నువ్వు నన్నే ఆరాధించు. 3) నన్ను జ్ఞాపకం చేయటానికి నమాజును నెలకొల్పు" అని ఆజ్ఞాపిస్తున్నాడు. ఖురాన్ 29:15వ వాక్యాన్ని చూడండి". మరోవాక్యం గమనించండి.

ٱتْلُ مَآ أُوحِىَ إِلَيْكَ مِنَ ٱلْكِتَٰبِ وَأَقِمِ ٱلصَّلَوٰةَ ۖ إِنَّ ٱلصَّلَوٰةَ تَنْهَىٰ عَنِ ٱلْفَحْشَآءِ وَٱلْمُنكَرِ ۗ وَلَذِكْرُ ٱللَّهِ أَكْبَرُ ۗ وَٱللَّهُ يَعْلَمُ مَا تَصْنَعُونَ

"(ఓ ప్రవక్తా!) 1) నీ వైపుకు పంపబడిన (వహీ చేయబడిన) గ్రంథాన్ని పారాయణం చేస్తూ ఉండు. 2) నమాజును నెలకొల్పు, నిశ్చయంగా నమాజ్ I) సిగ్గుమాలినతనం నుంచి, II) చెడు విషయాల నుంచి ఆపుతుంది. నిశ్చయంగా అల్లాహ్ స్మరణ చాలా గొప్ప విషయం. మీరు చేసేదంతా అల్లాహ్'కు తెలుసు" అని ఖురాన్ చెబుతుంది.

ఈ వాక్యంలో "నిశ్చయంగా నమాజ్ 1) సిగ్గుమాలినతనం నుంచి, 2) దుష్కర్మల నుంచి ఆపుతుంది" అన్న వాక్య భాగం అత్యంత గమనార్హమైనది. ఇందులో ఒకని నమాజ్ అనే 'ఆరాధన' వానిని 'దుష్కర్మల' నుండి ఆపగలగాలి. లేదంటే అతని నమాజ్, అసలు నమాజే కాజాలదని సుస్పష్టంగా అర్థమౌతుంది. ఇంకా, "3) నిశ్చయంగా అల్లాహ్ స్మరణ చాలా గొప్ప విషయం" అన్నది మరింత గమనార్హం!

దీని వాస్తవికత ఏమిటంటే ప్రతి మనిషీ తన జీవితంలో రెండే రెండు పనులు చేస్తుంటాడు. వాటిలో 1) మంచి పనులు, 2) చెడు పనులు. ఈ రెండు సందర్భాల్లోనూ అల్లాహ్ జ్ఞప్తిలో ఉండాలి. అంటే నమాజ్ మొదలు పెట్టి తిరిగి నమాజ్ ముగించే వరకూ అల్లాహ్ను జ్ఞాపకం పెట్టుకోవాలా? లేక దానితోపాటు ఒక నమాజ్ మొదలు పెట్టి మరొక నమాజ్ మొదలు పెట్టే వరకు అల్లాహ్ను జ్ఞాపకం పెట్టుకోవాలా? అన్న ప్రశ్నలకు సరైన సమాధానం– నమాజ్ మొదలు పెట్టినప్పటి నుండి నమాజ్ మూగించే వరకు జ్ఞాపకం పెట్టుకోవాలి. అలాగే ఒక నమాజ్ ముగించి, మరొక నమాజ్ ప్రారంభించే వరకూ అల్లాహ్ను జ్ఞానపకం పెట్టుకోవాలి అన్నదే!

సత్కర్మలు చేయాల్సి వచ్చినప్పుడు ఒక మనిషికి అల్లాహ్ జ్ఞప్తిలో ఉంటే అతడు వాటిని విడనాడడు. అలాగే దుష్కర్మలకి పాల్పడే పరిస్థితి వచ్చినప్పుడు అల్లాహ్ జ్ఞప్తిలో ఉంటే అతడు వాటిని విడనాడుతాడు. ఇదీ నమాజ్ ప్రభావం, లక్ష్యం.

సంధి చేయటం నమాజ్, ఉపవాసం, దానం కంటే గొప్పది!

వ్యక్తుల మధ్య, వర్గాల మధ్య ఘర్షణ వలన జీవితంలోని సకల జీవన రంగాలు స్థంభించి పోతాయన్నది ఒక వాస్తవం. కాబట్టి వ్యక్తుల మధ్య, వర్గాల మధ్య ఘర్షణ నివారించటానికి వారి మధ్య సంధి చేయటం ఎంత విశేషమైనదో అర్థం చేసుకోవచ్చు. అందుకే ప్రవక్త ముహమ్మద్ ఏమంటున్నారో చూడండి.

عَنْ أَبِي الدَّرْدَاءِ، قَالَ: قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ: أَلَا أُخْبِرُكُمْ بِأَفْضَلَ مِنْ دَرَجَةِ الصِّيَامِ وَالصَّلَاةِ وَالصَّدَقَةِ؟ قَالُوا: بَلَى، قَالَ: صَلَاحُ ذَاتِ الْبَيْنِ فَإِنَّ فَسَادَ ذَاتِ الْبَيْنِ هِيَ الْحَالِقَةُ، قَالَ أَبُو عِيسَى: هَذَا حَدِيثٌ صَحِيحٌ، وَيُرْوَى عَنِ النَّبِيِّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ أَنَّهُ قَالَ: هِيَ الْحَالِقَةُ لَا أَقُولُ تَحْلِقُ الشَّعَرَ وَلَكِنْ تَحْلِقُ الدِّينَ.

హదీస్: Tirmizi saheeh 2509– మహనీయ ముహమ్మద్ – "నేను మీకు 1) ఉపవాసం, 2) నమాజ్ మరియు 3) దానానికి మించి ఉన్నత స్థాయి కలిగిన ఆచరణ ఏమిటో చూపనా?" అని ప్రశ్నించారు. దానికి అనుయాయులు– "అంతకంటే భాగ్యమా ఓ ప్రవక్తా!" అన్నారు. అప్పుడు ఆయన– "1) పరస్పర కలయికలను, 2) సంబంధాలను పటిష్ట పరచుకోవటం, (దీనికి విరుద్ధంగా) 3) పరస్పర కలయికలను, 4) సంబంధాలను విచ్ఛిన్నం చేయటం (ధర్మాన్ని) బోడి చేసేటంతటి దుర్మార్గం" అని హెచ్చరించారు. తరువాత– "అది జుట్టును గొరుగుతుందని నేను అనడం లేదు, కానీ అది ధర్మాన్ని గొరుగుతుందని చెబుతున్నాను" అని రెట్టించి మరీ హెచ్చరించారు.

దీనినిబట్టి వ్యక్తుల, వర్గాల మధ్య సంధి చేయటం అనే 'సత్కర్మ' ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. దీనిని ఉపవాసం, 2) నమాజ్ మరియు 3) దానానికి మించిన విషయం అని చెప్పటం గమనార్హం.

ప్రవక్త ముహమ్మద్ చేస్తున్న 'విశ్వాసి నిర్వచనం' ఏమిటి?

విశ్వాసి గురించి పలువురు పలు రకాలుగా నిర్వచనాలు చేస్తుంటారు. ప్రవక్త కంటే గొప్ప నిర్వచనం ఎవరు చేయగలరు. అల్–సిల్సిలా అల్–సహీహా 426వ హదీస్ చూడండి.

المؤمِنُ يَأْلَفُ ويُؤْلَفُ، ولا خيرَ فيمَنْ لا يأْلَفُ ولا يؤلَفُ، وخيرُ الناسِ أنفعُهم للناسِ.

మహనీయ ప్రవక్త ముహమ్మద్– "ఒక నిజమైన విశ్వాసి స్నేహశీలిగా ఉంటాడు మరియు ఇతరులచే ఇష్టపడబడతాడు; స్నేహశీలిగా ఉండని, ఇతరులచే ఇష్టపడబడని వానిలో ఏ మంచి లేదు; మరియు ఇతరులకు అత్యంత మేలు చేసేవారే ఉత్తములు" అని అంటున్నారు.

"తన తోటి ప్రజలతో సంబంధాలు పటిష్ట పరచుకుంటాడు, స్నేహశీలిగా ఉంటూ, ఇతరులు ఇష్టపడేవానిగా ఉంటాడు" అని ప్రవక్త ఒక విశ్వాసిని నిర్వచనం చేస్తున్నారు.

ఒకవేళ 'విశ్వాసాలూ-ఆరాధనలు' చేస్తున్నప్పటికీ తమ తోటి విశ్వాసులతో, తోటి ప్రజలచే ఇష్టపడకపోయిన వానిలో ఏమంచీ లేదు, ఇతరులకు అపారంగా మేలు చేసే వారే ఉత్తములని ప్రవక్త తీర్మానిస్తున్నారు. 'సత్కర్మల'ను పాటించకుండా కేవలం మేము తౌహీద్లో ఉన్నాం, తౌహీద్ ప్రచారం చేస్తున్నాం, నమాజులూ, ఉపవాసాలు పాటిస్తున్నాం కాబట్టి అల్లాహ్ ఇష్టులం అయిపోతాం అనుకుంటే అది ఆత్మవంచన అవుతుంది!

మూడవ ఆరాధన: అజ్-జకాహ్ సత్కర్మలు లేకుండా చెల్లదు!

అజ్జ్-జ్జకాహ్/వార్షిక విధిదానం. తన అవసరాలకు పోగా ఒక సంవత్సరం పాటు తన వద్ద మిగిలి ఉన్న సొమ్ముపై నూటికి రెండున్నర శాతం తీసి, ఆ డబ్బును బీదసాదల్లో దానం చేయాలి. ఇది మూడవ ఆరాధన. ఇస్లాం ధర్మంలో దీని ప్రాధాన్యత కూడా విశేషమైనదే. ఇది ఆర్థిక అంశానికి సంబంధించిన ఆరాధన. దీనిని ఏయే ఖాతాల్లో ఖర్చు చేయాలో ఈ క్రింది వాక్యంలో చూడండి.

9:60- إِنَّمَا ٱلصَّدَقَٰتُ لِلْفُقَرَآءِ وَٱلْمَسَٰكِينِ وَٱلْعَٰمِلِينَ عَلَيْهَا وَٱلْمُؤَلَّفَةِ قُلُوبُهُمْ وَفِى ٱلرِّقَابِ وَٱلْغَٰرِمِينَ وَفِى سَبِيلِ ٱللَّهِ وَٱبْنِ ٱلسَّبِيلِ ۖ فَرِيضَةً مِّنَ ٱللَّهِ ۗ وَٱللَّهُ عَلِيمٌ حَكِيمٌ

దానాలను కేవలం 1) నిరుపేదల కొరకూ, 2) అభాగ్య జీవుల కొరకు, 3) వాటి వసూళ్ల కోసం నియమితులైన వారికొరకు, 4) హృదయాలను ఆకట్టుకోవలసి ఉన్నవారి కొరకు, 5) మెడలను విడిపించటానికీ, 6) రుణగ్రస్తుల కొరకూ, 7) దైవమార్గం కొరకూ, 8) బాటసారుల కొరకూ వెచ్చించాలి. ఇది అల్లాహ్ తరపున నిర్ణయించబడిన ఒక విధి. అల్లాహ్ మహాజ్ఞాని, మహావివేకి.

పై వాక్యంలో మొత్తం ఎనిమిది ఖాతాలు పేర్కొనటం జరిగింది. అయితే మన చర్చనీయ అంశాన్ని అనుసరించి, ఈ దానం అనే ఆరాధన అల్లాహ్ వద్ద స్వీకరించబడాలంటే దానికి హదీసులో ఒక షరతు ఉంది. అదేమిటో చూడండి.

హదీస్, ప్రవక్త ముహమ్మద్- "దానధర్మాలు చిరునవ్వుతో చేసినప్పుడే ఆమోదయోగ్యం అవుతాయి" అని తెలియజేశారు (తిర్మిజీ).

పైన పేర్కొన్న హదీసు ప్రకారం- జకాత్ చెల్లింపు అనే ఆరాధనను అల్లాహ్'కి అంగీకారం కావాలంటే 'చిరు మందహాసం' అనే 'సత్కర్మ' జత కావాలి. లేదంటే అది అల్లాహ్'కి ఆమోదయోగ్యం కాజాలదని ప్రవక్త ముహమ్మద్ స్వయంగా తెలియజేస్తున్నారు.

మానవుడు ఎల్లవేళలా ఇచ్చే స్థితిలో లేకపోవచ్చు. అలాంటి తరుణంలో ఎవరైనా ఆర్థిక సహాయం చేయమని అర్థిస్తే, వారిపై చిరాకుపడక ఎలా సముదాయించాలో ఖురాన్ 17:28వ వాక్యం ఎలా మార్గదర్శకం చేస్తుందో చూడండి.

وَإِمَّا تُعْرِضَنَّ عَنْهُمُ ٱبْتِغَآءَ رَحْمَةٍ مِّن رَّبِّكَ تَرْجُوهَا فَقُل لَّهُمْ قَوْلًا مَّيْسُورًا

ఒకవేళ నువ్వు ఆశించే నీ ప్రభువు కారుణ్యాన్ని (సంపదను) నీవు ఇంకా అన్వేషిస్తూ ఉన్నందువల్ల వారి (బీదసాదల) నుంచి ముఖం తిప్పుకో వలసివస్తే మృదువుగా వారికి నచ్చజెప్పు.

విషయం అర్థమైంది కదా.. "నేనే ఇబ్బందుల్లో ఉంటే, నీవు నన్ను సహాయం

చేయమంటావా!" అని ఎదుటి వారితో దుష్ప్రవర్తనకి పాల్పడకూడదు. ప్రస్తుతం నావద్ద సహాయం చేసే స్తోమత లేదు. కాబట్టి నన్ను క్షమించండి అని ఉత్తమంగా సాగనంపాలి.

నాలుగవ ఆరాధన: అస్-సౌమ్ సత్కర్మలు లేకుండా చెల్లదు!

ఇస్లామీయ ఐదు ఆరాధనల్లో ఉపవాసము అనేది నాలుగోవది. అది కూడా ఒక గొప్ప ఆరాధన. అయితే 'ఉపవాసాలు' మరియు 'సత్కర్మల' మధ్య ఉన్న అవినాభావ సంబంధం గురించి ఖురాన్-హదీస్ ప్రబోధనలు ఏమంటున్నాయో చూడండి. ముందుగా ఖురాన్ 2:183వ వాక్యం ఏమంటుందో చూడండి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ

"విశ్వసించిన ఓ ప్రజలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించబడింది. మీ. పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయ-భక్తులు పెంపొందే అవకాశం ఉంది" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

వ్యక్తి తాను చేసే ఆచరణ విషయంలో దేవునిపట్ల భయ-భక్తుల వైఖరికి ఉపవాసం ఒక ప్రేరకం కావాలన్నది దేవుని ఉద్దేశ్యం అని పైవాక్యం వలన అర్థమౌతుంది. ఈ ఖురాన్ వాక్యానికి వ్యాఖ్యానంగా ప్రవక్త చెప్పిన హదీసులు చూడండి.

హదీస్ "ఉపవాస వ్రతం పాటిస్తున్నప్పటికీ) 1) అసత్యం పలకటాన్ని, 2) అసత్యాన్ని ఆచరించటాన్ని విడనాడని వ్యక్తి ఆకలి దప్పులతో పడుండటం పట్ల అల్లాహ్కు ఏ మాత్రం ఆసక్తిలేదు" అని, ఇంకా, ప్రవక్త ముహమ్మద్- "ఐదు విషయాల వలన ఉపవాసం రద్దు అయిపోతుంది" అని ప్రకటించారు. వాటిలో- 1) అబద్దం, 2) పరోక్ష నింద,

3) చాడీలు, 4) అబద్ధ సాక్ష్యం, 5) కామదృష్టి", –(హజ్రత్ జాబిర్)

హదీస్ ప్రవక్త ముహమ్మద్– "ఉపవాసము పాపాల నుండి రక్షించుకోవటానికి ఒక డాలుగా పని చేస్తుంది. కనుక దానిని డాలుగా చేసుకోండి. ఉపవాసి 1) దుర్భాషలు ఆడరాదు. 2) అరవకూడదు. 3) ఎవరైనా అతనితో దుర్భాషలాడితే లేక 4) జగడానికి దిగితే నేను ఉపవాసంతో ఉన్నాను కనుక నావలన జగడమాడటం సాధ్యంకాదని తప్పించుకోవాలి" అని తెలియజేస్తున్నారు.

హదీస్ ప్రవక్త ముహమ్మద్ "ఉపవాస లక్ష్యం అన్న పానీయాలను విడనాడటం కాదు. 1) అబద్ధమాడకూడదు 2) అసత్యాన్ని పలకకూడదు" అని స్పష్టపరిచారు. (బుఖారీ, అబూహురైరా).

ఉపవాసం వాస్తవ లక్ష్యం– సృష్టికర్త పట్ల భయ–భక్తులు. ఈ 'భయ–భక్తులు' కారణం గానే 'శాశ్వత ధర్మ సమ్మత'మైన ఆహార–పానీయాల స్వీకరణను, దాంపత్య సుఖాన్ని దైవాదేశం మేరకు పగటిపూట 'తాత్కాలికం'గా నిషేధించుకుంటున్నాడు ఒక విశ్వాసి!

వైదికులూ, యూదుల మాదిరిగానే ముస్లిములు కూడా 'చాంద్రమాన క్యాలండర్'నే అనుసరిస్తారు. కాబట్టి, ఎండలు తీవ్రంగా మండిపోయే రోహిణీ కార్తిలోనూ రమజాన్ మాసం వస్తుంది. ఉదా: అలాంటి సందర్భంలో ప్రభుత్వ అధికారిగా ఉన్న ఒక ముస్లిం తన కార్యాలయంలో వంటరిగా ఉన్నాడు. ఒకవైపు– 'ఫ్రిజ్'లో చల్లటి నీరు ఉంది. మరోవైపు మిట్టమధ్యాహ్నం రెండు గంటల సమయంలో గొంతుక తడారిపోయి, నాలుక పిడచకట్టుకుపోయి తీవ్రమైన దాహంతో తల్లడిల్లుతూ ఉంటాడు. ఉపవాస వ్రత విరమణకి ఇంకా నాలుగున్నర గంటల సమయం ఉంది. తాను మాత్రమే ఉన్న ఆ గదిలో ఫ్రిజ్ తెరచి, ఒక్క గుక్కెడు నీరు తాగవచ్చుకదా! తాగుతాడా? లేదు.

అప్పుడు అతడి ఆలోచన ఏమిటంటే– "ఇప్పుడు ఇక్కడ అల్లాహ్ నాతోనే ఉన్నాడు. నేను గనక నాలుగున్నర గంటలపాటు ఓరిమి వహించకపోతే నా ఉపవాస వ్రతం భంగం అయిపోతుంది. తత్కారణంగా నేను దైవశిక్షకి గురి కావలసి వస్తుంది" అన్నదే కదా! నిజమే సరిగ్గా అతని అదే విశ్వాసం ప్రాణాంతకమైన దాహాన్ని తట్టుకునేలా చేసింది.

రమజాన్ నెల గడిచిపోయిన తరువాత, అదే ముస్లిం అదే ఆఫీసులో తనకి ఒకడు 'శాశ్వత నిషేధమైన' లంచం ఇస్తుంటే... "ఆ తలుపు కాస్త దగ్గరకి వెయ్యవయ్యా! ఎవరైనా చూస్తారు!" అని ఆదేశిస్తున్నాడు. ఎందుకు? తాను లంచం పుచ్చుకుంటున్నది.

ఎవరూ చూడకూడదని, ఒకవేళ ఈ వ్యాసం చదువుతున్న మీరు ఒక ముస్లిం అయి ఉన్నా లేదా ఆస్తికులై ఉన్నా ఇక్కడ ఒక ప్రశ్న ఏమిటంటే– "రమజాన్ నెలతోపాటు మీ దేవుడు కూడా ఈ ఆఫీసులో నుండి వెళ్ళిపోయాడా!?" అన్నది. దీనికి మీ అంతరాత్మ ఇచ్చే సమాధానం. ఏమిటి? "లేదు". అంటే ఆయన ఇక్కడే ఉన్నాడన్నదే కాదా! అయినప్పటికీ, అలా ప్రవర్తించే వానికి ఇక్కడ లేకుండా పోయింది ఒకటి ఉంది... అది– 'ధర్మం పట్ల నిబద్ధత'.

లేదండి, దాని దారివేరు. దీని దారివేరు అని అంటే, "ఉపవాసాల్లో తినకూడదు. తాగకూడదు!" అని మీరు చేస్తున్నది ఒక 'నటన మాత్రమే' అని తేలిపోతుంది! ధర్మాన్ని ఒక నటనగా చేసుకున్న నాటకీయ భక్తులకి అల్లాహ్ సహాయం ఇహంలోనూ లభించదు, పరంలోనూ లభించదన్నది సుస్పష్టం. అల్లాహ్ సహాయానికి అర్హులు నటులు కాదు. భయ–భక్తులు కలిగిన నికార్సైన దాసులే!

ఎతేకాఫ్/మౌనవ్రతం – సత్కర్మలు

రమజాన్ నెలలో మూడవ దశకంలో ఎతేకాఫ్/మౌనవ్రతం పేరిట పాటించే ప్రత్యేక ఆరాధన ఒకటి ఉంది. సాధ్యమైన వారు ఐచ్చికంగా పాటించవలసిన వ్రతం ఇది. అయితే ఈ వ్రతానికి ఏంతో గొప్ప పుణ్యఫలం లభిస్తుందని ప్రవక్త మహనీయులు సెలవిచ్చారు. అది పాటించే వారు పదిరోజులపాటు ఇంటికి వెళ్ళరాదు. మస్జిద్ పట్టునే ఉండాలి.. వ్యాపార–ఉద్యోగాలు, లౌకిక లావాదేవీలు వేటినీ చేయరాదు. దైవ ప్రసన్నత కోసం చేసే అలాంటి మౌన వ్రత ఆరాధన అల్లాహ్ దృష్టిలో గొప్పదా లేక తోటి మానవులకు ఉపయోగపడే సత్కర్మలు గొప్పవా అన్న ప్రశ్నకు ప్రవక్త ముహమ్మద్ ఇస్తున్న సమాధానం ఏమిటో హదీస్, ముజముల్ కబీర్ 13646లో చూడండి.

قِيلَ: يَا رَسُولَ اللَّهِ، مَنْ أَحَبُّ النَّاسِ إِلَى اللَّهِ؟ قَالَ: أَحَبُّ النَّاسِ إِلَى اللَّهِ تَعَالَى أَنْفَعُهُمْ لِلنَّاسِ، وَأَحَبُّ الْأَعْمَالِ إِلَى اللَّهِ عَزَّ وَجَلَّ سُرُورٌ تُدْخِلُهُ عَلَى مُسْلِمٍ، أَوْ تَكْشِفُ عَنْهُ كُرْبَةً، أَوْ تَقْضِي عَنْهُ دَيْنًا، أَوْ تَطْرُدُ عَنْهُ جُوعًا، وَلَأَنْ أَمْشِيَ مَعَ أَخٍ فِي حَاجَةٍ أَحَبُّ إِلَيَّ مِنْ أَنْ أَعْتَكِفَ فِي هَذَا الْمَسْجِدِ شَهْرًا، وَمَنْ كَفَّ غَضَبَهُ سَتَرَ اللَّهُ عَوْرَتَهُ، وَمَنْ كَظَمَ غَيْظَهُ وَلَوْ شَاءَ أَنْ يُمْضِيَهُ أَمْضَاهُ مَلَأَ اللَّهُ قَلْبَهُ رَجَاءً يَوْمَ الْقِيَامَةِ، وَمَنْ مَشَى مَعَ أَخِيهِ فِي حَاجَةٍ حَتَّى تَتَهَيَّأَ لَهُ أَثْبَتَ اللَّهُ قَدَمَهُ يَوْمَ تَزِلُّ الْأَقْدَامُ، وَإِنَّ سُوءَ الْخُلُقِ يُفْسِدُ الْعَمَلَ كَمَا يُفْسِدُ الْخَلُّ الْعَسَلَ.

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ కథనం– "ఓ ప్రవక్తా! దేవునికి ఎవరు అత్యంత ప్రియులు? ఏ కర్మలు దేవునికి అత్యంత ప్రియమైనవి?" అని ప్రశ్నించారు. దానికి ఆయన– "ప్రజల్లో దేవునికి అత్యంత ప్రియమైనవారు ఎవరంటే, 1) మానవాళికి అత్యంత ప్రయోజనకరంగా ఎవరు ఉంటారో వారు అని (సాధారణంగా చెప్పి), మరియు 2) దేవునికి అత్యంత ప్రియమైన కార్యాలు ఏమిటంటే A) ఎవరైన ఒక విశ్వాసిని సంతోష పెట్టటం, లేదా B) వాని ఏదైనా ఆపదను తొలగించటం, C) ఒకని అప్పును చెల్లించటం, D) ఒకని ఆకలి తీర్చటం" అని (ప్రత్యేకంగా) చెప్పారు. ఇంకా "3) తన తోటి విశ్వాసి అవసరాన్ని తీర్చటానికి తిరగాడటం నా దృష్టిలో రెండు నెలల పాటు మసీదులో ఎతేకాఫ్/మౌనవ్రతం పాటించటం కంటే ఎక్కువ ప్రియతమం. అలాగే 4) ఎవరు తన కోపాన్ని దిగమింగుతాడో అల్లాహ్ వాని తప్పిదాలను మరుగు పరుస్తారు. 5) ఒకడు తన ప్రతీకారాన్ని తీర్చుకొనే శక్తి ఉన్నప్పటికీ దానిని మలచి వేస్తాడో అలాంటి వాని హృదయాన్ని అల్లాహ్ ఆనంద పారవశ్యంతో నింపివేస్తాడు. 6) ఏ వ్యక్తి తనతోటి సోదరునితో కలసి పరిశ్రమిస్తూ, వాని అవసరాన్ని పరిపూర్తి చేస్తాడో అల్లాహ్ అలాంటి వాని పాదాలను ఆ దినాన స్థిర పరుస్తాడు. ఏ నాడైతే పాదాలు తొట్రిల్లిపోతాయో. సిరకా (vinegar) తేనెను నాశనం చేసినట్లు దుష్కార్యాలు దైవారాధనలను నాశనం చేస్తాయి" అని హెచ్చరిస్తున్నారు.

ఈ హదీసులో 'ఎతేకాఫ్'/మౌనవ్రతం వంటి ఒక గొప్ప ఆరాధనకి లభించే పుణ్యఫలం కంటే అవసరార్థుల అక్కరలను తీర్చే 'సత్కర్మ'కి ఐదు రెట్లు అధిక పుణ్యఫలం లభిస్తుందని చెప్పటం అత్యంత గమనార్హం!

సరే ఇక్కడ మన గమనార్హ విషయం పైన పేర్కొన్న ఖురాన్–హదీస్ ప్రబోధనల ప్రకారం 'ఉపవాసాలు' ఎంత నియమ బద్ధంగా పాటించినా సదరు వ్యక్తి 'సత్కర్మలు' పాటించకపోతే అవి అల్లాహ్ వద్ద ఆమోదయోగ్యం కాజాలనని అర్థమౌతుంది.

ఐదవ ఆరాధన: అల్-హజ్ సత్కర్మలు లేకుండా చెల్లదు!

అల్–హజ్ అంటే యాత్ర. ఇస్లాం విధి చేసిన ఆరాధనల్లో హజ్ అన్నది కూడా ప్రముఖ ఆరాధన. ఒక విశ్వాసి ఆరోగ్యమూ–ఆర్థిక స్థితి సక్రమంగా ఉంటే సౌదీ అరేబియాకి చెందిన మక్కా నగరంలో ఉన్న మస్జిదుల్–హరామ్ అంటే 'పవిత్ర ఆలయం' కనీసం జీవితంలో ఒక్క సారి నిర్దేశిత దినాలలో సందర్శించాలి. ఈ ఆరాధన నెరవేర్పునకు అల్లాహ్ పెడుతున్న షరతులు ఏమిటో చూడండి.

2:197- ٱلْحَجُّ أَشْهُرٌ مَّعْلُومَٰتٌ ۚ فَمَن فَرَضَ فِيهِنَّ ٱلْحَجَّ فَلَا رَفَثَ وَلَا فُسُوقَ وَلَا جِدَالَ فِى ٱلْحَجِّ ۗ وَمَا تَفْعَلُوا۟ مِنْ خَيْرٍ يَعْلَمْهُ ٱللَّهُ ۗ وَتَزَوَّدُوا۟ فَإِنَّ خَيْرَ ٱلزَّادِ ٱلتَّقْوَىٰ ۚ وَٱتَّقُونِ يَٰٓأُو۟لِى ٱلْأَلْبَٰبِ

"హజ్ మాసాలు నిర్ధారితమై ఉన్నాయి. కనుక ఈ నిర్ణీత మాసాలలో హజ్ను తన కొరకు విధించుకున్న వ్యక్తి హజ్ దినాల్లో 1) కామ క్రీడలకు, 2) పాపకార్యాలకు, 3) ఘర్షణలకు దూరంగా ఉండాలి. 4) మీరు ఏ సత్కార్యం చేసినా దాని గురించి అల్లాహ్కు తెలుసు. 5) (హజ్ యాత్రకు బయలుదేరినప్పుడు) ప్రయాణ సామగ్రి (చేతిఖర్చు) వెంటతీసుకొని వెళ్ళండి. 6) అయితే అన్నింటి కంటే అత్యుత్తమ సామగ్రి దేవునిపట్ల భయ-భక్తులు (అని బాగా గుర్తుంచుకోండి). 7) కనుక బుద్ధిమంతులారా! నా పట్ల భయ-భక్తులు కలిగి ఉండండి" అని అల్లాహ్ గట్టిగా తాకీదు చేస్తున్నాడు.

దైవభక్తి పరాయణత అంటే 'దుష్కర్మల'ను విడనాడి సత్కర్మలను పాటించటం తప్పనిసరని అర్థం అవుతుంది. హజ్ ఆరాధనా దినాల్లో వ్యక్తి అత్యంత నిష్టాగరిష్టునిగా మారిపోవాలి. శాశ్వత దుష్టకార్యాలైన ఘర్షణలు-గలాటాలకి దిగరాదు. ఇంకా ఆ స్థితిలో కనీసం తన పరిచారకులను మందలించటం వంటి సామాన్య దుష్కర్మలకి పాల్పడటం కూడా నేరమే!

ఈ విధంగా హజ్ క్రతువులు ఐదు నుండి ఆరు దినాలపాటు 'శాశ్వత దుష్టకర్మల'కే కాక, 'శాశ్వత సత్కర్మలైన' భార్యా-భర్తలు కలిగి ఉండే పరస్పర దాంపత్య సంబంధానికి బహు దూరంగా ఉండటమే కాక, చివరికి దాని ప్రేరణ కలిగించే మాటలలూ, ఆలోచనలకి సైతం దూరంగా ఉండాలి. ఏతావాతా దుష్కర్మలపై నియంత్రణ సాధించి, వాటిపట్ల అసహ్యత కలిగించి, 'సత్కర్మల' పట్ల ఆసక్తీ-అనురక్తి పెంచటమే సకల ధార్మిక క్రతువుల అంతిమ లక్ష్యం. అదే గనుక నెరవేరకపోతే మన విశ్వాసాలూ-ఆరాధనలు యావత్తూ దేవుని దృష్టిలో ఆత్మలేని శవాలుగానే పరిగణించబడతాయన్నది నిస్సందేహం!

హజ్ క్రతువుల క్రమం తప్పటం నేరమా?
ఒక దైవదాసుని ఆత్మగౌరవాన్ని భంగపరచటం నేరమా?

ఆయా మతావలంబీకులు సాధారణంగా ధార్మిక క్రతువులపట్ల అతి జాగరూకతను, అప్రమత్తతను ప్రదర్శిస్తుంటారు. అదే తమ వ్యక్తిగత-సామూహిక జీవనంలో నైతిక-మానవత వంటి 'సత్కర్మల' విషయంలో ఏమాత్రము జాగరూకతను కనబరచరు. నిజానికి సకల ధార్మిక క్రతువుల పరమ లక్ష్యం- 'నైతికతా-మానవత' విలువలను

ప్రేరేపించటమే. ఇక క్రతువులా? సత్ప్రవర్తనా? ఈ రెండిటిలో ఏది ప్రధానం అన్న మీమాంస (dilemma)కి మానవమహోపకారి ప్రవక్త ముహమ్మద్ సమాధానం ఏమిటో హదీస్ Abu dawud 2015లో చూడండి.

عَنْ أُسَامَةَ بْنِ شَرِيكٍ، قَالَ: خَرَجْتُ مَعَ النَّبِيِّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ حَاجًّا، فَكَانَ النَّاسُ يَأْتُونَهُ، فَمَنْ قَالَ: يَا رَسُولَ اللَّهِ، سَعَيْتُ قَبْلَ أَنْ أَطُوفَ، أَوْ قَدَّمْتُ شَيْئًا أَوْ أَخَّرْتُ شَيْئًا، فَكَانَ يَقُولُ: لَا حَرَجَ لَا حَرَجَ إِلَّا عَلَى رَجُلٍ اقْتَرَضَ عِرْضَ رَجُلٍ مُسْلِمٍ وَهُوَ ظَالِمٌ، فَذَلِكَ الَّذِي حَرِجَ وَهَلَكَ .

గౌరవ ఉసామా షరీక్ కథనం: ప్రవక్త మహానీయునితో హజ్ తీర్థయాత్ర నిమిత్తం బయలు దేరాం, (హజ్ పరిక్రమ జరుగుతుండగా) ప్రజలు ఆయన వద్దకు వచ్చి "ఓ దైవ ప్రవక్తా! నేను *'తవాఫ్'* క్రతువు కంటే ముందు *'సయీ'* క్రతువు చేశాను అని అంటే, మరొకరు ఫలానా పరిక్రమ ముందు చేశాను అంటే, మరొకరు ఫలానా కర్మ తరువాత చేశాను" అంటుండేవారు. దానికి ప్రవక్త మహనీయులు– "ఎలాంటి సమస్యా లేదు! ఎలాంటి సమస్యా లేదు!!" అంటూ– "ఒకవేళ ఎవరైనా దౌర్జన్యపూర్వకంగా (అపవాదుకి పాల్పడి, అపహాస్యం అవమానం వంటి విషయాలతో) ఒక విధేయుని గౌరవాన్ని భంగపరిస్తే అది అసలు సమస్య! అలాంటి వాడు నాశనం అవుతాడు!!" అని హెచ్చరించారు.

ఈ హదీసులోనూ 'ధార్మిక క్రతువులు మరియు లోకుల మర్యాద' మధ్య ఉన్న విశేషమైన ప్రాధాన్యతా క్రమం కనిపిస్తుంది. హజ్ తీర్థయాత్ర అనేది జీవితంలో ఒకసారి చేసే విశేషమైన గొప్ప వ్రతం. పైగా ఎంతో ప్రయాసతో, మరెంతో ఖర్చుతో కూడుకున్న యజ్ఞం. పైగా అప్పటికప్పుడు సరిచేసుకొని తిరిగి చేసేదీ కాదు. కాబట్టి దాని క్రతువులు ఎంతటి విశేషమైనవై ఉంటాయో ఊహించుకోవచ్చు.

అంతగొప్ప వ్రతానికి సంబంధించిన క్రతువులు క్రమం తప్పి, వెనకా ముందు అయిపోవటం అన్నది సామాన్య విషయం ఏమీ కాదు! అలాంటి నేపథ్యంలో అదేమీ సమస్యే కాదని చెప్పి, "తోటి ప్రజలతో 'సత్ప్రవర్తన' కలిగి ఉండకపోవటమే అసలు వినాశనకరమైన సమస్య" అని మానవమహోపకారి ప్రవక్త ముహమ్మద్ హెచ్చరించటం గురించి ప్రతి ముస్లిమూ గంభీరంగా ఆలోచించాలి!

హజ్ ఆరాధనా? అగత్య పరుల అవసరాలు తీర్చటమా? ఏది శ్రేష్ఠతరం?

ఖురాన్–హదీస్ ప్రబోధనాలు వ్రాత పూర్వకంగా ఉన్నప్పుడు అవి సైద్ధాంతికమైనవి మాత్రమే. అయితే వాటి ప్రామాణికమైన ఆచరణాత్మక అన్వయం (Practical

application) మాత్రం 1) మహనీయ ప్రవక్త ముహమ్మద్, ఆయన అనుయాయులు, 2) వారి అనుయాయులు మరియు 3) వారి అనుయాయుల్లో చూడాలి. అలాంటి వారిలో మూడవ తరానికి చెందిన సుప్రసిద్ధ తాబె–తాబియీ, గొప్ప ఇస్లామీయ పండితులు అబ్దుల్లాహ్ ఇబ్ను అల్–ముబారక్. ఆయన తను ఒకవైపు– అల్లాహ్ కోసం చేసే 'హజ్ ఆరాధన'కి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారా? లేక మరోవైపు– మానవాళి కోసం చేసే సేవా తత్పరతకి అవసరమైన 'సత్కర్మలు'కి ప్రాధాన్యత ఇస్తున్నారా? అన్నది ప్రశ్న. దానికి ఆయన జీవితంలో జరిగిన ఈ ఘట్టమే సమాధానం. అల్–బిదాయా వన్–న్నహాయా 10/191 నుండి చూడండి.

خَرَجَ عَبْدُ اللَّهِ بْنُ الْمُبَارَكِ رَحِمَهُ اللَّهُ فِي الْحَجِّ سَنَةً، فَلَقِيَ فَتَاةً تَقُولُ لَهُ :أَنَا وَأَخِي هُنَا لَيْسَ لَنَا شَيْءٌ إِلَّا هَذَا الْإِزَارُ، وَلَيْسَ لَنَا قُوتٌ إِلَّا مَا يُلْقَى عَلَى هَذِهِ الْمَزْبَلَةِ، وَقَدْ حَلَّتْ لَنَا الْمَيْتَةُ مُنْذُ أَيَّامٍ .فَدَفَعَ إِلَيْهَا نَفَقَةَ الْحَجِّ، وَقَالَ: «هَذَا أَفْضَلُ مِنْ حَجِّنَا فِي هَذَا الْعَامِ»، ثُمَّ رَجَعَ.

గౌరవనీయులు అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ ఒకసారి హజ్ తీర్థయాత్రకి పయనమయ్యారు. మార్గం మధ్యలో చనిపోయిన ఒక పక్షి కనిపించింది. దానిని చెత్త డబ్బాలో వేయమని చెప్పారు. ఆయన అక్కడ ఉండగానే ఒక యువతి వచ్చి, ఆ మృత పక్షిని తీసుకుపోతుంది. ఆ దృశ్యాన్ని చూచినా అబ్దుల్లాహ్ ఆ యువతిని వెంబడించారు. ఆ ఇంటి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆ యువతి తన దుర్భర స్థితిని వినిపించి, గత కొన్ని రోజులుగా నిషిద్ధమైనవి తినటం మా కోసం తప్పనిసరి అయిపోయింది. మా తండ్రి వద్ద ఉన్న డబ్బును దౌర్జన్యంగా దోచుకొని, ఆయనను హత్య చేశారని ఆ యువతి తన గోడు వెళ్ళగక్కింది. వారి దుస్థితిని విన్న అబ్దుల్లాహ్ తన కోశాధికారిని పిలిచి– "మీ వద్ద మొత్తం ఎంత డబ్బు ఉంది?" అని ప్రశ్నించారు. దానికి అతడు– "వెయ్యి దీనారులు ఉన్నాయి" అని చెప్పాడు. అప్పుడు ఆయన– "మన తిరుగు పయనానికి ఇరవై దీనారులు సరిపోతాయి. ఇక మిగిలిన దీనారులు ఆ కుటుంబానికి ఇచ్చివేయి!" అని ఆదేశించారు. అతడు ఆ ప్రకారంగానే చేశాడు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ ముబారక్– "ఈ సంవత్సరం మా కోసం హజ్ తీర్థ యాత్ర చేయటం కంటే ఈ సహాకారమే శ్రేష్ఠమైనది!" అని ప్రకటించారు.

ఆ మహనీయుని ఆచరణాత్మ సంఘటన ఇస్లాం ధర్మం అంతిమ లక్ష్యం మానవ సేవ, లోకకళ్యాణం అని నిరూపిస్తుంది. దీనికి మించింది ఏదీ లేదు. నిజానికి ఈ 'విశ్వాసాలు–ఆరాధనలు' వాటిని సాధించే 'సాధనాలు/ప్రేరకాలు' మాత్రమే అని ఖురాన్–హదీసు

ప్రబోధనలు తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ ఈ మౌలిక విషయాన్ని పూర్తిగా తిలోదకాలిచ్చి, 'మానవత'ను పూర్తిగా వదలివేశారు.

అందుకే మన చుట్టుపక్కల లక్షలాది మంది కనీస అవసరాలు తీరక, దుర్భర జీవనం గడుపుతున్నారు. గొప్ప ధార్మికులైన ముస్లిములు సైతం తమ సొంత అన్నా చెల్లెళ్ళకి సైతం కనీస అవసరాలు తీరని స్థితిలో ఉన్నప్పటికీ; ఉమ్రా, హజ్ యాత్రల పేరిట లక్షలాది రూపాయలను యథేచ్ఛగా ఖర్చు చేస్తున్నారు. దీనిని బట్టి వారికి ఇస్లాం ధర్మం ఆత్మ అర్థం కాలేదని తెలుస్తుంది. అయితే ఇస్లాం భౌతిక రూపంతో పాటు ఆత్మీయ రూపాన్ని అర్థం చేసుకున్న మన పూర్వీకుల దృష్టిలో దైవారాధనలా? మానవ సేవా? అన్నప్పుడు రెండవ దానికే ప్రాధాన్యత ఇచ్చేవారని పై సంఘటన రుజువుచేస్తుంది. ఆయన దైవ ఆరాధన కంటే మానవ సేవాకి ప్రాధాన్యత ఇవ్వటానికి దోహదమైన Musnad Ahmed shish 9673వ హదీస్ చూడండి.

عَنْ أَبِي هُرَيْرَة ، قَالَ: قَالَ رَجُلٌ: يَا رَسُولَ اللَّهِ، إِنَّ فُلَانَةَ يُذْكَرُ مِنْ كَثْرَةِ صَلَاتِهَا، وَصِيَامِهَا، وَصَدَقَتِهَا، غَيْرَ أَنَّهَا تُؤْذِي جِيرَانَهَا بِلِسَانِهَا، قَالَ: "هِيَ فِي النَّارِ"، قَالَ: يَا رَسُولَ اللَّهِ، فَإِنَّ فُلَانَةَ يُذْكَرُ مِنْ قِلَّةِ صِيَامِهَا، وَصَدَقَتِهَا، وَصَلَاتِهَا، وَإِنَّهَا تَصَدَّقُ بِالْأَثْوَارِ مِنَ الْأَقِطِ، وَلَا تُؤْذِي جِيرَانَهَا بِلِسَانِهَا، قَالَ:" هِيَ فِي الْجَنَّةِ".

గౌరవనీయ అయిహురైరా ఉల్లేఖనం: ఒక వ్యక్తి మహనీయ ముహమ్మద్ సన్నిధికి వచ్చి– "ఓ ప్రవక్తా! ఫలానా ఆమె 1) నమాజులు అధికంగా చేస్తుంది. 2) ఉపవాసాలు పాటించటంలో, 3) దానాలు చేయటంలోనూ ప్రఖ్యాతి గాంచింది. అయితే, ఆమె తన నోటి దురుసుతనంతో పొరుగు వారిని బాధిస్తుంది" అని అన్నారు. దానికి ప్రవక్త మహనీయులు– "ఆమె నరకవాసి" అన్నారు. ఆ తరువాత అదే వ్యక్తి– "మరొక ఆమె ఉంది. ఆమె అయితే 1) నమాజులు, 2) ఉపవాసాలు, 3) దానాలు మాత్రమే చేస్తుందని ప్రతీతి. ఆమె కేవలం కొన్ని పన్నీరు ముక్కలనే దానం చేస్తుంది. కానీ, తన నోటి దురుసుతనంతో ఎవరినీ ఇబ్బంది పెట్టదు" అని అన్నారు. దానికి స్పందనగా ప్రవక్త మహనీయులు– "ఆమె స్వర్గవాసి" అని ప్రకటించారు.

ఒక ఆమె విధి ఆరాధనలు (ఫరాయెజ్) మాత్రమే కాక, అదనపు ఆరాధనలు (నవాఫీల్) కూడా చేసినప్పటికీ పొరుగు వారిని ఇబ్బంది పెట్టిన కారణంగా ఆమె నరకవాసి అయిపోయింది. అంటే సత్కర్మలు లేని కారణంగా ఆమె ఆరాధనలు నరకం నుండి రక్షించలేక పోయాయి.

8. చివరికి మిగిలి ఉండేవి ఏమిటి? విశ్వాసాలూ-ఆరాధనలా? లేక సత్కర్మలా?

మరణించి, అల్లాహ్ వద్ద వెళ్ళిన వానితో చివరికి మిగిలి ఉండేవి ఏమిటి? అని ఖురాన్ను సూటిగా ప్రశ్నిస్తే అదిచ్చే స్పష్టమైన సమాధానం.

18:46 – ٱلْمَالُ وَٱلْبَنُونَ زِينَةُ ٱلْحَيَوٰةِ ٱلدُّنْيَا ۖ وَٱلْبَٰقِيَٰتُ ٱلصَّٰلِحَٰتُ خَيْرٌ عِندَ رَبِّكَ ثَوَابًا وَخَيْرٌ أَمَلًا

"ఈ సంపదా మరియు ఈ సంతానం, కేవలం ఐహిక జీవితపు అలంకారాలు మాత్రమే. కాని శాశ్వతంగా నిలిచేవి 'సత్కర్మ'లే! అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతిఫలానికి మేలైనవి మరియు దానిని ఆశించటానికి కూడా ఉత్తమమైనవి" అని ఇంకా,

19:76 – وَيَزِيدُ ٱللَّهُ ٱلَّذِينَ ٱهْتَدَوْا۟ هُدًى ۗ وَٱلْبَٰقِيَٰتُ ٱلصَّٰلِحَٰتُ خَيْرٌ عِندَ رَبِّكَ ثَوَابًا وَخَيْرٌ مَّرَدًّا

"మార్గదర్శకత్వం పొందిన వారికి, అల్లాహ్ వృద్ధిని ప్రసాదిస్తాడు. చిరస్థాయిగా ఉండిపోయే 'సత్కర్మ'లే నీ ప్రభువు దగ్గర ప్రతిఫలం రీత్యా ఉత్తమమైనవి మరియు పర్యవసానం దృష్ట్యా కూడా ఉత్తమమైనవి" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

పై రెండు వాక్యాలూ 'ٱلْبَٰقِيَٰتُ ٱلصَّٰلِحَٰتُ'/"చిరస్థాయిగా ఉండిపోయేవి 'సత్కర్మ'లే!" అని ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నాయి. ఎందుకంటే నీ ప్రభువు దృష్టిలో 'పుణ్యఫలం' రీత్య అవే 'خَيْرٌ'/'మేలైనవి', ఇంకా ఒక భక్తుడు ఆశించదగిన 'خَيْرٌ'/'మేలు' కూడా అవే అని ఖురాన్ నిర్ద్వంద్వంగా ప్రకటిస్తుంది! ఖురాన్ ఇస్తున్న ఈ సమాచారం కంటే నమ్మకమైన, కచ్చితమైన సమాచారం ఇంకా ఏది కాగలదు!?

9. హదీస్ ప్రకారం- పరలోకంలో కొందరు విశ్వాసుల దివాళాకి కారణం విశ్వాసాలూ-ఆరాధనల రాహిత్యమా? లేక సత్కర్మల రాహిత్యమా?

హదీస్ Tirmizi 2418– ప్రవక్త మహనీయ ముహమ్మద్ తన అనుయాయులను ఉద్దేశించి "దివాళాకోరు అని ఎవరినంటారో మీకు తెలుసా?" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా ఆయన అనుయాయులు "ఎవని వద్ద డబ్బూదస్కం ఉండదో, కనీస జీవన అవసరాలు ఉండవో అలాంటి వానిని దివాళాకోరు అంటారు" అని సమాధానం ఇచ్చారు. దానికి వివరణ ఇస్తూ ప్రవక్త మహనీయులు– "మన పరివారంలో ఎవరు తీర్పు దినంరోజు 1) ఉపవాసాలు, 2) నమాజులు 3) విధిదానాలతో పాటు, I) ఒకరిని దూషించి, II) ఒకరిపై

నిందలు మోపి, III) ఒకని సంపదను దోచుకొని, IV) ఒకరి రక్తాన్ని చిందించి, V) ఒకరిపై దౌర్జన్యం చేసి వస్తాడో అలాంటి వాడిని వారందరి సమక్షంలో కూర్చుండ బెట్టటం జరుగుతుంది. అతని ఆ 'దుష్కర్మల'కి బదులుగా అతని (విశ్వాసాలూ-ఆరాధనల) 'పుణ్యఫలాల'ను బాధితులకి బట్వాడా చేయటం జరుగుతుంది. ఆ తరువాత అతని బాధితుల బదులు తీర్చటానికి ముందే ఒకవేళ అతడి 'పుణ్యఫలాలు'ఖాళీ అయిపోతే, అతడి బాధితుల 'పాపపంకిలము'ను అతని ఖాతాలో జమచేస్తారు. ఆ తరువాత వానిని నరకంలో విసరివేయటం జరుగుతుంది. వాడే అసలైన దివాళాకోరు!" అని హెచ్చరించారు.

'గొప్ప పుణ్యాత్ముడి'గా దేవుని వద్దకు చేరినప్పటికీ, 'గొప్ప పాపిష్టి'గా మారి నరకానికి పోయే దివాళాకోరు తనానికి మూల కారణం కేవలం 'విశ్వాసాలూ-ఆరాధనలు' ఆచరిస్తూ, వాటితోనే సంతృప్తిపడి నైతికతా-మానవత వంటి 'సత్కర్మల'కి తిలోదకాలిచ్చి తోటి మానవులతో దురుసుగా ప్రవర్తించటమే! అని పైన పేర్కొన్న హదీసు ప్రకారం తేలిపోతుంది.

ఈనాటి అధిక శాతం ధార్మికులు, 'ధార్మిక క్రతువుల'ను క్రమం తప్పకుండా ఆచరిస్తుంటారు. కానీ, తమ 'వ్యావహారిక జీవితం'లో సదాచరణ శూన్యులై ఉంటారు. పరలోకంలో అలాంటి వారిగతి అధోగతి కాక తప్పదని తెలుస్తుంది!

10. తీర్పుదినం రోజున అల్లాహ్, తన దాసులకు విశ్వాసాలూ-ఆరాధనల గురిని ప్రశ్నిస్తాడా? సత్కర్మల గురించి ప్రశ్నిస్తాడా?

ఈనాటి భక్తుల ప్రకారం దైవం పరలోకంలో తీర్పుదినం రోజున విశ్వాసాలూ-ఆరాధనల గురించే ప్రశ్నిస్తాడాని భావిస్తూ ఉంటారు. అయితే ధర్మ గ్రంథాలను అధ్యయనం చేస్తే ఆయన ప్రశ్నించేది వేరేగా ఉంది. అదేమిటో సహీహ్ ముస్లిం 2569వ హదీసులో మీరే చూడండి.

حَدَّثَنِي مُحَمَّدُ بْنُ حَاتِمِ بْنِ مَيْمُونٍ، حَدَّثَنَا بَهْزٌ، حَدَّثَنَا حَمَّادُ بْنُ سَلَمَةَ، عَنْ ثَابِتٍ، عَنْ أَبِي رَافِعٍ، عَنْ أَبِي هُرَيْرَةَ، قَالَ قَالَ رَسُولُ اللَّهِ صلى الله عليه وسلم " إِنَّ اللَّهَ عَزَّ وَجَلَّ يَقُولُ يَوْمَ الْقِيَامَةِ يَا ابْنَ آدَمَ مَرِضْتُ فَلَمْ تَعُدْنِي . قَالَ يَا رَبِّ كَيْفَ أَعُودُكَ وَأَنْتَ رَبُّ الْعَالَمِينَ . قَالَ أَمَا عَلِمْتَ أَنَّ عَبْدِي فُلاَنًا مَرِضَ فَلَمْ تَعُدْهُ أَمَا عَلِمْتَ أَنَّكَ لَوْ عُدْتَهُ لَوَجَدْتَنِي عِنْدَهُ يَا ابْنَ آدَمَ اسْتَطْعَمْتُكَ فَلَمْ تُطْعِمْنِي . قَالَ يَا رَبِّ وَكَيْفَ أُطْعِمُكَ وَأَنْتَ رَبُّ الْعَالَمِينَ . قَالَ أَمَا عَلِمْتَ أَنَّهُ اسْتَطْعَمَكَ عَبْدِي فُلاَنٌ فَلَمْ تُطْعِمْهُ أَمَا عَلِمْتَ أَنَّكَ لَوْ أَطْعَمْتَهُ

لَوَجَدْتَ ذَلِكَ عِنْدِي يَا ابْنَ آدَمَ اسْتَسْقَيْتُكَ فَلَمْ تَسْقِنِي . قَالَ يَا رَبِّ كَيْفَ أَسْقِيكَ وَأَنْتَ رَبُّ الْعَالَمِينَ قَالَ اسْتَسْقَاكَ عَبْدِي فُلاَنٌ فَلَمْ تَسْقِهِ أَمَا إِنَّكَ لَوْ سَقَيْتَهُ وَجَدْتَ ذَلِكَ عِنْدِي " .

గౌరవనీయులైన అబూ హురైరా కథనం ప్రకారం, మహనీయ ప్రవక్త ముహమ్మద్ ఇలా ప్రవచించారు:

నిశ్చయంగా, ప్రళయ దినాన అల్లాహ్ తాలా ఇలా సెలవిస్తాడు:

1. "ఓ ఆదమ్ కుమారుడా! నేను అనారోగ్యానికి గురయ్యాను, కానీ నువ్వు నన్ను పరామర్శించలేదు". దానికి..

   మానవుడు: "ఓ నా ప్రభువా! నువ్వు అఖిలాండ కోటికి అధిపతివి (రబ్బుల్ ఆలమీన్). నిన్ను నేను ఎలా పరామర్శించగలను?" అని అడుగుతాడు. అప్పుడు..

   అల్లాహ్: "నా ఫలానా దాసుడు అనారోగ్యానికి గురైనప్పుడు నువ్వు అతడిని పరామర్శించలేదనే విషయం నీకు తెలియదా? ఒకవేళ నువ్వు అతడిని పరామర్శించి ఉంటే, నన్ను అతడి వద్దే కనుగొనేవాడివి అని నీకు తెలియదా?" అని అడుగుతాడు.

2. ఆ తర్వాత అల్లాహ్: "ఓ ఆదమ్ కుమారుడా! నేను నిన్ను ఆహారం అడిగాను, కానీ నువ్వు నాకు పెట్టలేదు" అని అడుగుతాడు. దానికి

   మానవుడు: "ఓ నా ప్రభువా! నువ్వు లోకాలన్నింటికీ ఆహారాన్ని ప్రసాదించేవాడివి. నీకు నేను ఎలా ఆహారం పెట్టగలను?" అని అడుగుతాడు. అప్పుడు..

   అల్లాహ్: "నా ఫలానా దాసుడు నిన్ను ఆహారం అడిగినప్పుడు నువ్వు పెట్టలేదనే విషయం నీకు తెలియదా? ఒకవేళ నువ్వు అతడికి అన్నం పెట్టి ఉంటే, ఆ పుణ్యఫలాన్ని ఈ రోజు నా వద్ద పొందేవాడివి అని నీకు తెలియదా?" అని సెలవిస్తాడు.

3. చివరగా అల్లాహ్: "ఓ ఆదమ్ కుమారుడా! నేను నిన్ను దాహం తీర్చమని నీరు అడిగాను, కానీ నువ్వు నాకు ఇవ్వలేదు" అని అడుగుతాడు. దానికి..

   మానవుడు: "ఓ నా ప్రభువా! లోకనాథుడవైన నీకు నేను ఎలా నీరు ఇవ్వగలను?" అని అడుగుతాడు. అప్పుడు..

అల్లాహ్: "నా ఫలానా దాసుడు దాహంతో నిన్ను నీరు అడిగినప్పుడు నువ్వు ఇవ్వలేదు. ఒకవేళ నువ్వు అతడి దాహం తీర్చి ఉంటే, ఆ పుణ్యఫలాన్ని నా వద్ద కనుగొనేవాడివి" అని సెలవిస్తాడు.

ఈ హదీసు మాత్రమే కాదు, దీనిని 'హదీసె ఖుదుసీ' అని అంటారు. ఇది అల్లాహ్ స్వయంగా ప్రవక్తకు ప్రత్యక్షంగా అందించిన సమాచారం. ఇంత గొప్ప హదీసులో రోగులను పరామర్శించటం, తీర్పు దినం లాంటి అత్యంత ఆపత్కాల సమయంలో–

1) "ఓ మానవుడా! నీవు నా అద్వితీయత (తౌహీద్)ను అంగీకరిస్తావని ఎదురుచూచాను!" అనిగాని, 2) "ఓ మానవుడా! నీవు నా ఘనకీర్తన ఎప్పుడు చేస్తావా అని ఎంతో ఆశగా నీ కోసం ఎదురు చూశాను!" అనిగాని, 3) "ఓ మానవుడా! నీవు నా ఆరాధన చేయటానికి నా మసీదుకి లేదా హజ్, ఉమ్రాలు చేయటానికి నా కాబా గృహానికి ఎప్పుడొస్తావా అని నా కళ్లు కాయలు కాసినట్లు నీ కోసం పడిగాపులు కాశాను!" అనిగాని అల్లాహ్ ఎన్నడూ ప్రకటించలేదు. అలా ఎందుకు ప్రకటించలేదంటే విశ్వాసాలూ– ఆరాధనలు Means మాత్రమే Ends కాదు కాబట్టి.

11. కొందరు నరకానికి పోవటానికి మూల కారణం సత్కర్మల రాహిత్యం!

ఖురాను గ్రంథం నరక వాసుల రెండు విధాలైన స్పందనలు చూపిస్తుంది వాటిలో... ఒకటి– "మాకు తిరిగి భూలోకానికి పంపిస్తే 1) విశ్వసిస్తాము, 2) సత్కర్మలు చేస్తాము" అన్నది. రెండు– "మాకు తిరిగి భూలోకానికి పంపిస్తే 1) సత్కర్మలు చేస్తాము" అని అంటారు. దీనికి కారణం ఏమిటంటే మూడు రకాలు ప్రజలు ఉంటారు. వారిలో...

1. ప్రవక్తలు ఉన్న కాలం నాటి ప్రజలు. అంటే ప్రవక్తలను చూచి, వారి సందేశాన్ని విని, అర్థం చేసుకుని ప్రవక్తల ప్రతిపాదిత దేవుని విశ్వాసం పట్ల ఆత్మ సంతృప్తి (Inner satisfaction) కలిగినప్పటికీ, అహంకారంతో లేదా మంకుపట్టుతో విశ్వాసాన్ని ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కరించిన వారు.

2. ప్రవక్తలు లేని కాలం నాటి ప్రజలు. వారు తమ బుద్ధి–వివేకాలను ఉపయోగించి భూ–మ్యాకాల సూచనల ద్వారా లేక ప్రవక్తలు ఇచ్చి వెళ్ళిన ధర్మ ప్రబోధనలు అధ్యయనం చేసి, అర్థం చేసుకుని ప్రవక్తల ప్రతిపాదిత దేవుని విశ్వాసం పట్ల ఆత్మ సంతృప్తి కలిగినప్పటికీ, అహంకారంతోనో లేదా మంకుపట్టుతోనో విశ్వాసాన్ని ఉద్దేశ్యపూర్వకంగా తిరస్కరించిన వారు.

3. ప్రవక్తలు లేని కాలం నాటి ప్రజలు. వీరు దేవుడూ–పరలోకము వగైరా విషయాల పట్ల తిరస్కార భావన లేనప్పటికీ, వాటిపట్ల ఆసక్తి లేని ప్రజలు. అయినా ఆ సృష్టికర్త వారి మనస్సులో పెట్టిన సహజ 'నైతికశక్తి ప్రేరణ'తో 'దుష్కర్మల'ను విడనాడి, 'సత్కర్మల'ను ఆచరించే నిష్టాగరిష్టులైన సజ్జనులు.

ఈ క్రింది పేర్కొంటున్న ఖురాన్ 6:27వ వాక్యంలో మాట్లాడుతున్న నరక వాసులు పైన పేర్కొన్న మూడు వర్గాల్లో ఎందులో వస్తారో గుర్తించండి.

وَلَوْ تَرَىٰٓ إِذْ وُقِفُواْ عَلَى ٱلنَّارِ فَقَالُواْ يَٰلَيْتَنَا نُرَدُّ وَلَا نُكَذِّبَ بِـَٔايَٰتِ رَبِّنَا وَنَكُونَ مِنَ ٱلْمُؤْمِنِينَ

నరకం దగ్గర వారు నిలబెట్టబడినప్పుడు నీవు వారిని చూస్తే (ఎంత బావుండు!)– "అయ్యో! మేము మళ్లీ తిరిగి పంపబడితే బావుండునే! అదే గనక జరిగితే మేము మా ప్రభువు 'మహిమల'ను తిరస్కరించము. ఇంకా మేము విశ్వాసుల్లో చేరిపోతాము!" అని (ఆ సమయంలో) వారు హామీ ఇస్తారు. ఖురాన్ 7:53వ వాక్యాన్ని చూడండి.

هَلْ يَنظُرُونَ إِلَّا تَأْوِيلَهُۥ ۚ يَوْمَ يَأْتِى تَأْوِيلُهُۥ يَقُولُ ٱلَّذِينَ نَسُوهُ مِن قَبْلُ قَدْ جَآءَتْ رُسُلُ رَبِّنَا بِٱلْحَقِّ فَهَل لَّنَا مِن شُفَعَآءَ فَيَشْفَعُواْ لَنَآ أَوْ نُرَدُّ فَنَعْمَلَ غَيْرَ ٱلَّذِى كُنَّا نَعْمَلُ ۚ قَدْ خَسِرُوٓاْ أَنفُسَهُمْ وَضَلَّ عَنْهُم مَّا كَانُواْ يَفْتَرُونَ

గ్రంథంలో తెలియజేయబడిన తుదిఫలితం ఎప్పుడు వస్తుందా అని మాత్రమే తప్ప మరో దానికోసం వీరు నిరీక్షించటం లేదు. ఏ రోజున దీని తుదిఫలితం వచ్చేస్తుందో ఆ రోజు, ముందు నుంచీ దీనిని విస్మరిస్తూ వచ్చినవారే ఇలా అంటారు: "మా ప్రభువు (తరపున నియుక్తులైన) ప్రవక్తలు నిజంగానే సత్య బద్ధమైన విషయాలు తెచ్చారు. ఇప్పుడు మా కోసం సిఫారసు చేసే సిఫారసు దారులెవరైనా మాకు లభిస్తారా? లేదా లోగడ మేము చేసిన 'దుష్కర్మల'కు భిన్నమైన 'సత్కర్మలు' చేసేందుకు మళ్లీ మేము (భూలోకానికి) తిరిగి పంపబడతామా?" అని అంటారు. నిస్సందేహంగా వీళ్లు తమ స్వయానికి నష్టం చేకూర్చుకున్నారు. వీళ్లు కల్పిస్తూ వచ్చిన విషయాలన్నీ వీళ్ల నుంచి మటుమాయం అయ్యాయి.

కాస్త జాగ్రత్తగా గమనిస్తే పైరెండు వాక్యాల్లో మాట్లాడుతున్న వారు మొదటి రకం ప్రజలు అయి ఉండాలి. లేదా రెండవ రకం ప్రజలు కూడా అయి ఉండవచ్చు. ఎందుకంటే– "మా ప్రభువు 'మహిమల'ను తిరస్కరించము!" అంటే స్వీకరిస్తాము అని అంటున్నారు.

అంటే వారు సత్కర్మలు చేసే సజ్జనులే. అయినప్పటికీ వారు తమకు 'దేవుని విశ్వాసం' పట్ల 'ఆత్మ సంతృప్తి' కలిగినప్పటికీ, అహంకారంతో దేవునిపట్ల విశ్వాసాన్ని తిరస్కరించి ఉండవచ్చు. కాబట్టి వారు నరక వాసులు అయ్యారని తెలుస్తుంది.

గమనిక: సత్కర్మలు చేసే సజ్జనులు అయినప్పటికీ దేవుని పట్ల విశ్వాసం విషయంలో ఆత్మ సంతృప్తి కలిగిన తరువాత కూడా దానిని తిరస్కరించే వారు కొందరు ఉంటారు. కారణం ఏమిటంటే వారిలో ఉండే అహంకారం, పక్షపాతం కారణంగా తను దైవాన్ని నమ్ముతున్నానంటే ప్రజల్లో నామోషీగా భావించి తిరస్కరిస్తారు. అలాంటి వారు సజ్జనులు అయినప్పటికీ నరక వాసులు అవుతారన్నది గమనార్హం. ఎందుకంటే మనిషికి అసలైన శత్రువు అహంకారమే! ఖురాన్ 32:12వ వాక్యం చూడండి.

وَلَوْ تَرَىٰٓ إِذِ ٱلْمُجْرِمُونَ نَاكِسُوا۟ رُءُوسِهِمْ عِندَ رَبِّهِمْ رَبَّنَآ أَبْصَرْنَا وَسَمِعْنَا فَٱرْجِعْنَا نَعْمَلْ صَٰلِحًا إِنَّا مُوقِنُونَ

అపరాధులు తమ ప్రభువు సమక్షంలో తలలువంచుకుని ఉండటాన్ని నువ్వుచూస్తే ఎంత బావుంటుంది! (అప్పుడు వారిలా అంటారు)– "మా ప్రభూ! మేమంతా చూసుకున్నాము. (అంతా) విన్నాము. ఇక మమ్మల్ని తిరిగి పంపించు. (ఇక నుంచి) మేము 'సత్కర్మలు' చేస్తాము. మాకిక పూర్తి నమ్మకం కలిగింది" అని అంటారు. ఇంకా ఖురాన్ 35:37వ వాక్యం కూడా చూడండి.

وَهُمْ يَصْطَرِخُونَ فِيهَا رَبَّنَآ أَخْرِجْنَا نَعْمَلْ صَٰلِحًا غَيْرَ ٱلَّذِى كُنَّا نَعْمَلُ ۚ أَوَلَمْ نُعَمِّرْكُم مَّا يَتَذَكَّرُ فِيهِ مَن تَذَكَّرَ وَجَآءَكُمُ ٱلنَّذِيرُ ۖ فَذُوقُوا۟ فَمَا لِلظَّٰلِمِينَ مِن نَّصِيرٍ

అందులో వారిలా ఘోషిస్తారు; "ప్రభూ! మమ్మల్ని బయటికి తియ్యి. మేము ఇప్పటిదాకా చేసిన (చేదు) పనులకు భిన్నమైన (మంచి) పనులు చేస్తాము". (సమాధానంగా అల్లాహ్ ఇలా అంటాడు): అర్థం చేసుకునేవానికి అర్థం చేసుకోగలిగేంత వయస్సును మేము మీకు ఇవ్వలేదా? హెచ్చరించేవాడు సైతం మీ వద్దకు వచ్చాడు. కనుక (శిక్షను) చవిచూడండి. (ఇలాంటి) దుర్మార్గులను అదుకునే వాడెవడూ లేడు".

ఈ రెండు వాక్యాల్లో విశ్వాసం ప్రస్తావన లేకుండా కేవలం 'సత్కర్మలు' గురించి మాత్రమే ఉంది. వీరు పైన పేర్కొన్న ముగ్గురిలో మూడవ వర్గం ప్రజలై ఉంటారు. ఏదేమైనప్పటికీ నరక వాసులు తాము నరకానికి పోవటానికి కారణం– 'సత్కర్మలు' ఆచరించకపోవటం అన్నది మాత్రం వాస్తవం.

12. అల్లాహ్ ప్రకారం- కొందరు స్వర్గం పొందటానికి కారణం విశ్వాసాలూ-ఆరాధనలా? లేక సత్కర్మలా?

32:19 – أَمَّا ٱلَّذِينَ ءَامَنُواْ وَعَمِلُواْ ٱلصَّٰلِحَٰتِ فَلَهُمْ جَنَّٰتُ ٱلْمَأْوَىٰ نُزُلًۢا بِمَا كَانُواْ يَعْمَلُونَ

"ఎవరు 1) విశ్వసించి, 2) సత్కార్యాలు కూడా చేశారో వారు చేసుకున్న 'సత్కర్మల'కు బదులుగా వారికి శాశ్వతమైన స్వర్గ నివాసం ఆతిథ్యంగా అభిస్తుంది" అని ఖురాన్ చెబుతుంది.

ఈ వాక్యంలో విషయం కాస్త విశేషంగా ఉంది. "ఎవరు 1) విశ్వసించి, 2) సత్కార్యాలు కూడా చేశారో..." అని చెప్పి, తిరిగి ఏమంటున్నాడో చూడని. "...వారు చేసుకున్న 'సత్కర్మల'కు బదులుగా వారికి శాశ్వతమైన స్వర్గ నివాసం ఆతిథ్యంగా అభిస్తుంది" అని అంటున్నాడు.

నిజానికి అక్కడ– "వారు కలిగి ఉన్న విశ్వాసానికి మరియు వారు చేసుకున్న సత్కర్మలకి బదులుగా వారికి శాశ్వతమైన స్వర్గ నివాసం ఆతిథ్యంగా అభిస్తుంది" అని రెండిటి ప్రస్తావన చేసి చెప్పవచ్చు కానీ అలా చెప్పలేదన్నది గమనార్హం. ఈ క్రింది వస్తున్న వాక్యాలు అత్యంత గమనార్హం. ఒక్కొక్కటిగా చూడండి.

6:127 – لَهُمْ دَارُ ٱلسَّلَٰمِ عِندَ رَبِّهِمْ ۖ وَهُوَ وَلِيُّهُم بِمَا كَانُواْ يَعْمَلُونَ

వారి కొరకు వారి ప్రభువు వద్ద శాంతి నిలయం ఉంది. వారి 'సత్కర్మల' మూలంగా అల్లాహ్ వారికి రక్షకునిగా నిలుస్తాడు.

32:17 – فَلَا تَعْلَمُ نَفْسٌ مَّآ أُخْفِىَ لَهُم مِّن قُرَّةِ أَعْيُنٍ جَزَآءًۢ بِمَا كَانُواْ يَعْمَلُونَ

వారు చేసిన 'సత్కర్మల'కు ప్రతిఫలంగా, వారి కళ్లకు చలువనిచ్చే ఎలాంటి సామగ్రిని మేము దాచి పెట్టామో (దాని గురించి) ఏ ప్రాణికీ తెలియదు.

46:14 – أُوْلَٰٓئِكَ أَصْحَٰبُ ٱلْجَنَّةِ خَٰلِدِينَ فِيهَا جَزَآءًۢ بِمَا كَانُواْ يَعْمَلُونَ

వారే స్వర్గవాసులు. వారందులో కలకాలం ఉంటారు. వారు చేసుకున్న 'సత్కర్మల'కు ప్రతిఫలం (ఇది).

56:24 – جَزَآءًۢ بِمَا كَانُواْ يَعْمَلُونَ

వారు చేసుకున్న 'సత్కర్మల'కు తగిన ప్రతిఫలం ఇది..

76:22 – إِنَّ هَٰذَا كَانَ لَكُمْ جَزَآءً وَكَانَ سَعْيُكُم مَّشْكُورًا

"ఇది మీ 'సత్కర్మల'కు బదులుగా ఇవ్వబడిన ప్రతిఫలం. మీ కృషి స్వీకరించబడిందని వారితో అనబడుతుంది".

ఈ ఐదు వాక్యాల్లో ఎక్కడా 'విశ్వాసాలూ-ఆరాధనాల' ప్రస్తావన చేయక కేవలం ఒక్క 'సత్కర్మల' కారణంగా స్వర్గం లభించిందని అల్లాహ్ స్వయంగా ప్రకటిస్తున్నాడు. దీనినిబట్టి ఇస్లాంలో 'సత్కర్మల' ప్రాధాన్యత ఎంతగా ఉందో గుర్తించవచ్చు.

విశ్వాసాలూ-ఆరాధనల విషయంలో
అల్లాహ్ అలాంటి ప్రకటనలు ఎందుకు చేయలేదు?

1. జీవన్మరణాల వ్యవస్థ లక్ష్యం సత్కర్మలు ఎవరు చేస్తారో పరీక్షించటం!
2. భూ మండలంపై చేసిన అలంకరణ లక్ష్యం సత్కర్మలు ఎవరు చేస్తారో పరీక్షించట!
3. ఈ భూమ్యాకాశాల నిర్మాణ లక్ష్యం సత్కర్మలు ఎవరు చేస్తారో పరీక్షించటం!

అనే ఈ మూడు ప్రకటనలు ఎంతో గంభీరమైనవి అసాధారణమైనవి. ఎందుకంటే-

1. జీవన్మరణాల వ్యవస్థ లక్ష్యం- మనుషుల్లో ఎవరు 'సత్కర్మలు' చేస్తారో పరీక్షించటం అన్నది ఒక విశేషమైన ప్రకటన.
2. దానికి మించి, భూ మండలంపై చేసిన జీవన మనుగడ లక్ష్యం- 'సత్కర్మలు' ఎవరు చేస్తారో పరీక్షించటం అన్నది మరింత విశేషమైన ప్రకటన.
3. పై రెండిటికీ మించి, ఈ విశ్వవ్యవస్థ నిర్మాణ లక్ష్యం- మనుషులలో ఎవరు 'సత్కర్మలు' చేస్తారో పరీక్షించటం అన్నది ఖురాన్ 'సత్కర్మల'కి ఇస్తున్న సర్వోన్నత స్థానానికి అంతిమ తార్కాణం అంటే అది ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు.

నిజంగా విశ్వాసాలూ-ఆరాధనల విషయంలో అలాంటి ప్రకటన చేయాలంటే అల్లాహ్ చేయగలడు కదా! అయినా ఎందుకు చేయలేదు? అన్నది ప్రశ్న. దీనికి సమాధానం ఒక్కటే అవి: Means తప్ప, Ends కాదు అన్నదే. పై ప్రకటనలు కేవలం ప్రకటనలు మాత్రమే కాదు, అవి ఒక వాస్తవికతను కలిగి ఉన్నాయి. దానికి ప్రబల గుర్తే ఈ క్రింది నాలుగు విషయాలు. వాటిలో...

1. చివరికి మిగిలి ఉండేవి సత్కర్మలు!
2. హదీస్ ప్రకారం- పరలోకంలో కొందరు విశ్వాసుల దివాళాకి కారణం సత్కర్మల రాహిహిత్యం!
3. నరక వాసులు నకరకానికి పోవటానికి మూలం సత్కర్మల రాహిత్యం!

4. అల్లాహ్ ప్రకారం– కొందరు స్వర్గం పొందటానికి కారణం సత్కర్మల ఆచరణ!

పైన పేర్కొన్న నాలుగు విషయాలూ సత్కర్మల ఔన్నత్యాన్నే చాటుతున్నాయి. దీని ప్రకారం ఆ మూడు ప్రకటనలు అత్యంత అర్థవంతమైనవని తెలుస్తుంది. ఇదే విషయాన్ని మరింత సుదృఢం చేసే విషయాలు రానున్నాయి కాస్తజాగ్రత్తగా గమనించగలరు

సారాంశం

ఈ అంశంలో చేసిన ఖురాన్–హదీస్ అధ్యయనం ప్రకారం:

1. భూమ్యాకాశాల సృష్టి లక్ష్యం మానవుల్లో ఎవరు 'విశ్వాసాలూ–ఆరాధనలు' చేస్తారో అనికాక, 'సత్కర్మలు' చేస్తారో పరీక్షించటం అని చెప్పటం,

2. భూమిపై మానవ మనుగడకి కారణమైన జీవావరణం (Biosphere) ఏర్పాటు లక్ష్యం మానవుల్లో ఎవరు 'సత్కర్మలు' చేస్తారో పరీక్షించటం,

3. ఈ జీవన్మరణాల వ్యవస్థ రూపకల్పన లక్ష్యం మానవులలో ఎవరు 'సత్కర్మలు' చేస్తారో పరీక్షించటం అని ఖురాన్ చెప్పటం, అలాగే

4. అల్లాహ్, ప్రవక్త ముహమ్మద్'ను అత్యున్నత స్థానంలో ఉన్నారని కొనియాడుతున్నది, 'విశ్వాసాలూ–ఆరాధన'ల్లోనా? 'నైతికత'లో అని చెప్పటం,

5. ప్రవక్తకి సామీప్యం పొందే ప్రియులు 'సత్కర్మలు' చేసేవారు. ప్రవక్తకి దూరమయ్యే అసహ్యులు 'దుష్కర్మల'కు పాల్పడేవారు అని చెప్పటం,

6. 'సౌశీల్యత' కోసం సమాజులో సైతం వేడుకోవాలని చెప్పటం,

7. 'విశ్వాసాలూ–ఆరాధనలు' అల్లాహ్ వద్ద చెల్లాలంటే వాటికి తప్పననిసరిగా 'సత్కర్మలు' తప్పనిసరి షరతు అని ఖురాన్–హదీసులు చెప్పటం,

8. ఒక విశ్వాసి ఈలోకంలో 'విశ్వాసాలూ–ఆరాధనలు' చేస్తాడు. సత్కర్మలు కూడా చేస్తాడు. అయితే చివరికి మిగిలి ఉండేవి 'సత్కర్మలు' అని చెప్పటం,

9. తీర్పుదినం రోజున 'విశ్వాసాలూ–ఆరాధనల' అపార పుణ్యఫలం ఉన్నప్పటికీ దివాళా కోరు కావటానికి కారణం 'సత్కర్మలు' లేకపోవటం అని చెప్పటం,

10. తీర్పుదినం రోజున అల్లాహ్, తన దాసులకు 'విశ్వాసాలూ–ఆరాధనల' గురించి కాక, 'సత్కర్మలు' గురించి ప్రశ్నిస్తాడని చెప్పటం,

11. నరక వాసులు, తాము నరకానికి బలి కావటానికి కారణం– 'విశ్వాసాలూ–ఆరాధనల' రాహిత్యం కాక, 'సత్కర్మలు' లేకపోవటం అని చెప్పటం,

12. 'స్వర్గ ప్రవేశానికిగల అర్హత'కి కారణం– 'విశ్వాసాలూ–ఆరాధనలు' అనికాక, 'సత్కర్మలు ఆచరించటం' అని అల్లాహ్ స్వయంగా ప్రకటించటం.

ఖురాన్–హదీస్ అధ్యయనంతో వెలుగులో వచ్చిన పన్నెండు సందర్భాలు ఇస్లాం 'సత్కర్మల' ప్రాధాన్యతను 'శిఖరాగ్ర స్థాయి' (Apex level)లో పెట్టిన వాస్తవాన్ని తెలియజేస్తున్నాయి. విశ్వవ్యవస్థ నిర్మాణం, మానవ సృష్టి మౌలిక లక్ష్యం– మానవుల్లో ఎవరు 'సత్కర్మలు' చేస్తారో పరీక్షించటం అని ప్రకటించటం ఒక సాధారణ విషయం ఏమీ కాదు. అది ధర్మంలో 'సత్కర్మల'కి ఉన్న పరాకాష్ట ప్రాధాన్యతకి, ఆవస్యకతకి, ఔన్నత్యానికి ఉన్న సర్వోన్నత స్థానం ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

విశ్వాసాలు లేకపోయినా సత్కర్మలు కూడా కొట్టివేయబడతాయి కదా!

ఖురానులో సత్కర్మలే సర్వస్వం అని అల్లాహ్ ప్రకటించిన అనేక ఆధారాలు చూచి ఉన్నారు. అందుకే 'విశ్వాసాలూ–ఆరాధనలు' Means అవుతాయని 'సత్కర్మలు' మాత్రమే Ends అవుతాయనే నిర్ధారణ అవుతుంది. అయితే Mean అయిన విశ్వాసం లేని కారణంగా Ends అయిన 'సత్కర్మలు' కొట్టివేయబడతాయని అల్లాహ్ ప్రకటిస్తున్న అనేక వాక్యాధారాలు ఉన్నాయి. దానికి కారణం ఏమిటి? అన్నది ఒక కీలకమైన ప్రశ్న. దీని సమాధానం ఈ క్రింది వాక్యాల తరువాత వస్తుంది. 'సత్కర్మలు' కొట్టివేయ బడతాయన్న వాక్యాలను ముందుగా చూడండి. ఖురాన్ 5:5వ వాక్యం చూడండి.

وَمَن يَكْفُرْ بِٱلْإِيمَٰنِ فَقَدْ حَبِطَ عَمَلُهُۥ وَهُوَ فِى ٱلْءَاخِرَةِ مِنَ ٱلْخَٰسِرِينَ

"విశ్వాసాన్ని తిరస్కరించిన వారి సత్కర్మలు వృథా అయి పోతాయి. పరలోకంలో వారు నష్టపోయిన వారిలో చేర్తారు" అని ఖురాన్ హెచ్చరిస్తుంది. 39:65వవాక్యం చూడండి.

وَلَقَدْ أُوحِىَ إِلَيْكَ وَإِلَى ٱلَّذِينَ مِن قَبْلِكَ لَئِنْ أَشْرَكْتَ لَيَحْبَطَنَّ عَمَلُكَ وَلَتَكُونَنَّ مِنَ ٱلْخَٰسِرِينَ

"నిశ్చయంగా నీ వద్దకు, నీ పూర్వీకులైన ప్రవక్తల వద్దకు పంపబడిన సందేశం (వహీ) ఇది: "ఒకవేళ నువ్వు గనక బహుదైవారాధనకు పాల్పడితే నువ్వు చేసుకున్నదంతా వృథా

అయిపోతుంది. మరి నిశ్చయంగా నువ్వు నష్టపోయినవారిలో చేర్తావు" అని ఖురాన్ హెచ్చరిస్తుంది. 7:147వ వాక్యం చూడండి.

وَٱلَّذِينَ كَذَّبُواْ بِـَٔايَٰتِنَا وَلِقَآءِ ٱلۡأٓخِرَةِ حَبِطَتۡ أَعۡمَٰلُهُمۡۚ هَلۡ يُجۡزَوۡنَ إِلَّا مَا كَانُواْ يَعۡمَلُونَ

"ఇంకా మా ప్రబోధనలను, అంతిమ దినాన కలుసుకునే విషయాన్ని అసత్యాలని తిరస్కరించిన వారి సత్కర్మలన్నీ వృథా అయిపోయాయి. వారికి వారు చేస్తూ ఉండిన దాని (శిక్షే) ఇవ్వబడుతుంది" అని ఖురాన్ హెచ్చరిస్తుంది. 2:217వ వాక్యం చూడండి.

وَمَن يَرۡتَدِدۡ مِنكُمۡ عَن دِينِهِۦ فَيَمُتۡ وَهُوَ كَافِرٞ فَأُوْلَٰٓئِكَ حَبِطَتۡ أَعۡمَٰلُهُمۡ فِي ٱلدُّنۡيَا وَٱلۡأٓخِرَةِۖ وَأُوْلَٰٓئِكَ أَصۡحَٰبُ ٱلنَّارِۖ هُمۡ فِيهَا خَٰلِدُونَ

"మరి మీలో గనక ఎవరయినా తమ ధర్మం నుంచి తిరిగిపోయి, అవిశ్వాస స్థితిలో మరణిస్తే వారి ఇహపర లోకాల్లోని కర్మలు సర్వనాశనమైపోతాయి. అలాంటి వారే నరకవాసులు. వారందులో కలకాలం పడి ఉంటారు" అని ఖురాన్ హెచ్చరిస్తుంది.

సత్కర్మలు కొట్టివేయబడటానికి పైన పేర్కొన్న నాలుగు వాక్యాల్లో... 1) విశ్వాసాన్ని తిరస్కరించటం, 2) బహుదైవారాధనకు పాల్పడటం, 3) ధర్మ ప్రబోధనలను అతిక్రమించటం, అంతిమ దినాన్ని తిరస్కరించటం, 4) ధర్మం నుంచి తిరిగిపోయి, అవిశ్వాస స్థితిలో మరణించటం అనే నాలుగు కారణాలు ఖురాన్ చెబుతుంది.

అలాంటివి ఏమీ లేకుండా తన మానాన తాను తనకు జన్మతః లభించిన సహజ నైతిక–మానవీయ విచక్షణా జ్ఞానం ప్రేరణ ఆధారంగా దుష్కర్మలను విడనాడి సత్కర్మలను ఆచరించే వారి సత్కర్మలు పరలోకంలో వృధా కాజాలవు. ఇంకా వారిలో ఉన్న మంచితనాన్ని బట్టి దైవం తనను గూర్చిన అదనపు సన్మార్గ భాగ్యం కూడా ప్రసాదించవచ్చు.

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

విశ్వమానవ సమానత్వం

ధర్మశాస్త్రాల సందేశం!



Part-5

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం!----------I

అంటరానితనం పాటించేవానికి శాశ్వత నరక శిక్షలు తప్పవు!--------1

హిందూ ధర్మశాస్త్రాల్లో విశ్వమానవ సమతా భావన!----------2

యూదా ధర్మశాస్త్రంలో విశ్వమానవ సమతా భావన!----------5

క్రైస్తవ ధర్మగ్రంథంలో విశ్వమానవ సమతా భావన!----------6

ముస్లిం ధర్మశాస్త్రాలైన
ఖురాన్–హదీసులో విశ్వమానవ సమతా భావన!----------7

అల్లాహ్ ముస్లిములకే శుభవార్తలు ఇస్తున్నాడా!?----------10

అల్లాహ్ ముస్లిములను తప్ప, ముస్లిమేతరులను ప్రేమించడా!?-------11

ఖురాన్'కి పూర్వపు సకల ధర్మశాస్త్రాల పరిస్థితి కూడా అంతే!--------12

సకల మనవుల్లో ఉన్న
'ఆత్మ' ఒక్కటే! వారి 'రక్తమాంసాలు' కూడా ఒక్కటే!!----------13

అందుకే సృష్టికర్త తనతోటి వారిని
తనతో సమానంగా చూడమంటున్నాడు!----------13

సారాంశం----------16

పరిచయం

ఈనాటి సమాజం భౌతిక విజ్ఞాన శాస్త్ర రంగంలో ఎంతగా ఆధునికం అవుతుందో ఈనాటి ప్రజలు మానసికంగా అంతగానే అజ్ఞానపూరిత భావావేశాలకి గురవుతున్నారు. నేటి ధార్మిక సమాజం మరింతగా దిగజారిపోతుంది. అందుకే నాస్తికత్వం పెరుగుతోంది. అంతర్జాతీయంగా జాత్యాహంకారం, జాతీయంగా కులతత్వం–అంటరానితనం తిరిగి వెర్రితలలు వేస్తుంది. ఈ నేపథ్యంలో సమాజ సంస్కరణ విషయానికి వస్తే, ధార్మికుల పాత్రకంటే నాస్తికులూ, హేతువాదుల పాత్ర గొప్పగా ఉందని చెప్పాలి.

అయితే ఈనాటి సంస్కర్తలు రెండు విషయాలు ఆలోచించాలి. వాటిలో ఒకటి సమాజంలో పరివర్తన వేగంగా రావాలి. రెండు అది పది కాలాల పాటు స్థిరంగా నిలబడాలి.

నేటి ఆధునిక సమాజంలో మనుషుల్లో పెనవేసుకొని ఉన్న అత్యంత హేయమైన భావాల్లో ఒకటి తోటి మనుషుల్లో "కొందరిని జన్మతః అధములు" అని భ్రమించటం. దీని వలన కోట్లాది మంది ప్రజలు ఎంతగానో ఆత్మక్షోభకి గురవుతున్నారు. ఒకరి ఆత్మ గౌరవాన్ని భంగపరచటం కంటే పెద్దనేరం మరొకటి ఉండదు.

కొందరు జాత్యాహంకారులు, కుల దురహంకారులు ఈ దుర్మార్గాన్ని ధర్మగ్రంథాల పేరిట పోషిస్తున్నారు. అందుకే ఈ అంటరానితనం అంతగా వేళ్లూనుకొని నేటికీ సజీవంగా ఉంది. విచిత్రం ఏమిటంటే ధర్మశాస్త్రాలు ఈ దుష్ట భావాన్ని కూకటి వేళ్ళతో పెకిలించి వేస్తున్నాయి!

ముల్లును మూల్లుతోనే తీయాలి అన్నట్లు– వారు ఏ ధర్మ గ్రంథాల ఆధారంగా ఆ నిమ్నోన్నతా భావాలను పెంచి పోషిస్తున్నారో అవే గ్రంథాల ఆధారాలతో వాటిని అంతం చేయాలి! సంస్కరణా రంగంలో ఈ ప్రక్రియ అత్యంత ప్రభావాత్మకంగానూ, అత్యంత వేగంగానూ వ్యక్తుల అంతరంగాన్ని సంస్కరిస్తుంది. ఇది మా 45 సంవత్సరాల క్షేత్రస్థాయి అనుభవం!

ఈ చిరు పుస్తకం జాత్యాహంకార–కులాహంకార ఖండనకు సంబంధించిన హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం ధర్మశాస్త్రాల అనేక ఆధారాలను ఇవ్వటం జరిగింది. ముఖ్యంగా ధార్మిక సంస్కర్తలతోపాటు, సంఘసంస్కర్తలైన మా నాస్తిక–హేతువాద మిత్రులు ఈ పుస్తకాన్ని కాస్త నిశితంగా అధ్యయనం చేయాలని సవినయంగా కోరుతున్నాను.

KAKINADA
12-02-2025

M. A. Abhilash
96664 88877

అంటరానితనం పాటించేవానికి శాశ్వత నరక శిక్షలు తప్పవు!

ఈనాటి ఆధునిక సమాజంలో మనుషుల్లో పెనవేసుకొని ఉన్న అత్యంత హేయమైన విషయాల్లో ఒకటి– తోటి మనుషుల్లో "కొందరిని జన్మతః అధికులూ–అధములు" అని భావించటం. మానసిక–శారీరక శక్తీ–సామర్థ్యాల పరంగా మానవుల్లో జన్మతః హెచ్చుతగ్గులు ఉంటాయి. అది ప్రకృతి సిద్ధం. అయినప్పటికీ వారు తమకు తగిన రంగాన్ని ఎంచుకొని అందులో గొప్పగా రాణించి, తమ సహజ దౌర్బల్యాన్ని అధిగమించి, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు.

ఈలోకం ఒక 'పయనం' మాత్రమే 'గమ్యం' కాదు. కాబట్టి ఇక్కడ ఉన్న సహజ హెచ్చుతగ్గులు ఒక 'పరీక్ష' తప్ప, 'శిక్ష'కాదు. కాబట్టి ఇక్కడి బలహీనత ఒక 'అపజయం' కాదు, అలాగే ఇక్కడి బలం ఒక 'విజయం' కాదు. ధర్మం పరంగా పరలోక జీవితంలో తాము చేసుకున్న నేరాలూ–ఘోరాలు పర్యవసానంగా 'శాశ్వత శిక్షల నరకాని'కి బలైపోవటమే 'అసలైన అపజయం'. అలాగే ఇక్కడ చేసుకున్న సత్కర్మల పరిణామంగా లభించబోయే 'శాశ్వత సుఖాల స్వర్గం' పొందటమే 'వాస్తవమైన విజయం'.

ఇక ఈ ఉచ్చ–నీచ భావాలు నిరక్షరాస్యులు, అజ్ఞానుల్లోనే కాక, గొప్ప ధార్మికులుగా చెప్పుకొనే వారిలోనూ ఈ నికృష్ట భావన ఉండటం అత్యంత శోచనీయం. ముఖ్యంగా హిందూ, యూదా వర్గాల మెజారిటీ ప్రజల్లో ఈ భావన ఎంతగానో వేళ్లూనుకొని ఉంది. ఒకని 'ఆత్మగౌరవము'ను భంగపరచటం అన్నది ఘోరనేరం. అలాంటి వారికి శాశ్వత నరక శిక్షలు కాకపోతే ఇంకేముంటాయి!? 'విశ్వమానవ సమానత్వం' గురించి హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం ధర్మశాస్త్రాలు ఏమంటున్నాయో కాస్త నిశితంగా చూడండి.

హిందూ ధర్మశాస్త్రాల్లో విశ్వమానవ సమతా భావన!

సర్వ మానవాళి ఒకే అమృతత్వానికి పుత్రులు!

శ్వేతాశ్వతరోపనిషత్తు 3:8—

శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రా ఆ యే దివ్యాని ధామాని తస్థుః।
వేదాహమేతం పురుషం మహాన్తమాదిత్యవర్ణం తమసః పరస్తాత్॥

అర్థం: "దివ్యధామాల్లో నివసించే ఓ విశ్వ మానవులారా! అమృతత్వానికి సంతానమైన ఓ మానవులారా! వినండి! అజ్ఞానమనే చీకటికి అవతల ఆదిత్యునిలా ప్రకాశించే ఆ పరమ పురుషుడిని (పరమాత్మను) నేను తెలుసుకున్నాను!" అని శ్వేతాశ్వతర మహర్షి చెబుతున్నాడు.

శ్వేతాశ్వతరోపనిషత్తు 2:5–

శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రా ఆ యే దివ్యాని ధామాని తస్థుః॥

అర్థం: "దివ్య లోకాలలో నివసించేవారైనా, ఈ భూమిపై ఉన్నవారైనా... ఓ సమస్త విశ్వ మానవులారా! మీరంతా అమృతత్వానికి సంతానం (అమృతస్య పుత్రాః). ఈ దివ్య వాణిని వినండి".

విశేషం: మనుషుల్లో కొందరిని గొప్పవారుగా, మరి కొందరిని నీచులుగా కాకుండా "విశ్వే అమృతస్య పుత్రాః" అంటే "విశ్వంలో ఉన్న సకల మానవులూ అమృతత్వానికి పుత్రులు" అని శ్వేతాశ్వతర మహర్షి సంబోధిస్తున్నాడు. ఎందుకంటే మనుషులందరి మూలం/తండ్రి ఒక్కడే అయినప్పుడు, మానవాళి అంతా సోదరులై ఒకే కుటుంబం అవుతుందనేది నిర్వివాదాంశం.

సర్వజనులకు వేదవాణి!

యజుర్వేదం 26:2—

యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః।
బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ స్వాయ చారణాయ చ॥

అర్థం: "ఏ విధంగానైతే నేను సమస్త మానవాళి శ్రేయస్సు కొరకు ఈ కళ్యాణకరమైన వేదవాణిని ప్రబోధిస్తున్నానో... ఇది బ్రాహ్మణులకు, క్షత్రియులకు, శూద్రులకు, వైశ్యులకు,

మన వారికి మరియు అపరిచితులైన సమస్త జనులకు (విదేశీయులకు/సమస్త మానవాళికి) సమానంగా వర్తిస్తుంది" అని పరమేశ్వరుడు స్వయంగా ప్రకటిస్తున్నాడు.

విశేషం: భగవంతుని సందేశం సర్వ మానవులకు సమానంగా చెందుతుందని చెప్పడానికి ఇది అతిపెద్ద వేద ఆధారం. వేదజ్ఞానం మరియు భగవంతుని సందేశం కేవలం కొందరికే పరిమితం కాదని, సమస్త మానవాళికి సమానంగా ఇవ్వబడిందని యజుర్వేదం స్పష్టంగా ప్రకటిస్తోంది! మానవాళి సమానత్వానికి ఇదొక ప్రబల నిదర్శనం.

సమస్త ప్రాణుల పట్ల సమభావం

భగవద్గీత 9:29—

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః।
యే భజంతి తు మాం భక్త్యా మయ్యి తే తేషు చాహమ్॥

అర్థం: "నేను సమస్త ప్రాణుల పట్ల (మానవులందరి పట్ల) సమానమైన భావంతో ఉంటాను. నాకు ద్వేష్యుడు కానీ, ప్రత్యేకమైన ప్రియుడు కానీ లేడు" అని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో తాను ఏ ఒక్క వర్గానికో సొత్తు కానని, మానవాళి అందరి పట్ల సమభావంతో ఉంటానని ప్రకటించాడు:

సర్వ జీవులకు పరమేశ్వరుడే తండ్రి!

భగవద్గీత 14:4—

సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః।
తాసాం బ్రహ్మ మహద్యోనిరహం బీజప్రదః పితా॥

అర్థం: "ఓ అర్జునా! వివిధ యోనులలో జన్మించే సమస్త రూపాలకు (మానవాళికి) ప్రకృతి తల్లి వంటిదైతే, వారిని ఉత్పన్నం చేసే బీజప్రదాతయైన తండ్రిని నేనే!"

పరమేశ్వరుడు కేవలం ఒక మతానికి చెందిన దేవుడిగా కాక, విశ్వంలోని సమస్త మానవులకు/జీవులకు మూల పితృదేవుడనని తెలియజేస్తున్నాడు.

సమస్త విశ్వంలో దైవత్వం

ఈశావాస్య ఉపనిషత్తు మంత్రం 1—

ఈశావాస్యమిదం సర్వం యత్కిఞ్చ జగత్యాం జగత్।
తేన త్యక్తేన భుఞ్జీథా మా గృధః కస్యస్విద్ధనమ్॥

అర్థం: "ఈ చరాచర జగత్తులో ఉన్న సమస్తమూ ఈశ్వరునిచే వ్యాపించబడి ఉంది. కావున స్వార్థాన్ని త్యజించి దేవుడు ఇచ్చిన దానిని అనుభవించు; ఇతరుల ధనాన్ని ఆశించకు".

తన–పర భేదాలు కలిగినవాడు అజ్ఞాని అవుతాడు!

మహా ఉపనిషత్తు 6:71,72–

'వసుధైవ కుటుంబకమ్' అనే పదం ప్రత్యక్షంగా, అత్యంత ప్రసిద్ధంగా కనిపించే ప్రధాన ఆధారం మహా ఉపనిషత్తు.

అయం నిజః పరో వేతి గణనా లఘుచేతసామ్।
ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్॥

అర్థం: "ఈ వ్యక్తి నా వాడు, ఆ వ్యక్తి పరాయి వాడు అనే ఆలోచన అల్పబుద్ధి కలిగిన వారికి మాత్రమే ఉంటుంది. ఉదార స్వభావం, విశాల హృదయం ఉన్నవారికి మాత్రం ఈ సమస్త భూమండలమే ఒకే కుటుంబం".

విశ్వమానవ సహోదార భావం కలిగినవాడు జ్ఞాని అవుతాడు!

యజుర్వేదం 32:8–

వేదాహమేతం పురుషం మహాన్తమాదిత్యవర్ణం తమసః పరస్తాత్।
యత్ర విశ్వం భవత్యేకనీడమ్॥

అర్థం: "జ్ఞాని అయినవాడు ఆ పరమాత్మను తెలుసుకుంటాడు. ఆ పరమాత్మ సన్నిధిలో/ఈ సత్యంలో సమస్త విశ్వం ఒకే పక్షిగూడు (ఏక నీడమ్) లాగా కలిసిపోతుంది" అని గుర్తిస్తాడు.

విశేషం: రకరకాల పక్షులు వేర్వేరు దిక్కుల నుండి వచ్చి ఒకే చెట్టు గూటిలో ఎలా నివసిస్తాయో, అలాగే భిన్న సంస్కృతులు, భాషలు కలిగిన మానవులంతా ఈ భూమి అనే ఒకే నీడలో నివసించే ఒకే కుటుంబం అని యజుర్వేదం ప్రబోధిస్తోంది.

మతాలూ–సంస్కృతులు వేరైనా మానవులంతా ఒకే కుటుంబం!

అథర్వవేదం 12:1:45— పృథ్వీ సూక్తం

వివిధ భాషలు మాట్లాడే, రకరకాల ఆచారాలు కలిగిన ప్రజలను భూమాత ఒకే కుటుంబంలా ఎలా పోషిస్తుందో అథర్వవేదం వివరిస్తుంది. చూడండి.

జనం బిభ్రతీ బహుధా వివాచసం నానాధర్మాణం పృథివీ యథౌకసమ్।
సహస్రం ధారా ద్రవిణస్య మే దుహామ్ ధ్రువేవ ధేనురపస్ఫురంతీ॥

అర్థం: "వివిధ భాషలు మాట్లాడేవారిని (వివాచసమ్), రకరకాల మతాలను/నమ్మకాలను అనుసరించే వారిని (నానాధర్మాణం) ఈ భూదేవి తన ఒకే ఇంట్లో నివసించే కుటుంబ సభ్యుల్లా (యథౌకసమ్) ఆదరిస్తోంది. నిరంతరం పాలనిచ్చే ఆవులా మనందరికీ సమృద్ధిని ప్రసాదిస్తోంది" అని వేదం చెబుతోంది.

ద్వేషం, అసహ్యం ఎవనిలో ఉండవు?

ఈశావాస్య ఉపనిషత్తు (మంత్రం 6)

అద్వైత దృష్టితో సమస్త జీవులలో దైవాన్ని, దైవంలో సమస్త జీవులను చూడటమే నిజమైన విశ్వ కుటుంబ భావన అని ఈ మంత్రం చెబుతుంది.

యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవానుపశ్యతి।
సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే॥

అర్థం: "ఎవరైతే సమస్త జీవులను తన ఆత్మలోనే చూస్తాడో, తన ఆత్మను సమస్త జీవులలో దర్శిస్తాడో... అతడికి ఎవరిపైనా ద్వేషం గానీ, అసహ్యం గానీ ఉండవు". భగవద్గీత 5:18 వ శ్లోకం ఏమంటుందో చూడండి.

సారాంశం

సనాతన ధర్మానికి చెందిన మూల గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు మరియు భగవద్గీతలో భగవంతుడు మానవాళిని విభజించి మాట్లాడలేదు. మనుషులందరినీ "విశ్వే అమృత పుత్రులు"గా, తన సంతానంగా సంబోధిస్తూ, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని మరియు నైతిక ధర్మాన్ని ప్రబోధించాడు. అలాగే సనాతన వైదిక సాహిత్యం మానవాళిని సరిహద్దులతో విడదీయలేదు. భూమిని ఒక ఇల్లుగా, మానవులందరినీ ఆ ఇంట్లోని సభ్యులుగా (వసుధైవ కుటుంబకమ్) పరిగణించడం వేదాలు మరియు ఉపనిషత్తులు ప్రపంచానికి అందించిన అత్యున్నత మానవీయ ప్రపంచీకరణ సందేశం.

యూదా ధర్మశాస్త్రంలో విశ్వమానవ సమతా భావన!

సకల మానవాళిని సంబోధిస్తున్న యెహోవా!

యెషయా 45:22– "భూదిగంతముల నివాసులారా, నా వైపు చూచి రక్షణ పొందుడి; దేవుడను నేనే, మరి ఏ దేవుడును లేడు".

దేవుని మందిరం సర్వజనులకు ప్రార్థనా మందిరం!

యెషయా 56:7– "నా ప్రార్థనా మందిరము సమస్త జనులకు ప్రార్థనా మందిర మనబడును" అని పాతనిబంధన ప్రకటిస్తుంది.

దీని ప్రకారం– ఆరాధన అనేది ఏ ఒక్క జాతికి పరిమితం కాదని సుస్పష్టమౌతోంది.

సమస్త మానవుల దేవుడు

యిర్మీయా 32:27– "ఇదిగో నేను యెహోవాను, సర్వ శరీరులకును (సమస్త మానవాళికి) దేవుడను; నాకొకటి అసాధ్యమైనది యుండునా?"

బైబిలులోని పాత నిబంధన (Old Testament)లోనూ దేవుడు సమస్త మానవాళిని తన సృష్టిగా, తన పిల్లలుగా భావించి సంబోధించాడు. జాతి, ప్రాంత లేదా కుల సరిహద్దులకు అతీతంగా సమస్త జనులకు రక్షణ, నీతి మరియు ప్రేమ అందుబాటులో ఉన్నాయనేదే బైబిలు గ్రంథ మౌలిక సందేశం.

క్రైస్తవ ధర్మగ్రంథంలో విశ్వమానవ సమతా భావన!

దేవుడు లోకమును ప్రేమించేను!

యోహాను 3:16– "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను; కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను".

విశేషం: ఇక్కడ "లోకమును" (ప్రపంచాన్ని/సమస్త మానవాళిని) అని స్పష్టంగా చెప్పబడింది.

కులమతాలకి అతీతంగా యెహోవా అందరినీ అంగీకరిస్తాడు!

యేసు ప్రధాన శిష్యుడైన పేతురు దేవుని దృష్టిలో మనుషులందరూ సమానులేనని గ్రహించినప్పుడు–

అపొస్తలుల కార్యములు 10:34,35– "అప్పుడు పేతురు నోరు విప్పి—దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువానిని ఆయన అంగీకరించును".

దేవుని దృష్టిలో జాతి, వర్గ, లింగ భేదాలు లేవు! మానవాళి అంతా ఒక్కటే!

గలతీయులకు 3:28– "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; మీరందరును క్రీస్తు యేసునందు ఒక్కటై యున్నారు" అని బైబిలు ప్రకటిస్తుంది.

సకల మానవాళి మూలం ఒక్కటే!

సమస్త ప్రపంచ జనాభా అంతా ఒకే మూలం నుండి వచ్చిందని పౌలు ఎథెన్స్ నగరంలో ప్రసంగిస్తూ చెప్పిన మాట:

అపొస్తలుల కార్యములు 17:26– "మరియు యావద్భూమి మీద కాపురం ఉండుటకు ఆయన ఒకని నుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించెను".

సారాంశం

బైబిల్‌లోని క్రొత్త నిబంధన (New Testament) గ్రంథాలలో కూడా దేవుడు కేవలం ఒకే తెగకో, జాతికో పరిమితం కాకుండా సమస్త మానవాళిని ఉద్దేశించి చేసిన సార్వజనీన ప్రబోధనలు, మరియు మానవులందరూ దేవుని దృష్టిలో సమానులేనని తెలిపే స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి.

ముస్లిం ధర్మశాస్త్రాలైన ఖురాన్-హదీసులలో విశ్వమానవ సమతా భావన!

స్త్రీ–పురుషుల మధ్య, వర్గాల మధ్య హెచ్చుతగ్గులు లేవు! ఎందుకు?

4:1– "మానవులారా! 1) మీ ప్రభువుకు భయ–భక్తులు కలిగి ఉండండి. 2) ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. 3) అదే ప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. 4) తిరిగి ఆ ఇరువురి నుండి కోటానుకోట్ల మంది స్త్రీ–పురుషుల్ని ప్రపంచంలో విస్తరింపజేశాడు. మీరు ఒకరి ద్వారా మరొకరు తమ అవసరాలు గడుపుకోవడానికి దేవుని పేరును ఒక సాధనంగా చేసుకుంటారు. అలాంటి దేవుని పట్ల భయ–భక్తులు కలిగి ఉండండి భయపడండి. రక్త సంబంధీకులతో మీకు ఏర్పడివున్న సహజ బాంధవ్యాన్ని తెంచకండి. దేవుడు మీ చర్యల్ని ఓ కంట గమనిస్తున్నాడన్న సంగతి మరచిపోకండి" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

కుల–మతాలకి అతీతంగా మానవుల్లో సద్వర్తనులే దైవానికి ఇష్టులు!

49:13– "ఓ మానవులారా! (యా అయ్యుహన్–నాస్) మేము మిమ్మల్ని ఒక పురుషుడు, ఒక స్త్రీ (ఆదమ్, హవ్వాల ఒకే జంట) నుండి సృష్టించాము. మీరు ఒకరినొకరు

పరిచయం చేసుకోవడానికి మిమ్మల్ని జాతులుగా, తెగలుగా చేశాము. నిశ్చయంగా అల్లాహ్ దృష్టిలో మీలో అత్యంత గౌరవనీయుడు మీలో ఉన్న భయ-భక్తులు ఉన్నవాడే".

ఈ వాక్యంలో గమనార్హ విషయాల్లో 1) మానవులంతా ఒకే జంట సంతానమని తెలుస్తుంది. 2) జాతులు మరియు కులాలు కేవలం పరస్పర గుర్తింపు కోసమేనని తెలుస్తుంది. 3) దేవుని దృష్టిలో గొప్పవాడు కావటానికి సద్వర్తన కలిగి ఉండాలని తెలుస్తుంది.

ప్రవక్త ముహమ్మద్
ఒక్క ముస్లిముల పట్లే కాక, యావత్ మానవాళి పట్ల కారుణ్యం!

21:107- "మేము నిన్ను సమస్త లోకాలకు/మానవాళికి కరుణగా (రహ్మతుల్లిల్ ఆలమీన్)గా చేసి పంపాము" అని అల్లాహ్ ఖురాన్లో ప్రకటిస్తున్నాడు.

దీని ప్రకారం- మహ్మద్ ప్రవక్త కేవలం ముస్లింలకే కాక సర్వ ప్రపంచానికి కారుణ్యంగా పంపబడ్డారని తెలుస్తుంది.

సృష్టికర్త సమస్త మానవుల పోషకుడు, యజమాని, ఆరాధ్యుడు!

114:1-3- "ఓ ప్రవక్తా! నేను మానవుల రక్షకుడను (రబ్బిన్-నాస్), మానవుల పాలకూడను (మలికిన్-నాస్), మానవుల ఆరాధ్యుని (ఇలాహిన్-నాస్) శరణు వేడుకుంటున్నాను" అని ప్రకటించు.

ఖురాన్లోని చివరి అధ్యాయంలో అల్లాహ్ తనను కేవలం ముస్లింల దేవుడిగా కాక సమస్త మానవాళి సృష్టికర్తగా ప్రకటించుకున్నాడు.

ఆదిలో మానవాళి అంతా ధార్మికంగా ఒకే సంఘం!

2:213- "మానవులంతా మొదట ఒకే సమాజంగా ఉండేవారు..." అని ఖురాన్ ప్రకటిస్తుంది.

మానవాళి మొదటి జంట, వారికి కలిగిన సంతానం, వారి సంతానం ఒకే ధార్మిక వర్గంగా ఉండేవారు. కాలానుగుణంగా అభిప్రాయ భేదాలు తలెత్తి వివిధ వర్గాలుగా విడిపోయారు. భిన్నాభిప్రాయం అన్నది సహజం. భార్యా-భర్తల మధ్య, అన్నా-దమ్ముల మధ్య సైతం భిన్నాభిప్రాయం అనివార్యం. కాబట్టి వారు కలసి ఉంటున్నారంటే కారణం-

వారి మధ్య సహనం–సర్దుబాటు వైఖరి ఉండటమే. అలాగే కుల–మత వర్గాల మధ్య కూడా ఉండాలి. అప్పుడే సమాజ గమనం సాఫీగా సాగగలదు.

1. 'إِنَّ ٱللَّهَ بِٱلنَّاسِ لَرَءُوفٌ رَّحِيمٌ' నిశ్చయంగా అల్లాహ్ మానవుల యెడల అమితమైన వాత్సల్యం కలవాడు! పరమ కృపాశీలుడు (2:143),

2. 'وَلَٰكِنَّ ٱللَّهَ ذُو فَضْلٍ عَلَى ٱلْعَٰلَمِينَ' అల్లాహ్ లోకవాసులపై ఎంతో దయానుగ్రహం కలవాడు (2:251),

3. 'إِنَّ ٱللَّهَ لَا يَظْلِمُ ٱلنَّاسَ شَيْـًٔا' అల్లాహ్ అయితే మానవాళికి ఏ కాస్త అన్యాయం కూడా చేయడు. (10:44),

4. 'إِنَّ ٱللَّهَ لَذُو فَضْلٍ عَلَى ٱلنَّاسِ' నిశ్చయంగా అల్లాహ్ ప్రజల పట్ల దయా దాక్షిణ్యాలు గలవాడు (40:61).

5. 'وَلَقَدْ كَرَّمْنَا بَنِىٓ ءَادَمَ' మేము ఆదం సంతతికి గౌరవం పొసగాము (17:70)"

అందుకే ఖురాన్ 4:58వ ప్రబోధనలో ముస్లిములకు ఇస్తున్న ఆదేశం ఏమిటో చూడండి. 'وَإِذَا حَكَمْتُم بَيْنَ النَّاسِ أَن تَحْكُمُوا بِالْعَدْلِ' అంటే "మీరు మానవుల మధ్య తీర్పు ఇచ్చేటప్పుడు అత్యంత న్యాయంగా తీర్పు ఇవ్వాలని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు!" అని ఖురాన్ ముస్లిములకు తాకీదు చేస్తుంది.

ఖురానులో ఎక్కడా లేని ప్రకటనలు!

1. నిశ్చయంగా అల్లాహ్ ముస్లిముల యెడల అమితమైన వాత్సల్యం కలవాడు,

2. అల్లాహ్ ముస్లిములపై ఎంతో దయానుగ్రహం కలవాడు,

3. అల్లాహ్ అయితే ముస్లిములకి ఏ కాస్త అన్యాయం కూడా చేయడు,

4. నిశ్చయంగా అల్లాహ్ ముస్లిముల పట్ల దయా దాక్షిణ్యాలు గలవాడు.

5. మేము ముస్లిం సంతతికి గౌరవం పొసగాము

వంటి సంకుచిత మతతత్వ ప్రకటనలు ఖురాను గ్రంథంలో ఏకోశానా లేనేలేవు. దీని ప్రకారం ఖురాన్ విశ్వమానవాళికి చెందిన సార్వత్రిక గ్రంథమేగానీ, అది కేవలం ఒక ప్రత్యేక మతవర్గానికి మాత్రమే చెందిన గ్రంథం కాదని తెలుస్తుంది.

హదీసు ప్రకారం విశ్వమానవ సమాననత్వం!

ముస్నద్ అహ్మద్ 22978– "ఓ ప్రజలారా! మీ అందరి ప్రభువు ఒక్కడే! మీ అందరి తండ్రి (ఆదమ్) ఒక్కడే! జ్ఞాపకం ఉంచుకోండి, ఏ అరబ్బు జాతీయునికి అరబ్బేత జాతీతునిపై గానీ, ఏ అరబ్బేతర జాతీయునికి అరబ్బు జాతీయునిపై ఎలాంటి ప్రాధాన్యత లేదు. అలాగే నల్లవానిపై తెల్లవానికి గానీ, తెల్లవానిపై నల్లవానికి గానీ ఎలాంటి ఆధిక్యత లేదు. ఆధిక్యతకు కొలమానం కేవలం "తఖ్వా" అంటే 'నైతికత–మానవత విలువలు' మాత్రమే" అని ప్రవక్త ముహమ్మద్ ప్రకటిస్తున్నారు. ఇది ప్రవక్త ముహమ్మద్ తన జీవిత చరమాంకంలో సమస్త మానవాళిని ఉద్దేశించి చేసిన విశ్వజనీన చారిత్రాత్మక ప్రసంగం.

యావత్ సృష్టి అల్లాహ్ కుటుంబం!

సకల సృష్టి దేవుని కుటుంబమే అని ముస్నద్ అబీ యఅలా హదీస్ 3315వ హదీసులో సెలవిస్తున్న వైనాన్ని చూడండి.

عَنْ أَنَسٍ قَالَ: قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ: الْخَلْقُ عِيَالُ اللَّهِ، فَأَحَبُّ الْخَلْقِ إِلَى اللَّهِ أَنْفَعُهُمْ لِعِيَالِهِ

ప్రవక్త ముహమ్మద్– "సమస్త సృష్టి అల్లాహ్ కుటుంబమే, కాబట్టి తన కుటుంబానికి అత్యంత మేలు చేసేవాడే అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవాడు" అని ప్రకటించారు.

సకల మానవాళి ప్రాణం విలువ సమానం!

5:32– "...ఎవరైనా ఒక నిరపరాధిని చంపితే, అతడు సమస్త మానవాళిని చంపినట్లే! అలాగే ఎవడైనా ఒక ప్రాణాన్ని కాపాడితే, అతడు సమస్త మానవాళిని కాపాడినట్లే!".

అల్లాహ్ ముస్లిములకే శుభవార్తలు ఇస్తున్నాడా!?

"అల్లాహ్ ఎవరితో ఉన్నాడు? అల్లాహ్ ఎవరిని ప్రేమిస్తున్నాడు?" అన్న ప్రశ్నలు ముస్లిములకు వేస్తే వారు ఠక్కున ఇచ్చేసమాధానం– "మా ముస్లిములనే!" అని వస్తుంది. అయితే అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి.

1. 'أَنَّ ٱللَّهَ مَعَ ٱلْمُتَّقِينَ'/'అల్లాహ్ నిష్ఠ గలవారికి తోడుగా ఉన్నాడు' (2:194),

2. 'إِنَّ ٱللَّهَ مَعَ ٱلصَّٰبِرِينَ'/'స్థైర్యం కనబరచే వారికి అల్లాహ్ తోడుగా ఉంటాడు' (8:46),

పై రెండు వాక్యాల్లో– "అల్లాహ్ •నిష్ఠ గలవారికి • స్థైర్యం కనబరచే వారికి తోడుగా ఉంటాడు!" అని ఉంది. ఇక "అల్లాహ్ ఎవరిని ప్రేమిస్తాడు?" అన్న ప్రశ్నకు ఖురాన్ ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి.

3. 'إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُقْسِطِينَ'/'అల్లాహ్ న్యాయశీలురను ప్రేమిస్తాడు'(5:42),

4. 'إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُحْسِنِينَ'/'అల్లాహ్ ఉత్తమంగా వ్యవహరించేవారిని ప్రేమిస్తాడు' (2:195)

పై రెండు వాక్యాల్లో– "•న్యాయశీలురను, •ఉత్తమంగా వ్యవహరించే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు!" అని ఉంది. పూర్తి ఖురానులో ఎక్కడా "ముస్లిములను అల్లాహ్ ప్రేమిస్తాడు!" అనిలేదు!

•'అల్లాహ్ తోడు'గాని, •'అల్లాహ్ ప్రేమ'గాని ఆయా మతవర్గాలను బట్టి కాక, ఆయా వ్యక్తులు వ్యక్తిగతంగా కలిగి ఉన్న •నిష్ఠ, •స్థైర్యం, •న్యాయాశీలత, •ఉత్తమ వ్యవహారం వంటి సద్గుణాలను బట్టి మాత్రమే లాభిస్తుందని ఖురాన్ తెలియజేస్తుంది.

గమనిక: పూర్తి ఖురానులో ఎక్కడా "అల్లాహ్ ముస్లిములకు తోడుగా ఉంటాడు!" అనిగానీ లేదా "అల్లాహ్ ముస్లిములను ప్రేమిస్తాడు!" అనిగానీ చేసిన ప్రత్యేక ప్రకటన కనీసం ఒక్కసారైనా లేదన్నది అత్యంత గమనార్హం!

అల్లాహ్ కొందరిని
ప్రేమించకపోవటానికి కారణం వారి మతమా? వారి దుష్కర్మలా?

ఖురాన్ ప్రకారం– అల్లాహ్ ఆయా ప్రజలను వారివారి మతవర్గాలను బట్టి ప్రేమించడా? లేక ఆయా వ్యక్తుల వ్యక్తిగత దుర్లక్షణాలను బట్టి ప్రేమించడా? అన్న ప్రశ్నలకు ఖురాన్ ఇస్తున్న సమాధానం ఏమిటో కాస్త జాగ్రత్తగా చూడండి.

1. 'إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْمُعْتَدِينَ'/'మితిమీరి పోయేవారిని అల్లాహ్ ప్రేమించడు' (2:190),

2. 'وَٱللَّهُ لَا يُحِبُّ ٱلْفَسَادَ'/'అల్లాహ్ అవినీతిని సుతరామూ ప్రేమించడు' (2:205),

3. وَٱللَّهُ لَا يُحِبُّ كُلَّ كَفَّارٍ أَثِيمٍ/మేలును మరిచే పాపిష్టులను అల్లాహ్ ప్రేమించడు (2:276),

4. فَإِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْكَٰفِرِينَ/సత్య తిరస్కారులను అల్లాహ్ ప్రేమించడు (3:32).

5. وَٱللَّهُ لَا يُحِبُّ ٱلظَّٰلِمِينَ/అల్లాహ్ దౌర్జన్యపరులను ప్రేమించడు (3:57).

6. إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ مَن كَانَ خَوَّانًا أَثِيمًا/దగాకోరును, పాపిష్టిని అల్లాహ్ ప్రేమించడు (4:107).

7. 'وَٱللَّهُ لَا يُحِبُّ ٱلْمُفْسِدِينَ'/'అల్లాహ్ కల్లోల జనకులను ప్రేమించడు' (5:64),

8. 'إِنَّهُۥ لَا يُحِبُّ ٱلْمُسْرِفِينَ'/'అతికి పాల్పడే వారిని అల్లాహ్ ప్రేమించడు' (6:141),

9. 'إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْخَآئِنِينَ'/'ద్రోహులను అల్లాహ్ ఎంత మాత్రం ప్రేమించడు' (8:58),

10. 'إِنَّهُۥ لَا يُحِبُّ ٱلْمُسْتَكْبِرِينَ'/'గర్విష్టులను ఆయన ఏ మాత్రం ప్రేమించడు' (16:23),

11. 'إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْفَرِحِينَ'/'మిడిసిపడే వారిని అల్లాహ్ ప్రేమించడు' (28:76)

12. إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ كُلَّ مُخْتَالٍ فَخُورٍ/బడాయి కోరులను అల్లాహ్ ప్రేమించడు (31:18)

అని ఖురాన్ ప్రకటిస్తుంది. "ముస్లిములు కాని వారైనా హిందువులను, యూదులను, క్రైస్తవులను తదితర సకల ముస్లిమేతరులను అల్లాహ్ ప్రేమించడు!" అన్నది మెజారిటీ ముస్లిముల సాధారణ అపోహ!

వాస్తవానికి •మితిమీరే వారు, •అవినీతి పరులు, •కల్లోల జనకులు, •అతికి పాల్పడే వారు, •ద్రోహులు, •గర్విష్టులు, •మిడిసిపడేవారు వగైరా అనే ఆయా 'దుష్కర్మల'కి పాల్పడేవారిని పేర్కొని, "అలాంటి వారిని అల్లాహ్ ప్రేమించడు!" అని మాత్రమే ఖురానులో ఉంది. కానీ...

1. "హిందువులతో అల్లాహ్ ఉండడు, ఆయన వారిని ప్రేమించడు!",

2. "యూదులతో అల్లాహ్ ఉండడు, ఆయన వారిని ప్రేమించడు!",

3. "క్రైస్తవులతో అల్లాహ్ ఉండడు, ఆయన వారిని ప్రేమించడు!",

4. "లేదా తదితర మతవర్గాల పేరును ప్రస్తావించి; అల్లాహ్ వారితో ఉండడు, ఆయన వారిని ప్రేమించడు!" అన్న ప్రకటనలు ఖురాను గ్రంథంలో ఏకోశానా లేవు. వేరే ఏ ధర్మ గ్రంథంలోనూ లేవు!

అల్లాహ్ కొందరిని ప్రేమించటానికి కారణం వారి మతమా? వారి మతాలా? సత్కర్మలా?

1. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلتَّوَّٰبِينَ وَيُحِبُّ ٱلْمُتَطَهِّرِينَ/అల్లాహ్ పశ్చాత్తాపడి, పారిశుద్ధ్యాన్ని పాటించే వారినే ప్రేమిస్తాడు (2:222),

2. فَإِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُتَّقِينَ/అల్లాహ్ భయ-భక్తులు గలవారినే ప్రేమిస్తాడు (3:76),

3. وَٱللَّهُ يُحِبُّ ٱلصَّٰبِرِينَ/అల్లాహ్ సహనమూర్తులనే ప్రేమిస్తాడు (3:146),

4. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُتَوَكِّلِينَ/అల్లాహ్ తనను నమ్ముకున్న వారినే ప్రేమిస్తాడు (3:159),

5. وَٱللَّهُ يُحِبُّ ٱلْمُحْسِنِينَ/సదాచార సంపన్నులనే అల్లాహ్ ప్రేమిస్తాడు (5:93),

6. وَٱللَّهُ يُحِبُّ ٱلْمُطَّهِّرِينَ/ పవిత్రతను పాటించే వారినే అల్లాహ్ ప్రేమిస్తాడు (9:108),

7. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُقْسِطِينَ/అల్లాహ్ న్యాయం చేసే వారినే ప్రేమిస్తాడు (49:9),

8. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلَّذِينَ يُقَٰتِلُونَ فِى سَبِيلِهِۦ صَفًّا كَأَنَّهُم بُنْيَٰنٌ مَّرْصُوصٌ/అల్లాహ్ ప్రేమించేది సీసం పోసి నిర్మింపబడిన గోడలాగా ఐక్యమత్యంతో స్థిరంగా అతని మార్గంలో పరిశ్రమించే వారినే సుమా! (61:4)

వాస్తవానికి •పశ్చాత్తాపం, పారిశుద్ధత, •భయ-భక్తులు, •సదాచార సంపన్నత, •పవిత్రత, •న్యాయం, •ఐక్యమత్యంతో పరిశ్రమించటం వగైరా అనే ఆయా 'సత్కర్మలు' ఆచరించే వారిని పేర్కొని, "అలాంటి వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు!" అని మాత్రమే ఖురానులో ఉంది.

ఖురాన్'కి పూర్వపు సకల ధర్మశాస్త్రాల పరిస్థితి కూడా అంతే!

హిందూ, యూదా, క్రైస్తవ ధర్మ శాస్త్రాల్లోనూ వ్యక్తిగతంగా దుష్కర్మలకి పాల్పడుతున్న ఆయా వ్యక్తులను హెచ్చరించటం జరిగింది తప్ప...

1. యూదా, క్రైస్తవ, ముస్లిం తదితర వర్గాల పేరు తీసుకొని- "వారిని సర్వేశ్వరుడు ప్రేమించడు!" అన్న ప్రకటన ఏ ఒక్క హిందూ శాస్త్రంలోనూ లేదు.

2. హిందూ, క్రైస్తవ, ముస్లిం తదితర వర్గాల పేరు తీసుకొని- "వారిని యెహోవా ప్రేమించడు!" అన్న ప్రకటన యూద ధర్మశాస్త్రమైన తోరాలో లేదు.

3. హిందూ, యూద, ముస్లిం తదితర వర్గాల పేరు తీసుకొని– "వారిని పరలోకమందున్న తండ్రి ప్రేమించడు!" అన్న ప్రకటన క్రొత్త నిబంధనలో లేదు.

4. హిందూ, యూద, క్రైస్తవ తదితర వర్గాల పేరు తీసుకొని– "వారిని అల్లాహ్ ప్రేమించడు!" అన్న ప్రకటన ఖురానులో లేదన్న విషయాన్ని మీరు చూసి ఉన్నారు.

గమనిక: దీని ప్రకారం ఆయా మతస్తుల ధర్మశాస్త్రాలు– "మా మత వర్గంలో ఉన్న వారికే దేవుని అనుగ్రహం లభిస్తుంది!" అని ప్రకటించే అవకాశం ఎవరికీ ఇవ్వటం లేదు. ఇంకా అవి: ఏ మతవర్గంలో ఉన్నవారైనా ఎవరు నైతికతా, మానవత, ఐక్యత వంటి సుగుణాలు కలిగి సజ్జనులుగా మసలుకుంటారో వారికే దేవుని అనుగ్రహం లభిస్తుందని సంపూర్ణ హామీ ఇస్తున్నాయన్నది అత్యంత గమనార్హం!

సకల మనవుల్లో ఉన్న 'ఆత్మ' ఒక్కటే! వారి 'రక్తమాంసాలు' కూడా ఒక్కటే!!

భగవద్గీత 15:7– మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః।
మనః షష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి॥

భౌతిక జగత్తులో ఉన్న జీవాత్మలు నా యొక్క సనాతనమైన అంశములు. కానీ, భౌతిక శక్తిచే కట్టివేయబడి, వారు మనస్సుతో కలిపి ఉన్న ఆరు ఇంద్రియములతో ప్రయాస పడుతున్నారు.

బైబిలు ఆదికాండము (Genesis) 2:7– "దేవుడైన యెహోవా నేల మంటితో నరుని చేసి, వాని నాసికారంధ్రములలో జీవాత్మను ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" అని బైబిలు ప్రకటిస్తుంది.

ఖురాను 15:29వ వాక్యం ఏమంటుందో చూడండి.

فَإِذَا سَوَّيْتُهُ وَنَفَخْتُ فِيهِ مِن رُّوحِي فَقَعُوا لَهُ سَاجِدِينَ

"నేను ఆయనను రూపకల్పన చేసి, ఆయనలో నా ఆత్మను (రూహ్) ఊదినప్పుడు, మీరందరూ ఆయన ముందర సాష్టాంగపడండి" అని అల్లాహ్ దైవదూతలను ఆదేశిస్తున్నాడు.

దీని ప్రకారం– సకల మానవుల్లో ఉన్న "ఆత్మ ఒక్కటే" అని సుస్పష్టంగా తెలుస్తుంది. అలాగే ఒకే "జంట రక్తమాంసాలు" పంచుకుని పుట్టారని తెలుస్తుంది. కనుక సకల మానవులు పరస్పరం తోబుట్టువులు అవుతారన్నది నిర్వివాదాంశం!

కాబట్టి కులతత్వం, మతతత్వం, ప్రాంతీయతత్వం, జాతితత్వం తదితర సంకుచిత తత్వాల నుండి బయటపడి, "విశ్వజనీన మానవత్వం" మాత్రమే కలిగి ఉండాలి. అలాగే ఒక వ్యక్తి మరో వ్యక్తిని చిన్న చూపు చూస్తున్నాడంటే వాస్తవానికి తనకు తానే చిన్న బుచ్చుకుంటున్నట్లు అవుతుంది కదా! అయినా ఈనాటి అధికశాతం ధార్మికులు అలా ప్రవర్తిస్తున్నారంటే దానికి కారణం– వారికి తమతమ ధర్మగ్రంథాల జ్ఞానం లేకపోవటం లేదా వాటిపట్ల నిబద్ధత లేకపోవటం.

అందుకే సృష్టికర్త, తనతోటి వారిని తనతో సమానంగా చూడమంటున్నాడు!

మౌలికంగా అందరూ ఒక్కటైనప్పుడు దాని పరిణామంగా తమ గౌరవ–మర్యాదలను, తన మాన–ప్రాణాలను ఎంతగా కాపాడుకుంటారో అలాగే కుల–మతాలకు, వర్ణ–వర్గాలకు, తెగలూ–జాతులకు అతీతంగా విశ్వమానవ గౌరవ–మర్యాదలను, మాన–ప్రాణాలను అంతగానే కాపాడాలి. దీనికి సంబంధించి మన ధర్మశాస్త్రాలు ఏమంటున్నాయో చూడండి.

ఉపనిషత్తు, ఈశావాస్యం 6– యస్తు సర్వాణి భూతాన్య ఆత్మన్యేవానుపశ్యతి।
సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే॥

"ఎవరైతే సమస్త జీవులను తన ఆత్మలోనే చూస్తాడో, మరియు సమస్త జీవులలోనూ ఆ ఒకే ఆత్మను దర్శిస్తాడో, అతడు ఎవరినీ ద్వేషించడు" అని చెబుతున్నాడు.

భగవద్గీత 5:18– విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని।
శుని చైవ శ్వపాకే చ పండితాः సమదర్శినः॥

"నిజమైన పండితులు– 1) ఓ బ్రాహ్మణుడిని, 2) ఓ ఆవుని, 3) ఓ ఏనుగుని, 4) ఓ కుక్కని, 5) ఓ చండాలుడిని సమ–దృష్టితో చూస్తారు" అని భగవద్గీత ప్రకటిస్తుంది.

భగవద్గీత 6:32– ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః॥

"సర్వ ప్రాణులను సమానముగా దర్శిస్తూ, మరియు ఇతరుల సుఖాలకు, దుఃఖాలకు, అవి తనకే అయినట్టు స్పందించే వారిని, పరిపూర్ణ యోగులుగా పరిగణిస్తాను" పరమేశ్వరుడు ప్రకటిస్తున్నాడు.

మొదటి శ్లోకంలో హిందువులు "విద్యా వినయం ఉన్న పండితులు"గా పరిగణించ బడాలంటే వారికి వేదవేదాంగాలు అధ్యయనం చేయాలని, అష్టావధానాలు, సహస్రావధానాలు చేయాలని కాక, సర్వమానవుల పట్ల సమదృష్టి కలిగి ఉండాలని ఆ పరమేశ్వరుడు చెబుతున్నాడు.

ఇక్కడ అత్యంత గమనార్హ విషయం ఏమిటంటే ఒక కుక్కను సైతం ఒక బ్రాహ్మణునితో సమానంగా చూడాలని హిందూ శాస్త్రం చెప్పటం! ఇది సమానత్వ భావనకి పరాకాష్ట! అలాంటి ప్రబోధన కలిగి ఉన్న ఒక హిందువు ఒకవైపు– తన బెడ్రూంలో పెంపుడు కుక్కలను అనుమతిస్తూ మరోవైపు– ఒకని శూద్రునిగా ముద్రవేసి తన ఇంటిలో రానివ్వక పోవటం గురించి ఏమనాలి!? ఒకవేళ మీరు మీ తోటి మానవులతో ఆ భావన కలిగి ఉంటే దైవం దృష్టిలో మీ స్థానం ఎంత హీనమైనదో ఒక్కసారి ఆలోచించండి.

రెండవ శ్లోకంలో "పరిపూర్ణ యోగులు" కావాలంటే ఒకటి– సర్వ మానవులపట్ల సమభావం కలిగి ఉండాలి. రెండు– ఇతరుల సుఖ దుఃఖాలును తన సుఖ దుఃఖాలతో సమానంగా చూడాలి. ఈ సుగుణాలు మీలో ఉంటేనే మీరు ఒక హిందువుగా కాగలరు.

బైబిలు 1వ యోహాను 4:20,21– "ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపని వాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు। దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయన వలన పొందియున్నాము" అని యేసు శిష్యుడైన ఉవహాను ప్రకటిస్తున్నాడు.

నిజమైన యూదులు, క్రైస్తవులు కావాలంటే ఒకవైపు– తోటి మానవులను ద్వేషిస్తూ మరోవైపు దేవుని ప్రేమిస్తున్నానని చెప్పేవారు అబద్ధీకులు అని బైబిలు చెబుతుంది. మీరు అబద్ధీకులా సత్యవంతులా అన్నది ఆత్మావలోకనం చేసుకోండి.

ఖురాను 5:32– "ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే! ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడిన వాడు సర్వ మానవాళి ప్రాణాలను కాపాడినట్లే! ఇంకా, 90:12–18– మరియు (ఒక వ్యక్తి) ఉన్నతశిఖరాలకు ఎదగటం అంటే ఏమిటో నీకు తెలుసా? ఎవరినైనా బానిసపు బంధనాల నుండి విముక్తి కలిగించటం, తాను స్వయంగా ఆకలితో ఉన్నప్పటికీ, అనాధునికి లేదా దిక్కులేని నిరుపేదకు అన్నం పెట్టటం. అంతే కాదు; విశ్వసించి, సహనం,

సానుభూతుల్ని గురించి పరస్పరం బోధించుకునే వారిలో మనిషి చేరిపోవటం. ఇలాంటి వారే కుడిపక్షం వారు (అనగా దైవం దృష్టిలో విజేతలు)"

మొదటి వాక్యం ప్రకారం– ఒక మనిషిని చంపితే సర్వమానవులను చంపినట్లు, ఒక ప్రాణాన్ని కాపాడితే సర్వమానవుల ప్రాణాలను కాపాడినట్లే ఎందుకు అవుతుంది? ఎందుకంటే సకల మానవుల్లో ఉన్న 'ఆత్మ మూలతత్వం' ఒక్కటే కాబట్టి!

రెండవ వాక్యం ప్రకారం– ఒకవ్యక్తి ఉన్నత శిఖరాలకు ఎదగటం అంటే ప్రార్థనలు చేయటం, ఉపవాసాలు పాటించటం, హజ్, ఉమ్రా యాత్రలు చేయటం అని కాక, బందీలను విడిపించటం, తాను స్వయంగా ఆకలితో ఉన్నప్పటికీ బీద–సాదలైన అన్నార్తుల ఆకలి తీర్చటం వగైరా అని చెప్పటం అత్యంత గమనార్హం.

గమనిక: ఈ మూడు శాస్త్రాల్లోనూ మీ కులస్తులను, మీ మతస్తులను అని కాక, తన–పర భేదం లేకుండా విశ్వవ్యాప్తంగా ఉన్న తోటి మానవులను ప్రేమించాలి, గౌరవించాలి, వారి సేవచేయాలని చెప్పటం అత్యంగా గమనార్హం.

సకల ధర్మశాస్త్రాలు ఏ మతం వారు ఆ మతాన్ని, ఏ కులం వారు ఆ కులాన్ని గౌరవించండి, ఆదరించండి అని చెప్పటం లేదు. దానికి బదులుగా అవి సకల వర్గ తత్వాలకు అతీతంగా కేవలం ఒకే ఒక్క "విశ్వ మానవతా సంబంధం" ఆధారంగా మాత్రమే ఒకరినొకరు సహాయ–సహకారాలు అందించుకోవలని ప్రబోధిస్తున్నాయి.

సారాంశం

ఈ అధ్యయనం ప్రకారం ఒక్క ఖురాన్–హదీస్ ప్రబోధనలే కాక, సకల ధర్మ గ్రంథాలూ 'మతవర్గ కేంద్రక గ్రంథాలు'గా కాక, 'యావత్ మానవాళి కేంద్రక గ్రంథాలు' అయి ఉన్నాయని తెలుస్తుంది. ఎందుకంటే:

1. హిందువుల ధర్మ శాస్త్రాలు "విశ్వే అమృతస్య పుత్రాః" అంటే "అమృతత్వానికి సంతానమైన ఓ మానవులారా!" అని సకల మానవులను సంబోధిస్తున్నాయి.
2. యూదా, క్రైస్తవ ధర్మ శాస్త్రాలు "యావద్భూమి మీద ఒకని నుండి ప్రతి జాతిని సృష్టించెను" అని తెలియజేస్తున్నాయి.
3. ముస్లిముల ధర్మ శాస్త్రాలైన ఖురాన్–హదీసులు కూడా "మానవులందరినీ ఒకే కుటుంబం, ఒకే సృష్టికర్త సంతానం" అని చాటుతున్నాయి.

ఈ అధ్యయనాన్ని బట్టి సకల ధర్మశాస్త్రాల్లో ఒక్క 'విశ్వ మానవ సమానత్వం' తప్ప, జాతి–వర్ణ, కుల–మత, వర్గ–లింగ 'ఉచ్చ–నీచ భావాలు' ఏమాత్రమూ లేవని తేలిపోయింది.

కాబట్టి నిజమైన ధార్మికులు కాదలచిన వారు తోటి మానవులపట్ల అంటరాని తనాన్ని, నిమ్నోన్నతా భావాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కలిగి ఉండరాదని తెలుస్తుంది. సకల మానవులను సమదృష్టితో చూడటమే నిజమైన ధార్మికతకు, ఆధ్యాత్మికతకు అసలైన కొలమానం అన్నదే సమస్త ధర్మగ్రంథాల సందేశం. ఇంత గొప్ప ధార్మిక సత్యతను తిరస్కరించి తోటిమానవుల్లో కొందరిని కులం తక్కువారని చిన్న చూపు చూస్తూ వారి 'ఘోర ఆత్మక్షోభ'కి కారకులు అవుతున్న వారికి ఆ దైవం శాశ్వత నరక శిక్షలు విధించడంటారా!? ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి.

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

దైవ ప్రసన్నతకి ఆలంబన

విశ్వాసపథమా?

వివేకపథమా?



Part-6

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం----------I

విశ్వాసపథమా? వివేకపథమా? –
ధర్మ శాస్త్రాలు ఏమంటున్నాయి?----------1

విశ్వాసాలు సత్కర్మలకు
ప్రేరకాలు అవుతేనే అర్థవంతం లేదంటే వ్యర్థం!----------2

ధర్మం అత్యున్నత శిఖరం ఏమిటి?----------3

'ప్రత్యేకవాదం' అంటే ఏమిటి?
మరియు 'సమ్మిళితవాదం' అంటే ఏమిటి?----------5

వేద శాస్త్రాల్లో ఒక్క 'విశ్వాసం' కోరే మత బోధనలే
కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!----------6

హిందూ శాస్త్రాల 'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!-----6

హిందూ శాస్త్రాల 'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!---8

దైవమూ–విశ్వాసమూ అనేది లేకపోయినా ఆ స్థాయి లభిస్తుందా!?---11

యూద ధర్మశాస్త్రంలో ఒక్క 'విశ్వాసం' కోరే మత
బోధనలే కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!--13

యూదుల పాత నిబంధన
'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!----------13

యూదుల పాత నిబంధన
'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!----------14

క్రొత్త నిబంధనలో ఒక్క 'విశ్వాసం' కోరే మత బోధనలే
కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!--------15

క్రొత్త నిబంధన 'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!-----15

క్రైస్తవుల క్రొత్త నిబంధన
'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!----------16

ఇస్లాం ధర్మశాస్త్రంలో ఒక్క 'విశ్వాసం' కోరే మత బోధనలే
కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!--------17

ఖురాన్ 'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!---------17

ఖురాన్ 'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!--------19

అల్లాహ్ ఎవరిని ప్రేమించడు!?----------20

దైవమూ–విశ్వాసమూ లేకపోయినా ఆ స్థాయి లభిస్తుందా!?--------22

సారాంశం----------24

కిం కర్తవ్యం?----------25

పరిచయం

ఈనాడు ఆస్తిక–నాస్తిక వర్గాలే కాక, విభిన్న మతవర్గాలు పరస్పరం తీవ్రంగా ఘర్షిస్తున్నాయి. ముఖ్యంగా హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం తదితర బయటి మత వర్గాల్లోనే కాక, అంతర్గత మతాలకు చెందిన శైవ–వైష్ణవ, ఆర్థడాక్స్–రిఫార్మిస్ట్, క్యాథలిక్ – ప్రొటస్టంట్, సున్నీ–షియా తదితర మత వర్గాల మధ్య ఏదో ఒక సందర్భంలో ఘర్షణలు తలెత్తుతూనే ఉన్నాయి. ఇక్కడ శాస్త్రాలు మూడు విషయాలు చెబుతున్నాయి.

1. 'బయటి మత వర్గాల' మధ్య విభేదాలకి అవకాశం లేదు,

2. 'లోపలి మత వర్గాల' మధ్య విభేదాలకి అసలే అవకాశం లేదు,

3. 'ఆస్తిక–నాస్తిక వర్గాల' మధ్య విభేదాలకీ అవకాశం లేదు.

ఎందుకంటే, సృష్టికర్త తన శాస్త్రాల్లో ఒక్క 'విశ్వాసపథం' ఆధారంగానే కాక, 'వివేకపథం' ఆధారంగానూ ఇహ–పరాల సాఫల్యం ఇస్తానంటున్నాడు. ఇది కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ ఇది ఒక వాస్తవం. సకల మతాలకి చెందిన పండితులు ఈ గొప్ప విషయాన్ని దాచేశారు. అందుకే ఈరోజు ప్రతి చిన్న విషయానికి మతవర్గాల మధ్య, ఆస్తిక–నాస్తిక వర్గాల మధ్య ఘర్షణ తలెత్తుతుంది. ఈ సమస్య పరిష్కారానికే "విశ్వాస పథమా? వివేకపథమా?" అన్న మకుటంతో మీ చేతుల్లో ఉన్న ఈ చిరు పుస్తకం రచించటం జరిగినది.

ధర్మశాస్త్రాలు ఈ రెండు పథాలనూ ఆమోదిస్తున్నాయన్న వాస్తవికతను గుర్తిస్తే ఆయా మతవర్గాల మధ్య మరియు ఆయా ఆస్తిక–నాస్తిక వర్గాల మధ్య జరుగుతున్న సకల ఘర్షణలు నిరర్థకం అని తేలిపోతుంది! ఇందులో ఏమాత్రమూ సందేహం లేదు.

వివిధ వర్గాల మధ్య సామరస్యం సాధించి, జాతీయ సమైక్యతను సాధించటం సగటు పౌరులుగా మనందరి రాజ్యాంగ బాధ్యత. ఐక్యత లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాజాలదు. ఈ క్రమంలో ఆయా మత వర్గాల మధ్య ఐక్యత కోసం పనిచేసే సంస్కర్తలకి ఈ పుస్తకం ఇస్తున్న సమాచారం అత్యద్భుతంగా ఉపకరిస్తుందని వందశాతమూ హామీ ఇవ్వగలను.

KAKINADA
20-10-2026

M. A. Abhilash

విశ్వాసపథమా? వివేకపథమా? - ధర్మ శాస్త్రాలు ఏమంటున్నాయి?

మా సుదీర్ఘ పరిశోధనలో ధర్మగ్రంథాల సందేశం 'కామన్ సెన్స్'కి అత్యంత అనుసారంగానే ఉంటుంది తప్ప, దానికి వ్యతిరేకంగా ఉండదని సుస్పష్టం అయ్యింది! పైగా ఆ గ్రంథాలు కూడా తమ సత్యత నిర్ధారణకి 'కామన్ సెన్స్'నే గీటురాయిగా చేసుకోమంటున్నాయి!

కాస్త నిశితంగా గమనిస్తే మనుషుల్లో రెండు భావధారాలు కనిపిస్తాయి. వాటిలో... ఒకటి– 'విశ్వాస ప్రాధాన్యత'లో ఆలోచించేవారు. రెండు– 'వివేక ప్రాధాన్యత'లో ఆలోచించేవారు. నిజానికి ప్రతి ఒక్కరిలోనూ ఈ రెండు లక్షణాలూ మిళితంగానే ఉంటాయి. అయితే ఒక్కొక్కరిలో ఒక్కొక్క భావన ప్రబలంగా ఉంటుంది. ఉదా:

1. 'విశ్వాస ప్రాధాన్యత'లో ఆలోచించేవారు– మంచి–చెడుల గురించి దేవుడు–ధర్మశాస్త్రాల ఆధారంగా తెలుసుకొని ఆచరించటానికి ఇష్టపడతారు. కాబట్టి వీరిని 'విశ్వాసపథం'/'విశ్వాసమార్గం' అనుసరించేవారని చెప్పవచ్చు.

2. 'వివేక ప్రాధాన్యత'లో ఆలోచించేవారు– మంచి–చెడుల గురించి తమలోనే ఉన్న బుద్ధి–వివేకాల ఆధారంగా నిర్ధారించుకొని ఆచరించటానికి ఇష్టపడతారు. కాబట్టి వీరిని 'వివేకపథం'/'వివేకమార్గం' అనుసరించేవారని చెప్పవచ్చు.

ఇక్కడ అసలైన విషయం ఏమిటంటే హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం ధర్మశాస్త్రాలు ఒక్క 'విశ్వాసపథం' గురించి మాత్రమే చెబుతున్నాయా? లేక 'వివేకపథం' గురించి కూడా చెబుతున్నాయా? అన్నది. నా సంక్షిప్త సమాధానం రెండవ మార్గం గురించి కూడా చెబుతున్నాయి అన్నదే! అది మీకు నిర్ధారణ కావాలంటే మీరు ఈ చిరుపుస్తకాన్ని పూర్తిగా అధ్యయనం చేయక తప్పదు.

నిజంగా ధర్మ శాస్త్రాలు రెండవ విధానాన్ని కూడా చూపిస్తే ఆయా మతవర్గాల మధ్య రగులుతున్న ఘర్షణ మరియు ఆస్తికులూ–నాస్తికుల మధ్య రగులుతున్న ఘర్షణకి అసలు అర్థమే లేకుండా పోతుందంది!

విశ్వాసాలు సత్కర్మలకు ప్రేరకాలు అవుతేనే అర్థవంతం లేదంటే వ్యర్థం!

ముందుగా విశ్వాసం గురించి ఆలోచిద్దాం. 'దేవుని పట్ల విశ్వాసం' అన్నది ఉదా: "దేవుడు ఉన్నాడు" అన్న విశ్వాసం ఒక భక్తునిలో– "నేను చేసే మంచి–చెడు కర్మలను ఆయన చూస్తున్నాడు కాబట్టి 'దుష్కర్మలు' చేయకూడదు, 'సత్కర్మల'ను మాత్రమే చేయాలి!" అన్న 'అంతర్గత ప్రేరకం' అవ్వాలి. అలాగే "మరణాంతర జీవితం ఉంది" అన్న 'విశ్వాసం' ఒక భక్తునిలో– "నేను చేసే దుష్కర్మలూ–సత్కర్మలకు ఇహలోకంలో శిక్షా–బాహుమానాలు తప్పినా పరలోకంలో తప్పవు!" అన్న 'అంతర్గత ప్రేరకం' అవ్వాలి. అందుకే ఈ విశ్వాసాలను పునఃస్మరణ చేయటానికి ఆరాధనలు ఒక సాధనంగా ఏర్పాటు చేయటం జరిగింది.

ఈ విధంగా చూస్తే 'విశ్వాసాలూ–రాధనలు' ఒక భక్తుని జీవితంలో "సత్కర్మలు" అనే లక్ష్యాన్ని చేర్చటానికి "సాధనాలు" లేదా "ప్రేరకాలు" అయ్యాయని తెలుస్తుంది. ఇక భక్తులు కలిగి ఉండే 'విశ్వాసాలూ–రాధనల' వలన దేవునికైతే ఎలాంటి ప్రయోజనమూ లేదు! సత్కర్మలు లేకపోతే మనిషికీ ప్రయోజనం లేదు!

ఈనాటి మాతావలంబికుల్లో దుష్కర్మల విజృంభణకి మూల కారణం ఆయా మతాలకి చెందిన కొందరు వంచక పండితులు– "సత్కర్మలు ఆచరించకపోయినా కేవలం విశ్వాసం కలిగి ఉంటే చాలు. ఇహ–పరాల సాఫల్యం లభిస్తుంది!" అన్న ఒక ధర్మ విరుద్ధ కాల్పనిక భరోసా ఇవ్వటమే! అంటే దేవుని ధర్మం సత్కర్మలకు లక్ష్య స్థానం ఇస్తే, ఈనాటి అధికశాతం మత పండితులు దానిని తప్పించి, విశ్వాసానికి లక్ష్య స్థానం ఇచ్చేశారు!

ఆధారిత కర్మలు? - స్వతంత్ర కర్మలు?

కర్మల్లో రెండురకాలు:

1వ రకం కర్మలు, వాటికి రెండవరకం కర్మలు తొడవుతేనేగానీ దేవుని వద్ద చెల్లవు.

2వ రకం కర్మలు, వాటికి మొదటి రకం కర్మలు తోడు కాకపోయినా దేవుని వద్ద చెల్లుతాయి.

ఉదా:ఇస్లాం ధర్మం ప్రకారం– ఒకటవ రకం కర్మలైన 'విశ్వాసాలూ–ఆరాధనలు' దేవుని వద్ద చెల్లాలంటే వాటికి రెండవ రకం కర్మలైన 'సత్కర్మలు' తోడవ్వాలి. అదే 'సత్కర్మలు' దేవుని వద్ద చెల్లాలంటే వాటికి 'విశ్వాసాలూ–ఆరాధనల'తోడు అవసరం లేదు! దీనిని బట్టి 'విశ్వాసాలూ–ఆరాధనలు' అన్నవి 'ఆధారిత కర్మలు' (Dependent actions) అయ్యాయి. 'సత్కర్మలు' అన్నవి 'స్వతంత్ర కర్మలు' (Independent actions) అయ్యాయి!

ధర్మం అత్యున్నత శిఖరం ఏమిటి?

ధర్మంలో "అత్యున్నత శిఖరం" (Pinnacle of religion) విశ్వాసమా? సత్కర్మలా? అన్న ప్రశ్నకి ఖురాన్ ఇచ్చే సమమాధానం ఏమిటో చూడండి.

1. సత్కర్మలు లేని విశ్వాసం చెల్లదు!

అనేక మతవర్గాల్లో ఉన్న భ్రష్ట భావాల్లో ఒకటి సత్కర్మలు లేకపోయినా దేవుని పట్ల విశ్వాసం ఉంటే చాలు. అలాంటి వానికి ఇహ–పరాల సాఫల్యం కలుగుతుందని బలమైన ప్రచారం జరుగుతుంది. అయితే ఖురాన్ 2:93వ వాక్యం ఏమంటుందో చూడండి.

قُلْ بِئْسَمَا يَأْمُرُكُم بِهِۦٓ إِيمَـٰنُكُمْ إِن كُنتُم مُّؤْمِنِينَ

వారితో అనండి: "మీరు విశ్వాసులే అయితే! ఈ దుష్కర్మలు చేయమని మిమ్మల్ని ప్రేరేపించే మీ ఈ విశ్వాసం చాలా చెడ్డది" అని ఖురాన్ చెబుతుంది. అలాగే ఖురాన్ 6:158వ వాక్యం కూడా చూడండి.

لَا يَنفَعُ نَفْسًا إِيمَـٰنُهَا لَمْ تَكُنْ ءَامَنَتْ مِن قَبْلُ أَوْ كَسَبَتْ فِىٓ إِيمَـٰنِهَا خَيْرًا–

"విశ్వసించి కూడా ఏ మేలునూ (ఏ సత్కర్మనూ) సంపాదించుకోని వ్యక్తికి, తన విశ్వాసం వల్ల (తీర్పుదినం రోజు) ఏ ప్రయోజనమూ చేకూరదు!" అని ఖురాన్ తీర్మానపూర్వకంగా ప్రకటిస్తుంది.

పై రెండు వాక్యాలు రెండు విషయాలు చెబుతున్నాయి. వాటిలో... 1) మీరు దుష్కర్మలు గనక చేస్తూ ఉంటే మీలో ఉన్నది 'చెడ్డ విశ్వాసమే'గాని 'మంచి విశ్వాసం' కాదన్నది. విశ్వాసం మంచిది కావాలంటే 'సత్కర్మలు' తప్పనిసరని అర్థమౌతుంది. 2) 'సత్కర్మలు' లేకుండా ఒట్టి 'విశ్వాసం'తో వస్తే అటువంటి విశ్వాసం అల్లాహ్ వద్ద పనికిరాదన్నది. ఇక హదీసు విషయానికి వస్తే... సహీహ్ బుఖారి 2475వ హదీస్ చూడండి.

عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ عَنْهُ، قَالَ: قَالَ النَّبِيُّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ: لَا يَزْنِي الزَّانِي حِينَ يَزْنِي وَهُوَ مُؤْمِنٌ، وَلَا يَشْرَبُ الْخَمْرَ حِينَ يَشْرَبُ وَهُوَ مُؤْمِنٌ، وَلَا يَسْرِقُ حِينَ يَسْرِقُ وَهُوَ مُؤْمِنٌ، وَلَا يَنْتَهِبُ نُهْبَةً يَرْفَعُ النَّاسُ إِلَيْهِ فِيهَا أَبْصَارَهُمْ حِينَ يَنْتَهِبُهَا وَهُوَ مُؤْمِنٌ.

ప్రవక్త ముహమ్మద్– "1) ఒక వ్యభిచారి విశ్వాసిగా ఉంటూ వ్యభిచారం చేయజాలడు. 2) ఒక తాగుబోతు విశ్వాసిగా ఉంటూ మద్యం సేవించజాలడు. 3) ఒక దొంగ విశ్వాసిగా ఉంటూ దొంగతనం చేయజాలడు. 4) ఎవరైనా ఒక వ్యక్తి విశ్వాసిగా ఉంటూ దోపిడీ, విధ్వంసాలకు బరితెగించలేడు" అని హెచ్చరించారు.

ఈ విధంగా ఒకవైపు అల్లాహ్ పట్ల విశ్వాసి అవటం, మరోవైపు షైతాన్ ప్రేరేపిత అనైతిక–అమానవీయ దుష్కర్మలకి పాల్పడటం అన్నది పరస్పరం పొసగని, పరస్పర విరుద్ధ విషయాలని అర్థమౌతుంది. దీని ప్రకారం సత్కర్మలు లేని విశ్వాసాలు చెల్లవని అటు ఖురాన్, ఇటు– ప్రవక్త మహనీయుల ప్రబోధనలతో తేలిపోయింది. దీనికి సంబంధించిన మరింత వివరణ కోసం "సత్కర్మలే సర్వోన్నతం!" అన్న మా రచన చూడగలరు.

ఏది సుస్పష్టంగా తెలుస్తుందో దానికే మనిషిని నిబద్ధుడు చేయటం సాధ్యం మరియు న్యాయం కూడా. ఉదా: సామాన్య ప్రజలను ఉద్దేశించి– "దైవాన్ని విశ్వసించటం మంచిదా చెడ్డదా?" అని ఆస్తిక–నాస్తిక ప్రజలను ప్రశ్నిస్తే వారందరూ ఏకగ్రీవంగా సమాధానం ఇస్తారా? లేక విభిన్నంగా సమాధానం ఇస్తారా? విభిన్నంగానే ఇస్తారు. దీనికి బదులుగా– "సత్కర్మలు చేయటం మంచిదా చెడ్డదా?" అని ప్రశ్నిస్తే వచ్చే సమాధానం– "ఏకగ్రీవంగా ఉంటుందా లేక విభిన్నంగా ఉంటుందా?" ఏకగ్రీవంగానే ఉంటుంది.

దీనికి కారణం ఏమిటంటే– మత సంబంధమైన 'విశ్వాసాలూ–ఆరాధనలు' వగైరా మనిషి వివేకానికి–బుద్ధికి కాస్త కష్టంగా అందే "అభౌతిక" విషయాలు. కానీ, "నైతికతా–మానవత"కి సంబంధించిన విలువలు మనిషి వివేకానికి–బుద్ధికి 'అత్యంత సులువు'గా అందే "భౌతిక" విషయాలు.

కాబట్టి పరలోకంలో తీర్పు తీర్చటానికి కేవలం ఒక్క 'విశ్వాసాలూ-ఆరాధనల'ను మాత్రమే ఆధారం చేసుకొని తీర్పు చేయటం సకల మానవాళిపట్ల న్యాయమా? లేదా 'నైతికతా-మానవత'కి సంబంధించిన "సత్కర్మల" ఆధారం తీర్పు చేయటం న్యాయమా? అని ప్రశ్నిస్తే మీ 'ఇంగితం-అనుభవం' ఇచ్చే సమమాధానం ఏమిటి? "సత్కర్మలు" అన్నదే కదా! ఇక ఖురాన్ దానికి పూర్వపు గ్రంథాలు ఏమంటున్నాయో చూడాల్సి ఉంది.

'ప్రత్యేకవాదం' అంటే ఏమిటి? మరియు 'సమ్మిళితవాదం' అంటే ఏమిటి?

ఆయా మతస్థులు అప్పుడప్పుడు ఒకవైపు- మా మతం, మతం కాదు అదొక ధర్మం ఎందుకంటే సర్వ మానవాళిని ఉద్దేశించి మాట్లాడుతుంది అని గొప్పగా చెబుతుంటారు. కానీ, మరోవైపు- పక్కా మతతత్వంతో, మతోన్మాదంతో ప్రవర్తిస్తుంటారు. వారి ఈ ద్వంద్వత్వానికి కారణం ఏమిటంటే ఆయా ధర్మ గ్రంథాలలో ఉన్న 'వర్గగతమైన ప్రత్యేక మత విధానాలు' ఎవరి కోసం చెప్పబడ్డాయో, అలాగే 'సార్వత్రిక విలువల విధానం' ఎవరి కోసం ఉన్నాయో నిర్ధారితంగా తెలుసుకోకపోవటమే! హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం ధర్మశాస్త్రాల నిశిత అధ్యాయనంతో వాటిలో రెండు విధానాలు కనిపిస్తాయి. వాటిలో...

1. **'ప్రత్యేకవాదం' (Exclusivism):** ఇందులో ఒకవ్యక్తి ఇహ-పరాల సాఫల్యం సాధించాలంటే ఒకవైపు- 'విశ్వాసాలూ-ఆరాధన'ల వంటి మత సంబంధమైన విషయాలు కలిగి ఉంటూ, రెండవవైపు- 'నైతికతా-మానవత'కి చెందిన "సత్కర్మలు" కూడా ఆచరించాలని ధర్మ గ్రంథాలు తప్పనిసరి చేస్తున్నాయి. వాటిని పాటించే వారితో వివిధ మతవర్గాలు ఏర్పడ్డాయి. ఈ వర్గాల్లో దేనికదే తానే సత్యంపై ఉందని బలంగా భావిస్తుంది. ప్రతి వర్గం మరొక వర్గాన్ని నిరాకరిస్తుంది. కాబట్టి దీనిని 'ప్రత్యేకవాదం' (Exclusivism) అంటున్నాం.

2. **'సమ్మిళితవాదం' (Inclusivism):** ఇదైతే 'విశ్వాసాలూ-ఆరాధన'ల వంటి మత సంబంధ విషయాలు కలిగి లేనప్పటికీ, కేవలం 'నైతికతా-మానవత'కి చెందిన "సత్కర్మలు" మాత్రమే నిష్ఠగా ఆచరించినా ఇహ-పరాల సాఫల్యం లభిస్తుందనే సంపూర్ణ హామీ ధర్మ గ్రంథాలు ఇస్తున్నాయి. ఇక్కడ ప్రజల్లో 'విశ్వాసాలు' కాక, కేవలం 'విలువలు' మాత్రమే ప్రాతిపాదిగా ఉంటాయి. కాబట్టి ఇందులో మతాలకి అతీతంగా సజ్జనులైన ఆస్తికులే కాక, సజ్జనులైన నాస్తికులు సైతం కలసిపోతారు. అంటే ఇందులో మతవర్గతత్వం ఏమాత్రమూ ఉండదు. అంటే కలుపుగోరుతనం ఉంటుంది. అందుకే దీనిని 'సమ్మిళితవాదం' (Inclusivism) అని అంటున్నాం.

పైన పేర్కొన్న మొదటి విధానం ధర్మ గ్రంథాలు బోధిస్తున్నాయని అందరికీ తెలిసిందే. అయితే ఈ రెండవ విధానాన్ని కూడా ధర్మ శాస్త్రాలు బోధిస్తున్నాయా!? అన్నది చాలా మందికి సందేహం. నిజానికి దీనిని కూడా ధర్మశాస్త్రాలు బోధిస్తున్నాయి!

వేద శాస్త్రాల్లో ఒక్క 'విశ్వాసం' కోరే మత బోధనలే కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!

అయితే మత పండితులు సాధారణంగా విశ్వాస సంబంధమైన మత బోధనలు తప్ప, వివేకం కోరే విలువల ప్రబోధనలను ప్రచారంలో పెట్టరు. దాని వలన ఆ శాస్త్రాలు 'ప్రత్యేకవాదం' (Exclusivism) మాత్రమే కలిగి ఉన్న మతతత్వం, సంకుచిత మతోన్మాదం బోధించే గ్రంథాలుగా అవమానానికి, అపఖ్యాతికి గురౌతున్నాయి. సరే ఇక రెండు వాదాలకి సంబంధించిన హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం ధర్మశాస్త్రాల ఆధారాలను ఒక్కొక్కటిగా చూడండి.

హిందూ శాస్త్రాల 'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!

హిందూ పండితుల్లో రెండు రకాలుగా మాట్లాడే వారిని గమనించే ఉంటారు. వారిలో...

1. మత విధానం మాత్రమే చెల్లుతుంది అని, ఇంకా మా మత విధానం ద్వారా మాత్రమే ఇహ–పరాల సాఫల్యం ఉంటుంది అని 'విశ్వాసపథం' కోరే మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించి మాట్లాడుతుంటారు.

2. వారే ఒక్కోసారి మతం ప్రధానం కాదు మానవత్వమే ప్రధానం. దేవుడు మతాన్ని చూడడు వారిలో ఉన్న మంచితనాన్నే చూస్తాడు అని 'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించి మాట్లాడుతుంటారు.

నిజానికి హిందూ శాస్త్రాల్లో ఈ రెండు విధాలైన ప్రబోధనాలు కూడా ఉన్నాయి. అయితే ఆ రెండు విధాలైన ప్రబోధనాలు ఎందుకు ఉన్నాయి? ఎవరి కోసం ఉన్నాయి? అన్న ప్రశ్నలకు సమాధానాలు నిర్దిష్టంగా నిర్ధారించరు. అయితే ముందుగా మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన బోధనలు చూడండి.

గీతాశాస్త్రం 6:47– యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః॥

"అందరి యోగులలో కెల్లా, ఎవరి మనస్సు ఎల్లప్పుడూ నాయందే నిమగ్నమై ఉంటుందో,

ఎవరు నా యందు ధృఢ విశ్వాసంతో భక్తితో ఉంటారో, వారిని అత్యున్నతమైన వారిగా పరిగణిస్తాను".

గీతాశాస్త్రం 9:34– మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు।
మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణఃII

"ఎల్లప్పుడూ నన్నే స్మరించుము, నా పట్ల భక్తితో ఉండుము, నన్ను ఆరాధించుము, మరియు నాకు ప్రణామములు అర్పించుము. నీ మనస్సు మరియు శరీరము నాకు సమర్పించుటచే నీవు నా వద్దకు నిస్సందేహముగా వచ్చెదవు".

గీతాశాస్త్రం 18:65– మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మేII

"ఎల్లప్పుడూ నన్నే స్మరించుము, నా పట్ల భక్తితో ఉండుము, నన్ను పూజించుము మరియు నాకు నమస్కరించుము. ఇలా చేయటం వలన నీవు తప్పకుండా నన్నే చేరుకుందువు. నేను నీకిచ్చే వాగ్దానం ఇది, ఎందుకంటే నీవు నాకు చాలా ప్రియమైనవాడివి" అని దేవుడు చెబుతున్నాడు.

గీతాశాస్త్రం 18:66– సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచఃII

"అన్ని విధములైన ధర్మములనూ విడిచిపెట్టి, కేవలం నాకే శరణాగతి చేయుము. నేను నిన్ను అన్ని పాపముల నుండి విముక్తి చేసెదను; భయపడకుము".

ఈ రకమైన ప్రబోధనలతో సుస్పష్టంగా తెలిసేది ఏమిటి? i) అత్యున్నతులు కావాలన్నా, ii) దైవం వద్దకు చేరాలన్నా, iii) పాప విముక్తి కలగాలన్నా, ఒక్క శ్రీకృష్ణుని మాత్రమే ఆరాధించే మతవర్గంలో తప్ప, మరే మతవర్గంలోనూ ఇహ–పరాల సాఫల్యం లభించదు అని ఖరాఖండీగా ప్రకటించటం జరిగింది.

అంటే, ఒక్క శ్రీకృష్ణుని నమ్ముకున్న వారికి తప్ప, ఔన్నత్యం, ముక్తీ–మోక్షాలు అన్నవి మరే మతస్థులకూ ప్రాప్తం కావన్నది గమనార్హం! కాబట్టి దీనిని 'విశ్వాసపథాని'కి చెందిన మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) అని చెప్పాలి.

హిందూ శాస్త్రాల 'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!

'విశ్వాసపథం' కోరే మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన వైదిక బోధనలు ఏమిటో చూశారు. వాటి ఆధారంగానే దేవుని ప్రసన్నత పొందటానికి హిందూ

మత స్వీకారం తప్పనిసరని కొందరు హిందువులు ప్రచారం చేస్తూ ఉంటారు. అయితే దానితోపాటు, ఇక, 'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించిన ప్రబోధనలను కూడా వైదిక శాస్త్రాలు చేస్తున్న వైనాన్ని చూడండి.

గీతా శాస్త్రం 6:32– ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతఃII

"i) సర్వ ప్రాణులను సమానముగా దర్శిస్తూ, మరియు ii) ఇతరుల సుఖాలకు, దుఃఖాలకు, అవి తనకే అయినట్టు స్పందించే వారిని, iii) పరిపూర్ణ యోగులుగా పరిగణిస్తాను".

ఈ శ్లోకంలో పరమేశ్వరుడు ఒకరిని "యోగులుగా పరిగణిస్తాను" అని కాక, "పరిపూర్ణ యోగులుగా పరిగణిస్తాను" అని చెబుతున్నాడు. ఇది 'గొప్ప ఆధ్యాత్మిక స్థితి' (Great spiritual state)కి సంబంధించిన శుభవార్త. ఈ స్థాయికి చేరాలంటే ధార్మికులకి వెంటనే వచ్చే ఆలోచన– కఠోరమైన విశ్వాసాలూ–ఆరాధనల వంటి 'మత సంబంధిత క్రతువులు' (Religious rituals) జ్ఞాపకం వస్తాయి.

అయితే పరమేశ్వరుడు– "i) సర్వ ప్రాణులను సమంగా దర్శించటం ii) ఇతరులకు కలిగే సుఖ–దుఃఖాలను తనకే కలిగి నట్లు స్పందించటం!" అని మత సంబంధిత 'విశ్వాసాలూ–ఆరాధనల' ఎలాంటి ప్రస్తావన లేకుండా 'కేవలం మానవతా విలువలు' (Purely humanitarian values) గురించి మాత్రమే చెబుతున్నాడన్నది ఇక్కడ అత్యంత గమనార్హం.

కర్మయోగులు శ్రేష్ఠులు ఎందుకు అవుతారు?

మనిషి కర్మలు రెండు విధాలుగా చేస్తాడు. ఒకటి– తన సృష్టికర్త అయిన పరమేశ్వరుడు మనిషి మనసులోనే సత్కర్మల మరియు దుష్కర్మల స్పృహ (Consciousness) పెట్టేశాడు. వీటిలో...

మొదటి రకం కర్మలు చేస్తున్నప్పుడు మీరు 'యోగి' అంటే ఇంద్రియాలను నిగ్రహించి, పరమేశ్వరుని ఇచ్ఛానుసారంగా సత్కర్మలు ఆచరించేవానిగా ఉంటారు. సంక్షిప్తంగా చెప్పాలంటే తన సృష్టికర్తతో ఏకీభవించిన భక్తునిగా ఉంటారు.

రెండవ రకం కర్మలు చేస్తున్నప్పుడు మీరు 'భోగి' అంటే ప్రాపంచిక సుఖ–భోగాల విలాసాల కోసం ఇంద్రియ సుఖాల్లో మునిగి తేలేవానిగా ఉంటారు. దీనినే మరోరకంగా చెప్పాలంటే మాయకి గురైన దైవ ద్రోహిగా ఉంటారు.

ఈ విషయాన్ని మరింత వివరంగా చెప్పే శ్లోకాన్ని చూడండి.

గీతా శాస్త్రం 3:7– యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున।
కర్మేంద్రియైః కర్మయోగమసక్తః స విశిష్యతే॥

"కానీ, అర్జునా, i) తమ జ్ఞానేంద్రియములను మనస్సుతో అదుపు చేసి, ii) కర్మేంద్రియములతో మమకార/ఆసక్తులు లేకుండా పనిచేసే కర్మ యోగులు, నిజంగా ఏంతో శ్రేష్ఠులు".

ఈ శ్లోకంలో మొదటి విషయం– "సామాన్య యోగుల" గురించి కాక, "శ్రేష్ఠయోగులు" ఎవరో చెబుతుందన్నది గమనార్హం. రెండవ విషయం– "కర్మ యోగి" ఎవరో చెబుతుందన్నది కూడా గమనార్హమే. మూడవ విషయం– ప్రతి మనిషిలోనూ సహజంగా ఉండే రెండు విధాలైన ఇంద్రియాల గురించి చెబుతుంది. వాటిలో...

1. **జ్ఞానేంద్రియాలు:** i) కళ్ళు (చూడటం), ii) చెవులు (వినడం), iii) ముక్కు (వాసన), iv) నాలుక (రుచి), v) చర్మం (స్పర్శ) అనే ఐదు జ్ఞానాన్ని గ్రహించే సాధనాలు. వీటిని మనస్సుతో నియంత్రించాలి. అంటే మనస్సు కోరే చెడు దృశ్యాలను చూడకుండా కంటిని అదుపు చేయాలి; చాడీలు, చెడు మాటలు వినకుండా చెవులను నియంత్రించాలి; అడ్డమైన రుచులను కోరే జిహ్వా చాపల్యాన్ని అదుపు చేసుకోవాలి. ఇతర ఇంద్రియాల విషయంలోనూ అలాగే జాగ్రత్త పడాలి.

2. **కర్మేంద్రియాలు:** i) వాక్ (నోరు), ii) పాణి (చేతులు), iii) పాదాలు (కాళ్ళు), iv) పాయు (విసర్జనావయవం), v) ఉపస్థ (జననేంద్రియం) అనే ఐదూ కర్మలు చేసే సాధనాలు. మనిషి తన నోటితో ఇతరుల మనస్సును ఆనందపరచాలే గానీ గాయ పరచకూడదు. తన చేతులతో ఇతరులకు మేలు చేయాలే గానీ కీడు తలపెట్టకూడదు. తన జననేంద్రియాన్ని ధర్మ బద్ధంగా తప్ప, అధర్మాగా వినియోగించరాదు. అలాగే మిగతా కర్మేంద్రియాలతో తనకీ, సమాజానికి మంచినే చేకూర్చాలి తప్ప చెడు కలిగించకూడదు.

ఇప్పుడు పరమేశ్వరుని దృష్టిలో "శ్రేష్ఠలైన కర్మ యోగులు" కావాలంటే చేయవలసిన పనేమిటి? అన్నది ప్రశ్న. దీనికి సమాధానం తెలుసుకోవటానికి ముందు మనిషి కర్మ చేసే మౌలిక మార్గాలు ఎన్ని ఉన్నాయో తెలుసుకోవాలి. వాటిలో... ఒకటి– 'మనసా', రెండు– 'వాచా', మూడు– 'కర్మణా' అనే మూడు ఈ ఉపకరణాల (Tools) ఆధారంగా మాత్రమే

ఏ మనిషైనా ఏ కర్మైనా చేస్తాడు.

ఇక "శ్రేష్ఠమైన కర్మ యోగులు" ఎవరు? ప్రశ్నకి సమాధానం: ఒకటి– మీ 'మనస్సు'లో కలుగుతున్న ఆలోచనలు నైతికమా? అనైతికమా? అన్నది ప్రశ్నించుకుంటూ ఉండాలి. మీ నోటితో వెలువడబోయే మాటలు తూటాలా, కుసుమాలా అన్నది గమనిస్తూ ఉండాలి. మీ చేతలతో వ్యక్తం కానున్న చేష్టలు దోహదమయ్యేది నిర్మాణానికా, విచ్ఛిన్నానికా అన్నది బేరీజు వేసుకోవాలి.

పై మూడిటిలో దేని వలన అనైతికమైనది చేస్తున్నా మీరు మాయగాడి ప్రభావంలో పోయినట్లే! అలాగే నైతికమైనది చేస్తుంటే మీరు మీ సర్వేశ్వరుని అనుగ్రహంలో ఉన్నట్లే!

ఇక్కడ మీరు గమనించవలసిన అసలైన విషయం– సర్వేశ్వరుడు స్వయంగా ప్రశంసించేటంతటి "శ్రేష్ఠమైన కర్మ యోగులు" కావటానికి ప్రత్యేకమైన విశ్వాసాలూ–ఆరాధనలు, యాగాలూ–యజ్ఞాలు, ప్రత్యేక వేష–భాషలు గురించి ఏమాత్రమూ చెప్పక, కేవలం తన "దసేంద్రియాల నియంత్రణ" గురించి మాత్రమే చెబుతున్నాడన్నది. మరొక శ్లోకం చూడండి.

గీతా శాస్త్రం 5:25– లభంతే బ్రహ్మనిర్వాణమ్ ఋషయః క్షీణకల్మషాః।
ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః॥

"i) ఎవరి పాపములు నశించినవో, ii) ఎవరి సందేహములన్నీ నిర్మూలింపబడినవో, iii) ఎవరి మనస్సులు క్రమశిక్షణతో ఉన్నవో, iv) ఎవరైతే సమస్త ప్రాణుల సంక్షేమం కోసం నిమగ్నమౌతారో, అట్టి పవిత్రమైన వ్యక్తులు భౌతిక జగత్తు నుండి విముక్తి పొంది, భగవంతుడిని పొందుతారు!" అని శాస్త్రం చెబుతోంది.

పైన పేర్కొన్న మొదటి శ్లోకంలో "ఋషయః" అన్న పదం గమనార్హం అంటే 'ఋషులు' అనగా 'హృషీకముల'ను అంటే 'ఇంద్రియముల'ను జయించిన వారు అన్నది. వారి నిర్వచనం ఏమిటో చూడండి. వారు: "i) పాప కర్మలను త్యజించిన వారు, ii) జీవితం గురించి సంశయం లేనివారు, iii) క్రమ శిక్షణ కలిగినవారు". ఇంత విశేషమైన స్థాయి వ్యక్తిత్వం కలిగిన వారి విశేషమైన కర్మ ఏమై ఉంటుంది? అన్నది ప్రశ్న. దానికి– 'సర్వభూతహితే రతాః'/"సమస్త ప్రాణుల సంక్షేమం కోసం నిమగ్నమయ్యే వారు!" అని పరమేశ్వరుడు ఒకే ఒక్క సమాధానం ఇస్తున్నాడు.

అతడు చేసిన ఎలాంటి మత సంబంధమైన విశ్వాసాలూ–ఆరాధనల వంటి క్రతువులూ, కర్మకాండలు చేసినట్లు పరమేశ్వరుడు చెప్పటం లేదు. కాబట్టి అతనికి పారలౌకిక ముక్తీ–మోక్షాలు కాక, కేవలం లౌకిక–భౌతిక సిద్ధులు మాత్రమే కలుగుతాయా? అన్న సందేహం కొందరికి కలుగుతుంది. దానికి– 'లభంతే బ్రహ్మనిర్వాణమ్' / "భౌతిక జగత్తు నుండి విముక్తి పొంది, భగవంతుడిని పొందుతారు!" అని శాస్త్రం సమాధానం చెబుతోంది.

ఇక్కడ అత్యంత గమనార్హమైన విషయం ఏంటంటే: ఇటు– లౌకిక జీవితంలో శ్రేష్ఠుడు కావాలన్నా, అటు– పారలౌకిక జీవితంలో మోక్షగామి కావాలన్నా... పై రెండు శ్లోకాల్లోనూ కొన్ని నైతిక–మానవీయ లౌకిక (Secular) కర్మలను చెప్పడం జరిగిందే తప్ప, మత (Religious) సంబంధమైన దేవుని అస్తిత్వం పట్ల ప్రత్యేక విశ్వాసం, వైరాగ్యం–సన్యాసం, యజ్ఞ–యాగాదుల వంటి ప్రత్యేక పూజల సంబంధిత క్రతువుల గురించిన ఊసు ఏమాత్రమూ ప్రస్తావించకపోవడం అత్యంత విశేషం! ఇదీ గీతా శాస్త్రం చూపిస్తున్న విలువల వివేకపథం!

దీనిని బట్టి 'శ్రేష్ఠత–మోక్షం' వంటి ఇహ–పరాల్లో ఉన్నతమైన ఆధ్యాత్మిక హోదా అనేది ఒక ప్రత్యేక మత విశ్వాసాన్ని బట్టి మాత్రమే కాక, తనలోనే ఉన్న 'వివేకపథం' అనుసరించి 'దుష్కర్మల'ను విడనాడి, 'సత్కర్మల'ను ఆచరించిన వానికీ ఇహ–పరాల సాఫల్యం ఉంటుందని తెలుస్తుంది.

యూద ధర్మశాస్త్రంలో ఒక్క 'విశ్వాసం' కోరే మత బోధనలే కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!

సామాన్యంగా కొందరు యూదా పండితులు మా యూదా ధర్మం ఒక్కటే ఇహ–పరాల సాఫల్యానికి ఏకైక మార్గం అని విశ్వాసం ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) మాత్రమే విశ్వసిస్తారు. దానినే ప్రచారం కూడా చేస్తుంటారు. యూదా ధర్మశాస్త్రాల్లో 'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించిన ప్రబోధనలు కూడా ఉన్నాయి. ముందుగా 'విశ్వాసపథం' కోరే బోధనలు చూడండి.

యూదుల పాత నిబంధన 'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!

యూదా పండితుల్లోనూ రెండు రకాలుగా మాట్లాడే వారిని మీరు గమనించే ఉంటారు. అయితే ముందుగా మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన బోధనలు చూడండి.

2వ దినవృత్తాంతములు 20:20– "అంతట వారు ఉదయముననే లేచి తెకోవ అరణ్యము నకు పోయిరి; వారు పోవుచుండగా యెహోషాపాతు నిలువబడి యూదా వారలారా! యెరూషలేము కాపురస్థులారా! నా మాట వినుడి; మీ దేవుడైన యెహోవాను నమ్ముకొనుడి, అప్పుడు మీరు స్థిరపరచబడుదురు; ఆయన ప్రవక్తలను నమ్ముకొనుడి, అప్పుడు మీరు కృతార్థులగుదురనిచెప్పెను" అని బైబిలు ప్రకటిస్తుంది.

యెషయా 45:22– "భూదిగంతముల నివాసులారా, నా వైపు చూచి రక్షణ పొందుడి దేవుడను నేనే మరి ఏ దేవుడును లేడు" అని యెహోవా దేవుడే స్వయంగా ప్రకటిస్తున్నాడు.

కీర్తనలు 34:7,8– "యెహోవాయందు భయభక్తులు గలవారి చుట్టు ఆయన దూత కావలి యుండి వారిని రక్షించును। యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు" అని కీర్తనా కారుడు చెబుతున్నాడు.

పైన పేర్కొన్న వాక్యాల్లోని మొదటి వాక్య భాగం– "స్థిరపరచబడాలన్నా, కృతార్థులు కావాలన్నా యెహోవాను, ప్రవక్తలను నమ్ముకోవాలి!" అని చెబుతుంది. రెండవ వాక్య భాగం– "భూదిగంతముల నివాసుల్లో ఎవరు రక్షణ పొందాలన్నా ఒక్క యెహోవవను తప్ప ఎవరినీ నమ్మరాదు!" అని అంటుంది. మూడవ వాక్య భాగం– "ఒక్క యెహోవాను విశ్వాసిస్తేనే ధన్యత లభిస్తుంది!" అని ప్రకటిస్తుంది.

ఇక్కడ దేవుని ప్రసన్నత, ఇహ–పరాల సాఫల్యం ఒక్క యెహోవాను నమ్ముకున్న యూదులకు తప్ప, వారెవరికీ లభించదన్నది గమనార్హం! కాబట్టి దీనిని 'విశ్వాసపథాని'కి చెందిన మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) అని చెప్పాలి.

యూదుల పాత నిబంధన 'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!

'విశ్వాసపథం' కోరే మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన పాత నిబంధన బోధనలు ఏమిటో చూశారు. వాటి ఆధారంగానే దేవుని ప్రసన్నత పొందటానికి యూదా మత స్వీకారం తప్పనిసరని యూదులు ప్రచారం చేస్తూ ఉంటారు. అయితే దానితోపాటు, ఇక, 'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించిన ప్రబోధనలు కూడా పాత నిబంధన చేస్తున్న వైనాన్ని చూడండి.

మీకా 6:8– "మనుష్యుడా, యేది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది; i) న్యాయముగా నడుచుకొనుటయు, ii) కనికరమును ప్రేమించుటయు, iii) దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు".

దేవుడు మనుషుల నుండి కోరుతున్న వాస్తవ విషయాలు ఏమిటో పైవాక్యం చెబుతుంది. మరొక వాక్యం చూడండి.

యెహేజ్కేలు 18:21,22– "అయితే i) దుష్టుడు తాను చేసిన పాపములన్నిటిని విడిచి, ii) నా కట్టడలన్నిటిని అనుసరించి iii) నీతిని అనుసరించి iv) న్యాయము జరిగించిన యెడల అతడు మరణము నొందడు, అవశ్యముగా అతడు బ్రదుకును.। అతడు చేసిన అపరాధములలో ఒకటియు జ్ఞాపకములోనికి రాదు, అతని నీతినిబట్టి అతడు బ్రదుకును" అని బైబిలు ప్రకటిస్తుంది.

ఈ వాక్యంలో "అతని నీతినిబట్టి అతడు బ్రదుకును!" అన్న స్పష్టమైన ప్రకటన అత్యంత గమనార్హం. దీనికి బదులు– "నా కట్టడలన్నిటిని అనుసరించి బ్రదుకును అనిగాని, యూదా మత స్వీకారాన్నిబట్టి అతడు బ్రదుకును!" అన్న కచ్చితమైన ప్రకటన పాత నిబంధనలో కనీస ఒక్కటీ లేదు!

ఒకడు యూదుల్లో జన్మించినప్పటికీ ఒకవేళ ఆ పాత నిబంధన పేర్కొన్న 'విలువలు' గనక లేకపోతే అతడు ఒక 'నామకార్థ యూదుడు' తప్ప 'నీతిమంతుడైన యూదుడు' కాజాలడు. అలాగే ఒకవ్యక్తి ఈనాటి 'ఏ మతవర్గం'లో జన్మించినప్పటికీ ఒకవేళ పాత నిబంధన పేర్కొన్న 'విలువలు' కలిగి ఉంటేనే అతడు 'నీతిమంతుడైన యూదుడు' కాగలడు!

ఇక్కడ 'నీతిమంతుడైన యూదుడు' అనే ఒక గొప్ప ఆధ్యాత్మిక హోదా ఒక ప్రత్యేక 'జాతి'ని బట్టిగాని, 'కుల వర్గము'ను బట్టిగాని, 'మత వర్గము'ను బట్టిగాని కాక, కొన్ని 'ప్రత్యేక విలువల'ను బట్టి మాత్రమే లభిస్తుందన్నది అత్యంత గమనార్హమైన విషయం.

దీని ప్రకారం పాత నిబంధనలో ఒక్క 'విశ్వాసపథ'గాముల 'ప్రత్యేకవాదం' (Exclusivism) సంబంధిత బోధనలే కాక, 'వివేకపథ'గాములకి సైతం వర్తించే సార్వత్రిక 'సమ్మిళితవాద' (Inclusivism) ప్రబోధనలు కూడా ఉన్నాయని తెలుస్తుంది!

క్రొత్త నిబంధనలో ఒక్క 'విశ్వాసం' కోరే మత బోధనలే కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!

సామాన్యంగా కొందరు క్రైస్తవ పండితులు మా క్రైస్తవ ధర్మం ఒక్కటే ఇహ–పరాల సాఫల్యానికి ఏకైక మార్గం అని విశ్వాసం ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) మాత్రమే విశ్వసిస్తారు. దానినే ప్రచారం కూడా చేస్తుంటారు. క్రొత్త నిబంధనలో

'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించిన ప్రబోధనలు కూడా ఉన్నాయి. ముందుగా 'విశ్వాసపథం' కోరే బోధనలు చూడండి.

క్రొత్త నిబంధన 'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!

క్రైస్తవ పండితుల్లోనూ రెండు రకాలుగా మాట్లాడే వారిని మీరు గమనించే ఉంటారు. అయితే ముందుగా మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన బోధనలు చూడండి.

యోహాను 14:6– "యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు!" అని యేసే స్వయంగా ప్రకటిస్తున్నారు.

అపో.కార్యములు 4:12– "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను" అని ...

ఈ రెండు వాక్యాల ప్రకారం ఒక్క క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వానికి తప్ప, ఈలోకంలో మరే మతస్తునికీ దేవుని ప్రసన్నత లభించదని అర్థమౌతుంది. అయితే ఇదే బైబిలు మరోవిధమైన ప్రబోధనలూ చేస్తుంది. వాటిని కూడా చూడండి.

పైన పేర్కొన్న వాక్యాల్లోని మొదటి వాక్య భాగం– "ఒక్క యేసు ద్వారా తప్ప మారెవని ద్వారానూ దేవుని వద్దకు వెళ్ళటం అసాధ్యం!" అని తేలిపోయింది. రెండవ వాక్య భాగం– "ఒక్క యేసు నామంలో తప్ప, మారెవరి నామంలోనూ రక్షణ లేదు!" అని క్రొత్త నిబంధన ప్రకటిస్తుంది.

ఇక్కడ రక్షణ, నిత్యజీవం యేసును విశ్వసించిన ఒక్క క్రైస్తవులకు తప్ప, వారెవరికీ లభించదన్నది గమనార్హం! కాబట్టి దీనిని 'విశ్వాసపథాని'కి చెందిన మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) అని చెప్పాలి.

క్రొత్త నిబంధన 'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!

'విశ్వాసపథం' కోరే మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన క్రొత్త నిబంధన బోధనలు ఏమిటో చూశారు. వాటి ఆధారంగానే దేవుని ప్రసన్నత పొందటానికి క్రైస్తవ మతస్వీకారం తప్పనిసరని క్రైస్తవులు ప్రచారం చేస్తూ ఉంటారు. అయితే దానితో

పాటు, ఇక, 'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించిన ప్రబోధనలు కూడా క్రొత్త నిబంధన చేస్తున్న వైనాన్ని చూడండి.

యోహాను 5:29– "మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానము నకును బయటికి వచ్చెదరు".

అపో.కార్యములు 10:34,35– "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను। ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును".

రోమా 2:6,7– "ఆయన ప్రతివానికి వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును.। సత్‌క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి నిత్యజీవము నిచ్చును". మరో రెండు వాక్యాలను చూడండి.

రోమా 2:11 "దేవునికి పక్షపాతములేదు. ధర్మశాస్త్రము లేక పాపము చేసినవారందరు ధర్మశాస్త్రము లేకయే నశించెదరు"

రోమా 2:12 "ధర్మశాస్త్రము కలిగినవారై పాపము చేసినవారందరు ధర్మశాస్త్రాను సారముగా తీర్పు నొందుదురు" అని పరిశుద్ధ వాక్యం చెబుతుంది.

ఈ వాక్యాల ప్రకారం– ఒకవ్యక్తి అతడు ఏ మత వర్గానికి చెందిన వాడైనా దేవుని పట్ల భయభక్తులు కలిగి, నీతిమంతుడై ఉంటే వానిని దేవుడు అంగీకరిస్తాడని సుస్పష్టం అవుతుంది.

కాబట్టి ఒకవ్యక్తి క్రైస్తవుల్లో జన్మించినప్పటికీ ఒకవేళ బైబిలులో పేర్కొన్న నీతి, సత్క్రియలు వంటి 'విలువలు' గనక కలిగి లేకపోతే అతడు ఒక 'నామకార్థ క్రైస్తవుడు' తప్ప 'నీతిమంతుడైన క్రైస్తవుడు' కాజాలడు. అలాగే ఒకవ్యక్తి ఈనాటి 'ఏ మతవర్గం'లో జన్మించినప్పటికీ ఒకవేళ బైబిలు పేర్కొన్న నీతి, సత్క్రియలు వంటి 'విలువలు' గనక కలిగి ఉంటే అతడు దేవుని దృష్టిలో ఒక 'నీతిమంతుడైన క్రైస్తవుడు' కాగలడు!

ఇక్కడ 'నీతిమంతుడైన క్రైస్తవుడు' అనే ఒక గొప్ప ఆధ్యాత్మిక హోదా ఒక ప్రత్యేక 'జాతి'ని బట్టిగాని, 'కుల వర్గము'ను బట్టిగాని, 'మత వర్గము'ను బట్టిగాని కాక, కేవలం కొన్ని 'నైతిక–మానవీయ విలువల'ను బట్టి మాత్రమే లభిస్తుందన్నది అత్యంత గమనార్హమైన

విషయం. కొన్ని 'మత విశ్వాసాలూ–ఆరాధనా క్రతువుల'ను బట్టి ఇలాంటి హామీ ఇచ్చిన దాఖలా పూర్తి క్రొత్త నిబంధనలో ఒక్కటీ లభించదు!

ఇస్లాం ధర్మశాస్త్రంలో ఒక్క 'విశ్వాసం' కోరే మత బోధనలే కాక, 'వివేకం' కోరే విలువల ప్రబోధనలు కూడా ఉన్నాయి!

సామాన్యంగా కొందరు ముస్లిం పండితులు మా ఇస్లాం ధర్మం ఒక్కటే ఇహ–పరాల సాఫల్యానికి ఏకైక మార్గం అని విశ్వాసం ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) మాత్రమే విశ్వసిస్తారు. దానినే ప్రచారం కూడా చేస్తుంటారు. ఖురానులో 'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించిన ప్రబోధనలు కూడా ఉన్నాయి. ముందుగా 'విశ్వాసపథం' కోరే బోధనలు చూడండి.

ఖురాన్ 'ప్రత్యేకవాదం' (Exclusivism) ప్రబోధనాలు!

ముస్లిం పండితుల్లోనూ రెండు రకాలుగా మాట్లాడే వారిని మీరు గమనించే ఉంటారు. అయితే ముందుగా మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన బోధనలు చూడండి. వాటిలో 3:31వాక్యం చూడండి.

قُلْ إِن كُنتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ ۗ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ قُلْ أَطِيعُوا اللَّهَ وَالرَّسُولَ ۖ فَإِن تَوَلَّوْا فَإِنَّ اللَّهَ لَا يُحِبُّ الْكَافِرِينَ

"మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు; మీ పాపాలను క్షమిస్తాడు. అల్లాహ్ అత్యంత క్షమాశీలుడు, అపార కరుణామయుడు" అందుకే "అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయులవ్వండి. వారు తిరిగిపోతే, నిశ్చయంగా అల్లాహ్ అవిశ్వాసులను ప్రేమించడు" అని ఖురాన్ చెబుతుంది. 4:13వ వాక్యంచూడండి.

وَمَن يُطِعِ اللَّهَ وَرَسُولَهُ يُدْخِلْهُ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا ۚ وَذَٰلِكَ الْفَوْزُ الْعَظِيمُ

"ఎవరైతే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయులవుతారో, వారిని అల్లాహ్ క్రింద నదులు ప్రవహించే స్వర్గవనాల్లో ప్రవేశింపజేస్తాడు. వారు అందులో శాశ్వతంగా ఉంటారు. అదే గొప్ప విజయం" అని ఖురాన్ ప్రకటిస్తుంది. ఇంకా 4:69వ వాక్యం చూడండి.

وَمَن يُطِعِ اللَّهَ وَالرَّسُولَ فَأُولَٰئِكَ مَعَ الَّذِينَ أَنْعَمَ اللَّهُ عَلَيْهِم مِّنَ النَّبِيِّينَ وَالصِّدِّيقِينَ وَالشُّهَدَاءِ وَالصَّالِحِينَ ۚ وَحَسُنَ أُولَٰئِكَ رَفِيقًا

"ఎవరైతే అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయులవుతారో, వారు అల్లాహ్ అనుగ్రహించిన ప్రవక్తలు, సత్యనిష్ఠులు, అమరవీరులు, సత్పురుషులతో కలిసి ఉంటారు. వారు ఎంత మంచి సహచరులు!" అని ఖురాన్ ప్రకటిస్తుంది. చివరిగా 24:52వ వాక్యం చూడండి.

وَمَن يُطِعِ اللَّهَ وَرَسُولَهُ وَيَخْشَ اللَّهَ وَيَتَّقْهِ فَأُولَٰئِكَ هُمُ الْفَائِزُونَ

"ఎవరైతే అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు విధేయులై, అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి, ఆయనకు విధేయతతో జీవిస్తారో, వారే విజయం పొందినవార"ని ఖురాన్ చెబుతుంది.

ఈ నాలుగు వాక్యాల్లో మొదటిది– "ప్రవక్త ముహమ్మద్ను అనుసరిస్తేనే అల్లాహ్ ప్రేమిస్తాడు. దీని నుండి వైముఖ్యం చూపిస్తే కాఫిరలు అయిపోయినట్లే!" అని ఖురాన్ తీర్మానిస్తుంది. రెండవ వాక్యం– "అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ను అనుసరిస్తేనే స్వర్గ ప్రవేశం లేదంటే లేదు!" అని ఖురాన్ ప్రకటిస్తుంది. మూడవ వాక్యం– "అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ను అనుసరిస్తేనే స్వర్గంలో పుణ్యాత్ములతో సాంగత్యం!" ఆన్నది ఖురాన్ ప్రకటన. నాలుగోవ వాక్యం– "అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ను అనుసరిస్తేనే విజేతలు లేదంటే పరాజితులే!" అని చెబుతుంది.

ఇక్కడ దేవుని ప్రసన్నత, ఇహ–పరాల సాఫల్యం అల్లాహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ విశ్వాసించని వారెవరికీ లభించదన్నది గమనార్హం! కాబట్టి దీనిని 'విశ్వాసపథాని'కి చెందిన మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) అని చెప్పాలి.

ఖురాన్ 'సమ్మిళితవాదం' (Inclusivism) ప్రబోధనాలు!

'విశ్వాసపథం' కోరే మత ఆధారిత 'ప్రత్యేకవాదం' (Exclusivism) గురించిన ఖురాన్ బోధనలు ఏమిటో చూశారు. వాటి ఆధారంగానే దేవుని ప్రసన్నత పొందటానికి ఇస్లాం మత 'స్వీకారం తప్పనిసరని ముస్లిములు ప్రచారం చేస్తూ ఉంటారు. అయితే దానితో పాటు, ఇక, 'వివేకపథం' కోరే విలువల ఆధారిత 'సమ్మిళితవాదం' (Inclusivism) గురించిన ప్రబోధనలు కూడా ఖురాను గ్రంథం చేస్తున్న వైనాన్ని చూడండి.

1. 'إِنَّ ٱللَّهَ بِٱلنَّاسِ لَرَءُوفٌ رَّحِيمٌ' / "నిశ్చయంగా అల్లాహ్ మానవుల యెడల అమితమైన వాత్సల్యం కలవాడు! పరమ కృపాశీలుడు" (2:143),

2. 'وَلَٰكِنَّ ٱللَّهَ ذُو فَضْلٍ عَلَى ٱلْعَٰلَمِينَ' / "అల్లాహ్ లోకవాసులపై ఎంతో దయానుగ్రహం కలవాడు" (2:251),

3. ‘إِنَّ ٱللَّهَ لَا يَظْلِمُ ٱلنَّاسَ شَيْـًٔا’/“అల్లాహ్ అయితే మానవాళికి ఏ కాస్త అన్యాయం కూడా చేయడు”. (10:44),

4. ‘إِنَّ ٱللَّهَ لَذُو فَضْلٍ عَلَى ٱلنَّاسِ’/“నిశ్చయంగా అల్లాహ్ ప్రజల పట్ల దయా దాక్షిణ్యాలు గలవాడు” (40:61),

5. ‘وَلَقَدْ كَرَّمْنَا بَنِىٓ ءَادَمَ’/“మేము ఆదం సంతతికి గౌరవం పొసగాము” (17:70),

అందుకే ఖురాన్ 4:58వ వాక్యం ఏమంటుందో చూడండి. ‘ وَإِذَا حَكَمْتُم بَيْنَ النَّاسِ أَن تَحْكُمُوا بِالْعَدْلِ’ అంటే “మీరు మానవుల మధ్య తీర్పు ఇచ్చేటప్పుడు అత్యంత న్యాయంగా తీర్పు ఇవ్వాలని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు!” అని ఖురాన్ ముస్లిములకు తాకీదు చేస్తుంది.

పై వాక్యాల్లో ప్రవక్త ముహమ్మద్ను విశ్వాసించిన ముస్లిముల పట్ల అని కాక; అల్లాహ్, సర్వ మానవాళి పట్ల • వాత్సల్యం కలవాడు, • దాయానుగ్రహం కలవాడు, • అన్యాయం చేయనివాడు, • దయా దాక్షిణ్యం కలవాడు వగైరా అని ఖురాన్ చెబుతుంది.

అల్లాహ్ ఎవరిని ప్రేమిస్తాడు!?

అల్లాహ్ ఎవరిని ప్రేమిస్తాడు? అన్న ప్రశ్నకు అటు– ముస్లిములు మమ్మల్నే ప్రేమిస్తాడు అనుకుంటూ ఉంటారు. ఇటు– ముస్లిమేతరులు కూడా ఖురాన్ ప్రకారం అల్లాహ్ ముస్లిములనే ప్రేమిస్తాడని భావిస్తుంటారు. ఇంతకూ అల్లాహ్ మతవర్గాలను బట్టి ప్రేమిస్తాడా? లేక సత్కర్మలను బట్టి ప్రేమిస్తాడా? ఖురాన్ సమాధానం ఏమిటో చూడండి.

1. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلتَّوَّٰبِينَ وَيُحِبُّ ٱلْمُتَطَهِّرِينَ/అల్లాహ్ పశ్చాత్తాపడి, పారిశుద్ధ్యాన్ని పాటించే వారినే ప్రేమిస్తాడు (2:222),

2. فَإِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُتَّقِينَ/అల్లాహ్ భయ–భక్తులు గలవారినే ప్రేమిస్తాడు (3:76),

3. وَٱللَّهُ يُحِبُّ ٱلصَّٰبِرِينَ/అల్లాహ్ సహనమూర్తులనే ప్రేమిస్తాడు (3:146),

4. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُتَوَكِّلِينَ/అల్లాహ్ తనను నమ్ముకున్న వారినే ప్రేమిస్తాడు (3:159),

5. وَٱللَّهُ يُحِبُّ ٱلْمُحْسِنِينَ/సదాచార సంపన్నులనే అల్లాహ్ ప్రేమిస్తాడు (5:93),

6. وَٱللَّهُ يُحِبُّ ٱلْمُطَّهِّرِينَ/ పవిత్రతను పాటించే వారినే అల్లాహ్ ప్రేమిస్తాడు (9:108),

7. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلْمُقْسِطِينَ/అల్లాహ్ న్యాయం చేసే వారినే ప్రేమిస్తాడు (49:9),

8. إِنَّ ٱللَّهَ يُحِبُّ ٱلَّذِينَ يُقَٰتِلُونَ فِى سَبِيلِهِۦ صَفًّا كَأَنَّهُم بُنْيَٰنٌ مَّرْصُوصٌ/అల్లాహ్ ప్రేమించేది సీసం పోసి నిర్మింపబడిన గోడలాగా ఐక్యమత్యంతో స్థిరంగా ఆయన మార్గంలో పరిశ్రమించే వారినే సుమా! (61:4)

వాస్తవానికి • పశ్చాత్తాపం, పారిశుద్ధత, • భయ-భక్తులు, • సదాచార సంపన్నత, • పవిత్రత, • న్యాయం, • ఐక్యమత్యంతో పరిశ్రమించటం వగైరా అనే ఆయా నైతిక-మానవీయ సత్కర్మలను పేర్కొని, "వాటిని ఆచరించే వారిని మాత్రమే అల్లాహ్ ప్రేమిస్తాడు!" అని ఖురాను చెబుతుంది. కానీ, పూర్తి ఖురానులో "అల్లాహ్ ముస్లిములనే ప్రేమిస్తాడు!" అనే ఒక ప్రత్యేక మతవర్గం గురించి ఎలాంటి ప్రకటనలూ లేవు.

అల్లాహ్ ఎవరిని ప్రేమించడు!?

గత అంశంలో అల్లాహ్ ఎవనిని ప్రేమిస్తాడో చూశారు. అలాగే అల్లాహ్ ఎవరిని ప్రేమించడో చూడండి.

1. 'إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْمُعْتَدِينَ'/'మితిమీరి పోయేవారిని అల్లాహ్ ప్రేమించడు' (2:190),
2. 'وَٱللَّهُ لَا يُحِبُّ ٱلْفَسَادَ'/'అల్లాహ్ అవినీతిని సుతరామూ ప్రేమించడు' (2:205),
3. وَٱللَّهُ لَا يُحِبُّ كُلَّ كَفَّارٍ أَثِيمٍ/మేలును మరిచే పాపిష్టులను అల్లాహ్ ప్రేమించడు (2:276),
4. فَإِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْكَٰفِرِينَ/సత్య తిరస్కారులను అల్లాహ్ ప్రేమించడు (3:32).
5. وَٱللَّهُ لَا يُحِبُّ ٱلظَّٰلِمِينَ/అల్లాహ్ దౌర్జన్యపరులను ప్రేమించడు (3:57).
6. إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ مَن كَانَ خَوَّانًا أَثِيمًا/దగాకోరు, పాపిష్టిని అల్లాహ్ ప్రేమించడు (4:107).
7. 'وَٱللَّهُ لَا يُحِبُّ ٱلْمُفْسِدِينَ'/'అల్లాహ్ కల్లోల జనకులను ప్రేమించడు' (5:64),
8. 'إِنَّهُۥ لَا يُحِبُّ ٱلْمُسْرِفِينَ'/'అతికి పాల్పడే వారిని అల్లాహ్ ప్రేమించడు' (6:141),
9. 'إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْخَآئِنِينَ'/'ద్రోహులను అల్లాహ్ ఎంత మాత్రం ప్రేమించడు' (8:58),
10. 'إِنَّهُۥ لَا يُحِبُّ ٱلْمُسْتَكْبِرِينَ'/'గర్విష్టులను ఆయన ఏ మాత్రం ప్రేమించడు' (16:23),
11. 'إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ ٱلْفَرِحِينَ'/'మిడిసిపడే వారిని అల్లాహ్ ప్రేమించడు' (28:76)
12. إِنَّ ٱللَّهَ لَا يُحِبُّ كُلَّ مُخْتَالٍ فَخُورٍ/బడాయి కోరులను అల్లాహ్ ప్రేమించడు (31:18)

అని ఖురాన్ ప్రకటిస్తుంది. "ముస్లిములు కాని వారైనా హిందువులను, యూదులను, క్రైస్తవులను తదితర సకల ముస్లిమేతరులను అల్లాహ్ ప్రేమించడు!" అన్నది మెజారిటీ ముస్లిముల సాధారణ అపోహ!

వాస్తవానికి • మితిమీరే వారు, • అవినీతి పరులు, • కల్లోల జనకులు, • అతికి పాల్పడే వారు, • ద్రోహులు, • గర్విష్టులు, • కల్లోల జనకులు, • మిడిసిపడేవారు వగైరా అనే "ఆయా 'దుష్కర్మల'కి పాల్పడే వారిని అల్లాహ్ ప్రేమించడు!" అని మాత్రమే ఖురానులో ఉంది. కానీ...

1. "అల్లాహ్ హిందువులను ప్రేమించడు!",

2. "అల్లాహ్ యూదులను ప్రేమించడు!",

3. "అల్లాహ్ క్రైస్తవులను ప్రేమించడు!",

4. "లేదా తదితర మతవర్గాల పేరును ప్రస్తావించి; అల్లాహ్ ప్రేమించడు!" అన్న ప్రకటనలు ఖురాను గ్రంథంలో ఏకోశానా లేవు. వేరే ఏ ధర్మ గ్రంథంలోనూ లేవు!

గమనిక: అల్లాహ్, ప్రేమ–ద్వేషాలకు ఒక్క సత్కర్మలు–దుష్కర్మలు మాత్రమే ప్రాతిపదిక తప్ప, ఎలాంటి మత వర్గాలు కాదన్నది అత్యంత గమనార్హం!

"ప్రవక్త ముహమ్మద్ను విశ్వసిస్తేనే అల్లాహ్ ఇహపరాల సాఫల్యం ప్రసాదిస్తాడు!" అని మాత్రమే ఖురాన్ చెబుతుందని చాలా మంది ముస్లిములే కాక, ముస్లిమేతరులూ భావిస్తుంటారు. అయితే ఖురాన్ 2:62వ వాక్యం ఏమంటుందో చూడండి.

إِنَّ ٱلَّذِينَ ءَامَنُواْ وَٱلَّذِينَ هَادُواْ وَٱلنَّصَٰرَىٰ وَٱلصَّٰبِـِٔينَ مَنْ ءَامَنَ بِٱللَّهِ وَٱلْيَوْمِ ٱلْءَاخِرِ وَعَمِلَ صَٰلِحًا فَلَهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ

"1) విశ్వసించినవారైనా (అంటే ముస్లిములైనా), 2) యూదులైనా, 3) క్రైస్తవులైనా, 4) సాబియనులు అయినా (అనగా హిందువులైనా) ఇంకా 5) మరెవరైనాసరే I) అల్లాహ్ను, II) అంతిమ దినాన్ని విశ్వసించి III) సదాచరణ చేస్తే, వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంటుంది. (ఇహ–పరాల్లో) వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

ఈ వాక్యంలోనూ "మహనీయ ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించిన ముస్లిములకి మాత్రమే "ఇహ–పరాల్లో భయంగానీ, దుఃఖంగానీ ఉండదు!" అని కాక, 1) ప్రవక్త ముహమ్మద్ను

విశ్వసించిన ముస్లిములైనా, 2) ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించని యూదులైనా, 3) క్రైస్తవులైనా, 4) సాబియనులు అయినా (అనగా హిందువులైనా) ఇంకా 5) మరెవరైనాసరే కేవలం మూడు విషయాలు గనక పాటిస్తే వారికి వారి ప్రభువు వద్ద ప్రతిఫలం ఉంటుందని ఖురాన్ సంపూర్ణ హామీనిస్తుంది.

దీనినిబట్టి ఒకడు ముస్లిములో జన్మించినప్పటికీ ఒకవేళ ఖురానులో పేర్కొన్న 'విశ్వాసాలూ-ఆరాధనాల'తోపాటు, "సత్కర్మలు" గనక కలిగి ఉండకపోతే అతడు ఒక 'నామకార్థ ముస్లిం' తప్ప 'సజ్జనుడైన ముస్లిం' కాజాలడు. అలాగే ఒకవ్యక్తి ఈనాటి 'ఏ మతవర్గం'లో జన్మించినప్పటికీ ఒకవేళ అతడు ఖురాను పైన పేర్కొన్న మూడు విషయాలను గనక కలిగి ఉంటే అతడు అల్లాహ్ దృష్టిలో 'సజ్జనుడైన ముస్లిం' కాగలడు!

విశ్వాసం లేకపోయినా సత్కర్మలతో సాఫల్యం!

గీతా, బైబిలు, ఖురాన్ గ్రంథాలు మత గ్రంథాలు మాత్రమే కావు. అవి ధర్మ గాంథాలు కూడా. అందుకే అవి ఆయా మతవర్గాలకి చెందిన 'ప్రత్యేకవాదం'తో పాటు సర్వజనులకు చెందిన 'సార్వత్రికవాదం' కూడా కలిగి ఉన్నాయి. ఆ విషయాన్ని మీరు గత అంశాల్లో అధ్యయనం చేసి ఉన్నారు. అంతేకాదు విశ్వాసానికి అతీతంగా కేవలం మానవాళి సంక్షేమం కోసం పాటుపాడేవారు కూడా దైవాన్ని విశ్వసించినట్లే అని గీతా, బైబిలు, ఖురాన్ గ్రంథాలు ప్రకటిస్తున్న వైనాన్ని చూడండి.

దైవమూ-విశ్వాసము, పూజలూ-ప్రార్థనలు వంటి అలౌకిక విషయాలతో సంబంధం లేకుండా కేవలం నైతికతా-మానవత, సేవ-సహాకారం వంటి లౌకిక విలువల అనుసరణ ద్వారా ఇహ-పరాల సాఫల్యం ఎలా సాధ్యం? అన్నది భావవాదుల సందేహం!

మనుషుల్లో 'భావవాదం' ప్రాబల్యంలో ఉన్నవారు లేదా 'భౌతికవాదం' ప్రాబల్యంలో ఉండేవారు ఉంటారన్నది ఒక వాస్తవం అన్నది తెలిసిందే కదా! ఈ రెండు మనస్తత్వాలను సృష్టించింది ఆ ఏకైక సృష్టికర్తే అన్నది కూడా ఒక వాస్తవం.

అటువంటప్పుడు తన ప్రసన్నత పొందటానికి అందరినీ కేవలం ఒక్క 'విశ్వాసపథం' ద్వారానే నా ప్రసన్నత లభిస్తుంది 'వివేకపథం' ద్వారా లభించదు అంటే అది మానవుల పట్ల అన్యాయం అవుతుంది కదా!

సృష్టికర్త తన సకల మానవుల పట్ల కారుణ్యం కలవాడు మరియు న్యాయకారి కాబట్టి రెండు మార్గాలనూ ఆమోదించాలి కదా! అందుకే 'దేవుని అస్తిత్వం, భక్తి-పూజ'వంటి

'అభౌతిక' విషయాల్లో "అభ్యాసే అపి అసమర్థః"/"అభ్యాసములో ఒకవేళ అసమర్థుడవైతే" అన్న లౌకిక వాదులకు ఉన్న సమస్యను ఉటంకించి, 'అలౌకిక మార్గాని'కి ప్రత్యామ్నాయం అయిన 'సత్కర్మల అనుసరణ' అనే ఒక 'లౌకికమార్గం' కూడా ఆయనే చూపిస్తున్నాడు! అలాంటి వారికోసమే ఈ అంశం.

దేవుని తనపట్ల విశ్వాసం–భక్తి లేకపోయినా కేవలం 'వివేకపథం' ఆధారంగా చేసే "సత్కర్మల"తో కూడా ఒకడు నా అనుగ్రహానికి పాత్రుడు కాగలడు అనే హామీ దైవమే స్వయంగా తన శాస్త్రాల్లో ఇస్తున్న వైనాన్ని చూడండి.

గీతా శాస్త్రం 12:10– అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ।
మదర్థమపి కర్మాణి కుర్వన్సిద్ధిమవాప్స్యసి॥

"1) నన్ను భక్తితో స్మరించే అభ్యాసం చేయలేకపోతే 2) నా కోసమే పనులు చెయ్యటానికి ప్రయత్నం చేయుము. 3) ఈ విధంగా నా కొరకు కర్మలు చేయటం వలన నీవు పరిపూర్ణ స్థాయిని చేరుకోగలవు" అని సర్వేశ్వరుడే స్వయంగా ప్రకటిస్తున్నాడు.

ఈ శ్లోకంలో ఉన్న గమనార్హ విషయాల్లో ఒకటి– 'దేవుని అస్తిత్వం, భక్తి–పూజ' అనే విషయాలకు బదులు, "మదర్థమపి కర్మాణి కుర్వన్"/"నా కోసమే కర్మలు చెయ్యటానికి ప్రయత్నం చేయుము" అంటే ఇక్కడ వచ్చే అర్థం ఏమిటి? 'నైతిక–మానవీయ విలువలైన సత్కర్మలే' కదా! వాటిని ఆచరించినా "సిద్ధిమవాప్స్యసి"/"నీవు పరిపూర్ణ స్థాయిని చేరుకోగలవు!" అన్న సంపూర్ణ హామీ ఆ పరమేశ్వరుడే స్వయంగా ఇస్తున్నాడని తెలిపోయింది!

దీని ప్రకారం వైదిక వాఙ్మయంలో ఒక్క 'విశ్వాసపథ'గాముల 'ప్రత్యేకవాదం' (Exclusivism) సంబంధిత బోధనలే కాక, 'వివేకపథ'గాములకు సైతం వర్తించే సార్వత్రిక 'సమ్మిళితవాద' (Inclusivism) ప్రబోధనలు కూడా ఉన్నాయని తెలుస్తుంది!

ఇదే విషయాన్ని బైబిలూ చెబుతుంది!

బైబిలులో ఎన్నెన్నో ఆజ్ఞలు–ఆదేశాలు ఉన్నాయి. వాటన్నిటిలో "గోల్డెన్ రూల్" పేరిట ప్రతీతి పొందిన ఆజ్ఞ ఏమిటో చూడండి.

బైబిలు మత్తయి 7:12– "కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశము నైయున్నది" అని యేసు ప్రకటిస్తున్నారు. లోకులైతే దీనిని గోల్డెన్ రూల్ అన్నారు. యేసు మరొక సందర్భంలో దానికి ఇంకా ఎంతటి స్థానం ఇస్తున్నారో చూడండి.

బైబిలు మత్తయి 22: 36–39– "బోధకుడా! ధర్మ శాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ ఏదని అడిగెను.। అందుకాయన నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెననునదియే.। ఇది ముఖ్య మైనదియు మొదటిదియునైన ఆజ్ఞ.। నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింప వలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే".

పాతా, క్రొత్త నిబంధనల్లో ప్రధానమైన ఆజ్ఞ– సృష్టికర్త అద్వితీయతను విశ్వసించటం. దాని తరువాత వెంటనే వచ్చే ఆజ్ఞ తోటి మనుషులను తనను తాను ఎంతగా ప్రేమిస్తాడో అంతగానే ప్రేమించటం.

అయితే పై వాక్యంలో యేసు ఒక అత్యంత విశేషమైన ప్రకటన చేస్తున్నారు. అది చాలా కీలకమైనది. కాస్త జాగ్రత్తగా గమనించండి...

అది "రెండవ ఆజ్ఞయు దాని వంటిదే!" అన్నది.

దీని ప్రకారం ఒక వ్యక్తి అటు– "సృష్టికర్త అయిన దేవుడు ఉన్నాడు" అనే 'విశ్వాసం' కలిగి ఉంటాడు. ఇటు– తన చుట్టూ ఉన్న వారిలో కుల–మతాలకు అతీతంగా తన వలె తన తోటివారి పట్ల ప్రేమకలిగి, వారి సేవలు చేస్తున్నాడు.

మరొక వ్యక్తి దేవుని పై ఎలాంటి విశ్వాసం కలిగి లేడు. అంటే దేవుని విషయంలో తటస్థుడు. దేవుని విషయంలో జగడాలి మారి కాడు. కానీ తన చుట్టూ ఉన్న వారిలో కుల–మతాలకు అతీతంగా తనవలె తన తోటివారి పట్ల ప్రేమకలిగి, వారి సేవలు చేస్తున్నాడు.

కాబట్టి యేసు, పైన చేసిన ప్రకటనను బట్టి అతడు కూడా మొదటి ఆజ్ఞను అంటే దేవుని పట్ల విశ్వాసం పరోక్షంగా కలిగి ఉన్నట్లే అని తెలుస్తుంది. దీనిని కాదంటే యేసు చేసిన ఆ తీర్మానాన్ని అసత్యమని తిరస్కరించినటే!

గమనిక: ఒకవేళ ఎవరైనా తమకు దేవుని గూర్చిన జ్ఞానం లేనప్పటికీ వారుగనక తమ తోటివారికి ఎలాంటి 'కీడు' తలపెట్టకుండా, వారికి 'మేలు' చేస్తుంటే అలాంటి వారు కూడా పరోక్షంగా దైవాన్ని ప్రేమిస్తున్నట్లే అన్నది అత్యంత గమనార్హం!

అయితే పూర్తి బైబిలులో ఎక్కడా అలాంటి ప్రకటన ప్రార్థనలూ–ఉపవాసలాను గురించి చేయలేదు. అందుకే అది "గోల్డెన్ రూల్" అయ్యింది.

ఇదే విషయాన్ని ఖురానూ చెబుతుంది!

ఖురాను గ్రంథాన్ని కాస్త నిశితంగా అధ్యయనం చేస్తే విశ్వాసాలూ–ఆరాధనలు అన్నవి Means అని మరియు సత్కర్మలు అన్నవి Ends అని కూడా ఎంతో స్పష్టంగా తెలుస్తుంది. ఈ విషయాన్ని "సత్కర్మలే సర్వోన్నతం!" అనే మా వేరొక రచనలో చూడగలరు. అయితే ఖురాన్ 25:70వ 'భావవాదుల' కోసం మాట్లాడుతున్న వైనాన్ని ముందుగా చూడండి.

إِلَّا مَن تَابَ وَءَامَنَ وَعَمِلَ عَمَلًا صَٰلِحًا فَأُو۟لَٰٓئِكَ يُبَدِّلُ ٱللَّهُ سَيِّـَٔاتِهِمْ حَسَنَٰتٍ ۗ وَكَانَ ٱللَّهُ غَفُورًا رَّحِيمًا

"అయితే (ఈ పాపకార్యాల తరువాత) 1) ఎవరు పశ్చాత్తాపం చెంది, 2) విశ్వసిస్తారో, 3) సదాచరణ చేస్తారో అలాంటి వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చి వేస్తాడు. అల్లాహ్ క్షమాభిక్ష పెట్టేవాడు, కరుణాకరుడు" అని ఖురాన్ చెబుతుంది.

ఈ వాక్యంలో ఒక వ్యక్తి పాప పరిహారం జరగటానికి మూడు విషయాలు చెప్పబడ్డాయి. వాటిలో...

1. దుష్కర్మల నుండి ఎవరు పశ్చాత్తాపం చెందటం,

2. దేవుని పట్ల విశ్వాసం కలిగి ఉండటం,

3. సత్కర్మలు ఆచరించటం.

ఈ మూడు విషయాల్లో రెండవది 'విశ్వాసం' గురించి ఉందన్నది గమనార్హం. అందుకే పైవాక్యం 'భావవాదుల' కోసం మాట్లాడుతుందని తెలుస్తుంది.

పైకవాక్యానికి తరువాత వచ్చిన 25:71వ వాక్యం 'భౌతికవాదుల' కోసం మాట్లాడుతున్న వైనం కనిపిస్తుంది. గమనించండి.

وَمَن تَابَ وَعَمِلَ صَالِحًا فَإِنَّهُ يَتُوبُ إِلَى اللَّهِ مَتَابًا

متفقہ اسلام 360 اردو అనువాదం– "اور جو توبہ کرے اور نیک عمل کرے تو بے شک وہ اللہ ہی کی طرف رجوع کرتا ہے۔"/" మరియు 1) ఎవరైతే పశ్చాత్తాపపడి, 2) సత్కర్మలు చేస్తాడో, నిజానికి అతడు అల్లాహ్ వైపు మరలుతున్నట్లే!" అని ఖురాన్ సంపూర్ణంగా హామీ ఇస్తుంది.

పై వాక్యంలో 1) 'పాశ్చాత్తాపం' మరియు 2) 'సత్కర్మలు' అనే రెండు విషయాల ప్రస్తావనే తప్ప, 'విశ్వాసం' గురించిన ప్రస్తావన లేదన్నది గమనార్హ విషయం.

ఒక విశ్వాసి కాని వ్యక్తి సత్కర్మలు చేస్తున్నా సాధారణంగా భావవాదులు ఒప్పుకోరు. అంటే అతడు దైవాన్ని విశ్వాసించకుండా అతడి సత్కర్మలు దేవుడు స్వీకరించడని అభ్యంతరం పెడతారు. ఏ వ్యక్తి అయితే దుష్కర్మలు విడనాడి, సత్కర్మలు చేయటం ప్రారంభిస్తాడో అలాంటి వాడు ప్రజల ముందు– "నేను దైవాన్ని విశ్వసిస్తున్నాను!" అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దైవానికి మానవుల విశ్వాస ప్రకటనలుగాని, మానవుల ఘన కీర్తనలుగాని అవసరం లేదు.

గమనిక: నిజానికి ఆయన 'సత్కర్మల'కి ప్రేరకం కావాలనే 'విశ్వాసాలూ–ఆరాధనల'ను విధి చేశాడు. ఒక వ్యక్తి తనలోని 'సహజ వివేకం ప్రేరణ'తో "సత్కర్మలు" ఆచరిస్తే దేవుని ఉద్దేశ్యానికి చేరిపోయినట్లే కదా! అందుకే వాని విషయంలోనే పైవాక్యం– 'فَإِنَّهُ يَتُوبُ إِلَى اللَّهِ مَتَابًا'/" నిజానికి అతడు అల్లాహ్ వైపు మరలుతున్నట్లే!" అని చెబుతుందన్నది గమనార్హం!

ఈ హామీ ధర్మగ్రంథాలు ఇవ్వటానికి ప్రధాన కారణం, విశ్వాసాలూ–ఆరాధనలకి చెందిన "ఆచార ఆజ్ఞల" (Means) కంటే "నైతికతా–మానవత ఆజ్ఞలు" (End) ప్రాధాన్యత కలిగి ఉండటమే!

సారాంశం

ఈ అధ్యయనంతో ప్రతి ధర్మశాస్త్రంలోనూ ఒకటి– 'విశ్వాసపథం' కోరే 'దేవుడూ–ప్రార్థనాది క్రతులతోపాటు విలువలు' పాటిస్తేనే దైవ ప్రసన్నత లభిస్తుందనే 'ప్రత్యేకవాదం' (Exclusivism) ఒకటి ఉందని తెలిసింది. ఇదొక్కటే కాక, రెండవదైన 'వివేకపథం' కోరే 'నైతికతా–మానవతా విలువలు' పాటించే వారికీ దైవ ప్రసన్నత లభిస్తుందనే 'సమ్మిళిత వాదం' (Inclusivism) కూడా మరొకటి ఉందని తెలిసింది. ఇంకా దీని నుండి మూడు కీలకమైన విషయాలు మన ముందుకు వస్తున్నాయి. వాటిలో...

1. 'బయటి మత వర్గాల' (Extro religious groups) మధ్య విభేదాలకి అవకాశం లేదు. ఎందుకంటే ఏ మతస్థులైనా వారివారి మత విశ్వాసాల కంటే,

సత్కర్మల ఆధారంగానూ ఇహ–పరాల సాఫల్యం కలుగుతుందని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి.

2. 'లోపలి మత వర్గాల' (Intro religious groups) మధ్య విభేదాలకి అసలే అవకాశం లేదు. మత విశ్వాసాలూ–ఆచారాల కంటే నైతికతా–మానవతా విలువలే దైవ ప్రసన్నతకి ఆలంబన అని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి.

3. 'ఆస్తిక–నాస్తిక వర్గాల' (Theistic and atheistic groups) మధ్య విభేదాలకీ అవకాశం లేదు. ఒకడు విశ్వాసంలో లేనప్పటికీ, అతడు గనక నైతికతా–మానవతా విలువలు కలిగి ఉంటే విశ్వాసంలో ఉన్నట్లే అని ధర్మశాస్త్రాలు హామీ ఇస్తున్నాయి.

ఇంతవరకూ ధర్మశాస్త్రాలు 'విశ్వాసాలకీ–కర్మకాండల'కి మాత్రమే విశేష ప్రాధాన్యత ఇస్తున్నాయనే భావన ఉండేది. అయితే ఈ అధ్యయనంతో నిజానికి అవి వాటికంటే "సత్కర్మల"కే పెద్దపీట వేస్తున్నాయని సుస్పష్టం అయ్యింది.

కాబట్టి అటు– 'బయటి మత వర్గాలు' ఇటు– 'లోపలి మత వర్గాలు' అలాగే 'ఆస్తిక–నాస్తిక వర్గాలు' పరస్పరం దేవుడూ, విశ్వాసాలూ–ఆచారాల విషయంలో విభేదాలకు–తగాదాలకు దిగి సిగపట్లు పట్టవలసిన అవసరం లేదు. ఎందుకంటే దేవుని దృష్టిలో సజ్జనులైన ఆస్తికులు ఎంత గొప్పవారో సజ్జనులైన నాస్తికులూ అంతే గొప్పవారని కూడా ధర్మశాస్త్రాల అధ్యయనంతో సుస్పష్టమయ్యింది. ఇదే ఈ చిరు పుస్తకం సారాంశం!

కిం కర్తవ్యం?

వివేకపథానికి చెందిన బుద్ధీ–జ్ఞానాలు: "ఆస్తికులు అయినా నాస్తికులు అయినా వారు గనక సజ్జనులైతే దైవ అనుగ్రహం కలగాలి. అలాగే ఆ ఇరువర్గాల్లో దుర్జనులైన వారికి దండన లభించాలి!" అని అంటున్నాయి. విశ్వాసపథానికి చెందిన గ్రంథాలూ–శాస్త్రాలు కూడా సరిగ్గా అదే చెబుతున్నాయి.

కాబట్టి ఆయా ఆస్తిక–నాస్తిక వర్గాలూ మత విశ్వాసాల గురించి విభేదాలు పూర్తిగా విడనాడి, కేవలం సత్కర్మలు ఆచరించే విషయంలో పరస్పరం పోటీపడాలి. దానికి గాను ఈ చిరు పుస్తకంలో పేర్కొన్న సువిశాల ధర్మశాస్త్రాల ప్రబోధనలను సర్వసామాన్యం చేయాలి. ఇదే మనందరి కర్తవ్యం కావాలి.

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

నైతికతా-మానవతా విలువలు పాటించే

లోకులందరూ భక్తులే!



Part-7

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

మత దుర్హంకారం ప్రదర్శించే హక్కు ఏ మతస్థునికీ లేదు!----------I

లోకులందరూ భక్తులే!----------1

భగవద్గీత ప్రకారం–
ఒక్క బ్రాహ్మణ కులంలో జన్మించిన వారే దేవునికి ఇష్టులా!?----------1

పాతనిబంధన ప్రకారం– ఒక్క యూదులతోనే
దేవుడు నిబంధనా ప్రమాణం చేశాడా? యూదులే దైవజనులా!?----------2

క్రొత్త నిబంధన ప్రకారం
ఒక్క క్రైస్తవ 'విశ్వాసము' కలిగిన వానికే రక్షణ? మరెవనికీ రక్షణ లేదా?----------4

ఖురాన్ ప్రకారం–
ఒక్క 'ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించిన వారు మాత్రమే అల్లాహ్'కి ఇష్టులా!?----5

ఖురాన్ ఇస్తున్న విశ్వజనీన భావన ఏమిటో చూడండి!----------8

ముస్లిమేతరులందరినీ కాఫిర్లుగా తీర్మానించలేరు!----------8

1. సకల సృష్టితాలూ ముస్లిములే!----------9

2. సకల మానవులూ ప్రకృతి సిద్ధంగా ముస్లిములే!----------10

3. ఈ లోకంలో ఉన్నవారంతా దైవాదేశాలూ–ప్రవక్తల ఆదర్శాలు కలిగినవారే!----11

4. గత ప్రవక్తల అనుయాయుల్లోనూ ఇహ–పరాల సాఫల్యం పొందేవారు ఉన్నారు!–13

ఖురాన్ ప్రకారం–
ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలోనూ విశ్వాసులు ఉన్నారు!----------13

ఖురాన్ ప్రకారం– ప్రవక్త ముహమ్మద్'ను
విశ్వసించని వారిలో ఇస్లామీయ విశ్వాసాలు, విలువలు కలిగినవారు ఉన్నారు!----14

ఖురాన్ ప్రకారం– ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో సత్య మార్గంపై
నిలకడగా ఉండేవారు ఉన్నారు! ఇంకా అల్లాహ్ వాక్యాలు పఠించేవారు ఉన్నారు!--15

ఖురాన్ ప్రకారం– ప్రవక్త ముహమ్మద్'ను
విశ్వసించని వారిలో సత్య మార్గదర్శకత్వం వహించేవారు ఉన్నారు!----------15

ఖురాన్ ప్రకారం–
ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో మధ్యేమార్గంపై నడిచేవారున్నారు!----16

ఖురాన్ ప్రకారం–
ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో సౌశీల్యవంతులు ఉన్నారు!--------16

ఖురాన్ ప్రకారం–
ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో ముస్లిములు ఉన్నారు!----------17

5. సకల ప్రవక్తల అనుయాయులూ ముస్లిములే!----------17

6. ఏ వర్గానికి చెందిన వారైనా ఆ మూడు విషయాలను ఆచరిస్తే ముస్లిములే!-----18

తన 'రిసాలత్'లో లేని ఒక విశ్వాసి
జనాజా నమాజ్ చేయించిన మానవమహోపకారి ప్రవక్త ముహమ్మద్!---------19

7. సకల మతాలూ ఇస్లాం ధర్మ హెచ్చు–తగ్గుల రూపాలే!----------21

ఈనాటి మానవాళి వర్గీకరణ అలా కాక, ఇలాగే జరగాలి!----------22

మత దుర్హంకారం ప్రదర్శించే హక్కు ఏ మతస్థునికీ లేదు!

"లోకులందరూ భక్తులే!" లేదా "లోకులందరూ ముస్లిములే!" అన్న ప్రకటన మీకు చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది కదూ!? ఎందుకంటే ముస్లిం అనే పదానికి మీకు అర్థం తెలియదు కాబట్టి. 'ఇస్లాం' అంటే 'దైవ విధేయత'. 'ముస్లిం' అంటే 'దైవ విధేయుడు'. చెడు చేయకుండా మంచి చేయవటమే 'దైవ విధేయత'. ఏ రుషీశ్వరుడైనా, 1 లక్షా 24 వేల మంది ప్రవక్తల్లో ప్రతి ఒక్కరూ బోధించింది దైవ విధేయతే కదా. అదే అరబీ భాషలో చెప్పాలంటే ఇస్లామే కదా. దైవ విధేయతను పాటించేవాడు దైవ విధేయుడే కదా. దీనిని అరబీ భాషలో చెప్పాలంటే ముస్లిమే కదా!

నిజానికి ఆదిలో ఇదే విషయం 'వైదిక ధర్మం' బోధించింది. అది కూడా ప్రజలను 'దైవ విధేయులు'గా మారమని అజ్ఞాపిస్తుంది. సంస్కృతంలో ఈ దైవ విధేయతను 'యోగము' అంటారు. యోగము అంటే కలియిక. దేవుని విధి-నిషేధాల ఆజ్ఞలు పాటించే వానిని 'యోగి' అంటారు. యూదులు, క్రైస్తవులు అదే దైవ ధర్మాన్ని 'యూద ధర్మం' అని, 'క్రైస్తవ ధర్మం' అని అంటారు. వారి ధర్మం కూడా దేవునికి 'విధేయత' పాటించమనే చెబుతుంది.

అయితే ఆయా మతాల్లో- 1) 'విశ్వాసాలు', 2) 'ఆరాధనలు' వేర్వేరుగా ఉంటాయి. కానీ వారందరూ పాటించవలసిన 3)వ దైన 'నైతిక-మానవీయ విలువలు' మాత్రం ఒక్కటిగానే ఉంటాయి. 'నిజమైన దైవ విధేయత' ఏమిటి? అన్న ప్రశ్నకి 'నైతిక-మానవీయ విలువలు' పాటించటం అన్నదే సరైన సమాధానం! ఈ రెండు విలువలే లేకపోతే ఏ మతవర్గంలో ఉన్నా దైవప్రసన్నత ఎంత మాత్రమూ లభించదు. ఈ విలువలు ఉంటే ఏ మతవర్గంలో లేకపోయినా దైవ ప్రసన్నత కచ్చితంగా లభిస్తుంది!

అటువంటప్పుడు ఏ మతస్థులైనా మా మతవర్గంలో చేరితేనే దేవునికి భక్తులు అవుతారు. వారికే మోక్షం, నిత్యజీవం, స్వర్గం అని వాదించే అవకాశం లేదుకదా! ఈ వాస్తవాన్ని అర్థం చేసుకుంటే ఈలోకంలో మతోన్మాదానికి తావే ఉండదు. ఈ మతోన్మాద భూతాన్ని వదిలించటమే తన ధ్యేయంగా చేసుకుని 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' పని చేస్తుంది.

కాబట్టి ఈ 'నైతిక-మానవీయ విలువలు' పాటించే లోకులందరూ యోగులే, యూదులే, క్రైస్తవులే, భక్తులే, ముస్లిములే అంటే తప్పుకాదు కదా!? ఈ సత్యాన్ని గుర్తిస్తే మత దుర్హంకారం ప్రదర్శించే హక్కు ఏ మతస్థునికీ ఉండదు! ఈ విషయాన్ని మరింత లోతుగా తెలుసుకోవాలంటే ఈ పుస్తకాన్ని నిశితంగా అధ్యయనం చేయక తప్పదు.

KAKINADA
12-02-2025

M. A. Abhilash

ఆయా మతవర్గాలకి దేనినిబట్టి విశిష్టత లభిస్తుంది!?

"మా బ్రాహ్మణులే ధార్మికులు, మా యూదులే ధార్మికులు, మా క్రైస్తవులే ధార్మికులు, మా ముస్లిములే ధార్మికులు! మిగిలిన వారందరూ భ్రష్టులూ, దుష్టులూ!" అనే సంకుచితతత్వంతో, అహంకారంతో ఆయా మత వర్గాలకి చెందిన కొందరు మతోన్మాదులు పరస్పరం విద్రవీగుతూ ఉంటారు. వీరి మనస్సుల్లో ఏర్పడిన ఈ మతదుర్హంకారమే గల్లీ మత ఘర్షణల నుండి, జాతులూ–దేశాల మధ్య యుద్ధాలకి కారణమౌతుంది!

అయితే ఆయా మత వర్గాల వారికి 'విశిష్టత' ఉందని వారివారి గ్రంథాల్లోనే ఉంది. అయితే వారికి లభించిన ఆ 'విశిష్టత'– 1) వారు జన్మించిన 'జాతి'ని బట్టి జన్మతః లభిస్తుందా? లేక 2) వారు కలిగి ఉన్న 'మత' వర్గాన్ని బట్టి లభిస్తుందా? లేక 3) వారు ఎంతో ఎఫోర్ట్ పెట్టి చేసుకొనే 'నైతికతా–మానవత' వంటి 'సత్కర్మల'ను బట్టి లభిస్తుందా? అన్నది ప్రశ్న. దీనికి సంక్షిప్త సమాధానం– "వారు చేసుకొనే 'సత్కర్మల'తో తప్ప, వారు జన్మించిన 'జాతి'ని బట్టి, వారు కలిగి ఉన్న ప్రత్యేక 'మత' వర్గాన్ని బట్టి మాత్రం లభించదు!" అన్నదే.

ధర్మ శాస్త్రాలు ఏమంటున్నాయి?

ఆయా మత వర్గాల్లో ఉన్న కొందరు దురహంకారులు తమ బూటకపు పెద్దరికాన్ని ధర్మ గ్రంథాల ప్రబోధనలతో justify చేసుకుంటూ ఉంటారు. నిజానికి అలాంటి సమర్థన వారి ధర్మ గ్రంథాల్లో ఏ కోశానా లేదు! వారి సంకుచిత, మతదుర్హంకార వాదనలకి ఎలాంటి ఆధారం లేదని హిందూ, యూదా, క్రైస్తవ ధర్మశాస్త్రాల నుండి సంక్షిప్తంగా మరియు ఖురాన్ ఆధారంగా సవివరంగా మీకు వివరించబోతున్నాను. కాస్త నిశితంగా గమనించండి.

భగవద్గీత ప్రకారం-
ఒక్క బ్రాహ్మణ కులంలో జన్మించిన వారే దేవునికి ఇష్టులా!?

గీతా శాస్త్రం 18:42– శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ।
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్॥

1) అంతరింద్రియ నిగ్రహము (మనోనిగ్రహము), 2) బాహ్యేంద్రియ నిగ్రహము, 3) తపస్సు, 4) శుచిత్వము, 5) ఋజు మార్గ వర్తనము, 6) శాస్త్రజ్ఞానము, 7) అనుభవజ్ఞానము, 8) దైవమందు, 9) గురువునందు, 10) శాస్త్రమందు నమ్మకము గలిగియుండుట (అనునివి) స్వభావము వలన పుట్టిన బ్రాహ్మణ కర్మయైయున్నది.

ఈ శ్లోకం ప్రకారం ఏ వ్యక్తిలో ఈ పది సుగుణాలు 'స్వాభావికం'గా ఉంటాయో వాడే బ్రాహ్మణుడని సుస్పష్టమౌతుంది. దీని ప్రకారం ఈనాటి 'నామకార్థ బ్రాహ్మణ కులం'లో జన్మించినప్పటికీ ఒకవేళ ఆ 'పది సుగుణాలు' లేకపోతే అతడు ఒక 'కుల బ్రాహ్మణుడు' తప్ప 'గుణ బ్రాహ్మణుడు' కాజాలడు.

అలాగే భగవద్గీత ప్రకారం– ఈనాటి 'నామకార్థ శూద్ర కులం'లో జన్మించిన ఒక వ్యక్తి ఆ 'పది సుగుణాలు' ఆచరిస్తే అతడు– "నేను గుణ బ్రాహ్మనుడను!" అని ప్రకటించుకునే ధార్మిక అర్హత ఉంటాడు. అలాగే ఈనాటి 'నామకార్థ బ్రాహ్మణ కులం'లో జన్మించి ఒక వ్యక్తి వేళవేళ ఆ 'పది సుగుణాలు' గనక ఆచరించకపోతే అతడు– "నేను గుణ బ్రాహ్మనుడను!" అని ప్రకటించుకొనే ధార్మిక అర్హతను కలిగి ఉండడు!

సకల మానవాళిలో ఎవరు ఆ 'పది సుగుణాలు' కలిగి ఉంటారో వారే దేవుని దృష్టిలో 'గుణ బ్రాహ్మణులు' కాగలరు. ఒకవేళ ఆ 'పది సుగుణాల'ను గనక కలిగి ఉండకపోతే

వారు 'కుల బ్రాహ్మణులు' అయినప్పటికీ 'గుణ బ్రాహ్మణులు' మాత్రం కాజాలరు. ఇదీ భగవద్గీత సందేశ సార్వత్రికత! సార్వజనీనత!!

దీని ప్రకారం– మేమే బ్రాహ్మణులం, దేవునికి మేమే ఇష్టులం, మాకే మోక్షం అన్న అహంకార పూరిత వాదన ఒక బూటకం అని తేలిపోతుంది.

పాతనిబంధన ప్రకారం- ఒక్క యూదులతోనే దేవుడు నిబంధనా ప్రమాణం చేశాడా? యూదులే దైవజనులా!?

ద్వితియోపదేశకాండము 29:13–15– "1) నీ పాళెములోనున్న పరదేశులేమి, 2) నీ కట్టెలను నరుకువారు మొదలుకొని 3) నీ నీళ్లుతోడే వారివరకును 4) మీరందరు నేడు మీ దేవుడైన యెహోవా సన్నిధిని నిలిచియున్నారు.. నేను మీతో మాత్రము కాదు, ఇక్కడ మనతో కూడను ఉండి, నేడు మన దేవుడైన యెహోవా సన్నిధిని నిలుచుచున్న వారితోను.. 5) ఇక్కడ నేడు మనతో కూడ నుండని వారితోను ఈ 'నిబంధన'ను ప్రమాణమును చేయుచున్నాను" అని దేవుడే స్వయంగా ప్రకటిస్తున్నాడు.

ఈ వాక్యం ప్రకారం దేవుడు ఒక్క యూదులతోనే నిబంధన చేశాడన్న యూదుల వాదన ఒక పెద్ద అబద్ధం అని తేలిపోయింది. ఎందుకంటే యూదుల వద్ద పనిచేయటానికి వచ్చిన యూదులు కాని అన్యులతో మరియు సకల లోకవాసులతోనూ 'నిబంధనా ప్రమాణము' చేసినట్లు దేవుడే చెబుతున్నాడు. అయితే యూదులతో 'ప్రత్యక్షం'గా మరియు యూదేతరులైన ప్రపంచ మానవులతో 'పరోక్షం'గా తీసుకున్న ఆ 'నిబంధన' ఏమిటి? అన్నది ప్రశ్న. బైబిలు ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి.

యిర్మియా 7:22,23– "నేను ఐగుప్తు దేశములో నుండి మీ పితరులను రప్పించిన దినమున దహనబలులను గూర్చి గాని బలులను గూర్చిగాని నేను వారితో చెప్పలేదు, అట్టి వాటిని గూర్చి నేను ఏ ఆజ్ఞయు ఇయ్యలేదు, ఈ ఆజ్ఞను మాత్రమే నేను వానికిచ్చితిని.. ఏదనగా నా మాటలు మీరు అంగీకరించిన యెడల నేను మీకు దేవుడనై యుందును మీరు నాకు జనులై యుందురు; మీకు క్షేమము కలుగునట్లు నేను మీకాజ్ఞాపించుచున్న మార్గమంతటి యందు మీరు నడుచుకొనుడి" అని దేవుడే స్వయంగా ఆజ్ఞాపిస్తున్నాడు.

ఈ వాక్యం ప్రకారం దేవుడు చేసిన పై నిబంధన తన 'మాటలు' అంగీకరించటం అని అర్థం అవుతుంది. అయితే ఆ 'మాటలు' ఏమిటన్నది ప్రశ్న. బైబిలు సమాధానం ఏమిటో చూడండి.

నిర్గమకాండము 20:2–17 మరియు ద్వితీయోపదేశకాండము 5:6–21 వచనాల్లో దేవుడు మోషేకు ప్రసాదించిన పది ఆజ్ఞలు ఉన్నాయి. ఇవి ఒక విశ్వాసి దేవునితో మరియు తోటిమానవులతో సంబంధాన్ని తెలిపే ప్రాథమిక నైతిక నియమాలు:

1) నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు: దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలి.

2) విగ్రహారాధన చేయకూడదు: దేవుని రూపంలో ఎలాంటి విగ్రహాలు లేదా ప్రతిమలు చేసుకోకూడదు.

3) దేవుని నామాన్ని వ్యర్థంగా ఉచ్చరించకూడదు: దేవుని పేరును తప్పుగా లేదా అగౌరవంగా వాడకూడదు.

4) విశ్రాంతి దినాన్ని పవిత్రంగా ఆచరించాలి: ఆరు రోజులు పని చేసిఏడవ రోజు (సబ్బాతు) విశ్రాంతి తీసుకోవాలి.

5) తల్లిదండ్రులను సన్మానించాలి: తల్లిదండ్రులను గౌరవించాలి.

6) నరహత్య చేయకూడదు: ఎవరినీ చంపకూడదు.

7) వ్యభిచారం చేయకూడదు: వివాహ బంధాన్ని పవిత్రంగా ఉంచాలి.

8) దొంగతనం చేయకూడదు: ఇతరుల వస్తువులను ఆశించకూడదు.

9) అబద్ధ సాక్ష్యం చెప్పకూడదు: నిజాయితీగా ఉండాలి.

10) దేనినీ ఆశించకూడదు: ఇతరుల ఆస్తిని భార్యను లేదా వస్తువులను ఆశించకూడదు.
ఈ పదాజ్ఞల్లో మూడు మాత్రమే దైవానికి సంబంధించినవి. మిగిలిన ఏడు ఆజ్ఞలూ మానవులకి సంబంధించినవే!

సకల మానవాళిలో ఎవరైనా ఆ పదాజ్ఞలను పాటిస్తే వారు యూదులు కానప్పటికీ ఆయన వారికి దేవుడై ఉంటాడు. ఇంకా, వారే దేవుని జనులై ఉంటారు. యూదులు అయినప్పటికీ ఒకవేళ ఆ పదాజ్ఞలను గనక పాటించకపోతే వారు దేవుని ఆగ్రహానికి బలౌతారు. ఇదీ పాత నిబంధన సందేశ సార్వత్రికత! సార్వజనీనత!!

దీని ప్రకారం– మేమే దైవ జనులం, దేవునికి ప్రియులం, మాకే మోక్షం అన్న యూదుల అహంకార పూరిత వాదన ఒక బూటకం అని తేలిపోతుంది!

క్రొత్త నిబంధన ప్రకారం–
ఒక్క క్రైస్తవ 'విశ్వాసము' కలిగిన వానికే రక్షణ? మరెవనికీ రక్షణ లేదా?

"తమ పాపాల నిమిత్తం యేసు ప్రాణం పెట్టాడని విశ్వసించి, క్రైస్తవులుగా మారిన వారు మాత్రమే దేవునికి ప్రియులు, వారు మాత్రమే రక్షణకి అర్హులు. ఇక, ప్రపంచంలో ఏ మత వర్గాన్నీ దేవుడు ఇష్టపడడు. వారిలో ఎవరికీ రక్షణ లేదు!" అన్నది ఒక క్రైస్తవుని అహంకారపూరిత మతోన్మాద వాదన! అయితే ఈ వాదన విషయంలో బైబిలు ఏమంటుంది? అన్నది ప్రశ్న. దీనికి సమాధానంగా ఈ వాక్యాలను కాస్త నిశితంగా చూడండి.

బైబిలు లూకా 5:30–32– పరిసయ్యులును వారి శాస్త్రులును ఇది చూచి సుంకరులతోను పాపులతోను మీరేల తిని త్రాగుచున్నారని ఆయన శిష్యుల మీద సణిగిరి। అందుకు యేసు– రోగులకే గాని ఆరోగ్యము గల వారికి వైద్యుడక్కర లేదు। మారుమనస్సు పొందుటకై నేను పాపులను పిలువవచ్చితిని గాని నీతిమంతులను పిలువ రాలేదని వారితో చెప్పెను.

ఇక్కడ యేసు; క్రైస్తవులు, అన్యులు అన్న 'మత పరమైన విభజన' చేయక "పాపులు" మరియు "నీతిమంతులు" అన్న 'శీల పరమైన విభజన' మాత్రమే చేయటం అత్యంత గమనార్హం. ఏ మత వర్గానికి చెందిన వారైనా వారిలో 'నీతిమంతుల'కి తన పట్లగల 'ప్రత్యేక విశ్వాసము' తప్పనిసరి షరతుగా పెట్టటం లేదన్నది గమనార్హం! మరొక వాక్యం చూడండి.

బైబిలు అపో.కార్యములు 10:34,35– దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను। ప్రతి జనములోను i) ఆయనకు భయపడి ii) నీతిగా నడుచుకొను వానిని ఆయన అంగీకరించును.

ఈ వాక్యం ప్రకారం– ఒకవ్యక్తి దేవుని పట్ల భయభక్తులు కలిగి, నీతిమంతుడై ఉంటే అతడు ఏ మత వర్గానికి చెందిన వాడైనా వానిని అంగీకరిస్తాడని సుస్పష్టమౌతుంది. మరోవాక్యం చూడండి.

బైబిలు రోమీయులకు 2:6,7– ఆయన ప్రతి వానికి వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును। సత్ క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకు వారికి నిత్యజీవము నిచ్చును.

ఈ వాక్యంలో గమనార్హ విషయాలు రెండు ఉన్నాయి. వాటిలో...

1. దేవుడు ప్రతివానికి వానివాని 'మత విశ్వాసాల'ను బట్టి ప్రతిఫలమిచ్చును అని కాక, వానివాని 'క్రియల' చొప్పున ప్రతిఫలమిచ్చును అనటం

2. సత్ క్రియను బట్టి నిత్యజీవము నిచ్చును అన్నాడే గాని, ఒక 'ప్రత్యేక మత విశ్వాసాల'ను బట్టి నిత్యజీవము నిచ్చును అని అనకపోవటం

అంటే ఒక వ్యక్తి ఏ మత వర్గానికి చెందినవాడైనా అతడు గనక 'సత్ క్రియ' చేస్తే రక్షణ లేదా మోక్షం పొందుతాడని బైబిలు సుస్పష్టంగా ప్రకటిస్తుంది.

"క్రీస్తు యందు ఉన్నవాని"గా మారాలంటే చేయ వలసినది ఏమిటి!?

బైబిలు 1వ యోహాను 2:6– "ఆయన (అంటే యేసు) యందు నిలిచి యున్నవాడనని చెప్పుకొను వాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానును నడుచుకొన బద్ధుడైయున్నాడు. మనమాయనయందున్నామని దీని వలన తెలిసికొనుచున్నాము" అని యోహాను చెబుతున్నాడు.

సకల మానవాళిలో ఎవరు యేసు క్రీస్తు ఎలాగు దయా, కరుణా, క్షమా వంటి 'సత్ క్రియల'ను కలిగి నడుచుకున్నారో ఆలాగునే నడచుకొను వారికి దేవుడు నిత్యజీవము ఇస్తాడు. ఒకవేళ 'దుష్క్రియల'కి తెగబడితే వారు క్రైస్తవ విశ్వాసం కలిగి ఉన్నప్పటికీ దేవుడు నిత్యమరణానికి గురి చేస్తాడు. ఇదీ క్రొత్త నిబంధన సందేశ సార్వత్రికత! సార్వజనీనత!!

దీని ప్రకారం– మేమే దైవజనులం, మాకే రక్షణ అని క్రైస్తవులు చేసే అహంకార పూరిత వాదన ఒక బూటకం అని తేలిపోతుంది!

ఖురాన్ ప్రకారం–

ఒక్క 'ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించిన వారు మాత్రమే ముస్లిములా!?

తనకి పూర్వం ఆయా మత వర్గాల్లో వచ్చిన మత భ్రష్టత్వం నేటి మెజారిటీ ముస్లిముల్లోనూ వచ్చేస్తుందని మహనీయ ప్రవక్త ముహమ్మద్ ముందస్తుగానే హెచ్చరించారు. చూడండి!

హదీస్ సహీహ్ బుఖారి 3456 – أَنَّ النَّبِيَّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ، قَالَ: لَتَتَّبِعُنَّ سَنَنَ مَنْ قَبْلَكُمْ شِبْرًا بِشِبْرٍ وَذِرَاعًا بِذِرَاعٍ حَتَّى لَوْ سَلَكُوا جُحْرَ ضَبٍّ لَسَلَكْتُمُوهُ، قُلْنَا: يَا رَسُولَ اللهِ الْيَهُودَ وَالنَّصَارَى، قَالَ: فَمَنْ

ప్రవక్త ముహమ్మద్–"మీరు పూర్వపు మత వర్గాలను ప్రతి అంగుళం, ప్రతి మూర యథాతథంగా అనుకరిస్తారు, వారు రాకాసి బల్లి రంధ్రంలో దూరితే, మీరు కూడా దూరుతారు!" అని అన్నారు. దానికి మేము–"ఓ ప్రవక్తా! మీ ఉద్దేశ్యం యూదులూ, క్రైస్తవులు అనా?" అని ప్రశ్నించాము. దానికి ప్రవక్త– "ఇంకెవరు కాగలరు?" అని అన్నారని ప్రవక్త అనుయాయులు తెలియజేశారు.

మోషే, యేసుల అనంతర తరాలకి చెందిన కొందరు భ్రష్టులైన యూదులూ; క్రైస్తవులు ఏయే తప్పుడు విశ్వాసాలూ–ఆచారాలు కల్పించుకొని 'భ్రష్టులూ–దుష్టులు' అయ్యారో ముస్లిముల భవిష్యత్ తరాలు కూడా సరిగ్గ అలాంటి తప్పుడు విశ్వాసాలూ–ఆచారాలు కల్పించుకొని 'భ్రష్టులూ–దుష్టులు' అవుతారన్నది పై హదీసు సారాంశం.

యూదుల అనేక భ్రష్టత్వాల్లో 'జాత్యాహంకారం' (racial arrogance) ప్రధానమైనది. దానిని ప్రారంభంలో చూశారు కదా! ముస్లిముల్లోనైతే 'మత దురహంకారం' (religious arrogance) వచ్చింది. అది తెలియాలంటే ఇక్కడ ప్రాథమికంగా ఖురాన్ గ్రంథానికి చెందిన నాలుగు పారిభాషికాల వాస్తవ అర్థాలు ఏమిటో తెలుసుకోవాల్సి ఉంది. వాటిలో...

1. ఇస్లాం అన్నది ఒక క్రియా వాచకం (verbal noun). దీనర్థం సమ్మతించటం.

2. ముస్లిం అన్నది కర్తావాచకం (subjective noun). దీనర్థం సమ్మతించి శిరసావహించే వాడు.

3. కుఫ్ర్ అన్నదీ క్రియా వాచకం (verbal noun). దీనర్థం తిరస్కరించటం.

4. కాఫిర్ అన్నది కూడా కర్తావాచకం (subjective noun). దీనర్థం తిరస్కారి.

ఇస్లాం అన్నది మనిషిని సృష్టించిన దేవుడే రూపొందించిన ధర్మం. కాబట్టి మనుషుల సార్వత్రిక స్వభావానికి అది అనుకూలంగా ఉంటుంది. కనుక 'ఇస్లాం, కుఫ్ర్' అన్న అనుకూల, ప్రతికూల 'క్రియలు', అలాగే 'ముస్లిం, కాఫిర్' అన్న అనుకూల, ప్రతికూల 'కర్తలు' కేవలం మహనీయ ప్రవక్త ముహమ్మద్ను 'విశ్వసించిన' మరియు 'తిరస్కరించిన'

వారివరకే పరిమితం అయ్యే విషయాలు కావు. అవి యావత్ లోకానికి మరియు యావత్ మానవాళికి సంబంధించిన సార్వత్రిక పారిభాషికాలు అవుతాయి. కొన్ని ఉదాహరణలు:

ధర్మం ఒక్కటే!

ఉదా: విజయ మిల్క్, విశాఖ మిల్క్, హెరిటేజ్ మిల్క్ అన్న మూడు పేర్లు వేర్వేరుగా ఉన్నప్పటికీ, వాటిలో 'మిల్క్' అన్నది కామన్గా వచ్చింది. ప్రవక్త ముహమ్మద్ కాలంలో దైవ ధర్మాన్ని 'ఇస్లాం ధర్మం' అని; యేసు, మోషే కాలాల్లో 'దేవుని ధర్మం' అని, వేద కాలంలో 'వైదిక ధర్మం' అని అన్నారు. ఇక్కడ కూడా ఒక విషయం కామన్గా వచ్చింది అది 'ధర్మం'. ఆ ఒక్క ధర్మాన్నే ఆయా పండితులు ఆయా కాలాల్లో పరిపరి విధాలుగా వివరించారు. ఆ వివరణలే ఆయా మతాలుగా ఏర్పడ్డాయి. నిజానికి ధర్మమైతే ఒక్కటే!

కాబట్టి వారివారి గ్రంథాల్లో ఉన్న ఆ ఏకైక ధర్మాన్ని వారు నిష్టగా ఆచరిస్తే వారిలో ప్రతి ఒక్కరికీ ఇహపరాల సాఫల్యం ఉంటుందన్నది ఖురాన్ భరోసా! ఇతర ధర్మ గ్రంథాలూ అదే భరోసా ఇస్తున్నాయి. అయితే దానిని ఆయా వర్గాలకు చెందిన మతోన్మాదులకి జీర్ణించుకోవటం కష్టమైపోతుంది. ఎందుకంటే వారి బ్రతుకుదెరువే వేర్పాటువాదం!

సజ్జనులు ఆయా కాలాల్లో!

ప్రవక్త ముహమ్మద్ కాలంలో 'సజ్జనుల'ను అరబీ భాషలో 'ముస్లిం' అన్నారు. యేసు, మోషే కాలాల్లో 'విశ్వాసి' అన్నారు. అదే వైదిక కాలంలో సంస్కృత భాషలో 'యోగి/శురుడు/దేవత' అన్నారు.

ఇక్కడ ఆ ముగ్గురిలో దేవునికి ఎవడు ఇష్టుడు? అన్నది ప్రశ్న. ఆ ముగ్గురిలో ఎవడైనా దేవునికి ఇష్టుడే అవుతాడు. ఎందుకంటే ఆ ముగ్గురిలో ప్రధానంగా మూడు విషయాలు కామన్గా ఉన్నాయి. అవి: వారి వ్యక్తిగత జీవితంలో 'నైతికత', వారి సామూహిక జీవితంలో 'మానవత' మరియు వారి వర్గగత జీవితంలో 'ఐక్యత' వంటి 'సద్గుణాలు' ఉన్నాయి. దేవుని దృష్టిలో సుగుణాలు ప్రధానం గానీ, వారి పేర్లు కాదు!

దుర్జనులు ఆయా కాలాల్లో!

సజ్జనులు ప్రతి కాలంలో ఉన్నట్లే, దుర్జనులు కూడా అన్ని కాలాల్లోనూ, అందరిలోనూ ఉన్నారు. ప్రవక్త ముహమ్మద్ కాలంలో 'దుర్జనుల'ను అరబీ భాషలో 'కాఫిర్' అని;

యేను, మోషే కాలాల్లో 'అవిశ్వాసి' అని, అదే వైదిక కాలంలో సంస్కృత భాషలో 'ఆసురుడు'/'రాక్షసుడు' అని అన్నారు.

ఇక్కడ ఆ ముగ్గురిలో దేవునికి ఎవడు అయిష్టుడు? అన్నది ప్రశ్న. ఆ ముగ్గురిలో ఎవడైనా దేవునికి అయిష్టుడే అవుతాడు. ఎందుకంటే ఆ ముగ్గురిలో ప్రధానంగా మూడు విషయాలు కామన్గా ఉన్నాయి. అవి: వారి వ్యక్తిగత జీవితంలో 'అనైతికత', వారి సామూహిక జీవితంలో 'అమానవీయత' మరియు వారి వర్గగత జీవితంలో 'అనైక్యత' వంటి దుర్గుణాలు ఉంటాయి. దేవుని దృష్టిలో గుణాలు ప్రధానంగానీ వారి పేర్లు కాదు!

'తన అంతరాత్మ ప్రబోధనం' లేదా 'తన ధర్మశాస్త్ర ప్రబోధనం'లో దేని ద్వారానైనా మంచిని సమ్మతించి ఆచరించే వాడినే ఖురాన్ 'అరబీ భాష'లో 'ముస్లిం' అని అంటుంది. దీని ప్రకారం సకల మానవాళిలో ఎవరైనా తన 'అంతరాత్మ ప్రబోధనల'ను అనుసరించినా లేదా తమ 'ధర్మ శాస్త్ర ప్రబోధన'ల ప్రకారం విలువలు కలిగి జీవించినా వారందరూ ముస్లిములే! ఇదీ ఖురాను గ్రంథ సందేశ సార్వత్రికత! సార్వజనీనత!!

కాబట్టి– "మేము మాత్రమే ముస్లిములము. అల్లాహ్ మాతోనే ఉన్నాడు. మిగిలిన వారందరూ కాఫిర్లు!" అంటున్న కొందరు మతోన్మాద ముస్లిముల వాదన కేవలం బూటకమని తేలిపోతుంది. చివరికి ప్రవక్త ముహమ్మద్ హెచ్చరిక నెరవేరింది!

ఖురాన్ ఇస్తున్న విశ్వజనీన భావన ఏమిటో చూడండి!

మానవ మహోపకారి ప్రవక్త ముహమ్మద్'పై దైవం అవతరింపజేసిన ఖురాన్ గ్రంథంలో మాత్రమే "ధరము" మరియు "అధర్మము" అంటే ఏమిటో సుస్పష్టంగా ఉంది. కాబట్టి వాటిలో "ధరము" అనుసరించే వ్యక్తులు మాత్రమే ముస్లిములు అనే భావనలో మెజారిటీ ముస్లిములు ఉన్నారు. వారే కాదు, ఈ లోకంలో ఎవరెవరైతే ఖురాన్ గ్రంథానికి పూర్వం అవతరించిన గ్రంథాల్లో ఉన్న దైవాదేశాలను పాటిస్తారో వారు కూడా ముస్లిములే అని ఖురాన్ ప్రకటిస్తుంది! ఈ విషయానికి సంబంధించిన ఆధారాలు ఖురాన్–హదీస్ నుండి మీ ముందుకు రానున్నాయి. వాటిని ప్రశాంతంగా అధ్యయనం చేస్తూ ముందుకు సాగాలని సవినయంగా కోరుతున్నాను.

చర్చనీయ అంశాలు ఇవే!

1) ఒక్క మానవులే కాదు, సకల సృష్టితాలూ ముస్లిములే అని ఖురాన్ చెబుతుంది!
2) యావత్ మానవాళి జన్మతః ముస్లిములని ఖురాన్ చెబుతుంది, 3) ప్రవక్త

ముహమ్మద్ దైవదౌత్యం (రిసాలత్) పట్ల ఇంకా నమ్మకం కలగని పూర్వపు ప్రవక్తల అనుయాయులను కూడా ముస్లిములని ఖురాన్ చెబుతుంది, 4) గత ప్రవక్తల అనుయాయుల్లోనూ ఇహ-పరాల సాఫల్యం పొందేవారు ఉన్నారని ఖురాన్ చెబుతుంది! 5) సకల ప్రవక్తల అనుయాయుల పేర్లుకూడా ముస్లిములని ఖురాన్ ప్రకటిస్తుంది, 6) ఏ వర్గానికి చెందిన వారైనా ఆ మూడు మౌలిక విషయాలను ఆచరిస్తే ముస్లిములే అని ఖురాన్ చెబుతుంది! 7) సకల మతాలూ ఇస్లాం ధర్మానికి చెందిన విభాగాలే అని ఖురాన్ చెబుతుంది!

ముస్లిమేతరులందరినీ కాఫిర్లుగా తీర్మానించలేరు!

యావత్ మానవాళిని మనం రెండు వర్గాలుగా చూడగలం ఒకటి- ప్రవక్తలను, వారి మహిమాన్విత సందేశాన్ని ప్రత్యక్షంగా చూచినవారు. రెండు- ప్రవక్తల కాలాన్ని ప్రత్యక్షంగా చూడనివారు. కాబట్టి వారిని ఈ క్రింది విధంగా వర్గీకరించాల్సి ఉంటుంది.

1. ప్రవక్తలను, వారి మహిమాన్విత సందేశాన్ని విని, చూచి స్వీకరించి దాని ఆచరణా-ప్రచురణల కోసం త్యాగాలు చేసిన వారు. వారిని అల్లాహ్ ఇష్టపడిన మోమినీన్/విశ్వాసులు (రజియల్లాహ్ అన్హుం/దైవానుగ్రహం పొందినవారు) అన్న శుభవార్త అందించి, వారు 'స్వర్గవాసులు' అని ఇహలోకంలోనే తీర్మానించటం జరిగింది. ఈ తీర్మానం ప్రవక్తల కాలానికి చెందిన ముస్లిములకి తప్ప, ప్రవక్తలు లేని కాలానికి చెందిన ముస్లిములకి వర్తించదు

2. ప్రవక్తలను, వారి మహిమాన్విత సందేశాన్ని విని, చూచి ఇది సత్యమే అని అంతరాత్మ సాక్ష్యం ఇచ్చిన తరువాత కూడా అహంకారంతో, తిరస్కరించి, ధర్మాన్నీ ధార్మికులను హింసించి, అంతం చేస్తున్న వారు. అలాంటి వారిని అల్లాహ్ ఆగ్రహించిన కాఫిర్లు/ధర్మధిక్కారులు (లానతుల్లాహి అలైహిం/అల్లాహ్ శాపానికి గురైనవారు) అన్న హెచ్చరిక చేసి, వారు 'నరకవాసులు' అని ఇహలోకంలోనే తీర్మానించటం జరిగింది. ఈ తీర్మానం కూడా ప్రవక్తల కాలానికి చెందిన ముస్లిమేతరులకి తప్ప, ప్రవక్తలు లేని కాలానికి చెందిన ధర్మధిక్కారులకి వర్తించదు!

అందుకే ఖురానులో ముస్లిమేతరులందరినీ కేవలం కాఫిర్లు అని తీర్మానించలేదు. వారు స్వయంగా పెట్టుకున్న యహూద్, నసారా, సాబయీన్, మజూసీ తదితర పేర్లతోనే వారిని సంబోధించటం జరిగిందన్నది అత్యంత గమనార్హం! ఇంకా "మేము కాఫిర్లు!" అని

స్వయంగా ప్రకటించుకున్న వారినే ఖురాన్ కాఫిర్లు అని చెప్పింది. కాబట్టి ప్రవక్త ముహమ్మద్ అనుచరులు కానీ వారిని 'కాఫిర్లు' అనే అవకాశం నేటి ముస్లిములకి ఖురాన్ ఇవ్వటంలేదని తెలుస్తుంది.

దీనికి మరింత వివరణ కోసం "ఖురాన్–హదీస్ ప్రకారం ఎవరు కాఫిర్?" అనే నా రచనను అధ్యయనం చేయగలరు. ఇక, ముందు పేజీలో పేర్కొన్న ఏడు విషయాల వివరణను ఖురాన్–హదీస్ వెలుగులో ఒక్కొక్కటిగా చూడండి.

1. సకల సృష్టితాలూ ముస్లిములే!

భౌతిక పరిభాషలో విశ్వం యావత్తూ ప్రకృతిక నియమాల (laws of nature)కి నిబద్ధమై ఉందని అంటారు. దీనినే ధార్మిక పరిభాషలో దైవ 'విధేయత'కే అనగా 'ఇస్లాం'కే అంకితమై ఉందని అంటారు. అంటే అణువు నుండి అనంతం వరకూ వ్యాపించి ఉన్న ఈ అండపిండ బ్రహ్మాండంలోని ప్రతి సృష్టితమూ దైవాదేశాల ప్రకారం చలిస్తుంది, నడుస్తుంది. కాబట్టి ఈ ప్రకృతిలో ఉన్న ప్రతీదీ ముస్లిమే! దీనికి ఆధారంగా ఖురాన్ వాక్యాన్ని చూడండి.

3:83 – أَفَغَيْرَ دِينِ ٱللَّهِ يَبْغُونَ وَلَهُۥٓ أَسْلَمَ مَن فِى ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ طَوْعًا وَكَرْهًا وَإِلَيْهِ يُرْجَعُونَ

ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవన్నీ తమకు ఇష్టమున్నా లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉండగా, వీరు అల్లాహ్ ధర్మాన్ని కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తున్నారా? ఎట్టకేలకు వారంతా ఆయన వైపునకే మరలించబడతారు.

ఈ వాక్యంలో గమనార్హ వాక్యభాగం– "ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవన్నీ అల్లాహ్ విధేయతకే (ఇస్లాం ధర్మానికే) కట్టుబడి ఉన్నాయి" అన్నది నిజమే కదా! ఏయే జీవులకి ఏయే విధమైన 'జీవన శైలి ప్రాకృతికం'గా తమ సృష్టికర్త తరఫున నిర్దేశితం అయ్యిందో, అది దానికి కట్టుబడి ఉంది. ఉదా:–

ఈగా; దోమ మొదలుకొని సింహాలూ, ఏనుగుల వరకూ ప్రతీదీ వాటివాటి నిర్దేశిత ప్రాకృతిక జీవన ప్రవృత్తులకే కట్టుబడి ఉన్నాయి! అలాగే సకల లోకాలూ, గ్రహాలూ, నక్షత్రాలు ఒకటేమిటి సమస్తమూ 'ధార్మిక పరిభాష'లో చెప్పాలంటే– తమ 'సృష్టికర్త ఆదేశాల' (laws of scrip– ture)కి లేదా 'లౌకిక పరిభాష'లో చెప్పాలంటే– 'ప్రకృతి

నియమాల' (laws of nature)కి తలవంచి విధేయులై (ముస్లిములై) ఉన్నాయి. దీని ప్రకారం ముస్లిం అనే సంబోధన కేవలం మానవుల్లో ఒక వర్గమైన ప్రవక్త ముహమ్మద్ అనుయాయులకే కాక, సకల సృష్టితాలకీ చెందుతుందని ఖురాన్ ప్రకారం సుస్పష్టమయ్యింది.

2. సకల మానవులూ ప్రకృతి సిద్ధంగా ముస్లిములే!

మనస్సులో చెలరేగే చెడును తిరస్కరించి, తన మనస్సులోనే కలిగే మంచిని స్వీకరించే స్వభావాన్ని ప్రతి మనిషీ జన్మతః కలిగి ఉంటాడు. దానినే ఖురాన్ తన పరిభాషలో ముస్లిం స్వభావం అంటుంది. ఇక ఖురాన్–హదీసులు ఏమంటున్నాయో చూడండి.

29:49–بَلْ هُوَ ءَايَٰتٌۢ بَيِّنَٰتٌ فِى صُدُورِ ٱلَّذِينَ أُوتُوا۟ ٱلْعِلْمَ ۚ وَمَا يَجْحَدُ بِـَٔايَٰتِنَآ إِلَّا ٱلظَّٰلِمُونَ

1) వాస్తవానికి ఇవి, స్పష్టమైన సూచనలు (ఖుర్ఆన్ ప్రబోధనలు) 2) ఎవరికి జ్ఞానమివ్వబడిందో, వారిహృదయాలలో (భద్రంగా) ఉంచబడ్డాయి. 3) మరియు మా సూచనలను (ప్రబోధనలను) దుర్మార్గులు తప్ప మరెవ్వరూ తిరస్కరించరు" అని అల్లాహ్ స్వయంగా ప్రకటిస్తున్నాడు. ఇక మానవమహోపకారి ప్రవక్త ముహమ్మద్ ఏమంటున్నారో చూడండి.

Tirmidhi – 2138 أَنَّ أَبَا هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ، قَالَ: قَالَ رَسُولُ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ: مَا مِنْ مَوْلُودٍ إِلَّا يُولَدُ عَلَى الْفِطْرَةِ، فَأَبَوَاهُ يُهَوِّدَانِهِ أَوْ يُنَصِّرَانِهِ، أَوْ يُمَجِّسَانِهِ كَمَا تُنْتَجُ الْبَهِيمَةُ بَهِيمَةً جَمْعَاءَ، هَلْ تُحِسُّونَ فِيهَا مِنْ جَدْعَاءَ، ثُمَّ يَقُولُ: فِطْرَةَ اللهِ الَّتِي فَطَرَ النَّاسَ عَلَيْهَا لا تَبْدِيلَ لِخَلْقِ اللهِ سورة الروم آية 30 ذَلِكَ الدِّينُ الْقَيِّمُ

గౌరవ అబూహురైరా ఉల్లేఖనం ప్రకారం మహనీయ ముహమ్మద్– "ప్రతి నవజాత శిశువు ధార్మిక స్వభావంపై జన్మిస్తుంది. అయితే వాని తలిదండ్రులు వానిని ('ధర్మ బద్ధుడు' కాని ఒక నామకార్థ) యూదునిగానో, క్రైస్తవునిగానో లేదా మజూసీగానో మార్చివేస్తారు. దీని ఉదాహరణ: ఒక పశువు సక్రమంగా జన్మిస్తుంది. ముక్కు–చెవులు తెగి జన్మించిన పశువులను మీరు చూశారా?" అని ప్రశ్నించి, ఈ క్రింది ఖురాన్ వాక్యం పఠించారు.

30:30- فَأَقِمْ وَجْهَكَ لِلدِّينِ حَنِيفًا ۚ فِطْرَتَ اللَّـهِ الَّتِي فَطَرَ النَّاسَ عَلَيْهَا ۚ لَا تَبْدِيلَ لِخَلْقِ اللَّـهِ ۚ ذَٰلِكَ الدِّينُ الْقَيِّمُ وَلَـٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ

"1) కనుక నీవు ఏకాగ్రతతో నీ ముఖాన్ని ధర్మంపై నిలుపు. 2) అల్లాహ్ మానవులను ఏ స్వభావంపై పుట్టించాడో ఆ స్వభావంపైనే ఉండండి. 3) అల్లాహ్ సృష్టిని (ప్రకృతిని) మార్చకూడదు సుమా! (ఎందుకంటే) ఇదే సరైన ధర్మం. 4) కాని చాలా మందికి తెలియదు" అని ఖురాన్ వాపోతుంది.

పైన పేర్కొన్న మొదటి వాక్యంలో ఖురాన్ ప్రబోధనలు అంటే మంచి-చెడు విశ్వాసాలూ-వ్యవహారాల స్పృహను ప్రతి మనిషి జన్మతః కలిగి ఉంటాడని తెలియజేస్తుంది. ఇంకా వాటిని ఒక్క 'దుర్మార్గులు' మాత్రమే తిరస్కరిస్తారని తెలుస్తుంది. రెండవ వాక్యం ' فَأَقِمْ وَجْهَكَ لِلدِّينِ حَنِيفًا'/ "అల్లాహ్ మానవులను ఏ స్వభావంపై పుట్టించాడో ఆ స్వభావంపైన్నే ఉండండి" అని ఖురాన్ ఆజ్ఞాపిస్తుంది. మరొక వాక్యం చూడండి.

7:172 – وَإِذْ أَخَذَ رَبُّكَ مِنۢ بَنِىٓ ءَادَمَ مِن ظُهُورِهِمْ ذُرِّيَّتَهُمْ وَأَشْهَدَهُمْ عَلَىٰٓ أَنفُسِهِمْ أَلَسْتُ بِرَبِّكُمْ ۖ قَالُوا۟ بَلَىٰ ۛ شَهِدْنَآ ۛ أَن تَقُولُوا۟ يَوْمَ ٱلْقِيَٰمَةِ إِنَّا كُنَّا عَنْ هَٰذَا غَٰفِلِينَ

"నీ ప్రభువు ఆదం సంతతి వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, స్వయంగా వారినే వారికి సాక్షులుగా పెట్టి, "నేను మీ ప్రభువును కానా?" అని అడిగినప్పుడు "ఎందుకు కావు? (నువ్వే మా ప్రభువు). ఈ విషయానికి మేమంతా సాక్షులుగా ఉన్నాం" అని వారు చెప్పారు. "దీని గురించి మాకేమీ తెలియదు!" అని ప్రళయ దినాన మీరు అనకుండా ఉండటానికీ" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

యావత్ మానవాళి జన్మించటానికి ముందే వారితో పైన పేర్కొన్న ప్రశ్నోత్తరాలు జరిగాయి. వాటి ప్రభావంతోనే కుల-మతాలకి అతీతంగా సర్వులూ 'ఆ పైవాడు' ఒకడు ఉన్నాడనే భావన సహజంగానే కలిగి ఉంటారు. అలాగే ప్రతిమనిషీ మంచిపట్ల ఆసక్తి, చెడుపట్ల భయం కలిగి ఉంటాడు. దానినే పై హదీసులో ప్రవక్త 'ఫిత్రత్'/nature/స్వభావం అంటున్నారు.

దీని ప్రకారం- ఎవరైతే అల్లాహ్ పెట్టిన 'సహజ నైతిక స్పృహ' ఆధారంగా చెడును విడనాడి, మంచిని ఆచరిస్తారో వారు కూడా ముస్లిములు అవుతారని ఖురాన్ తెలియజేస్తుంది. అలాంటి ముస్లిములు, ప్రవక్త ముహమ్మద్ను గురించి తెలియక లేదా తెలిసినా నమ్మకం కలగక ఇంకా విశ్వసించని వారిలో ఎందరో ఉన్నారని తెలుస్తుంది. దీని ప్రకారం- "ప్రవక్త ముహమ్మద్ను విశ్వాసించిన వారు మాత్రమే ముస్లిములు!" అన్న వాదన ఖురాన్ ప్రకారం తప్పని తేలుతుంది!

3. ఈ లోకంలో ఉన్నవారంతా దైవాదేశాలూ-ప్రవక్తల ఆదర్శాలు కలిగినవారే!

గత అంశంలో ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించిన ముస్లిములేకాక, సకల మానవాళీ స్వాభావికంగానే ముస్లిములని ఖురాన్ సుస్పష్టం చేసింది. ఇక యావత్ మానవాళి తమ వద్ద కలిగి ఉన్న దివ్య, పవిత్ర ధార్మిక సమాచారం ప్రకారమూ ముస్లిములే అని ఖురాన్ అధ్యయనంతో తెలుస్తుంది.

యావత్ మానవాళి ఉనికి ఒకే జంట నుండి ప్రారంభం అయిందని ఖురాన్ చెబుతుంది. అలాగే హిందూ, యూద, క్రైస్తవ శాస్త్రాలు కూడా అదే చెబుతున్నాయి. సృష్టికర్త, 'ఆది మానవ జంట'కి ఇచ్చిన 'ఆది ధర్మాని'కే వారు కట్టుబడి ఉండేవారు. దానినే సనాతన ధర్మం అంటారు. తరువాత వారిమధ్య (بَغْيًۢا بَيْنَهُمْ/ అధికారం, పెద్దరికాల పోరుతో (2:213) భేదాలు ఉత్పన్నం అయ్యాయి. పర్యవసానంగా వారు కలిగి ఉన్న ధర్మాన్ని తప్పుడు వ్యాఖ్యానాల ఆధారంగా వివిధ మతాలుగా చేసుకొని వేర్వేరు వర్గాలుగా చీలిపోయారు. దానికి సంబంధించిన ఆధారాన్ని చూడండి.

وَإِنَّ هَٰذِهِۦٓ أُمَّتُكُمْ أُمَّةً وَٰحِدَةً وَأَنَا۠ رَبُّكُمْ فَٱتَّقُونِ –23:52

నిశ్చయంగా మీ ఈ ధర్మం (ఆదిలో) ఒకే ధర్మం. నేనే మీ అందరి ప్రభువును. కాబట్టి మీరు నాపట్ల భయభక్తులు కలిగి మెలగండి.

فَتَقَطَّعُوٓا۟ أَمْرَهُم بَيْنَهُمْ زُبُرًا ۖ كُلُّ حِزْبٍۭ بِمَا لَدَيْهِمْ فَرِحُونَ –23:53

అయితే కాలక్రమంలో వారంతట వారే (విభేదించుకుని), తమ ధర్మాన్ని ముక్కచెక్కలుగా (అంటే వివిధ మతాలుగా) చేసుకున్నారు. ప్రతి వర్గం తన వద్దనున్న దాంతోనే సంబరపడిపోసాగింది.

ఈ వాక్యాలతో అర్థమయ్యే ప్రధానమైన విషయాల్లో...

1. సకల మానవులు తమ సృష్టికర్త ఆదిలో ఇచ్చిన ధర్మం ఆధారంగా ఒక్కటిగానే ఉండేవారు

2. ఈ లోకంలో ఉన్న సకల మతాలూ ఆదిధర్మం నుండి ఉద్భవించినవే

3. సకల మతస్తులు ఎంతోకొంత శాతం ఆదిధర్మాన్ని ఆశ్రయించి ఉన్నవారే

5:48– 'لِكُلٍّ جَعَلْنَا مِنكُمْ شِرْعَةً وَمِنْهَاجًا'/'లికుల్లిన్ జఅల్నా మిన్కుమ్ షిర్అతవ్ వ మిన్హాజా' అంటే– "మేము మీ (అనగా సకల మానవుల)లోని ప్రతి ఒక్కరికీ ఒక ధర్మశాస్త్రమునూ ఒక జీవిత విధానాన్నీ నియమించాము". 10:47– 'وَلِكُلِّ أُمَّةٍ رَّسُولٌ'/'వ లికుల్లి ఉమ్మతిర్ రసూల్'/"ప్రతి మానవ సముదాయానికి ఒక సందేశహరుడు ఉన్నాడు". 16:44– 'بِالْبَيِّنَاتِ وَالزُّبُرِ'/'బిల్ బయ్యినాతి వజ్జుబురి'/"పూర్వపు ప్రవక్తలను కూడా మేము స్పష్టమైన నిదర్శనాలతోనూ, గ్రంథాలతోనూ పంపి ఉన్నాము". 16:36– 'وَلَقَدْ بَعَثْنَا فِي كُلِّ أُمَّةٍ رَّسُولًا'/'వ లఖద్ బఅస్నా ఫీ కుల్లి ఉమ్మతిర్ రసూల...'/"మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము...". 35:24– 'وَإِن مِّنْ أُمَّةٍ إِلَّا خَلَا فِيهَا نَذِيرٌ'/'వ ఇమ్మిన్ ఉమ్మతిన్ ఇల్లా ఖలాఫీహా నజీర్'/"హెచ్చరిక చేసేవాడెవ్వడూ (అనగా ప్రవక్తలెవరూ) రాని వర్గము ఏదీ లేదు" అని అల్లాహ్ ప్రకటిస్తున్నాడు.

పై వాక్యాల అరబీ మూలంలో– 'ఫీ కుల్లి ఉమ్మతి' అనగా 'సకల మానవ వర్గాల'లో అన్నది గమనార్హ వాక్యభాగం. అంటే ఖురాన్ అవతరణకి పూర్వమే యావత్ మానవాళి వద్ద అటు– 'అల్లాహ్ ఆదేశాలు' (ఆహ్కామె ఇలాహీ) ఉన్నాయని, అలాగే ఇటు– ప్రవక్త ముహమ్మద్ నియామకానికి ముందే 'ప్రవక్తల ఆదర్శాలు' (సున్నతె రుసుల్) కూడా ఉన్నాయని అల్లాహ్యే స్వయంగా ప్రకటిస్తున్నాడు.

గమనిక: పైన పేర్కొన్న ఖురాన్ వాక్యాల ప్రకారం గ్రంథ ప్రజలు అని, పూర్వపు గ్రంథాలు, పూర్వపు ప్రవక్తలు అని ఎక్కడ వచ్చినా ఒక్క యూద, క్రైస్తవ మత వర్గాలే కాక, వారికంటే పూర్వులైన భారత ఉపఖండానికి చెందిన సనాతన, బౌద్ధ ధర్మాలకి చెందిన ప్రజలూ, వారి ధర్మ శాస్త్రాలైన వేదాలూ, ఉపనిషత్తులు, భగవద్గీత, దమ్మపదం వగైరా... అలాగే వారి రుషులైన శ్రీరామకృష్ణాదులు, బుద్ధుడు, మహావీర్ జైన్ వగైరాలను కూడా పరిగణలో తీసుకోవాలన్నది గమనార్హం!

ఇక, ఒక్క ప్రవక్త ముహమ్మద్ అనుయాయుల వద్దనే కాక, ఆయనకి పూర్వపు ప్రవక్తల అనుయాయులైన ప్రజల వద్దా ఇస్లాం ధర్మ ప్రబోధనలు ఉన్నాయని ఖురాన్ స్వయంగా తెలియజేస్తుంది. వాటిని గనక వారు సక్రమంగా అనుసరిస్తే, వారంతా ముస్లిములే అంటే దైవ విధేయులే అవుతారు!

దీని ప్రకారం– ఎవరైతే అల్లాహ్ గతంలో అందించిన వహీ 'ధార్మిక ప్రబోధనల' ఆధారంగా "చెడు"ను విడనాడి, "మంచి"ని ఆచరిస్తారో వారు కూడా ముస్లిములే

అవుతారని ఖురాన్ తెలియజేస్తుంది. అలాంటి ముస్లిములు, ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించని వారిలో కూడా ఎందరో ఉన్నారని సుస్పష్టమౌతుంది.

4. గత ప్రవక్తల అనుయాయుల్లోనూ ఇహ-పరాల సాఫల్యం పొందేవారు ఉన్నారు!

"ఎవరైనా దైవవిధేయులు (ముస్లిమీన్) కావాలన్నా, దైవవిశ్వాసులు (మోమినీన్) కావాలన్నా, ఇహ–పరాల సాఫల్యం సాధించాలన్నా 'ప్రవక్త ముహమ్మద్ను అనుసరించే ముస్లిం వర్గం'లో చేరక తప్పదు!" అని కొందరు వాదిస్తుంటారు. అది నిజమే. దానితోపాటు ఖురాను మరొక విధంగానూ వాదిస్తుంది. అదేమిటో కాస్త జాగ్రత్తగా గమనించండి.

ఖురాన్ ప్రకారం- ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలోనూ విశ్వాసులు ఉన్నారు!

كُنتُمْ خَيْرَ أُمَّةٍ أُخْرِجَتْ لِلنَّاسِ تَأْمُرُونَ بِٱلْمَعْرُوفِ وَتَنْهَوْنَ عَنِ ٱلْمُنكَرِ وَتُؤْمِنُونَ بِٱللَّهِ 3:110– وَلَوْ ءَامَنَ أَهْلُ ٱلْكِتَٰبِ لَكَانَ خَيْرًا لَّهُم ۚ مِّنْهُمُ ٱلْمُؤْمِنُونَ وَأَكْثَرُهُمُ ٱلْفَٰسِقُونَ

"1) మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరు. మీరు మంచి విషయాలకై ఆజ్ఞాపిస్తారు, చెడు నుంచి ఆపుతారు, ఇంకా మీరు అల్లాహ్ను విశ్వసిస్తారు. 2) గ్రంథవహులు కూడా విశ్వసించి ఉంటే, అది వారి కోసం శ్రేయస్కరం అయ్యేది. 3) వారిలో (అంటే ముస్లిమేతరుల్లో) కొందరు విశ్వాసులు కూడా ఉన్నారు. 4) కాని అత్యధికులు అవిధేయులే" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

పైవాక్యంలో నాలుగు వాక్య భాగాలు ఉన్నాయి. వాటిలో మూడవ వాక్య భాగం అత్యంత గమనార్హం. దాని ప్రకారం ప్రవక్త ముహమ్మద్ గురించి ఇంకా తెలియని వర్గాల్లోనూ కొందరు 'విశ్వాసులు' (మొమినీన్) ఉన్నారని, ఉంటారని సుస్పష్టమౌతుంది.

ఖురాన్ ప్రకారం- ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో ఇస్లామీయ విశ్వాసాలు, విలువలు కలిగినవారు ఉన్నారు!

"ఇస్లామీయ విశ్వాసాలూ, విలువలు కలిగినవారు' కేవలం ఒక్క ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించిన ముస్లిం సమాజంలో మాత్రమే ఉంటారు" అని చాలా మంది ముస్లిములు భావిస్తుంటారు. అయితే ఖురాన్ ఇచ్చే భావన ఏమిటో చూడండి.

3:199– وَإِنَّ مِنْ أَهْلِ ٱلْكِتَٰبِ لَمَن يُؤْمِنُ بِٱللَّهِ وَمَآ أُنزِلَ إِلَيْكُمْ وَمَآ أُنزِلَ إِلَيْهِمْ خَٰشِعِينَ لِلَّهِ لَا يَشْتَرُونَ بِـَٔايَٰتِ ٱللَّهِ ثَمَنًا قَلِيلًا ۚ أُو۟لَٰٓئِكَ لَهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ ۗ إِنَّ ٱللَّهَ سَرِيعُ ٱلْحِسَابِ

"గ్రంథవహులలో కొందరున్నారు. వారు 1) అల్లాహ్‌ను, 2) మీపై అవతరించిన దానినీ (అంటే ఖురాన్ను), 3) వారి వైపునకు అవతరించిన దాన్ని కూడా విశ్వసిస్తారు. 4) అల్లాహ్ పట్ల భయ-భక్తులు కలిగి ఉంటారు. 5) అల్లాహ్ ప్రబోధనలను కొద్దిపాటి మూల్యానికి అమ్ముకోరు. అలాంటివారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంది. నిశ్చయంగా అల్లాహ్ వేగంగా లెక్క తీసుకుంటాడు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

4:162- لَّٰكِنِ ٱلرَّٰسِخُونَ فِى ٱلْعِلْمِ مِنْهُمْ وَٱلْمُؤْمِنُونَ يُؤْمِنُونَ بِمَآ أُنزِلَ إِلَيْكَ وَمَآ أُنزِلَ مِن قَبْلِكَ وَٱلْمُقِيمِينَ ٱلصَّلَوٰةَ وَٱلْمُؤْتُونَ ٱلزَّكَوٰةَ وَٱلْمُؤْمِنُونَ بِٱللَّهِ وَٱلْيَوْمِ ٱلْـَٔاخِرِ ۚ أُو۟لَٰٓئِكَ سَنُؤْتِيهِمْ أَجْرًا عَظِيمًا

అయితే వారిలో 1) పరిపూర్ణమైన, పరిపక్వతనొందిన జ్ఞానం గలవారూ, 2) విశ్వసించిన వారూ, 3) నీపై అవతరింపజెయ్య బడినదాననీ (అంటే ఖురాన్), 4) నీకు పూర్వం అవతరింపజెయ్యబడిన దానినీ (అంటే వేదాలు, ఉపనిషత్తులు, గీతా, బైబిలు పాత, కొత్త నిబంధనలు) విశ్వసించేవారూ, 5) నమాజులను నెలకొల్పేవారూ, 6) జకాతును చెల్లించేవారూ, 7) అల్లాహ్ మరియు, 8) అంతిమ దినాన్ని విశ్వసించేవారూ వీరందరికీ మేము గొప్ప పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాము.

ఈ వాక్యంలో– 'مِنْهُمْ'/మిన్హుమ్ అంటే "వారిలో" అంటే పూర్వపు ప్రవక్తల అనుయాయుల్లో అన్నది. అంటే సనాతన, బౌద్ధ, యూద, క్రైస్తవ వగైరా మత వర్గాలు అన్నది గమనార్హం. ఇక వారిలో ఇస్లాం ధర్మానికి చెందిన విశ్వాసాలూ, ఆరాధనలు, వ్యవహారాలు కలిగినవారు ఉంటారని ఖురాన్ స్వయంగా చెబుతుంది. మరొక వాక్యాన్ని చూడండి.

10:40– وَمِنْهُم مَّن يُؤْمِنُ بِهِۦ ۚ وَمِنْهُم مَّن لَّا يُؤْمِنُ بِهِۦ ۚ وَرَبُّكَ أَعْلَمُ بِٱلْمُفْسِدِينَ

వారిలో కొందరు దీనిని (ఖురాన్ను) విశ్వసిస్తారు. మరికొందరు దీనిని విశ్వసించరు. కల్లోల జనకుల గురించి నీ ప్రభువుకు బాగా తెలుసు.

పూర్వపు ప్రవక్తల అనుయాయుల్లో అంటే ప్రవక్త ముహమ్మద్ను గురించి ఇంకా తెలియని వారిలో తలిదండ్రుల సేవ, అంతరబాహ్య పరిశుద్ధత మరియ దేవుని ఏకత్వం, స్త్రీ

పురుషుల సమానత్వం, దాన ధర్మాలు వగైరా వంటి ఎన్నెన్నో ఇస్లామీయ విలువలను పాటించేవారు ఎందరో ఉన్నారన్నది మనకి తెలిసిందే. అయితే పైవాక్యంలో ఖురాను గ్రంథాన్ని విశ్వసించేవారు కూడా ఉన్నారని ఖురాన్ ప్రకటిస్తుంది.

"పూర్వపు ప్రవక్తల అనుయాయుల్లోనూ దైవవిశ్వాసులు ఉంటారా!?" అన్న ప్రశ్నకి ఖురాన్ ఇస్తున్న సమాధానం– "ఉంటారు, ఉన్నారు!" అన్నదే. ఎందుకంటే వారిలోనూ– "ఈ సృష్టికి కర్త ఒక్కడే ఉంటాడు, ఆయననే ప్రత్యక్షంగా ఆరాధించాలి, ఈ రుషులూ, ప్రవక్తలు ఆయనచే నియమించబడిన వారు" అనే విశ్వాసం కలిగిన ప్రజలు అందరిలోనూ ఎందరో ఉన్నారు.

ఖురాన్ ప్రకారం–
ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో సత్య మార్గంపై నిలకడగా ఉండేవారు ఉన్నారు! ఇంకా అల్లాహ్ వాక్యాలు పఠించేవారు ఉన్నారు!

لَيْسُوا سَوَاءً ۗ مِّنْ أَهْلِ الْكِتَابِ أُمَّةٌ قَائِمَةٌ يَتْلُونَ آيَاتِ اللَّهِ آنَاءَ اللَّيْلِ وَهُمْ يَسْجُدُونَ – 3:113

"1) కాని గ్రంధ ప్రజలందరూ ఒకలాంటి వారు కాదు. 2) వారిలో సత్యమార్గంలో స్థిరంగా నిలిచి ఉన్నవారు కూడా కొందరు ఉన్నారు..." అని ఖురాన్ ప్రకటిస్తుంది.

పైవాక్యం "పూర్వపు ప్రవక్తల అనుయాయుల్లో సత్యమార్గంలో స్థిరంగా నిలిచి ఉన్నవారు ఉన్నారు!" అని ఖురాన్ తెలుపుతుంది. అంతేకాదు 'يَتْلُونَ آيَاتِ اللَّهِ آنَاءَ اللَّيْلِ'/"రాత్రులు అల్లాహ్ వాక్యాలు పఠిస్తుంటారు!" అంటుంది. దీని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయా మతస్తులు కలిగి ఉన్న ధర్మ గ్రంథాల ప్రబోధనలను కూడా ఖురాన్ ' آيَاتِ اللَّهِ'/"ఆయాతిల్లాహ్"/అల్లాహ్ ప్రబోధనాలు అనటం ఇక్కడ అత్యంత గమనార్హం.

ఖురాన్ ప్రకారం- ప్రవక్త ముహమ్మద్'ను
ఇంకా విశ్వసించని వారిలో సత్య మార్గదర్శకత్వం వహించేవారు ఉన్నారు!

وَمِن قَوْمِ مُوسَىٰ أُمَّةٌ يَهْدُونَ بِالْحَقِّ وَبِهِ يَعْدِلُونَ – 7:159

"1) మూసా జాతి వారిలో సత్యం ప్రకారం మార్గదర్శకత్వం వహించే, 2) సత్యాన్ని అనుసరించి న్యాయ నిర్ణయాలు గైకొనే వర్గం కూడా ఒకటుంది" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

దీని ప్రకారం– ప్రవక్త మూసా జాతీయులైన యూదుల్లో ఒక వర్గం 1) సత్యం ప్రకారం మార్గదర్శకత్వం వహిస్తుంది. 2) సత్య బద్ధంగా న్యాయ నిర్ణయాలు కూడా తీసుకొంటుం దని ఖురాన్ తెలియజేస్తుంది. ఈ మాట ఇతర ప్రవక్తల వర్గీయులకి కూడా వర్తిస్తుంది.

ఖురాన్ ప్రకారం- ప్రవక్త ముహమ్మద్'ను
విశ్వసించని వారిలో మధ్యేమార్గంపై నడిచేవారున్నారు!

5:66- وَلَوْ أَنَّهُمْ أَقَامُوا التَّوْرَاةَ وَالْإِنجِيلَ وَمَا أُنزِلَ إِلَيْهِم مِّن رَّبِّهِمْ لَأَكَلُوا مِن فَوْقِهِمْ وَمِن تَحْتِ أَرْجُلِهِم ۚ مِّنْهُمْ أُمَّةٌ مُّقْتَصِدَةٌ ۖ وَكَثِيرٌ مِّنْهُمْ سَاءَ مَا يَعْمَلُونَ

"వారు గనక తౌరాతుకూ, ఇంజీలుకూ, తమ ప్రభువు తరపున తమ వద్దకు పంపబడిన దానికి కట్టుబడి ఉంటే వారు తమ పైనుంచీ, క్రిందినుంచీ పుష్కలంగా ఉపాధిని పొందుతూ, హాయిగా భుజించేవారు. వారిలో ఒక వర్గం మాత్రం మధ్యేమార్గం అవలంబిస్తుంది. కాని వారిలోని అత్యధికులు చేసే పనులు చాలా చెడ్డవి" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

ఈ వాక్యంలో గమనార్హ విషయం– 'مُّقْتَصِدَةٌ'/'ముఖ్తసిదహ్' అంటే "మధ్యే మార్గంపై ఉండేవారు" అనే అర్థం వస్తుంది. అంటే రెండో అతివాదాలకి దూరంగా ఉండేవారు. సాధారణంగా ఈ లక్షణాలు కలినవారు ప్రవక్త ముహమ్మద్ను విశ్వాసించేవారిలోనే ఉంటారన్నది కొందరు ముస్లిముల భావన. అయితే అలాంటి అందరిలోనూ వారు ఉంటారన్నది ఖురాన్ సమాచారం!

ఖురాన్ ప్రకారం-
ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో సౌశీల్యవంతులు ఉన్నారు!

7:168– وَقَطَّعْنَٰهُمْ فِى ٱلْأَرْضِ أُمَمًا ۖ مِّنْهُمُ ٱلصَّٰلِحُونَ وَمِنْهُمْ دُونَ ذَٰلِكَ ۖ وَبَلَوْنَٰهُم بِٱلْحَسَنَٰتِ وَٱلسَّيِّـَٔاتِ لَعَلَّهُمْ يَرْجِعُونَ

"1) మేము వారిని (యూదులను వారు చేసిన దుర్మార్గాల కారణంగా) భూమండలంపై అనేక వర్గాలుగా చీల్చి (చెల్లాచెదురుగా చేసి) ఉంచాము. 2) వారిలో కొందరు సజ్జనులూ మరియు 3) తద్భిన్నంగా ఉండేవారు కూడా ఉన్నారు. 4) బహుశా వారు మరలి వస్తారేమోనని మేము వారిని మంచి, చెడు పరిస్థితులకి గురిచేసి పరీక్షించాము" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

ఈ వాక్యంలో ప్రవక్త మోషే అనుయాయులైన ముస్లిముల ప్రస్తావన జరుగుతుంది. పై వాక్యంలోని రెండవ విషయంలో– "వారిలో కొందరు సజ్జనులూ ఉన్నారు!" అనేది గమనార్హం. అంటే యూదుల్లో అందరూ భ్రష్టులు కారు, వారిలో కొందరైనా 'సజ్జనులు'/'ٱلصَّٰلِحُونَ' స్వాలిహూన్ ఉన్నారని ఖురాన్ తెలియజేస్తుంది.

ఖురాన్ ప్రకారం-

ప్రవక్త ముహమ్మద్'ను విశ్వసించని వారిలో ముస్లిములు ఉన్నారు!

28:52 ٱلَّذِينَ ءَاتَيۡنَٰهُمُ ٱلۡكِتَٰبَ مِن قَبۡلِهِۦ هُم بِهِۦ يُؤۡمِنُونَ

"మేము లోగడ ఎవరికయితే గ్రంథం వొసగామో వారు దీనిని (ఖుర్ఆన్‌ను) కూడా విశ్వసిస్తారు".

28:53 وَإِذَا يُتۡلَىٰ عَلَيۡهِمۡ قَالُوٓاْ ءَامَنَّا بِهِۦٓ إِنَّهُ ٱلۡحَقُّ مِن رَّبِّنَآ إِنَّا كُنَّا مِن قَبۡلِهِۦ مُسۡلِمِينَ

వారికి, దీనిని (అంటే ఖురాన్‌ను) చదివి వినిపించినప్పుడు, "ఇది మా ప్రభువు తరఫు నుంచి వచ్చిన సత్యం అని మేము విశ్వసిస్తున్నాము. అసలు మేము దీనికి ముందు నుంచే ముస్లిములుగా ఉన్నాము" అని వారు చెబుతారు".

28:54 أُوْلَٰٓئِكَ يُؤۡتَوۡنَ أَجۡرَهُم مَّرَّتَيۡنِ بِمَا صَبَرُواْ وَيَدۡرَءُونَ بِٱلۡحَسَنَةِ ٱلسَّيِّئَةَ وَمِمَّا رَزَقۡنَٰهُمۡ يُنفِقُونَ

"తాము చూపిన నిలకడ (సహన స్థైర్యాల)కు గాను వారు రెండింతల ప్రతిఫలం ప్రసాదించబడతారు. వారు మంచి ద్వారా చెడును పారద్రోలుతారు. మేము ప్రసాదించిన దానిలో నుంచి (బీదసాదల కోసం) ఖర్చు పెడతారు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

ఈ వాక్యంలో యేసు అనుయాయులను తాము ముస్లిములు అన్న ప్రకటనను ఖురాన్ సమ్మతిస్తుంది. దీనినిబట్టి ముస్లిములు ఒక్క ప్రవక్త ముహమ్మద్ అనుయాయులనే కాక, ఇతర ప్రవక్తల అనుయాయులను కూడా ఖురాన్ 'ముస్లిములు' అని పేర్కొంటున్న వైనం సుస్పష్టం.

దీని ప్రకారం– మహనీయ ప్రవక్త ముహమ్మద్'ను గురించిన సమాచారం అందని కారణంగా, అందినా ఇంకా అర్థం కాని కారణంగా ఆయనను విశ్వసించనప్పటికీ, తమ వద్ద ఉన్న గత వహీ (శృతి) ద్వారా లభించిన ధార్మిక గ్రంథాల ప్రబోధనాల ఆధారంగా చెడును విడనాడి, మంచిని ఆచరించేవారు కూడా ముస్లిములు అవుతారని ఖురాన్ తెలియజేస్తుంది.

5. సకల ప్రవక్తల అనుయాయులూ ముస్లిములే!

కేవలం ముహమ్మద్ ప్రవక్తను అనుసరించే ఒకే ఒక ప్రత్యేక మతవర్గానికి మాత్రమే "ముస్లిములు" అనే నామం లభిస్తుందని చాలా మంది ముస్లిం పండితులు భ్రమిస్తున్నారు. ఖురాన్ ప్రకారం– అది నిజం కాదు. ఎందుకంటే సకల ప్రవక్తల అనుసరించే వారందరూ ముస్లిములే అంటే దైవ విధేయులే అని ఖురాన్ స్వయంగా ప్రకటిస్తున్న వైనాన్ని చూడండి.

22:78 – هُوَ سَمَّىٰكُمُ ٱلْمُسْلِمِينَ مِن قَبْلُ وَفِى هَٰذَا

ఈ ఖుర్ఆన్‌కు పూర్వం కూడా ఆయన (అల్లాహ్) మిమ్మల్ని 'ముస్లింలు'గానే నామకరణం చేశాడు. మరి ఇందులో కూడా (మీ పేరు అదే).

అంటే ఈ ఖురాన్ అవతరణకి పూర్వం ఎందరు ప్రవక్తలు వచ్చారో వారందరి అనుయాయులూ 'ముస్లిము'లే అంటే దైవ విధేయులే. వారి ఆ పేరునే మీకూ పెట్టటం జరిగిందని అల్లాహ్ స్వయంగా తెలియజేస్తున్నాడు.

దీని ప్రకారం– ప్రవక్త ముహమ్మద్కి పూర్వపు ప్రవక్తల అనుయాయులు కూడా ముస్లిములే అని అల్లాహ్ స్వయంగా ప్రకటిస్తున్నాడు. వారు తమతమ ప్రవక్తల ద్వారా లభించిన ధర్మ ప్రబోధనల ఆధారంగా చెడును విడనాడి, మంచిని ఆచరించేవారు కూడా ముస్లిములు అవుతారని ఖురాన్ తెలియజేస్తుంది. అలాంటి ముస్లిములు, ప్రవక్త ముహమ్మద్ను ఇంకా విశ్వసించని వారిలో ఎందరో ఉన్నారు.

6. ఏ వర్గానికి చెందిన వారైనా ఆ మూడు విషయాలను ఆచరిస్తే ఇహ-పరాల సాఫల్యం కలుగుతుంది!

ఖురాన్, "1) ఇతర మత గుర్తింపులను విడనాడి, 2) తమ స్వంత జాతీయతను విడనాడి, 3) ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించి, 4) ఇస్లామీయ గుర్తింపును స్వీకరిస్తేనే మోక్షం!" అని హామీ ఇస్తుందని అధికశాతం ముస్లిములు భావిస్తారు. అయితే ఖురాన్ ఏమంటుందో చూడండి!

2:62 إِنَّ ٱلَّذِينَ ءَامَنُوا۟ وَٱلَّذِينَ هَادُوا۟ وَٱلنَّصَٰرَىٰ وَٱلصَّٰبِـِٔينَ مَنْ ءَامَنَ بِٱللَّهِ وَٱلْيَوْمِ ٱلْـَٔاخِرِ وَعَمِلَ صَٰلِحًا فَلَهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ

"1) (ప్రవక్త ముహమ్మద్ను) విశ్వసించినవారైనా, 2) యూదులైనా, 3) క్రైస్తవులైనా, 4) సాబియనులు అయినా (అనగా సనాతన ధార్మికులైలైనా) ఇంకా 5) మరెవరైనాసరే

I) అల్లాహ్ను, II) అంతిమ దినాన్ని విశ్వసించి III) సదాచరణ చేస్తే, వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంటుంది. (ఇహ–పరాల్లో) వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

"మహనీయ ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించిన వారు మాత్రమే ముస్లిములు అవుతారు!" అనే కొందరి వాదనే నిజమైతే, ఖురాన్ పై వాక్యంలో– "1) అంతిమ ప్రవక్తను విశ్వసించిన వారైనా, 2) యూదులైనా, 3) క్రైస్తవులైనా, 4) సాబియులు అయినా (అనగా సనాతనులైనా) ఇంకా 5) మరెవరైనాసరే పై మూడు విషయాలు పాటించిన వారికి ప్రతిఫలం ఉంటుంది. ఇహ–పరాల్లో వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు" అని ఖురాన్ సంపూర్ణ హామీ ఎందుకు ఇస్తుంది?

దీనినిబట్టి అర్థమయ్యేది ఏమిటంటే ఇహ–పరాల సాఫల్యానికి జాతిగత (ethnic), సాంస్కృతిక (cultural), సామాజిక (social) గుర్తింపు (identity)లను మాత్రమే కాక, కనీసం 'మతవర్గ గుర్తింపు' (religious identity)ని సైతం మార్చటం ఖురాన్ అభిమతం కాదని తెలుస్తుంది.

ఒక్కొక్క మతవర్గం పేరు వేర్వేరుగా తీసుకొని మరీ సకల మతస్తులకి ఆమోదయోగ్యమైన మూడు మౌలిక విషయాలు చెప్పటం జరిగింది. అవి:

1. 'దేవుని పట్ల విశ్వాసం'. అంటే మనుషులు మనసా–వాచా–కర్మణా చేసే కార్యాలపై నిశితమైన, తీక్షణమైన నిఘా పెట్టినవాడు ఒకడున్నాడనే పూర్తి స్పృహను కలిగి ఉండటం

2. 'పరలోకం పట్ల విశ్వాసం'. అంటే తానుచేసే మంచి–చెడు కర్మలకు శిక్షా–బహుమానాలు ఈలోకంలో తప్పినా, పరలోకంలో తప్పనిసరిగా లభిస్తాయన్న సత్యాన్ని గుర్తించి, భయ–భక్తులతో జీవితం గడపటం

3. ఈ రెండు విషయాల 'ప్రేరణ'తోనే ఒక మనిషి 'దుష్కర్మల'కి దూరంగా ఉంటూ, 'సత్కర్మల'కి చేరువ కాగలడు

సకల మతవర్గాల వారికీ ఆమోదయోగ్యమైన ఈ మూడు పనులు చేసేవారు ఏ మత వర్గంలో ఉన్నా, వారికి ఇహ–పరాల సాఫల్య హామీ ఖురాన్ నిస్సంశయంగా, నిస్సంకోచంగా ఇస్తుంది. అంటే ఖురాన్ దృష్టిలో వారంతా ముస్లిములేకదా! ఇది

"ఖురాన్ ప్రతిపాదించే కనీస ధార్మిక కార్యక్రమం" (common minimum religious program) అని తెలుస్తుంది.

తన 'రిసాలత్'లో లేని ఒక విశ్వాసి జనాజా నమాజ్ చేయించిన మానవమహోపకారి ప్రవక్త ముహమ్మద్!

ఖురాన్ అన్నది ఒక theoretical గ్రంథం. దానికి 'సున్నత్' అంటే ప్రవక్త ముహమ్మద్ 'ఆచరణా విధానం' లేదా 'ఆచరణాత్మక అనువర్తనం' (practical application). కనుక ఇప్పటి వరకూ ఖురాను వెలుగులో పరిశీలించిన theoretical విషయాన్ని, ప్రవక్త ముహమ్మద్ తన ఆచరణ/practical (సున్నత్)లో ఎలా 'అనువర్తనం' చేస్తున్నారో కాస్త జాగ్రత్తగా గమనించండి.

హదీస్Al-Silsila saheeh 1051 عن أنس رضى الله عنه قال لمَّا جاءَ نَعْيُ النَّجَاشِي قال رسول الله صلى الله عليه وسلم : صَلُّوا عليه. قالوا: يا رسول الله ! نُصَلِّي على عَبْدٍ حَبَشِيٍّ (لَيْسَ بِمُسْلِمٍ) ؟ فأنزل الله عز وجل: وَ اِنَّ مِنۡ اَہۡلِ الۡکِتٰبِ لَمَنۡ یُّؤۡمِنُ بِاللّٰہِ وَ مَاۤ اُنۡزِلَ اِلَیۡکُمۡ وَ مَاۤ اُنۡزِلَ اِلَیۡہِمۡ خٰشِعِیۡنَ لِلّٰہِ ۙ لَا یَشۡتَرُوۡنَ بِاٰیٰتِ اللّٰہِ ثَمَنًا قَلِیۡلًا ال عمران 199.

మహనీయ అనస్ ఉల్లేఖనం– "నజ్జాషీ మరణ వార్త వచ్చినప్పుడు, ప్రవక్త మహనీయులు అతని జనాజా నమాజ్ చేయండ"ని ఆజ్ఞాపించారు. అప్పుడు ప్రవక్త అనుయాయులు– "ఓ దైవ ప్రవక్తా! ఏమిటి మేము ఒక నీగ్రో వ్యక్తి (అంటే ముస్లిం కాని వ్యక్తి) జనాజా నమాజ్ చేయాలా?" అని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ నేపథ్యంలో 3:199వ ఖురాన్ వాక్యం అవతరించింది. పై హదీస్ మూలం (text)లో చూడగలరు.

ప్రవక్త చెప్పినప్పటికీ సహాబాలు అభ్యంతరం ఎందుకు పెట్టారు?

నజ్జాషీ మరణించాడనే వార్త విన్న వెంటనే ప్రవక్త మహనీయులు– 'صَلُّوا عليه'/"ఆయన జనాజా నమాజ్ చేయండి!" అని తన అనుయాయులను ఆజ్ఞాపించినప్పటికీ సహాబాలు– "يا رسول الله ! نُصَلِّي على عَبْدٍ حَبَشِيٍّ (لَيْسَ بِمُسْلِمٍ) ؟"/"ఓ దైవ ప్రవక్తా! ఏమిటి మేము ఒక ఇథియోపియా వ్యక్తి (అంటే 'మీ దైవదౌత్యాన్ని (రిసాలత్)' అంగీకరించని ఒక ఒక ముస్లిమేతర వ్యక్తి) జనాజా నమాజ్ చేయాలా?" అని అభ్యంతరం ఎందుకు పెట్టారు? అన్నది ప్రశ్న.

దీనికి సమాధానం ఏమిటంటే, సహాబాలు నజ్జాషీతో కలసినప్పుడు అతడు మా యేసును గురించి మీ విశ్వాసం ఏమిటని ప్రశ్నిస్తే, మరియం సూరా పఠించటం, ఆ తరువాత దానికి స్పందనగా అతడు– "మీరు చెప్పింది, మా గ్రంథం చెబుతుంది ఒక్కటే!" అని మాత్రమే చెప్పాడు. అంతేగాని, "నేను కూడా మీ ప్రవక్తను విశ్వసిస్తున్నాను!" అని మాత్రం అతడు చెప్పలేదు. అందుకే ప్రత్యక్షంగా ఆయనతో కలసిన ప్రవక్త అనుయాయులు జనాజా నమాజ్ చేయటానికి అభ్యంతరం పెట్టారు. సరిగ్గా వారు అభ్యంతరం పెడుతున్న నేపథ్యంలోనే వహీ ద్వారా అల్లాహ్ ఇస్తున్న 'సమాచారం' ఏమిటో చూడండి.

ఖురాన్ 3:199 – وَإِنَّ مِنْ أَهْلِ ٱلْكِتَٰبِ لَمَن يُؤْمِنُ بِٱللَّهِ وَمَآ أُنزِلَ إِلَيْكُمْ وَمَآ أُنزِلَ إِلَيْهِمْ خَٰشِعِينَ لِلَّهِ لَا يَشْتَرُونَ بِـَٔايَٰتِ ٱللَّهِ ثَمَنًا قَلِيلًا ۚ أُو۟لَٰٓئِكَ لَهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ ۗ إِنَّ ٱللَّهَ سَرِيعُ ٱلْحِسَابِ

గ్రంథవహులలో కొందరున్నారు. వారు I) అల్లాహ్‌ను, II) మీపై అవతరించిన దానినీ, III) వారి వైపునకు అవతరించిన దాన్ని కూడా విశ్వసిస్తారు. IV) అల్లాహ్ పట్ల భయ–భక్తులు కలిగి ఉంటారు. V) అల్లాహ్ ప్రబోధనలను కొద్దిపాటి మూల్యానికి అమ్ముకోరు. అలాంటి వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంది. నిశ్చయంగా అల్లాహ్ వేగంగా లెక్క తీసుకుంటాడు.

పైన వాక్యంలో– 'ఐదు ప్రత్యేకతలు' ప్రస్తావించటం జరిగినది. వాటిలో 'ప్రవక్త ముహమ్మద్ దైవదౌత్యము (రిసాలత్)' పట్ల విశ్వాసం గురించి పేర్కొనకపోవటం గమనార్హ విషయం. అంటే ఎవరైనా అల్లాహ్ దృష్టిలో సముచిత కారణం వలన ప్రవక్త ముహమ్మద్ రిసాలత్ను కాక, పూర్వపు ప్రవక్తల రిసాలత్ను అనుసరించే వారిని ముస్లిములుగా పరిగణించాలని అటు– 'ఖురాన్ ప్రబోధన' (తాలీమె ఖురాన్) ద్వారా మరియు ఇటు– 'ప్రవక్త ముహమ్మద్ ఆచరణ' (సున్నతె ముహమ్మది) ద్వారా సుస్పష్టం అవుతుంది.

అయితే ఇక్కడ వాక్యంలో ఒక్క నజ్జాషీ గురించేకాక, సాధారణంగా "గ్రంథవహులలో కొందరున్నారు వారు ఖురాన్ను కూడా విశ్వసిస్తారు" అని అల్లాహ్ అంటున్నాడేగానీ, "నజ్జాషీ ఖురాను విశ్వసించాడు!" అని అతని పేరిట ప్రత్యేకంగా ఏమీ చెప్పలేదు. ఒకవేళ అతడు నిజంగా కలిమా చదివి ఉంటే అల్లాహ్ అతడిని ఇంకా 'గ్రంథ ప్రజల' జాబితాలో

ఎందుకు ఉంచుతాడు? అతనిలో ఏదో లోటు ఉంది. కాబట్టే అల్లాహ్ అతడిని ఆ జాబితాలో ఉంచాడన్నది ఇక్కడ అత్యంత గమనార్హం. ఆ లోటు ఏమిటంటే; 'ప్రస్తుత రిసాలత్ కలిమా' పఠించక, 'గత రిసాలత్ కలిమా'లో ఉండటమే!

దీని ప్రకారం– మహనీయ ప్రవక్త ముహమ్మద్ అనుయాయులే కాక, ఏ ప్రవక్త అనుయాయులు అయినప్పటికీ కనీసం పై మూడు విషయాలను పాటిస్తే, వారికి ఇహ–పరాల సాఫల్యం లభిస్తుంది అని (2:62;5:69వ) వాక్యాల్లో ఖురాన్ సంపూర్ణ హామీ ఇస్తుంది. అలాంటి ముస్లిములు, ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించని ఆయా వర్గాల్లో నేటికీ ఎందరో ఉన్నారు.

ఈ విషయం మానవమహోపకారి ప్రవక్త ముహమ్మద్ స్వయంగా అలాంటి వాని జనాజా నమాజ్ (అంతిమసంస్కార ప్రార్థన) చేసిన సున్నత్/సంప్రదాయం వలన మరింత తేటగా అర్థం అయ్యింది.

7. సకల మతాలూ ఇస్లాం ధర్మ హెచ్చు-తగ్గుల రూపాలే!

ఈనాడు లోకంలో ఎన్నెన్ని మతాలు ఉన్నాయో వాస్తవానికి అవన్నీ సృష్టికర్త ఆదిలో ఇచ్చిన ఇస్లాం ధర్మాన్ని తప్పుగా వ్యాఖ్యానించి, వక్రీకరించి, హెచ్చు–తగ్గులు చేసి సృష్టించుకున్నవే! దానికి సంబంధించిన ఖురాన్ ఆధారాన్ని చూడండి.

21:92– إِنَّ هَٰذِهِۦٓ أُمَّتُكُمْ أُمَّةً وَٰحِدَةً وَأَنَا۠ رَبُّكُمْ فَٱعْبُدُونِ

మీ ఈ సమాజం (అంటే ధర్మం) వాస్తవానికి ఒకే సమాజం (ఒకే ధర్మం). నేను మీ అందరి ప్రభువును. కనుక మీరు నన్నే ఆరాధించండి.

21:93– وَتَقَطَّعُوٓا۟ أَمْرَهُم بَيْنَهُمْ ۖ كُلٌّ إِلَيْنَا رَٰجِعُونَ

కాని ప్రజలు పరస్పరం (విభేదించుకుని) తమ ధర్మంలో ముఠాలు సృష్టించుకున్నారు. అయితే అందరూ మా వద్దకు మరలి రావలసిన వారే.

ఈ వాక్యాన్ని వ్యాఖ్యానిస్తూ విశ్వ విఖ్యాత ఖురాన్ వ్యాఖ్యాత మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూదీ–

"ఇక్కడ 'మీరు' అన్న సంబోధన మానవులందరికీ వర్తిస్తుంది. భావమేమిటంటే, మానవులారా, మీరంతా యథార్థానికి ఒకే సముదాయం, ఒకే అనుచర సంఘంగా

ఉండేవారు. ప్రపంచంలో ప్రవక్తలు ఎందరు వచ్చినా వారంతా ఆ ఒకే ధర్మం సరిచేసి అందజేశారు. ఆ అసలు ధర్మం ఏమిటంటే, కేవలం ఒక్క అల్లాహ్ మటుకే మానవుల ప్రభువు, ఆ ఒక్క దైవాన్నే సేవించాలి, పూజించాలి అన్నది. తరువాత పుట్టిన మతాలన్నీ ఈ ధర్మాన్ని చెరిపి రూపొందించుకున్నవే. ఇందులోని ఒక అంశాన్ని ఒకరు గ్రహిస్తే మరో అంశాన్ని మరొకరు గ్రహించారు. పైగా ప్రతి ఒక్కరూ అందులోని ఒక్క అంశాన్ని తీసుకుని దానితోపాటు మరెన్నో అంశాలు తమ తరపున చేర్చుకున్నారు. ఈ విధంగా ఈ అసంఖ్యాకమయిన సముదాయాలు ఉనికిలోకి వచ్చాయి. ఇప్పుడు ఫలానా ప్రవక్త ఫలానా మతాన్ని స్థాపించాడని, ఫలానా ప్రవక్త ఫలానా మతానికి పునాది వేశాడని, మానవాళిలో ఈ సముదాయాలు, మతాలు ప్రవక్తలు సృష్టించినవేనని భావించడం కేవలం తప్పుడు అభిప్రాయం. విభిన్న సముదాయాలు తమ్ము తాము విభిన్న కాలాలకు, విభిన్న దేశాల ప్రవక్తలకు చెందినవిగా చెప్పుకున్నంత మాత్రాన ఈ విషయం సముదాయాల, మతాల ఈ వైవిధ్యం ప్రవక్తలు సృష్టించినదని అనడానికి ఆధారం కాదు. ఒకే దైవం పంపిన ప్రవక్తలు అనేక విభిన్న మతాలూ సృష్టించలేదు, ఒకే దైవం తప్ప మరొకరి దాస్యమూ నేర్పలేదు" అని చెబుతున్నారు.

దీని ప్రకారం ఆయా మతాలు హెచ్చు-తగ్గులకు, క్రమరాహిత్యానికి గురైన ఇస్లాం ధర్మ హెచ్చు-తగ్గుల రూపాలేనని సుస్పష్టమౌతుంది. అటు- ఖురాన్ చెప్పిన దానికి, ఇటు- మౌలానా మౌదూదీ వ్యాఖ్యానానికి ప్రబల గుర్తు ఆయా మతాల్లో, వాటి అనుయాయుల్లో ఇస్లాం ప్రతిపాదిత విశ్వాసాలు, ఆరాధనలు, వ్యవహారాలు నేటికీ వివిధ స్థాయిల్లో పరివ్యాప్తమై ఉండటమే!

ఈనాటి మానవాళి వర్గీకరణ అలా కాక, ఇలాగే జరగాలి!

ప్రవక్తలు లేని కాలంలో దైవసందేశం "మహిమాన్వితం"గా కాక, కేవలం భౌతికంగా మాత్రమే ఇవ్వటం జరుగుతుంది. కాబట్టి ఈనాటి ముస్లిములను ఆనాటి ముస్లిముల స్థాయి 'మోమినీన్' (రజియల్లాహు అన్హుం/అల్లాహ్ మెచ్చిన వారు) అని చెప్పకూడదన్నది అందరికీ తెలిసిందే. అలాగే ఈనాటి ముస్లిమేతరుల పరిస్థితి కూడా వేరు. వీరికి దైవసందేశం "మహిమాన్వితం"గా అందటం బహుదూరం కనీసం "జ్ఞానపరం"గా లేక "ఆచరణాత్మకం"గాను అందటం లేదు. అటువంటప్పుడు వీరిని ఆనాటి ధర్మ ధిక్కారుల స్థాయి 'కాఫిరీన్' (లానతుల్లాహి అన్హుం/అల్లాహ్ శాపానికి గురైన వారు)గా పరిగణించటం ఎలా సాధ్యం!?

దీనిని బట్టి ఈనాటి సకల మానవాళిని కొన్ని కలిగిన ముస్లిములుగానే పరిగణించాలి. అయితే వారిలో కొందరిని 'ధర్మానికి వివిధ స్థాయిల్లో దగ్గర'గా ఉన్నవారుగా మరి కొందరిని 'ధర్మానికి వివిధ స్థాయిల్లో దూరం'గా ఉన్నవారిగా చూడాలి.

ఎందుకంటే ఆనాడు సందేశహరుల (ముర్సలీన్) తరఫున 'సంపూర్ణ సత్య నిరూపణ' (ఇత్మామె హుజ్జత్) జరిగి, తద్వారా వారి అంతరాత్మలు సత్యాన్ని గ్రహించిన తరువాత కూడా అహంకారంతో, మంకుపట్టుతో ధర్మాన్ని తిరస్కరించారు. ధర్మాత్ములను హింసలకు-హత్యలకు పాల్పడ్డారు. కాబట్టి వారిని 'ధర్మ ధిక్కారులు' (కాఫిరీన్)గా పరిగణించటం జరిగింది.

అలాగే సకల మతాల్లో ఉన్న ఇస్లాం అనుసారమైన విషయాలను వారికి తెలిపి, వారు తమ వద్ద పూర్వం నుండి ఉన్న ఇస్లాంలో కల్పించిన వాటి లోపాలను వివరించి, విడనాడమని, వారు విస్మరించిన విషయాల ఆవశ్యకతను తెలియజేసి, వాటిని పాటించమని చెప్పాలి.

అంతేగాని ముస్లిమేతరులకి చెందిన ఆయా మతాలను షైతాను మాతాలుగా ప్రకటించి, వాటిని అంతం చేసి ఇస్లామును స్థాపిస్తాం అనే అహంకారపూరిత, ఆటవిక నినాదాలూ, ప్రకటనలూ చేయరాదు. నిజానికి ఏ వ్యక్తీ, ఏ మతమూ ఇస్లాం ధర్మానికి వందశాతమూ బయట ఉండదు! అలాగే ఏ ముస్లిం వ్యక్తీ, ఏ ముస్లిం జమాతూ వందశాతమూ ఇస్లాం అనుసారముగానూ ఉండదు! ఇక అన్యాయంగా, దౌర్జన్యంగా ప్రవర్తించే వారిని 'ధర్మ ధిక్కారులు' (కాఫిరీన్)గా కాక, కేవలం అనైతికంగా, అమానవీయంగా ప్రవర్తించే వారిగా 'అన్యాయస్తులు'గా, 'దౌర్జన్యపరులు' (జాలిమీన్)గా పేర్కొనాలి.

కాబట్టి ప్రపంచ ప్రజలను 'ముస్లిములు' మరియు 'కాఫిర్లు' అని వర్గీకరించక, అందరినీ సమదృష్టితో చూస్తూ, ప్రతి ఒక్కరినీ ప్రేమ పూర్వకంగా సంస్కరించే ప్రయత్నం చేయాలి. అంతేగానీ ఒక వర్గంలో ఉన్న వారిని మరొక వర్గంలో మార్చి, మత మార్పిళ్లకు పాల్పడనవసరం లేదు. ఇక ఎవరు ఏ మత వర్గంలో ఉండాలన్నది ప్రతి వ్యక్తికీ వానివాని వ్యక్తిగత ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. అది పూర్తిగా వ్యక్తి స్వేచ్ఛకి సంబంధించిన విషయం. దానిని ఎవరూ హరించరాదు. ఇదే ఖురాన్-హదీస్ కోరుకొనే సార్వజనీన, సార్వకాలీక సంస్కరణా విధానం.

అల్లాహ్ మనందరికీ ఖురాన్–హదీస్ నిషేధిస్తున్న 'మతోన్మాద పోకడల'ను విడనాడి, అవి అనుమతిస్తున్న 'మత సామరస్య విధానము'ను మాత్రమే అవలంబించే మహద్భాగ్యాన్ని ప్రసాదించుగాక! అలాగే ఏది తప్పుడు మార్గమో దానినుండి కాపాడి, ఏది సరైన మార్గమో దాని వైపునకు మార్గదర్శకత్వం చేయుగాక! ఆమీన్ యా రబ్బిల్ ఆలమీన్!

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

మధ్యేమార్గం

తప్పితే

నీచత్వం! క్రూరత్వం!!



Part-8

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం!----------I

మతోన్మాదం ఖురాన్–హదీస్ హెచ్చరికలు!----------1

ధార్మికులందరికీ ఇదే వర్తిస్తుంది!----------2

మరణానికి రెండు కారణాలు! జీవితానికి కారణం ఒక్కటే!----------3

నీచత్వం, క్రూరత్వం – చారిత్రక సాక్ష్యాలు!----------4

ఈ 'Normalism' గురించి ధర్మ గ్రంథాలు ఏమంటున్నాయి?-----12

మధ్యేమార్గం తప్పకుండా
ఉండటానికి దేవుడు చేసిన ఏర్పాటు ఏమిటి?----------15

ఇలాంటి దుస్థితికి గురికాకుండా
ఉండాలంటే ధర్మం తీసుకోమంటున్న జాగ్రత్తలు ఏమిటి?----------17

సారాంశం----------19

పరిచయం

"గతాన్ని చదివి వర్తమానాన్ని అర్థం చేసుకోవటం, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటం!" ఇదీ చరిత్రతో మనకు ఉండవలసిన సంబంధం.

చరిత్ర గొప్ప మార్గదర్శి. చరిత్రలో మంచి ఉంటుంది, చెడు ఉంటుంది. చరిత్ర అధ్యయన లక్ష్యం– అందులో ఉన్న చెడును విడనాడటం. మంచిని చేపట్టటం. చరిత్ర నుండి గుణపాఠం నేర్చుకున్న వారు చరిత్రకారులు అవుతారు. చరిత్రను నిర్లక్ష్యం చేసినవారు చరిత్ర హీనులుగా చరిత్రలో మిగిలిపోతారు! ఇదీ చరిత్ర వాస్తవికత.

ఈ చరిత్రలో ఎన్నెన్నో విషయాలు ఉంటాయి. వాటిలో రాచరికాల చరిత్ర, రాజుల చరిత్ర, ప్రజల చరిత్ర, మతాల చరిత్ర, వాస్తవ మతబోధనల చరిత్ర, మత సామరస్య చరిత్ర, మత ఉన్మాదాల చరిత్ర ఇలా అనేక రంగాలకి సంబంధించిన చరిత్ర ఉంటుంది.

ధర్మాన్ని యథాతథంగా అనుసరిస్తేనే 'పవిత్రత–మానవత' వంటి విలువలు కలుగుతాయి. అందులో అతి పోకడలకి పోతే వాటికి పూర్తి విరుద్ధమైన 'నీచత్వం–క్రూరత్వం' సైతం ధర్మ కార్యాలు అయిపోతాయి! చరిత్రలో అలా జరిగాయి కూడా! దీనికి సంబంధించిన చారిత్రక వాస్తవాలను ప్రస్తుతం మీ చేతిలో ఉన్న ఈ చిరు పుస్తకం చూపిస్తుంది.

దీని అధ్యయనంతో ప్రస్తుతం మీరు మీధర్మంతో ఎలాంటి సంబంధం కలిగి ఉన్నారో, ఎలాంటి సంబంధం కలిగి ఉండకూడదో, ఎలాంటి సంబంధం కలిగి ఉండాలో కూడా మీకు అర్థం అయిపోతుంది.

విజ్ఞులు, మేధావులు అయిన మీరు, నేనూ, మనమందరం మత చరిత్రలో High extremeకి గురైనవారి 'నీచత్వం–క్రూరత్వం' ఏమిటో తెలుసుకొని దానిని విడనాడాలి. అలాగే మత చరిత్రలో Moderate stateను అనుసరించే వారి 'పవిత్రత–మానవత్వం' ఏమిటో తెలుసుకొని దానిని అనుసరించాలి. 'సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్' చేపట్టిన 'సంస్కరణా యజ్ఞం' నిర్వర్తనలో ఈ చారిత్రక సమాచారం మీకు ఎంతగానో సహాయ పడుతుందని ఆశిస్తున్నాను.

KAKINADA
12-02-2025

M. A. Abhilash

మతోన్మాదం - ఖురాన్, హదీస్ హెచ్చరికలు!

ధార్మిక రంగంలో కనిపించే అతిపెద్ద సమస్య అతివాదం. దీనికి మూలాలు ఎక్కడ ఉన్నాయన్నది ప్రధానమైన ప్రశ్న. సాధారణంగా ప్రజల్లో 1) అతివాద, 2) మితవాద, 3) యథార్థవాద అనే మూడు రకాల మనస్తత్వాలు కలిగినవారు ఉంటారు. ఇవి జన్మతః అందరిలోనూ వివిధ స్థాయిల్లో ఉంటాయి.

అతివాదం ప్రాబల్యంలో ఉన్నవారు ధార్మిక విషయాల్లో 'ఉన్న' దానికంటే 'అతి'గా ఊహిస్తారు. అలాగే ప్రవర్తిస్తారు. మితవాదం ప్రాబల్యంలో ఉన్నవారు 'ఉన్న' దానికంటే 'మితం'గా ఊహిస్తారు. అలాగే ప్రవర్తిస్తారు. యథార్థవాదం ప్రాబల్యంలో ఉన్నవారు 'ఉన్న' దానిని 'ఉన్నంత'గానే గుర్తిస్తారు. అలాగే ప్రవర్తిస్తారు.

మూడవ రకం ప్రజల వలన ఎటువంటి ప్రమాదమూ ఉండదు. ఇక, మిగిలిన ఇరువురిలో ఏ మనస్తత్వం కలిగినవారు సమాజానికి ఎక్కువ ప్రమాదకరం? అన్నది ప్రశ్న. దీనికి ఖురాన్ 4:171వ వాక్యం ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి.

يَا أَهْلَ الْكِتَابِ لَا تَغْلُوا فِي دِينِكُمْ

"ఓ గ్రంథ ప్రజలారా! 1) మీరు మీధర్మం విషయంలో అతిగా ప్రవర్తించకండి!"

ఈ వాక్యాల్లో "మీరు ధర్మం విషయంలో అతిగా ప్రవర్తించకండి!" అన్న ఆజ్ఞ గమనార్హం. అంటే దీని ప్రకారం అతివాదుల వల్లనే ఎల్లప్పుడూ ధర్మానికి నష్టం వాటిల్లుతుందని

తెలుస్తుంది. ఎందుకంటే "మీరు ధర్మం విషయంలో మితంగా ప్రవర్తించకండి!"అన్న ఆజ్ఞ ఖురానులో ఎక్కడాలేదు. ఇక హదీస్ ఇబ్నె మాజా సహీహ్ 3029 ఏమంటుందో చూడండి.

ثُمَّ قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ :... يَا أَيُّهَا النَّاسُ إِيَّاكُمْ وَالْغُلُوَّ فِي الدِّينِ، فَإِنَّهُ أَهْلَكَ مَنْ كَانَ قَبْلَكُمُ الْغُلُوُّ فِي الدِّينِ

తరువాత ప్రవక్త ముహమ్మద్...– "ఓ ప్రజలారా! ధర్మంలో అతిగా ప్రవర్తించటం పట్ల అప్రత్తంగా ఉండండి. ఎందుకంటే మీ కంటే ముందు గతించిన వారు అతిగా ప్రవర్తించటం వల్లనే నాశనం చేయబడ్డారు!" అని హెచ్చరిస్తున్నారు.

ధర్మంలో ప్రధానంగా విశ్వాసాలూ, వ్యవహారాలు (విధి–నిషేధాలు) మరియు ఆరాధనలు ఉంటాయి. వాటిని యథాతథంగా మాత్రమే అనుసరించాలి. వాటిలో అటు– కించెత్తు కలపకూడదు. ఇటు– కించెత్తు తీయకూడదు. ఈ చర్యను ధర్మం ఘోర నేరంగా పరిగణిస్తుంది.

ఏ వ్యవస్థ గతితప్పినా ప్రమాదకరమే. అదే ధార్మిక వ్యవస్థ గతితప్పితే ఘోరాతిఘోరం అయిపోతుంది. అతిపోకడలు వచ్చిచేరితే 'పవిత్రత–మానవత'కు నిలయమైన ధార్మిక రంగంలో 'నీచత్వం–క్రూరత్వం' పుణ్యకార్యాలు అయిపోతాయి! దీనికి చరిత్రే ప్రబల సాక్ష్యం. నేటి మెజారిటీ ధార్మికులు ఈ ప్రమాదానికే గురై ఉన్నారు. ఈ సమస్యకు కారణాలు పరిష్కారాలు ఏమిటో తెలపటమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ధార్మికులందరికీ ఇదే వర్తిస్తుంది!

ఏ వ్యవస్థ అయినా మౌలికంగా 1) కొన్ని 'నిర్దిష్ట ఆలోచనల, 2) కొన్ని నిర్దిష్ట ఆచరణల సముదాయం' (A specific set of ideas and practices) కలిగి ఉంటుంది. ఇస్లాం కూడా తనదంటూ ఒక 'నిర్దిష్ట ఆలోచన మరియు ఆచరణల సముదాయం' కలిగి ఉంది. ఇస్లామీయ సమాజంలో ఖురాన్ ఒక 'సైద్ధాంతిక మార్గదర్శి' (Theoretical guide)గా ఉంటుంది. ప్రవక్త ముహమ్మద్ ఒక 'ఆచరణాత్మక మార్గదర్శి' (Practical guide)గా ఉంటారు. ఆయనకి పూర్వపు గ్రంథాలూ–ప్రవక్తలు కూడా అంతే.

కాబట్టి సైద్ధాంతిక విషయాల్లో సందిగ్ధత ఏర్పడినప్పుడు, గతి తప్పినప్పుడు దాని పరిష్కారానికి ధర్మ గ్రంథాన్ని సంప్రదించాలి. ఆచరణాత్మక విషయాల్లో సందిగ్ధత ఏర్పడినప్పుడు దాని పరిష్కారానికి ప్రవక్త ఆచరణ (సున్నత్)ను సంప్రదించాలి. వీటికి లోబడి ఉన్న

దానిని మాత్రమే ధర్మం పేరిట తీసుకోవాలి. వీటికి విరుద్ధమైన ప్రతి దానిని ధర్మంగా తీసుకోరాదు. దీనికి సంబంధించిన ఆధారాన్ని ఖురాన్ 4:59వ వాక్యంలో చూడండి.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓاْ أَطِيعُواْ ٱللَّهَ وَأَطِيعُواْ ٱلرَّسُولَ وَأُوْلِى ٱلْأَمْرِ مِنكُمْۖ فَإِن تَنَٰزَعْتُمْ فِى شَىْءٍ فَرُدُّوهُ إِلَى ٱللَّهِ وَٱلرَّسُولِ إِن كُنتُمْ تُؤْمِنُونَ بِٱللَّهِ وَٱلْيَوْمِ ٱلْءَاخِرِۚ ذَٰلِكَ خَيْرٌ وَأَحْسَنُ تَأْوِيلًا

ఓ విశ్వాసులారా! i) అల్లాహ్కు విధేయత చూపండి. ii) ప్రవక్తకు విధేయత చూపండి. మరియు iii) మీలోని అధికారులకు కూడా. ఆపైన ఏ విషయంలోనైనా మీ మధ్య వివాదం తలెత్తితే దాన్ని i) అల్లాహ్ మరియు ii) ప్రవక్త వైపుకు మరల్చండి మీకు నిజంగా అల్లాహ్'పై, అంతిమ దినంపై విశ్వాసం ఉన్నట్లయితే ఇదే మేలైన పద్ధతి. పరిణామం రీత్యా కూడా ఇదే అన్నింటికంటే ఉత్తమమైనది.

"మీ మధ్య వివాదం తలెత్తితే" అన్నది గమనార్హం. ఈ "మీ" అంటే ఒకటి– పండితులైన పెద్దలు, రెండు– అనుచరులైన సామాన్యులు అన్నది గమనార్హం. ఈ విధంగా ఆలోచనా పరమైన సైద్ధాంతిక విషయాల్లో ఖురాన్ గ్రంథాన్ని సంప్రదించాలి. ఆచరణ సంబంధమైన విషయాల్లో ప్రవక్త ఆచరణ (సున్నత్)ను సంప్రదించాలని ఇస్లాం నిర్దేశిస్తుంది. దీనికి కట్టుబడి ఉండటం ప్రతి ధార్మికునికీ తప్పనిసరి విధి. ధార్మికులందరికీ ఇదే వర్తిస్తుంది.

మనిషిలో ఉన్న అనేక మానసిక పరిమితుల్లో ఒకటి– కుడికో లేక ఎడమకో ఒరిగి పోవటం! అన్నీ విషయాల్లోనూ మనుషులది ఇదే తంతు. అణువు నుండి అనంతం వరకూ ప్రతి ఒక్కటీ 'Extreme, in high'లో లేక Extreme, in lowలోనూ లేదు. సమస్తమూ కేవలం ఒక్క 'మితమైన స్థితి' (Moderate state)లోనే ఉంది.

మరణానికి రెండు కారణాలు! జీవితానికి కారణం ఒక్కటే!

ఉదా: సూర్యుడు భూమికి దగ్గరగా ఉన్నాడా? దూరంగా ఉన్నాడా? లేక మధ్యస్థంగా ఉన్నాడా? సూర్యుడు దగ్గరైతే వేడితో మరణిస్తారు. దూరమైతే చలితో మరణిస్తారు. మధ్యస్థమైతేనే జీవితం సాధ్యమౌతుంది. అలాగే మనిషి బ్రతికి బట్టకట్టాలంటే అతనికి BP, Sugar వంటి శారీరక స్థితులు "High" ఉండాలా? లేక "Low" ఉండాలా? ఈ రెండిటిలో ఏది ఉన్నా పర్యవసానం మాత్రం 'మరణం' అవుతుంది! ఒక్క Middle లేదా Normalగా ఉంటేనే 'జీవితం'. అటు– 'స్థూల స్థాయి' (Macro level)లో చూచినా, ఇటు– 'సూక్ష్మ స్థాయి' (Micro level)లో చూచినా "Normalism" అన్నది ఒక్కటే 'విశ్వజనీన జీవన నియమం' (Universal principle of life) అని తెలుస్తుంది.

అంటే అన్నీ విషయాల్లోనూ Normalగా ఉండటమే ప్రాణాధారం అవుతుంది. ఇవి మన పరిశీలనలో ఉన్న విషయాలు.

నీచత్వం, క్రూరత్వం - చారిత్రక సాక్ష్యాలు!

ఆయా మత వర్గాల్లో ఈ రెండు రకాల అతిశయాలకి గురైన వారిని చూస్తుంటాం. చరిత్రలో, వర్తమానంలోనూ వారు పాల్పడే అత్యంత జుగుప్స కలిగించే 'అత్యంత నీచమైన' చేష్టలు కనిపిస్తుంటాయి. అలాగే మానవత్వం తల దించుకొనే 'అత్యంత క్రూరమైన' ఘోరాలకు పాల్పడేవారూ కనిపిస్తూ ఉంటారు.

వివిధ మత వర్గాల నీచ చేష్టలు!

ధార్మిక వ్యవస్థలో అతిశయానికి పోయి, పాల్పడే కొన్ని నీచ కృత్యాలను చూడండి. కొందరు దుష్టులైన పండితులు తమ భక్తులను తప్పుగా ప్రేరేపించి వారి చేత అత్యంత నీచకార్యాలను సైతం అత్యంత పవిత్ర క్రతువులుగా చేయిస్తారు.

అందులో భాగంగా గురువులు/పండితుల మలమూత్రాలు, శరీర ద్రవాలను పవిత్రంగా భావించి స్వీకరించడం అంధభక్తికి పరాకాష్ట. అతి తీవ్రమైన భక్తి లేదా గురుపూజ వ్యామోహంలో పడి, శుచి-అశుచి విచక్షణ మరిచి ప్రవర్తించిన ఘటనలు వివిధ మతాల్లో మరియు తెగల్లో సంభవించాయి. ఉదా:

టిబెటన్ వజ్రయాన బౌద్ధమత చరిత్ర (లామా యిజమ్): 17వ–18వ శతాబ్దాలలో టిబెట్ సందర్శించిన పాశ్చాత్య మిషనరీలు (ఉదాహరణకు ఫాదర్ ఇప్పోలిటో దేసిదేరి Ippolito Desideri) మరియు తరువాతి పరిశోధకులు తమ రికార్డులలో ఒక విచిత్ర ఆచారాన్ని నమోదు చేశారు. కొందరు భక్తులు ప్రముఖ లామాల శరీర ఉత్సర్గాలను (మల, మూత్రాల నుండి తయారు చేసిన రిల్బు/గుళికలను) వ్యాధుల నివారణకు, ఆధ్యాత్మిక రక్షణకు పవిత్ర మూలికలుగా భావించి సేవించేవారు. ఇది బౌద్ధుల తంత్ర మార్గంలో దుర్వినియోగమైన అంధ విశ్వాసానికి ఉదాహరణ.

భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో విపరీత ధోరణులు: కొన్ని తీవ్ర అఘోర, వామాచార లేదా కురూప తెగల్లో పరమ గురువుల "ప్రసాదం" పేరిట శుచిత్వానికి భిన్నమైన పదార్థాలను స్వీకరించే అలవాటు ఉండేదని చారిత్రకారులు మరియు సామాజిక సంస్కర్తలు (ఉదాహరణకు కందుకూరి వీరేశలింగం, రాజా రామ్మోహన్ రాయ్ వంటి వారు తమ రచనలలో ప్రస్తావించిన మూఢనమ్మకాలు) పేర్కొన్నారు.

హిందూ సమాజంలో నేటికీ జరుగుతున్న అత్యంత జుగుప్స కలిగించే అఘోరీ విధానం: దాని ప్రకారం "పాప–పుణ్యాలు", "పవిత్రత–అపవిత్రత" అనే ద్వైత భావనలను తుడిచిపెట్టి, ఈశ్వర తత్వాన్ని (అద్వైతం) సాధించే మార్గాల పేరిట అఘోరీల జీవితంలో సాధారణ ప్రజలను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసే ప్రధాన ఆచారాల్లో...

శవమాంస భక్షణ (Post-Mortem Cannibalism): 1) స్మశానాల్లో లేదా గంగానదిలో తేలియాడే అనాథ శవాల నుండి మాంసాన్ని సేకరించి తినే ఆచారం వీరిలో ఉంది. 2) నరుల కపాలం (మనుషుల పుర్రెలను) పాత్రగా వాడటం అఘోరీలు ఆహారం తినడానికి, నీళ్లు లేదా మద్యం తాగడానికి మనుషుల పుర్రెను పాత్రగా ఉపయోగిస్తారు. 3) శవభస్మాన్ని శరీరానికి అలముకోవడం. వీరు దుస్తులకు దూరంగా ఉంటూ (దిగంబరంగా లేదా కౌపీనంతో), కాల్చిన శవాల బూడిదను (చిత్ భస్మం) తమ ఒంటి నిండా పూసుకుంటారు. 4) శవాలపై కూర్చుని సాధనలు (శవ సాధన), రాత్రి వేళల్లో శ్మశాన వాటికల్లో, సగం కాలిన శవాలు లేదా శవాల పైన కూర్చుని అర్ధరాత్రి వేళ మంత్రోచ్చారణలు చేస్తూ తీవ్రమైన తపస్సు, తంత్ర సాధనలు చేస్తారు. 5) లౌకిక సమాజ నిషిద్ధాలను ఉల్లంఘించడం, సమాజంలో అసహ్యంగా, పాపంగా భావించే వస్తువులను, ఆచారాలను వీరు కావాలని స్వీకరిస్తారు. గంజాయి, మద్యం తాగడం, మలమూత్రాల పట్ల విరక్తి చూపకపోవడం, శ్మశానాలలో వాడే పాత బట్టలను ధరించడం వంటివి చేస్తారు. ఇదంతా వికటించిన అద్వైత భావన వికృత రూపాయలు!

క్రైస్తవ సాధువుల విశేషాలు (Christian Extreme Asceticism): మధ్య యుగంలో ఐరోపాలో 'Extreme Asceticism' (అతివాద సన్యాసం) పాటించే కొందరు సాధువుల స్వేదము, నీరు లేదా వారు తాకిన అశుద్ధ ద్రవాలను రోగాలను నయం చేసే దివ్యౌషధాలుగా భక్తులు ఆస్వాదించే వారని ఆనాటి చర్చి రికార్డులు మరియు చరిత్రకారుల నివేదికలు తెలుపుతున్నాయి.

క్షుద్ర/విపాషండ తెగలు (Gnostic Sects) ప్రధాన క్రైస్తవ స్రవంతి (Mainstream Christianity)కి దూరంగా, క్రైస్తవ సిద్ధాంతాలను తంత్ర/మాంత్రిక విధానాలతో కలిపేసిన కొన్ని జ్ఞానవాద (Gnostic) తెగలు ఉద్భవించాయి:

4వ శతాబ్దపు చర్చి చరిత్రకారుడు ఎపిఫానియస్ (Epiphanius of Salamis) తన 'పనారియోన్' (Panarion) అనే గ్రంథంలో 'బోర్బోరైట్స్' (Borborites) అనే ఒక విపరీతమైన జ్ఞానవాద గుంపు గురించి రాశాడు.

ముస్లిం సుఫీ/తంత్ర మార్గాల్లో దిగజారిన శోధకులు (Extreme Sufi Sects/ Qalandars): సుఫీజం ప్రధానంగా ఆధ్యాత్మికత, దైవప్రేమను బోధించినప్పటికీ... కొన్ని విపరీతమైన అంచులకి వెళ్లిన 'కలందర్' (Qalandariyya) లేదా 'మలామతి' తెగలలో విచిత్ర ధోరణులు కనిపించాయి.

సామాజిక నిషేధాలను ఉల్లంఘించడం: కొందరు తీవ్రవాద కలందర్లు సమాజం తమను అసహ్యించుకోవాలనే ఉద్దేశ్యంతో లోకాచారాలను, పవిత్రతను, శరీరాచ్ఛాదనను పూర్తిగా నిరాకరించి దిశంబరులుగా తిరిగేవారు.

విష పదార్థాలు/అపవిత్రతల స్వీకారం: తమ అహాన్ని (Ego) చంపుకోవాలనే నెపంతో అసహ్యకరమైన పదార్థాలను లేదా శరీరక కష్టాలను తీవ్రంగా అనుభవించే విపరీత చర్యలకు పాల్పడేవారు. అయితే దీనిని ప్రధాన ఇస్లామీయ భావజాలానికి విరుద్ధమని ప్రధాన స్రవంతికి చెందిన ఇస్లామీయ పండితులు ప్రకటించి ఖండించారు.

ఆయా మత వర్గాలలో ఉన్న ఇలాంటి ఇత్యాది నీచ కృత్యాలను వివిధ ధార్మిక ఆలోచన-ఆచారణకి సంబంధించిన విషయాల్లో Extreme, in high భావనకి గువటంతో ఏర్పడ్డ దౌష్ట్యాలుగా చెప్పాలి. ఈ నీచ కృత్యాలకి వైదిక, యూద, క్రైస్తవ, ఇస్లాం ధర్మశాస్త్రాలకి ఎలాంటి సంబంధమూ లేదుగాక లేదు!

ధర్మం పేరిట మానవ హననం ఎందుకు సంభవించింది!?

ఈ పుస్తకం చదువుతున్న మీరు గుర్తించవలసిన అత్యంత మౌలిక విషయం వకటి ఉంది. అది: "దైవధర్మం వేరు దైవధర్మం పేరిట ఆయా ధార్మికులు చేసే విపరీత చేష్టలు వేరు!" అన్నదే. అందుకే ధర్మం పేరిట 'అతినీచమైన-అతిక్కూరమైన' చేష్టలను మీరు హిందూ, బౌద్ధ, యూదా, క్రైస్తవ, ముస్లిం 'సమాజాల'లో చూడగలరు. కానీ, దీనికి పూర్తి విరుద్ధంగా మీరు హిందూ, బౌద్ధ, యూదా, క్రైస్తవ, ముస్లిం 'ధర్మశాస్త్రాల'లో ఆ చేష్టల ఖండనను చూడగలరు!

ప్రాచీన వైదిక, యూద, క్రైస్తవ, ముస్లిం ధర్మశాస్త్రాలు "పరిశుద్ధతకు-అహింసకు" అత్యంత ప్రాధాన్యత ఇచ్చాయి. అయినప్పటికీ, 'అతినీచమైన-అతిక్కూరమైన' చేష్టలు ధర్మం గతీతప్పిన కాలాల్లో కొందరు 'నరబలి' పేరిట మరి కొందరు 'ధర్మ భ్రష్టులు' పేరిట అమాయకుల ప్రాణాలను బలితీసుకున్నారన్నది నిర్మొహమాటమైన చారిత్రక సత్యం. ఏ మతంలోనైనా, సిద్ధాంతంలోనైనా 'వివేకం-నైతికత' స్థానంలో 'అంధభక్తి-

తీవ్రవాదం' ప్రవేశించినప్పుడు మానవత్వం దిగజారి ఇలాంటి విపరీత చేష్టలకు దారితీసిందని చరిత్రలో ఎన్నో ఉదాహరణలు సాక్ష్యాలుగా నిలిచి ఉన్నాయి.

మతాచారం పేరిట హిందువులు సృష్టించిన నరమేధం!

ఐతిహాసిక ఆధారాలు: మహాభారతం (జరాసంధుడి నరబలి ప్రయత్నం) మగధ రాజైన జరాసంధుడు శివుడిని ప్రసన్నం చేసుకుని చక్రవర్తి కావడానికి 86 మంది రాజులను బంధించి, నరబలి ఇవ్వడానికి సిద్ధపడతాడు. శ్రీకృష్ణుడు దీనిని తీవ్రమైన అధర్మంగా ఖండించి, భీముడి ద్వారా జరాసంధుడిని సంహరింపజేసి ఆ రాజులందరినీ విడిపిస్తాడు. ధర్మసంస్థాపనలో భాగంగా నరబలిని నిరోధించడం శ్రీకృష్ణుడి ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా చూపబడింది.

అయినప్పటికీ 10వ–11వ శతాబ్దానికి చెందిన కాళికా పురాణంలో 'రుధిరాధ్యాయం' అనే అధ్యాయం ఉంది. ఇందులో కాళికా దేవిని ప్రసన్నం చేసుకోవడానికి ఇచ్చే వివిధ బలులలో నరబలి (మానవ బలి) విధులు, నిబంధనలు వర్ణించబడ్డాయి. రాజులు యుద్ధంలో విజయం కోసం, రాజ్య రక్షణ కోసం మాత్రమే దీనిని గుప్తంగా చేయాలని, సాధారణ ప్రజలు చేయడానికి వీల్లేదని అందులో పేర్కొనబడింది.

చారిత్రక మరియు శాసన ఆధారాలు (Historical Records) కొచ్ రాజవంశం: అస్సాంలోని కామాఖ్య దేవి ఆలయంలో 16వ శతాబ్దం వరకు (నరనారాయణ రాజు కాలం) నరబలులు జరిగేవని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. 1565లో కామాఖ్య ఆలయ పునర్నిర్మాణ సమయానికి 140 మంది నరబలి ఇవ్వబడ్డారని స్థానిక శాసనాలు, బురంజీలు (ఆహోమ్ రాజవంశ రికార్డులు) తెలుపుతున్నాయి.

విజయనగర సామ్రాజ్యం & ఇతర రాజవంశాలు: పోర్చుగీస్ యాత్రికుడు డొమింగో పేస్ (Domingo Paes) విజయనగర సామ్రాజ్యాన్ని సందర్శించినప్పుడు, కొత్త కోటలు, చెరువుల నిర్మాణాలు పూర్తయినప్పుడు లేదా నాశనం కాకుండా ఉండటానికి ప్రాచీన నమ్మకాల ప్రకారం బలవంతపు నర బలులు ఇచ్చేవారని రాశాడు.

బ్రిటిష్ నివేదికలు (19వ శతాబ్దం): ఒడిశా, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లోని ఖోండ్ (Khond) తెగలలో భూదేవిని ప్రసన్నం చేసుకుని పంటలు బాగా పండటానికి 'మేరియా' (Meriah) పేరుతో పిల్లలను/యువకులను బలి ఇచ్చే ఆచారం ఉండేది. 1830–1840 లలో బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఆచారాన్ని చట్టరీత్యా పూర్తిగా అణచివేసింది.

మతాచారం పేరిట యూదులు సృష్టించిన నరమేధం!

యిర్మియా 32:35– "వారు తమ కుమారులను కుమార్తెలను ప్రతిష్టింపవలెనని బెన్ హిన్నోము లోయలోనున్న బయలునకు బలిపీఠములను కట్టించిరి, ఆలాగు చేయుటకు నేను వారి కాజ్ఞాపింప లేదు, యూదావారు పాపములో పడి, యెవరైన నిట్టి హేయక్రియలు చేయుదురన్నమాట నా కెన్నడును తోచలేదు".

కీర్తనలు 106:37– "మరియు వారు తమ కూమారులను తమ కుమార్తెలను దయ్యములకు బలిగా అర్పించిరి".

కీర్తనలు 106:38– "నిరపరాధ రక్తము, అనగా తమ కుమారుల రక్తము తమ కుమార్తెల రక్తము ఒలికించిరి కనాను దేశపువారి బొమ్మలకు వారిని బలిగా అర్పించిరి ఆ రక్తమువలన దేశము అపవిత్రమాయెను".

2వ దినవృత్తాంతములు 28:3– "మరియు అతడు బెన్ హిన్నోము లోయ యందు ధూపము వేసి ఇశ్రాయేలీయుల యెదుట నుండి యెహోవా తోలివేసిన జనముల హేయ క్రియల చొప్పున తన కుమారులను అగ్నిలో దహించెను".

మతాచారం పేరిట క్రైస్తవులూ, ముస్లిములు సృష్టించిన నరమేధం!

1. క్రూసేడ్స్ కాలంలో క్రైస్తవులు యూదులను చంపడానికి గల కారణాలు & ఆధారాలు

11వ–13వ శతాబ్దాల మధ్య ముస్లింల నుండి యెరూషలేమును (Jerusalem) స్వాధీనం చేసుకోవడానికి ఐరోపా క్రైస్తవులు 'క్రూసేడ్స్' (క్రైస్తవ మత యుద్ధాలు) ప్రారంభించారు. అయితే, మధ్యప్రాచ్యానికి వెళ్లే మార్గంలోనే ఐరోపాలోని యూదులపై విపరీతమైన దాడులకు తెగబడ్డారు.

యుద్ధ కారణాలు (Motivations): "క్రీస్తు హంతకులు" (Deicide) అనే ముద్ర: యేసుక్రీస్తు సిలువ వేయబడటానికి యూదులే కారణమనే తీవ్రమైన మతద్వేష భావన (Anti-Semitism) ఆనాటి ఐరోపా సమాజంలో బలంగా ఉండేది. "దూరంగా ఉన్న ముస్లింలతో పోరాడటానికి వెళ్లేముందు, మన మధ్యనే ఉన్న క్రీస్తు శత్రువులైన యూదులను అంతమొందించాలి!" అనే అంధ విశ్వాసంతో దాడి చేశారు.

చారిత్రక ఆధారాలు & సంఘటనలు: రైన్‌ల్యాండ్ హత్యాకాండ (Rheinland Massacres – AD 1096): మొదటి క్రూసేడ్ సమయంలో 'కౌంట్ ఎమిచో' (Count Emicho) నాయకత్వంలో క్రైస్తవ సైన్యాలు జర్మనీలోని స్పేయర్ (Speyer), వర్మ్స్ (Worms), మైంజ్ (Mainz), మరియు కొలోన్ (Cologne) నగరాల్లోని యూదుల నివాసాలపై దాడులు చేశాయి.

వేలాదిమంది యూదులను బలవంతంగా మతం మార్చడానికి ప్రయత్నించారు; నిరాకరించిన వారిని సజీవంగా దహనం చేశారు లేదా నరికి చంపారు. మానసిక క్షోభతో అనేకమంది యూదు కుటుంబాలు శత్రువుల చేతిలో చావడం ఇష్టం లేక స్వయంగా ఆత్మహత్యలు చేసుకున్నాయి.

యెరూషలేము ముట్టడి (Siege of Jerusalem – AD 1099): క్రూసేడర్లు యెరూషలేమును స్వాధీనం చేసుకున్నప్పుడు, అక్కడ ఉన్న ముస్లింలతో పాటు యూదులను కూడా కత్తికి బలి ఇచ్చారు. యూదులందరూ తమ ప్రధాన ప్రార్థనా మందిరంలో (Synagogue) దాక్కునప్పుడు, క్రూసేడర్లు ఆ మందిరానికి బయట నుండి నిప్పు పెట్టి వారందరినీ సజీవ దహనం చేశారు. దీనిని ఆనాటి క్రైస్తవ చరిత్రకారుడు 'ఆల్బర్ట్ ఆఫ్ ఆచెన్' (Albert of Aachen) మరియు యూదు రికార్డులు ధృవీకరించాయి.

2. ఇస్లామీయ చరిత్రలో 'కాఫిర్లు' అని ముద్రవేసి ప్రజలను హతమార్చిన ఘటనలు: ఇస్లామీయ రాజవంశాల విస్తరణలో మరియు పొరుగు రాజ్యాలపై దండయాత్రల్లో తమ సిద్ధాంతాన్ని అంగీకరించని వారిని 'కాఫిర్లు' (Non-believers/Infidels)గా పరిగణించి ఊచకోత కోసిన అనేక చారిత్రక రికార్డులు ఉన్నాయి.

చారిత్రక ఆధారాలు & సంఘటనలు: భారతదేశంపై మహమూద్ గజనీ దండయాత్రలు (11వ శతాబ్దం): సుల్తాన్ మహమూద్ గజనీ భారత్‌పై 17 సార్లు దండయాత్రలు చేశాడు. ఆయన ఆస్థాన చరిత్రకారుడైన అల్-ఉత్బీ (Al-Utbi) తన 'తారీఖ్-ఇ-యామిని' (Tarikh-i-Yamini) గ్రంథంలో — గజనీ సైన్యాలు పఠాన్‌కోట్, మథుర, మరియు సోమనాథ్ ఆలయాలపై దాడి చేసినప్పుడు వేలాదిమంది విగ్రహారాధకులను (కాఫిర్లను) సంహరించి, ఆలయాలను ధ్వంసం చేశారని సగర్వంగా నమోదు చేశాడు.

తైమూర్ (Tamerlane) ఊచకోతలు (AD 1398): పర్షియా, మధ్య ఆసియా మరియు భారత్‌లపై దండెత్తిన తుర్కో-మంగోల్ పాలకుడు తైమూర్, తన దండయాత్రలను "కాఫిర్లపై జిహాద్" గా ప్రకటించుకున్నాడు.

ఢిల్లీ దండయాత్ర (1398): ఢిల్లీపై దాడి చేయడానికి ముందు, తన వద్ద బందీలుగా ఉన్న లక్ష మందికి పైగా హిందూ బందీలను (కాఫిర్లను) ఒక్క రోజులోనే శిరచ్ఛేదం చేయాలని ఆదేశించాడు. ఢిల్లీ నగరంలోకి ప్రవేశించిన తర్వాత లక్షలాది మంది సామాన్య ప్రజలను ఊచకోత కోసి, వారి తలలతో పిరమిడ్లు (గుట్టలు)గా పేర్చాడని ఆయన స్వీయచరిత్ర 'తుజుక్-ఇ-తైమూరీ' (Tuzuk-i-Timuri)లో నమోదు చేయబడింది.

బహమనీ సుల్తానులు – విజయనగర యుద్ధాలు (14వ–15వ శతాబ్దం): బహమనీ సుల్తాన్ మహమ్మద్ షా-1 విజయనగర సామ్రాజ్యంతో జరిగిన యుద్ధంలో ప్రతీకారంగా లక్షన్నర మందికి పైగా హిందూ పౌరులను చంపాడని మధ్యయుగ చరిత్రకారుడు ఫెరిష్తా (Ferishta) రాశాడు. పసిపిల్లలను, స్త్రీలను కూడా వదలకుండా చంపడాన్ని 'కాఫిర్లను అణచివేయడం'గా ఆనాటి రాజకోర్టులు అభివర్ణించాయి.

జోరోష్ట్రియన్ల (పారసీకుల) నిర్మూలన – పర్షియా ఇస్లామీకరణ (7వ శతాబ్దం తదుపరి): అరబ్ ముస్లింలు ససానియన్ పర్షియాను (ఇరాన్) జయించిన తర్వాత, అప్పటివరకు అక్కడ ఉన్న జోరోష్ట్రియన్ (గ్లోబల్ పారసీ) మతస్థులను 'కాఫిర్లు'గా పరిగణించి తీవ్ర వేధింపులకు గురిచేశారు. వారి అగ్నిక్షేత్రాలను ధ్వంసం చేయడంతో పాటు, మతం మారని వేలాది మందిని చంపేశారు. ఈ క్రూరత్వం తట్టుకోలేకనే పారసీకులు తమ ప్రాణాలను, మతాన్ని కాపాడుకోవడానికి భారత్‌కు (గుజరాత్ తీరానికి) శరణార్థులుగా పారిపోయి వచ్చారు.

యెజిడీల (Yezidis) పై ఒట్టోమన్లు మరియు ఆధునిక ఐసిస్ (ISIS) దాడులు: ఇరాక్ ప్రాంతంలో ఉన్న 'యెజిడీ' అనే ప్రాచీన మతస్థులను "సైతాన్ ఆరాధకులు/కాఫిర్లు" అని ముద్రవేసి ఒట్టోమన్ సామ్రాజ్య కాలంలోనూ, అలాగే ఇటీవల 2014లో ఐసిస్ (ISIS) ఉగ్రవాద సంస్థ కూడా వేలాది మంది యెజిడీ పురుషులను ఊచకోత కోసి, వేలాదిమంది మహిళలను లైంగిక బానిసలుగా (Sex Slaves) మార్చింది.

బౌద్ధులు సృష్టించిన నరమేధం

మయన్మార్ (పూర్వపు బర్మా) లోని రఖైన్ (Rakhine) రాష్ట్రంలో ఉన్న రోహింగ్యా ముస్లింలపై అక్కడి తీవ్రవాద బౌద్ధ గ్రూపులు మరియు మయన్మార్ మిలటరీ

(Tatmadaw) సంయుక్తంగా సాగించిన దాడులు, ఊచకోతలు ఆధునిక చరిత్రలో అత్యంత దారుణమైన మారణకాండలలో (Ethnic Cleansing/Genocide) ఒకటిగా నిలిచాయి.

శాంతి, అహింసలను బోధించే బౌద్ధమతం పేరు చెప్పి, ఆనాటి మతోన్మాద భిక్షువులు (Monks) మరియు సైన్యం రోహింగ్యాలను "అక్రమ బంగ్లాదేశ్ చొరబాటుదారులు" (Bengali illegal immigrants)గా ముద్రవేసి ఈ నరమేధానికి పాల్పడ్డారు.

దీనికి సంబంధించిన ప్రధాన చారిత్రక, అంతర్జాతీయ మరియు ఐక్యరాజ్యసమితి (UN) ఆధారాలు ఇక్కడ చూడవచ్చు:

1. విపరీతమైన మతోన్మాద వ్యాప్తి – Ashin Wirathu & 969 Movement ఈ నరమేధానికి బీజాలు 'అశిన్ విరాథు' (Ashin Wirathu) అనే ఉగ్ర-బౌద్ధ భిక్షువు నాయకత్వంలో పడ్డాయి.

'969 మూవ్‌మెంట్': ఈ ఉద్యమం ద్వారా బౌద్ధులను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టారు. "ముస్లింలు తమ జనాభాను పెంచుకుని బర్మాను ఇస్లామీకరణ చేస్తున్నారు, బౌద్ధ ధర్మాన్ని రక్షించుకోవడానికి ముస్లింల వ్యాపారాలను బహిష్కరించాలి, వారిని తరమివేయాలి!" అని బహిరంగంగా విద్వేషపూరిత ప్రసంగాలు (Hate Speech) చేశాడు.

TIME మేగజైన్ కవర్ పేజీ (2013): అంతర్జాతీయ మీడియా 'విరాథు'ను "The Face of Buddhist Terror" అని అభివర్ణిస్తూ కవర్ స్టోరీ ప్రచురించింది.

2012 మరియు 2017 రక్తపాతం (Key Violence Events)

2012 రఖైన్ అల్లర్లు: 2012 జూన్, అక్టోబర్ నెలల్లో రఖైన్ బౌద్ధులకు, రోహింగ్యాలకు మధ్య జరిగిన ఘర్షణల్లో వందలాదిమంది రోహింగ్యాలు చంపబడ్డారు. లక్షకు పైగా రోహింగ్యాలు తమ ఇళ్లను వదిలి లొకేషన్ మార్చి, అంతర్గతంగా శరణార్థి శిబిరాలకు (IDP camps) వెళ్లాల్సి వచ్చింది.

2017 'క్లియరెన్స్ ఆపరేషన్స్' (Clearance Operations): ఆగస్టు 2017లో రోహింగ్యా తిరుగుబాటు గ్రూపు (ARSA) కొన్ని పోలీస్ పోస్టులపై దాడి చేయడాన్ని

సాకుగా చూపి, మయన్మార్ సైన్యం తీవ్రవాద బౌద్ధ గ్రూపులతో కలసి "ఆపరేషన్స్" పేరుతో విపరీతమైన నరమేధానికి దిగింది.

గ్రామాలు కిక్కిరిసి ఉండగానే నిప్పు పెట్టడం, పారిపోతున్న వారిపై కాల్పులు జరపడం, మహిళలపై దారుణంగా సమూహ అత్యాచారాలు (Gang Rapes) చేయడం వంటి విపరీత చర్యలకు పాల్పడ్డారు.

ఐక్యరాజ్యసమితి (UN) & డాక్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్ (MSF) నివేదికలు

MSF (Médecins Sans Frontières) నివేదిక: 'డాక్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్' అనే అంతర్జాతీయ వైద్య సంస్థ ప్రకారం — 2017 ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 24 మధ్య కేవలం ఒక్క నెల వ్యవధిలోనే కనీసం 6,700 మంది రోహింగ్యాలు (అందులో 730 మందికి పైగా 5 సంవత్సరాల లోపు పిల్లలు) దారుణంగా చంపబడ్డారు.

UN Fact-Finding Mission (2018): ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం — మయన్మార్ సైనిక అధికారులు "ఇథ్నిక్ క్లెన్సింగ్" (జాతి నిర్మూలన) మరియు "జెనోసైడ్" (జనసంహారం) ఉద్దేశ్యంతోనే ఈ దాడులు చేశారు.

దాదాపు 7,500 కంటే ఎక్కువ రోహింగ్యా గ్రామాలు/ఇళ్లను తగులబెట్టారు. 2017 దాడుల తర్వాత దాదాపు 7,400,000 (7.4 లక్షలు) మందికి పైగా రోహింగ్యాలు ప్రాణాలు దక్కించుకోవడానికి బంగ్లాదేశ్ (కాక్స్ బజార్ – Cox's Bazar)కు శరణార్థులుగా పారిపోయారు.

ఇలాంటి నీచ-క్రూర కృత్యాలు మనుషుల్లో సహజంగా ఉండే అజ్ఞానం-స్వార్థం వంటి కారణాల వలన సంభవిస్తే దానికి అవగాహనతో నీయంత్రించవచ్చు. ఒకవేళ ఈ నీచ-క్రూర కృత్యాలకు 'మతపరమైన సమర్థన' (Religious justification) గనక లభిస్తే దానిని ఆపటం ఇక ఎవనితరమూ కాకుండా పోతుంది.

ఈ 'Normalism' గురించి ధర్మ గ్రంథాలు ఏమంటున్నాయి?

యావత్ సృష్టిలోని ప్రతీదీ నిర్దిష్టం Normal conditionకి లోబడి ఉందని మీరు గత ప్రారంభ అంశాల్లో చూచి ఉన్నారు. సృష్టిలోని ఎందులోనూ అతి లేదు. అంతా 'మధ్యస్థం'గానే ఉందని తెలుస్తుంది. ఇక ఈ విషయం గురించి ధర్మశాస్త్రాలు ఏమంటున్నాయో చూడాల్సి ఉంది.

వైదిక ధర్మం ఏమంటుంది?

వైదిక ధర్మం విషయానికి వస్తే అది–

భగవద్గీత 6:16– నాత్యశ్నతస్తు యోగోSస్తి న చైకాంతమనశ్నతః।
న చాతి స్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జున॥

భగవద్గీత 6:17– యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మాసు।
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా॥

అర్థం: 1) అతిగా తినేవాడికి, 2) అసలే తినకుండా ఉపవాసాలు ఉండేవాడికి; అలాగే 3) అతిగా నిద్రపోయేవాడికి, 4) అసలు నిద్రపోకుండా మేల్కొని ఉండేవాడికి యోగం (సిద్ధి) లభించదు. ఆహారం, విహారం, పనులు చేయడం, నిద్రించడం, మేల్కొనడం మొదలైన ప్రతి విషయంలోనూ 'సమతుల్యత' పాటించేవానికే యోగం లభిస్తుంది మరియు అతని దుఃఖాలన్నీ నశిస్తాయి.

అందుకే "అతి సర్వత్ర వర్జయేత్" అనే లోకోక్తి మూలం నీతిశాస్త్రాల్లో ఉన్నప్పటికీ, దాని అంతర్లీన సందేశం సమతుల్యతే ఆధ్యాత్మిక జీవన మార్గంగా భగవద్గీతలో ప్రబోధించ బడింది. "అతి సర్వత్ర వర్జయేత్" (ఏ విషయంలోనైనా అతి కాకూడదు. అది "సంస్కారాలు/ఆశ్రమ ధర్మాలు" వంటివి ఏవైనా కావచ్చు అవన్నీ మధ్యస్థంగానే ఉండాలి తప్ప, వాటిలో ఎలాంటి అసమతుల్యత ఏర్పడరాదు.

వేదశాస్త్రాల ప్రకారమూ మధ్యే మార్గమే శ్రేయస్కరం అని తెలుస్తుంది. కాబట్టి ఒక నిజమైన హిందువు కావాలంటే ఏ విషయంలోనూ గతి తప్పకుండా నీచ–క్రూర చేష్టలకు దూరంగా ఉంటూ మధ్యస్థంగా జీవితం గడపాలి.

యూదా, క్రైస్తవ ధర్మం ఏమంటుంది?

బైబిల్ గ్రంథం దేవుణ్ణి "క్రమశిక్షణ కలిగినవాడు" (God of Order)గా, మానవ ప్రవర్తనలో సమతుల్యతను కోరేవాడిగాను చూపిస్తుంది. 'మితత్వము' (Temperance/ Self-control) అన్నవి క్రైస్తవ్యంలో 'ఆత్మ ఫలము'ల్లో 'ఆత్మ నిగ్రహం' లేదా 'మితత్వం' అతి ముఖ్యమైనవి. దానికి వాక్యాధారం చూడండి.

ద్వితీయోపదేశకాండము 5:32– "కాబట్టి మీ దేవుడైన యెహోవా మీకు ఆజ్ఞాపించినట్లు చేయుటకు జాగ్రత్త పడుడి, కుడికిగాని ఎడమకుగాని తిరుగకూడదు".

సామెతలు 4:27– “కుడి పార్శ్వమునకుగాని ఎడమ పార్శ్వమునకుగాని తిరుగకుము, నీ పాదమును చెడు తనమునకు దూరముగా తొలగించుకొనుము”.

బైబిలు ప్రకారమూ మధ్యే మార్గమే శ్రేయస్కరం అని తెలుస్తుంది. కాబట్టి ఒక నిజమైన యూదుడు, క్రైస్తవుడు కావాలంటే ఏ విషయంలోనూ గతి తప్పకుండా నీచ–క్రూర చేష్టలకు దూరంగా ఉంటూ మధ్యస్థంగా జీవితం గడపకతప్పదు.

ఇస్లాం ధర్మం ఏమంటుంది?

ఇస్లాం జీవన విధానంలోనూ సమతుల్యతకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ‘వసత్’ (Wasat) అన్నది ఇస్లాంలో “మధ్యేమార్గం” లేదా సమతుల్యతను ‘వసత్’ అంటారు. ఖురాన్ ముస్లిం సమాజాన్ని “ఉమ్మతె వసత్” (2:143) అంటే ‘సమతుల్య/మధ్యస్థ సమాజం’ అని ప్రకటిస్తుంది. ఖురాన్ 25:67వ వాక్యం చూడండి.

وَٱلَّذِينَ إِذَآ أَنفَقُواْ لَمۡ يُسۡرِفُواْ وَلَمۡ يَقۡتُرُواْ وَكَانَ بَيۡنَ ذَٰلِكَ قَوَامٗا

“వారు ఖర్చుపెట్టే సమయంలో కూడా అటు మరీ దుబారా ఖర్చు చేయకుండా, ఇటు మరీ పిసినారితనం కూడా చూపకుండా రెండింటికీ మధ్య ‘సమతుల్యత’ను పాటిస్తారు”.

అంటే వారి మార్గం ఈ రెండు రకాల అతిపోకడలకి మధ్యస్థంగా ఉంటుందని ఖురాన్ చెబుతుంది. అలాగే 5:12 వ వాక్యం చూడండి.

وَلَقَدۡ أَخَذَ ٱللَّهُ مِيثَٰقَ بَنِيٓ إِسۡرَٰٓءِيلَ وَبَعَثۡنَا مِنۡهُمُ ٱثۡنَيۡ عَشَرَ نَقِيبٗاۖ وَقَالَ ٱللَّهُ إِنِّي مَعَكُمۡۖ لَئِنۡ أَقَمۡتُمُ ٱلصَّلَوٰةَ وَءَاتَيۡتُمُ ٱلزَّكَوٰةَ وَءَامَنتُم بِرُسُلِي وَعَزَّرۡتُمُوهُمۡ وَأَقۡرَضۡتُمُ ٱللَّهَ قَرۡضًا حَسَنٗا لَّأُكَفِّرَنَّ عَنكُمۡ سَيِّـَٔاتِكُمۡ وَلَأُدۡخِلَنَّكُمۡ جَنَّٰتٖ تَجۡرِي مِن تَحۡتِهَا ٱلۡأَنۡهَٰرُۚ فَمَن كَفَرَ بَعۡدَ ذَٰلِكَ مِنكُمۡ فَقَدۡ ضَلَّ سَوَآءَ ٱلسَّبِيلِ

అల్లాహ్ ఇస్రాయీల్ సంతతి నుండి గట్టి వాగ్దానాన్ని తీసుకున్నాడు. వారిలో నుంచే పన్నెండు మంది నాయకులను మేము నియమించాము. ఇంకా అల్లాహ్ వారితో ఇలా అన్నాడు– “నిశ్చయంగా నేను మీకు తోడుగా ఉన్నాను. మీరు గనక i) నమాజును నెలకొల్పుతూ ఉంటే, ii) జకాత్ ఇస్తూ ఉంటే, iii) నా ప్రవక్తలను విశ్వసిస్తూ, iv) వారిని గౌరవించి వారికి సహాయ పడితే, v) అల్లాహ్‌కు ఉత్తమ రుణాన్ని ఇస్తూ ఉంటే (కలిగే లాభాలు): i) నేను మీ చెడులను మీ నుంచి దూరం చేస్తాను. ii) క్రింద సెలయేళ్లు ప్రవహించే స్వర్గవనాలలోకి మిమ్మల్ని తీసుకుపోతాను. ఈ ప్రమాణం తరువాత కూడా మీలో ఎవడైనా తిరస్కార వైఖరికి పాల్పడితే అతడు ‘మధ్యేమార్గం’ (సవావుస్సబీల్) నుంచి తప్పిపోయాడు” అని ఖురాన్ హెచ్చరిస్తుంది.

ఇస్లాం ధర్మానికి ఉన్న అనేక నామాల్లో– 'సవావుస్సబీల్' అంటే "మధ్యేమార్గం" అన్నది కూడా ఒకటి. కాబట్టి ప్రకారమూ మధ్యే మార్గమే శ్రేయస్కరం అని తెలుస్తుంది. కాబట్టి ఒక నిజమైన ముస్లిం కావాలంటే ఏ విషయంలోనూ గతి తప్పకుండా నీచ–క్రూర చేష్టలకు దూరంగా ఉంటూ మధ్యస్థంగా జీవితం గడపాలి.

ఒక్క ప్రకృతేకాక, హిందూ, యూదా, క్రైస్తవ, ఇస్లాం ధర్మ శాస్త్రాలు కూడా అటు– Extreme, in highకి, ఇటు– Extreme, in lowకి కాక, ఒక 'మితమైన జీవనశైలి' (Moderate lifestyle) గురించే బోధిస్తున్నాయని తెలుస్తుంది. కాబట్టి ఒక నిజమైన హిందూ, యూదా, క్రైస్తవ, ముస్లిం తదితర భక్తులు సకల విషయాల్లో మరీ ముఖ్యంగా ధార్మిక విషయాల్లో "కుడి"కో లేక "ఎడమ"కో ఒరిగిపోకుండా "మధ్యస్థం"గా మాత్రమే ఉంటూనే 'పవిత్రత–మానవత' వంటి మౌలిక విలువలు పాటిస్తూ జీవితం గడపాలి.

మధ్యేమార్గం తప్పకుండా ఉండటానికి దైవం చేసిన ఏర్పాటు ఏమిటి?

మనిషి ప్రశాంత మనుగడ అన్నది అతని 'మితమైన జీవనశైలి'లోనే ఉందని తెలుసుకున్నారు. ఇది మనిషి సుదీర్ఘ అనుభవం కూడా. సకల ధర్మశాస్త్రాలు కూడా అదే విషయాన్ని చెబుతున్న వైనాన్నీ తెలుసుకున్నారు. మనిషికి ఉన్న అనేక పరిమితుల్లో ఒకటి కుడికో లేక ఎడమకో ఒరిగిపోవటం అని కూడా తెలుసుకున్నారు. అందుకే దీనిని అధిగమించటానికి ఖురాన్ మొదటి అధ్యాయాలోనే ఇస్లాం చేసిన కట్టుదిట్టమైన ఏర్పాటు ఏమిటో చూడండి.

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

1. అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో (ప్రారంభిస్తున్నాను)

الْحَمْدُ لِلَّهِ رَبِّ الْعَالَمِينَ

2. సకల లోకాల ప్రభువైన అల్లాహ్‌కే సర్వ స్తోత్రాలు.

الرَّحْمَٰنِ الرَّحِيمِ

3. ఆయన అనంత కరుణామయుడు మరియు అపార కృపాశీలుడు.

مَالِكِ يَوْمِ الدِّينِ

4. తీర్పు దినానికి ఆయనే యజమాని (రాజు).

إِيَّاكَ نَعْبُدُ وَ إِيَّاكَ نَسْتَعِينُ

5. (ఓ అల్లాహ్!) మేము నిన్ను మాత్రమే ఆరాధిస్తాము మరియు నీ సహాయాన్ని మాత్రమే అర్థించుకుంటాము.

اهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

6. మాకు రుజుమార్గం (straight path) చూపించు.

صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ

7. నీవు అనుగ్రహించిన వారి మార్గం; నీ ఆగ్రహానికి గురైన వారి మార్గం కాదు, మార్గభ్రష్టులైన వారి మార్గమూ కాదు.

పైన పేర్కొన్నవి ఖురాను గ్రంథ మొదటి అధ్యాయానికి సంబంధించిన పూర్తి వాక్యాలు. వాటిలో 7వ వాక్యం అత్యంత గమనార్హం.

1. నీవు "అనుగ్రహించిన" వారి మార్గం కావాలి.

2. నీ "ఆగ్రహానికి గురైన" వారి మార్గం వద్దు,

3. "మార్గభ్రష్టులైన" వారి మార్గం వద్దు. అంటే...

మొదటి వర్గం: ధర్మం విషయంలో 'మితమైన జీవనశైలి' (Moderate lifestyle) అనుసరించిన వారు. కాబట్టి ఆ మార్గం కావాలి.

రెండవ వర్గం: ధర్మం విషయంలో Extreme, in high మార్గం అనుసరించిన వారు. కాబట్టి ఆ మార్గం వద్దు.

మూడవ వర్గం: ధర్మం విషయంలో Extreme, in low మార్గం అనుసరించిన వారు. కాబట్టి ఆ మార్గం వద్దు.

ప్రతి ముస్లిం రోజుకు ఐదు పూటలు చేసే ప్రార్థనలో ఒక దినంలో కనీసం 17 నుండి 30 సార్లు దేవునితో పై వేడుకోలు చేసుకుంటూనే ఉంటాడు. దీనినిబట్టి ఇస్లాం ప్రకారం మధ్యే మార్గాన్ని వదలి అటు– Extreme, in highకి లేదా ఇటు– Extreme, in lowకి గురవటం ఎంతటి ప్రమాదకరమైన విషయమో అర్థం చేసుకోవచ్చు.

దైవధర్మం అంతిమ లక్ష్యం– 'వ్యక్తి సంక్షేమం!'. అదే దైవధర్మం గతి తప్పితే 1) గురువుల అశుద్ధాలు తినటం లాంటి 'నీచ' కార్యాలు, 2) 'నరబలి' లేదా 'హత్యాకాండ'కి పాల్పడటం లాంటి క్రూర చేష్టలు సైతం పవిత్రమైన ధర్మకార్యాలు అయిపోతాయి!

ఇలాంటి దుస్థితికి గురికాకుండా ఉండాలంటే ధర్మం తీసుకోమంటున్న జాగ్రత్తలు ఏమిటి?

ప్రతీ వ్యవస్థ దానిదంటూ ఒక పాలసీ కలిగి ఉంటుంది. అలాగే దైవ ధర్మం కూడా కొన్ని నిర్దిష్ట 'నియమ–నిబంధనల'తో ఒక కచ్చితమైన పాలసీ కలిగి ఉంటుంది. దానినే ధర్మశాస్త్రం అంటారు. దాని నియమ–నిబంధనలు మనిషి సాధారణ వివేచనకి, అతని ఇంగిత జ్ఞానానికి, మనస్సాక్షికి వందకు వంద శాతమూ సరిపోతాయి. అవి సార్వకాలికంగానూ, సార్వజనీనంగానూ ఉంటాయి. ఇక్కడ మీ ముందు రెండు విషయాలు రానున్నాయి. వాటిలో...

1. "ధర్మంలో ధర్మ శాస్త్రాల ప్రాధాన్యత ఎంతగా ఉంది" అన్నది.

2. "వాటి విధి–నిషేధాలను అతిక్రమిస్తే ఘోర పరిణామాలు తప్పవు" అన్నది.

ఈ రెండు విషయాలను గీతా, బైబిలు, ఖురాన్ గ్రంథాల వెలుగులో చూడండి.

ధర్మంలో ధర్మ శాస్త్రాల ప్రాధాన్యత ఏమిటి?

గీతాశాస్త్రం 16:24– తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్యవ్యవస్థితౌ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి॥

కావున చేయదగినదియు, చేయరానిదియు నిర్ణయించునపుడు నీకు శాస్త్రము ప్రమాణమైయున్నది. శాస్త్రమునందు చెప్పబడిన దానిని తెలిసికొని దాని ననుసరించి నీవీ ప్రపంచమున కర్మమును జేయదగును.

బైబిలు ద్వితియోపదేశకాండము 12:32– "నేను మీ కాజ్ఞాపించుచున్న ప్రతి మాటను అనుసరించి చేయవలెను. దానిలో నీవు ఏమియు కలుపకూడదు దానిలోనుండి ఏమియు తీసివేయకూడదు" అని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు.

ఖురాన్ 7:3వ వాక్యం చూడండి.

ٱتَّبِعُواْ مَآ أُنزِلَ إِلَيۡكُم مِّن رَّبِّكُمۡ وَلَا تَتَّبِعُواْ مِن دُونِهِۦٓ أَوۡلِيَآءَۗ قَلِيلٗا مَّا تَذَكَّرُونَ

"(ప్రజలారా!) మీ ప్రభువు తరఫున మీకు ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని మీరు అనుసరించండి. అల్లాహ్‌ను (అంటే ధర్మశాస్త్ర ఆదేశాలను) వదలి ఇతర సంరక్షకులను (అంటే ఇతరుల కాల్పనిక ఆదేశాలను) అనుసరించకండి. మీరు బహుకొద్దిగా మాత్రమే హితబోధను గ్రహిస్తారు" అని ఖురాను తాకీదు చేస్తుంది.

అతిక్రమిస్తే సంభవించే ఘోర పరిణామాలు ఏమిటి?

ధర్మంలో ధర్మశాస్త్రాల ప్రాధాన్యత ఏమిటో స్వయంగా ధర్మశాస్త్రాల వెలుగులోనే చూశారు. ఇక వాటి ప్రబోధనలను తిరస్కరిస్తే సంభవించే ఘోర పరిణామాలు ఏమిటో చూడండి.

గీతాశాస్త్రం 16:24– యः శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతः।
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్॥

ఎవడు శాస్త్రోక్తమగు విధిని విడిచిపెట్టి తనయిష్టమువచ్చినట్లు ప్రవర్తించునో, అట్టివాడు పురుషార్థసిద్ధినిగాని, సుఖముగాని, ఉత్తమగతియగు మోక్షమునుగాని పొందనేరడు" అని భగవద్గీత తీర్మానింస్తుంది. ఇదే విషయంలో బైబిలు ప్రబోధనం ఏమిటో చాడండి.

బైబిలు ద్వితియోపదేశకాండము 28:61,62– మరియు నీవు నశించువరకు ఈ ధర్మశాస్త్ర గ్రంథములో వ్రాయబడని ప్రతి రోగమును ప్రతి తెగులును ఆయన నీకు కలుగజేయును.। నీవు నీ దేవుడైన యెహోవా మాట వినలేదు గనుక ఆకాశ నక్షత్రముల వలె విస్తారములైన మీరు, లెక్కకు తక్కువై కొద్ది మందే మిగిలి యుందురు" అని బైబిలు హెచ్చరిస్తుంది.

ఖురాన్ 3:4వ వాక్యంలో ఏమంటుందో చూడండి.

...إِنَّ ٱلَّذِينَ كَفَرُواْ بِـَٔايَٰتِ ٱللَّهِ لَهُمْ عَذَابٌ شَدِيدٌ

"...అల్లాహ్ విధిత ఆజ్ఞలను తిరస్కరించిన వారికి కఠిన శిక్ష పడటం ఖాయం" అని ఖురాన్ హెచ్చరిస్తుంది. 2:229వ వాక్యం చూడండి.

تِلْكَ حُدُودُ اللَّهِ فَلَا تَعْتَدُوهَا ۚ وَمَن يَتَعَدَّ حُدُودَ اللَّهِ فَأُولَٰئِكَ هُمُ الظَّالِمُونَ

"ఇవి (అనగా నైతికతా–మానవతా విలువలు) అల్లాహ్ నిర్ణయించిన హద్దులు, కాబట్టి వీటిని అతిక్రమించకండి. ఎవరైతే వాటిని అతిక్రమిస్తారో, అలాంటి వారే దౌర్జన్యపరులు (దారుణాలకు ఒడిగట్టేవారు)" అవుతారు అని ఖురాన్ హెచ్చరిస్తుంది. ఇంకా...

ఖురాన్ 65:1వ వాక్యం చూడండి.

وَتِلْكَ حُدُودُ اللَّهِ ۚ وَمَن يَتَعَدَّ حُدُودَ اللَّهِ فَقَدْ ظَلَمَ نَفْسَهُ

"అవి (అంటే నైతికతా–మానవతా విలువలు) అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. ఎవరైతే వాటిని అతిక్రమిస్తారో, వారు తమకు తామే అన్యాయం చేసుకున్నవారవుతారు" అని ఖురాన్ హెచ్చరిస్తుంది.

ధర్మశాస్త్రాలు హెచ్చరించినట్లే వాటి ప్రబోధనలను అతిక్రమిస్తే సంభవించే ఘోర పరిణామాలు సంభవించటాన్ని చరిత్రక ఆధారాలతో చూచి ఉన్నారు. నేటికీ చూస్తూనే ఉన్నారు. ఇక ఈ దుష్పరిణామాల నుడిగుండం నుండి బయట పడాలంటే ధర్మశాస్త్రాల ప్రబోధిత ఆలోచనా–ఆచారణకి యథాతథంగా నిబద్ధులై అనుసరించాలి. ఇది తప్ప మరోమార్గాంతరం లేనేలేదు.

అంటే ధర్మ గ్రంథాలను 'సైద్ధాంతిక' (Theoretical) మార్గదర్శకంగా తీసుకోవాలి. ఆ తరువాత వాటి 'ఆచరణాత్మక' (Practical) ఆదర్శాలను వాటిని అందించిన మహనీయుల ఆదర్శ జీవితాల నుండి మాత్రమే తీసుకోవాలి. ఆ రెండు ఆధారాలు తప్ప, అటు– 'సైద్ధాంతిక', ఇటు– 'ఆచరణాత్మక' విషయాలను ధర్మంలో కొత్తగా కల్పించే హక్కు ఎవరికీ లేదుగాక లేదు! ఈ విషయాన్ని ప్రతి ధార్మికుడూ తప్పకుండా గుర్తించాలన్నది అత్యంత గమనార్హం!

సారాంశం

ధర్మ శాస్త్రాలు ఇచ్చిన 'సైద్ధాంతిక' మరియు 'ఆచరణాత్మక' ప్రబోధనలకి నిబద్ధులై, యథాతథంగా అనుసరిస్తేనే మనుషులు 'పవిత్రులు–దయామయులు'గా రూపొందుతారు. ఒకవేళ అవే ప్రబోధనల్లో Extreme, in highకి గురై, ధర్మ గ్రంథాలుగాని, మహనీయులుగాని ఎన్నడూ బోధించని మూఢ విశ్వాసాలూ, మూఢాచారాలను కల్పిస్తే; అది హిందువులైనా, బౌద్ధులైనా, యూదులైనా, క్రైస్తవులైనా, ముస్లిములైనా లేదా మరెవరైనా సరే 'నీచులూ– క్రూరులు' కాక, తప్పదన్నది సారాంశం!

ఒకవేళ మీరు ధర్మం పేరిట నీచకార్యాలకి పాల్పడుతున్నా, తోటి మతస్తులను ద్వేషిస్తున్నా ధర్మం విషయంలో మీరు Extreme, in highకి గురై ఉన్నట్లే. దీని నుండి బయటపడితేనే నేనైనా, మీరైనా 'ధార్మిక సజ్జనులు' అవుతాము. లేదంటే 'ధార్మిక దుర్జనులు' అన్నది తథ్యం!

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

మత విభేదాలు

దేవుడే పరిష్కరిస్తాడు!



Part-9

M. A. Abhilash
96664 88877

చర్చించిన అంశాలు

పరిచయం----------I

మత భేదాలను దైవం తప్ప ఎవరూ పరిష్కరించలేరు!----------1

ఈ రెండు విషయాల మధ్య తేడాను గుర్తించక పోవటమే!----------1

1. నైతికతా–మానవతా విలువలు----------2

2. విశ్వాసాలూ–ఆచారాల క్రతువులు----------2

పరస్పరం విభేదాలు విడనాడాలి! – మరి చేయవలసినది ఏమిటి?-----4

ఖురాన్ ప్రకారం– ఏ విషయాల్లో విభేదాలు ఉంటాయి?----------6

మత విభేదాలు పరిష్కరించటం అసాధ్యం!----------7

ఎదుటి వారి విశ్వాసాలు
తప్పు అనుకున్నప్పుడు వారిని ద్వేషించాలా? ప్రేమించాలా?--------10

సకల ధార్మికుల తక్షణ కర్తవ్యం ఏమిటి?----------11

పరిచయం

మానవ సమాజంలో మతం మనిషికి నైతికతను, మానవతను, ప్రేమను, కరుణను, సహనాన్ని నేర్పించి, అతడిని ఉత్తమమైన వ్యక్తిగా తీర్చిదిద్దాలి. కానీ నేడు మతాల పేరుతో, మతాల్లోని విభిన్న సిద్ధాంతాల పేరుతో మనుషుల మధ్య విభేదాలు, అపోహలు, ద్వేషాలు, ఘర్షణలు పెరుగుతున్నాయి. దీనికి కారణమ తమ మతమే సత్యమని పరస్పరం వాదించటమే! ఈ పోకడ మతాల అసలు ఉద్దేశాన్నే ప్రశ్నార్థకం చేస్తోంది.

మతాల మధ్య ఏకత్వం అంటే అందరూ ఒకే మతాన్ని అనుసరించడం కాదు; భిన్న మతాలను అనుసరిస్తూనే మానవీయ విలువల విషయంలో ఏకమవడం. ఈ భావన సమాజంలో బలపడినప్పుడు– మత విద్వేషాలకు, మతపరమైన ఆధిపత్య ధోరణులకు, అనవసర ఘర్షణలకు క్రమంగా స్థానం తగ్గుతుంది. మతం మనుషులను విడదీసే సాధనంగా కాకుండా, పరస్పరం సత్కర్మల్లో పోటీ పడే మాధ్యమంగా నిలుస్తుంది.

మత సంబంధిత విభేదాలను ఆయా మత వర్గాల పండితులు ఇక్కడే, ఇప్పుడే తేల్చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. దీని వలన మతవర్గాల మధ్య తీవ్రమైన ఘర్షణ తలెత్తింది. నిజానికి ఈ వ్యవహారాన్ని దేవుడు పరలోకంలో పరిష్కారం చేస్తానంటున్నాడు. కనుక మత పరమైన ఏకాభిప్రాయం ఇక్కడే సాధించటం అన్నది దైవ ప్రణాళికకు వ్యతిరేకమైన ప్రవర్తన అవుతుంది!

కనుక మతాల మధ్య, మతాల అంతర్గతంగా ఉన్న విశ్వాస–ఆచార విభేదాలను గౌరవిస్తూనే, మత విశ్వాసాలకంటే నైతిక–మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ, పరస్పర గౌరవం, ప్రేమ, సహనం, సహజీవనం ఆధారంగా మానవ సమాజాన్ని ఐక్యపరచడం అన్నది మత పండితుల ప్రయాస అయి ఉండాలి.

తద్వారా సమాజంలో ఉన్న వివిధ మత వర్గాల మధ్య ప్రేమ, సద్భావన, మానవ సంబంధాలు వంటి విలువలు వాటికవే వికసించటం మొదలవుతుంది. ఇక అక్కడి నుండి మత వర్గాల మధ్య ఐక్యత ఏర్పడి దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ బృహత్ లక్ష్యంతోనే ఈ చిరు పుస్తక రచన జరిగింది.

KAKINADA
12-02-2025

M. A. Abhilash

ఖురాన్ ప్రకారం మత విభేదాలను దైవం తప్ప ఎవరూ పరిష్కరించలేరు!

నేటి ధార్మిక వ్యవస్థ పరిస్థితి కుక్కలు చించిన విస్తరి చందంగా ఉందంటే అది అతి ఎంత మాత్రమూ సయోక్తి కాదు. ప్రతి వర్గమూ తన ఆలోచనా–ఆచారణా విధానాలే సరైనవి. మిగిలిన సకల మతాల విధానాలన్నీ తప్పే! అనే ఒక తీవ్రవాద ధోరణి రోజురోజుకూ పెరుగుతూ పోతుంది. ఈ వాగ్వివాదాల పరువం బాహ్య మత వర్గాల్లోనే కాక, అంతర్గత మత వర్గాల్లోనూ తాండవిస్తోంది. చిన్నచిన్న మత విభేదాలను చూపి పరస్పరం ఘోరమైన శతృత్వం పగప్రతీకారాలు పెంచుకుంటున్నారు!

ఈ పరిస్థితి ఆలోచనాపరులు, మేధావులు అయిన యువతకు మతం పట్ల అసహ్యం, ఏహ్యభావం కలిగిస్తుంది. పర్యవసానంగా వారు నాస్తికత్వం వైపునకు అతి వేగంగా మరలిపోతున్నారు.

ఈ రెండు విషయాల మధ్య తేడాను గుర్తించక పోవటమే!

ప్రతి ధార్మిక వ్యవస్థలోనూ మౌలికంగా రెండు విభాగాలుగా ఉంటాయి. వాటిలో... 1) మత సంబంధమైన 'విశ్వాసాలూ–ఆరాధనా క్రతువులు', 2) ప్రవర్తనా సంబంధమైన 'నైతికతా–మానవతా విలువలు'.

మొదటి విషయాల గురించి దైవం– "మీ మత విభేదాలను నేను పరలోకంలో పరిష్కరిస్తాను!" అని పదకొండు సార్లు ఖురానులో సుస్పష్టంగా ప్రకటించాడు. రెండవదైన "సత్కర్మలు' చేసే విషయంలో ముందుకు సాగిపోండి!" అని ఆజ్ఞాపిస్తున్నాడు.

దీని ప్రకారం మతవర్గాల్లో తలెత్తిన ఘర్షణలకు ప్రధాన కారణం– ఆస్తిక–నాస్తిక వర్గాలన్నీటి మధ్య 'ఏకాభిప్రాయం ఉన్న' నైతికతా–మానవతా వంటి సత్కర్మలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఎవరికీ 'సంపూర్ణ ఏకాభిప్రాయం లేని' మత సంబంధమైన విశ్వాసాలూ–ఆరాధనల విషయంలో ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నంలో పడిపోవటమే! 'ఈ రెండు విషయాల మధ్య తేడాను గుర్తించక పోవటమే!' నేటి ధార్మిక వ్యవస్థ అస్తవ్యస్తం కావటానికి ప్రధాన కారణం అయ్యింది.

దీనివలన ఒకవైపు– ధార్మికుల్లో ఎడతెగని ఘర్షణ మొదలైపోయింది. మరోవైపు– ధార్మికుల వ్యక్తిత్వంలో సత్కర్మలు తగ్గిపోతూ దుష్కర్మలు పెరిగిపోతున్నాయి. కాబట్టి ధర్మంలో ఉన్న ఆ రెండు విభాగాల వాస్తవికత ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి సంస్కర్తపైనా ఉంది. అందుకే ఈ రచన మీకు అందిస్తున్నాను.

1. నైతికతా-మానవతా విలువలు

ఒక మతవర్గానికి మరొక మతవర్గానికి మధ్యేకాక, ఒకే మతవర్గంలోని ఉపవర్గాల్లోనూ 'విశ్వాసాలూ–ఆరాధనా క్రతువుల' విషయంలో భేదం ఉంటుంది. దీనికి పూర్తిగా భిన్నంగా 'నైతికతా–మానవతా విలువల' విషయంలో అన్ని మత మతవర్గాల్లోనే కాక, చివరికి ఆస్తిక–నాస్తికు వర్గాల మధ్య కూడా ఎలాంటి భేదమూ ఉండదు! ఉదా:

> **నైతికతా విలువలు**: సత్యనిష్ఠ, న్యాయం, నిజాయితీ, బాధ్యత, వాగ్దానపాలన, విశ్వసనీయత, ఆత్మనిగ్రహం, నిష్పక్షపాతం, పారదర్శకత, వివేకం వగైరా...
>
> **మానవతా విలువలు**: సమానత్వం, కరుణ, సానుభూతి, సహనం, అహింస, సేవాభావం, క్షమాగుణం, సహకారం, సహజీవనం, పర్యావరణ పరిరక్షణ వగైరా...

2. విశ్వాసాలూ-ఆచారాల క్రతువులు

ఈ విషయాల్లో ఒక మతవర్గానికి మరొక మతవర్గానికి మధ్య భేదం ఉంటుంది. అంతేకాదు, ఒకే మతవర్గంలోని ఉపవర్గాల్లోనూ భేదం ఉంటుంది. ఉదా:

విశ్వాసాలు: 1) హిందూ మతం– బ్రహ్మం, ఆత్మ, కర్మ, పునర్జన్మ, జన్మల చక్రం, మోక్షం వగైరా... 2) యూదా మతం– ఏకదైవ విశ్వాసం, అబ్రహాము ఒడంబడిక, మోషే ప్రవక్త, తోరా దైవబోధన, ప్రవక్తల విశ్వాసం, దైవిక ఆజ్ఞలు, దైవిక తీర్పు వగైరా... 3) క్రైస్తవ మతం– ఏకదైవ విశ్వాసం, త్రిత్వ విశ్వాసం, యేసుక్రీస్తు దైవత్వం, యేసుక్రీస్తు అవతారం, సిలువ మరణం, పునరుత్థానం వగైరా... 4) ఇస్లాం– దేవుడు ఒక్కడే, మరణానంతర జీవితం, దైవదౌత్యం, దైవదూతలు, తీర్పుదినం వగైరా...

ప్రార్థనలు: హిందూ మతం– పూజ, సంధ్యావందనం, మంత్రజపం, ధ్యానం, ఆరతి, నైవేద్యం, భజన, కీర్తన, నమస్కారం, ప్రణామం, హోమం, యజ్ఞం, అభిషేకం వగైరా...

యూదా మతం– Shacharit ఉదయం చేసే ప్రార్థన, Mincha మధ్యాహ్నం చేసే ప్రార్థన, Ma'ariv/Arvit సాయంత్రం లేదా రాత్రి చేసే ప్రార్థన, Shema దేవుడు ఒక్కడే అనే విశ్వాసాన్ని ప్రకటించే పవిత్ర వచనాల పఠనం, Tehillim కీర్తనల గ్రంథంలోని ప్రార్థనా వచనాలను చదవడం, Berakhot ఆహారం, రోజువారీ అనుభవాలు లేదా ఇతర సందర్భాల్లో పలికే ఆశీర్వాద ప్రార్థనలు.

క్రైస్తవ మతం– The Lord's Prayer యేసుక్రీస్తు బోధించిన ప్రార్థన. ఇది "పరలోకమందున్న మా తండ్రీ..." అనే మాటలతో ప్రారంభమవుతుంది, Personal Prayer వ్యక్తిగత అవసరాలు, కృతజ్ఞతలు, పశ్చాత్తాపం కోసం దేవునికి ప్రార్థించడం, Morning Prayer రోజును ప్రార్థనతో ప్రారంభించడం, Evening/Night Prayer రోజు ముగింపులో కృతజ్ఞతలు తెలుపుతూ, క్షమాపణ కోరుతూ ప్రార్థించడం, Prayer of Petition ఆరోగ్యం, సహాయం, రక్షణ లేదా ఇతర అవసరాల కోసం ప్రార్థించడం, Intercessory Prayer ఇతరుల కోసం, అనారోగ్యంతో ఉన్నవారి కోసం లేదా సమాజ శాంతి కోసం ప్రార్థించడం, Thanks giving Prayer దేవునికి కృతజ్ఞతలు తెలపడం, Praise and Worship దేవుని మహిమను కీర్తించడం, భక్తిగీతాలు పాడటం, Prayer of Repentance చేసిన తప్పులను అంగీకరించి క్షమాపణ కోరడం.

ఇస్లాం– Fajr తెల్లవారుజామున చేసే మొదటి విధిగా నిర్ణయించబడిన నమాజు, Dhuhr మధ్యాహ్నం చేసే నమాజు, Asr మధ్యాహ్నం తర్వాత చేసే నమాజు, Maghrib సూర్యాస్తమయం తర్వాత చేసే నమాజు, Isha రాత్రి చేసే నమాజు, Du'a

అల్లాహ్‌ను వ్యక్తిగతంగా ప్రార్థించడం; సహాయం, క్షమాపణ, మార్గదర్శకత్వం లేదా ఇతర అవసరాల కోసం విన్నపం చేయడం, Dhikr అల్లాహ్‌ను స్మరించడం, ఆయన నామాలను లేదా నిర్దిష్ట స్మరణ వచనాలను పఠించడం, Qur'an Recitation ఖుర్‌ఆన్ వచనాలను పఠించడం, Tahajjud రాత్రివేళ చేసే స్వచ్ఛంద నమాజు, Witr ఇషా నమాజు తర్వాత సాధారణంగా ఆచరించే నమాజు వగైరా...

పరస్పరం విభేదాలు విడనాడాలి! — మరి చేయవలసింది ఏమిటి?

ఇక ఈ మత విభేదాలు ఇక్కడ పరిష్కారం కాజాలవు అని అల్లాహ్ స్వయంగా తేల్చి చెబుతున్నాడు. పైగా వాటిని పరలోకంలో తీర్చుతానని సుస్పష్టం చేస్తానంటున్నాడు. కాబట్టి విశ్వాసులు 'చేయకూడని పని' ఏమిటో అర్థమైంది. మరి 'చేయవలసిన పని' ఏమిటి? అన్నది ప్రశ్న. దానికి అల్లాహ్ ఇస్తున్న సమాధానం ఏమిటో 5:48వ వాక్యం చూడండి.

وَأَنزَلْنَآ إِلَيْكَ ٱلْكِتَٰبَ بِٱلْحَقِّ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ مِنَ ٱلْكِتَٰبِ وَمُهَيْمِنًا عَلَيْهِ ۖ فَٱحْكُم بَيْنَهُم بِمَآ أَنزَلَ ٱللَّهُ ۖ وَلَا تَتَّبِعْ أَهْوَآءَهُمْ عَمَّا جَآءَكَ مِنَ ٱلْحَقِّ ۚ لِكُلٍّ جَعَلْنَا مِنكُمْ شِرْعَةً وَمِنْهَاجًا ۚ وَلَوْ شَآءَ ٱللَّهُ لَجَعَلَكُمْ أُمَّةً وَٰحِدَةً وَلَٰكِن لِّيَبْلُوَكُمْ فِى مَآ ءَاتَىٰكُمْ ۖ فَٱسْتَبِقُوا۟ ٱلْخَيْرَٰتِ ۚ إِلَى ٱللَّهِ مَرْجِعُكُمْ جَمِيعًا فَيُنَبِّئُكُم بِمَا كُنتُمْ فِيهِ تَخْتَلِفُونَ

"1) ఇంకా (ఓ ప్రవక్తా!) మేము నీ వైపుకు ఈ గ్రంథాన్ని సత్య సమేతంగా అవతరింప జేశాము. 2) అది తనకన్నా ముందు వచ్చిన గ్రంథాలను సత్యమని ధృవీకరిస్తుంది, వాటిని పరిరక్షిస్తుంది. 3) కాబట్టి నువ్వు వారి పరస్పర వ్యవహారాలపై అల్లాహ్ అవతరింపజేసిన ఈ గ్రంథానికి అకనుగుణంగానే తీర్పు చెయ్యి. 4) నీ వద్దకు వచ్చిన ఈ సత్యాన్ని వీడి, వారి మనోవాంఛలను అనుసరించకు. 5) మీలో ప్రతి ఒక్కరి కోసం మేము ఒక విధానాన్ని, మార్గాన్నీ నిర్ధారించాము. 6) అల్లాహ్‌యే గనక తలిస్తే మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు. 7) అయితే మీకు వొసగబడిన దానిలో మిమ్మల్ని పరీక్షించాలన్నది ఆయన అభిలాష. 8) కాబట్టి మీరు సత్కర్మలు చేయటంలో త్వరపడండి. 9) మీరంతా మరలిపోవలసింది అల్లాహ్ వైపుకే. 10) ఆ తరువాత ఆయన, మీరు పరస్పరం విభేదించుకునే సమస్యల గురించి మీకు (తన తీర్పు) తెలియజేస్తాడు" అని ఖురాన్ తెలియజేస్తుంది.

ఈ వాక్యంలో కొన్ని గమనార్హ విషయాల్లో మొదటిది– "అల్లాహ్‌యే గనక తలిస్తే మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు!" అన్నది. దీని ప్రకారం మత విశ్వాసాల

పరమైన ఏకాభిప్రాయం ఎప్పటికీ రాదని అల్లాహ్ తేల్చేసినట్లే కదా! రెండవది– "అయితే మీకు వొసగబడిన దానిలో మిమ్మల్ని పరీక్షించాలన్నది ఆయన అభిలాష" గమనార్హం.

ఇమామ్ ఇబ్నె జరీర్ అత్-తబరీ (Imam Ibn Jarir al-Tabari):

తన ప్రసిద్ధ 'తఫ్సీర్ అత్-తబరీ' గ్రంథంలో ఈ ఆయత్ గురించి వివరిస్తూ— "ఇక్కడ "మీకు ప్రసాదించినదాని"లో అంటే అప్పజెప్పబడిన దివ్య గ్రంథాలు మరియు ధర్మశాస్త్రాలు (Shariah & Divine Books) అని పేర్కొన్నారు. అల్లాహ్ వేర్వేరు జాతులకు విభిన్నమైన ధార్మిక విధులను, చట్టాలను ఎందుకు ఇచ్చాడంటే— ఆయా గ్రంథాలు మరియు చట్టాల ప్రకారం ప్రజలు ఎంతవరకు విధేయత చూపుతున్నారు, తమకు ఇచ్చిన బాధ్యతలను ఎలా నిర్వహిస్తున్నారు అని పరీక్షించడానికే" అని ఆయన స్పష్టం చేశారు.

దీనిని బట్టి షరియా (ధర్మశాస్త్ర)లో మౌలికంగా 'సూత్రయబద్ధమైనవి మరియు శాఖాపరమైనవి' (Principles and Details) అనే రెండు రకాల విషయాలు ఉంటాయి. ఆయా విషయాల్లో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడటం అత్యంత సహజం. అయితే మానవాళిని పరీక్షించటానికి ఒక సాధనంగా ఆ వైవిధ్యాన్ని నేనే పెట్టానని అల్లాహ్'యే స్వయంగా ప్రకటిస్తున్నాడు.

అల్లాహ్ మానవాళి పరీక్ష అనే లక్ష్యంతో పెట్టిన ఈ వైవిధ్యాన్ని చెరిపేసి, ఆ విషయాల్లో ఏకాత్మతా, ఏకీకరణ (Oneness, Unification) తీసుకు రావాలని ప్రయత్నించటం అల్లాహ్ బృహత్ ప్రణాళికకు వ్యతిరేకంగా ప్రవర్తించటం కాదా!? అయితే "మత పరమైన విశ్వాసాలు (Faith/Beliefs), సిద్ధాంతాలు (Doctrines)" ఏకీకరణ అన్నది భక్తుల పరిధి (Domain)లోకి రాదని తేలిపోయింది. అయితే భక్తులుగా చేయవలసిన పనేమిటి? అన్నది శేష ప్రశ్న.

దీనికి అల్లాహ్ ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి– 'فَٱسْتَبِقُوا۟ ٱلْخَيْرَٰتِ'/"ఇక మీరు సత్కర్మలు చేయటంలో త్వరపడండి!" అని ఆజ్ఞాపిస్తున్నాడు. అంటే స్వయంగా సత్కర్మలు చేసుకుంటూ తన చుట్టూ ఉన్నవారిని సత్కర్మలు చేయటానికి ప్రోత్సహించుకుంటూ జీవితం గడపాలని తెలుస్తుంది. దీనినిబట్టి ఇక్కడ రెండు విషయాలు అల్లాహ్ ప్రస్ఫుటం చేస్తున్నాడని తెలుస్తుంది. వాటిలో...

1. 'మత విశ్వాసాలు' అన్నవి సకల మానవాళిలో ఏకాభిప్రాయం లేని 'వివాదాస్పద పరిధి' (Disputed zone)కి సంబధించిన విషయాలు కాబట్టి భక్తులు వాటిని సరిచేసే పనిలో వేగిర పడకూడదని అల్లాహ్ తెలియజేస్తున్నాడు.
2. 'సత్కర్మలు' అన్నవి సకల మానవాళిలో ఏకాభిప్రాయం ఉన్న 'వివాద రహిత పరిధి' (Undisputed zone)కి సంబంధించిన విషయాలు కాబట్టి భక్తులు వాటిని సరిచేసే పనిలో వేగిర పడాలని అల్లాహ్ తెలియజేస్తున్నాడు.

ఇక్కడవకూ బాగానే ఉంది. ఇక్కడే ఒక కలత భక్తులకు ఇబ్బంది పెడుతూ ఉంటుంది. అదేమిటంటే– "మత విశ్వాసాల వైరుధ్యాలు ఎవరు సరిచేస్తారు!" అన్నది. ఈ కలతకి–

'إِلَى ٱللَّهِ مَرْجِعُكُمْ جَمِيعًا فَيُنَبِّئُكُم بِمَا كُنتُمْ فِيهِ تَخْتَلِفُونَ' / "మీరంతా మరలిపోవలసింది అల్లాహ్ వైపునకే కదా! అప్పుడు అక్కడ ఆయన, మీరు పరస్పరం విభేదించుకునే సమస్యల గురించి మీకు (తన తీర్పు) తెలియజేస్తాడు!" అని అల్లాహ్ సమాధానం ఇస్తున్నాడు! అల్లాహ్ పరలోకంలో తీర్పు దినం నాడు పరిష్కారం కోసం కేటాయించిన విషయాలను ఇహలోకంలో ఈనాడే పరిష్కరించ జూడటం అల్లాహ్ ప్రణాళికలో వేలు పెట్టటమే కదా!

ఖురాన్ ప్రకారం– ఏ విషయాల్లో విభేదాలు ఉంటాయి?

ధర్మంలో 1) 'విశ్వాసము–ప్రార్థనాది క్రతువు' మరియు 2)'నైతిక–మానవీయ విలువలు' అనే రెండు విభాగాలు ఉంటాయని తెలుసుకున్నారు. అయితే వీటిలో ఏ విభాగంలో విభేదాలు, భిన్నాభిప్రాయాలు తలెత్తుతాయి? అన్నది ప్రశ్న. దానికి ఖురాన్– అవి పూర్తిగా మత పరమైన విశ్వాసాలు (Faith/Beliefs), సిద్ధాంతాలు (Doctrines), దైవత్వం (Monotheism vs Polytheism) మరియు గ్రంథాల వ్యాఖ్యానాల చుట్టూ తిరిగే ఆధ్యాత్మిక–సిద్ధాంతపరమైన (Theological & Doctrinal) విభేదాలేనని చెబుతుంది. అంటే 'నైతిక–మానవీయ విలువలు' విషయంలో విభేదాలు కాదన్నది అత్యంత గమనార్హం. విభేదానికి శ్రీకారం ఖురాన్ 23:53వ వాక్యంలో చూడండి.

وَإِنَّ هَٰذِهِۦٓ أُمَّتُكُمْ أُمَّةً وَٰحِدَةً وَأَنَا۠ رَبُّكُمْ فَٱتَّقُونِ فَتَقَطَّعُوٓا۟ أَمْرَهُم بَيْنَهُمْ زُبُرًا ۖ كُلُّ حِزْبٍۭ بِمَا لَدَيْهِمْ فَرِحُونَ

"1) నిశ్చయంగా ఆదిలో మీ ఈ ధార్మిక వర్గం ఒకే వర్గం, 2) నేనే మీ అందరి ప్రభువును. 3) కాబట్టి మీరు నాకు భయ–భక్తులు కలిగి ఉండండి.। 4) అయితే వారంతట వారే (పరస్పరం విభేదించుకుని), తమ ధర్మాన్ని ముక్కలుముక్కలుగా

చేసుకున్నారు. 5) ప్రతి (మత) వర్గం తన వద్దనున్న దానితోనే సంబరపడిపోసాగింది" అని అల్లాహ్ తెలియజేస్తున్నాడు.

ఇక్కడ అర్థమయ్యేది ఏమిటంటే ఈ విభేదాలు మత సంబంధమైనవే తప్ప, సత్కర్మలకి సంబంధించినవి కావని ఖురాన్ చెబుతుంది. పోనీ అలా చెప్పిన వాక్యం పూర్తి ఖురానులో ఒక్కటీ లేదు. పైగా ఖురాన్ 91:8వ వాక్యంలో– 'فَأَلْهَمَهَا فُجُورَهَا وَتَقْوَاهَا' /"మనిషి మనస్సుకు దుష్కర్మల మరియు సత్కర్మల మధ్య విచక్షణను తెలియజేశాడు!" అని అంటున్నాడు. కాబట్టి విలువల విషయంలో మనుషుల మధ్య సహజ అవగాహన పెట్టేశాడు. కాబట్టి వాటి విషయంలో విభేదం తలెత్తటం అసాధ్యం.

మత విభేదాలు పరిష్కరించటం అసాధ్యం!

మతస్తుల్లో తలెత్తిన మత భేదాలు ఇహలోకంలో శాశ్వతంగా పరిష్కరించటం సాధ్యం కాదు. ఎందుకంటే, విభేదాలు రెండు విధాలుగా ఏర్పడతాయి. వాటిలో...

1. మీరు ఏదో ఒక విషయం చెప్పారు. దాని జ్ఞానం వానికి లేదు. కాబట్టి అది తప్పని మీతో విభేదించవచ్చు.

2. మీరు ఏదో ఒక విషయం చెప్పారు. అతనికి అది సరైనదే అనే జ్ఞానం ఉంది. అయినప్పటికీ విభేదిస్తున్నాడు. మిమ్మల్ని తప్పుపట్టటం అతని ఉద్దేశ్యం కావచ్చు.

పైన పేర్కొన్న వారిలో ఎవని విభేదాన్ని మీరు పరిష్కరించగలరు? మొదటి వానిదా లేక రెండవ వానిదా.. మొదటి వానిదే! కారణం– అతనికి జ్ఞానం లోపించటం. అది పూర్తి చేయగానే విభేదం తొలగిపోయింది. రెండవ వాని విభేదం తొలగదు. దానికి ఖురాన్ 2:213వ వాక్యం చూపిస్తున్న కారణం ఏమిటో చూడండి.

كَانَ ٱلنَّاسُ أُمَّةً وَٰحِدَةً فَبَعَثَ ٱللَّهُ ٱلنَّبِيِّـۧنَ مُبَشِّرِينَ وَمُنذِرِينَ وَأَنزَلَ مَعَهُمُ ٱلْكِتَٰبَ بِٱلْحَقِّ لِيَحْكُمَ بَيْنَ ٱلنَّاسِ فِيمَا ٱخْتَلَفُوا۟ فِيهِ ۚ وَمَا ٱخْتَلَفَ فِيهِ إِلَّا ٱلَّذِينَ أُوتُوهُ مِنۢ بَعْدِ مَا جَآءَتْهُمُ ٱلْبَيِّنَٰتُ بَغْيًۢا بَيْنَهُمْ ۖ فَهَدَى ٱللَّهُ ٱلَّذِينَ ءَامَنُوا۟ لِمَا ٱخْتَلَفُوا۟ فِيهِ مِنَ ٱلْحَقِّ بِإِذْنِهِۦ ۗ وَٱللَّهُ يَهْدِى مَن يَشَآءُ إِلَىٰ صِرَٰطٍ مُّسْتَقِيمٍ

"1) మానవులంతా ఒకే సమాజంగా ఉండేవారు. 2) అల్లాహ్ ప్రవక్తలను శుభవార్తనిచ్చే వారుగా, హెచ్చరిక చేసే వారుగా చేసి పంపాడు. 3) ప్రజల మధ్య తలెత్తిన అభిప్రాయ భేదాలపై తీర్పు చేయటానికిగాను వారివెంట (అనగా ప్రవక్తల వెంట) సత్యబద్ధమైన గ్రంథాలను పంపాడు. 4) మరి వాళ్ళే (అనగా ప్రజలే) స్పష్టమైన ఆదేశాలు వొసగబడిన

తరువాత కూడా పరస్పర వైరభావం, అసూయ మూలంగా అందులో విభేదించుకున్నారు. 5) అందుచేత అల్లాహ్ విశ్వాసులకు ఈ భేదాభిప్రాయం నుండి కూడా తన ఆజ్ఞానుసారం సత్యం వైపుకు దర్శకత్వం వహించాడు. 6) అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

ఈ వాక్యంలో– "మరి వాళ్ళే (ధర్మం తెలిసినవారే) స్పష్టమైన ఆదేశాలు పొసగబడిన తరువాత కూడా 'بَغْيًۢا بَيْنَهُمْ'/'పరస్పర ఈర్ష్యా–అసూయ' మూలంగా అందులో విభేదించు కున్నారు" అన్నది అత్యంత గమనార్హ విషయం.

అంటే నేటి మతవర్గాల్లో తలెత్తిన విభేదాలకి కారణం– 'జ్ఞానమూ–అవగాహన' రాహిత్యం కాక, 'పరస్పర ఈర్ష్యా–అసూయలు' అని అల్లాహ్ తెలియజేస్తున్నాడు. అటువంటప్పుడు ఈ విభేదాలను పరిష్కరించటం మానవ మాత్రుల వలన ఎలా సాధ్యం? అందుకే ఖురాన్ 22:17వ వాక్యం ఏమంటుందో చూడండి.

إِنَّ ٱلَّذِينَ ءَامَنُواْ وَٱلَّذِينَ هَادُواْ وَٱلصَّٰبِـُٔونَ وَٱلنَّصَٰرَىٰ وَٱلْمَجُوسَ وَٱلَّذِينَ أَشْرَكُوٓاْ إِنَّ ٱللَّهَ يَفْصِلُ بَيْنَهُمْ يَوْمَ ٱلْقِيَٰمَةِۚ إِنَّ ٱللَّهَ عَلَىٰ كُلِّ شَىْءٍ شَهِيدٌ

"1) విశ్వాసులు (ప్రవక్త ముహమ్మద్ను విశ్వసించిన ముస్లిములు), 2) యూదులు, 3) సాబియీలు (హిందువులు), 4) క్రైస్తవులు, 5) మజూసీలు, 6) బహుదైవారాధకులు – వీరందరి మధ్యా అల్లాహ్ ప్రళయదినాన తప్పకుండా తీర్పుచేస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నింటికీ సాక్షిగా ఉన్నాడు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

ఈ వాక్యం 'బయటి మతవర్గాల' (External religious groups) మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించటం గురించి చెబుతుంది. అయితే 'అంతర్గత మత వర్గాల' (Internal religious groups) మతవర్గాల విభేదాల పరిష్కారం గురించి అల్లాహ్ ఏమంటున్నాడు? అన్నది ప్రశ్న. దానికి ఖురాన్ ఇస్తున్న సమాధానం ఏమిటో 2:111 నుండి 2:113 వరకు మూడు వాక్యాలను చూడండి.

وَقَالُواْ لَن يَدْخُلَ ٱلْجَنَّةَ إِلَّا مَن كَانَ هُودًا أَوْ نَصَٰرَىٰۗ تِلْكَ أَمَانِيُّهُمْۗ قُلْ هَاتُواْ بُرْهَٰنَكُمْ إِن كُنتُمْ صَٰدِقِينَ

"1) యూదులు, 2) క్రైస్తవులు తప్ప వేరెవరూ స్వర్గంలో ప్రవేశించలేర!"ని వారంటున్నారు. ఇవివారి ఆశలు, ఆకాంక్షలు మాత్రమే. "మీరు మీ వాదనలో సత్యవంతులే అయితే ఆ మేరకు ఏదన్నా నిదర్శనం సమర్పించండి!" అని వారిని అడుగు.

నిజానికి యూద ధార్మిక వర్గాన్ని సంస్కరించటానికి యేసు వచ్చి తన సంస్కరణా కార్యం చేసి వెళ్ళిపోయిన తరువాత ఆయన వర్గాన్ని ప్రజలు క్రైస్తవులు అని చెప్పసాగారు.

ఆ తరువాత కొంత కాలానికి పై వాక్యంలో పేర్కొన్నట్లు వారు– "యూదులే స్వర్గానికి వెళతారు!" అంటే "కాదుకాదు క్రైస్తవులే స్వర్గానికి వెళతారు!" అనే విభేదం తలెత్తింది. దాని వాస్తవికతను వివరిస్తూ అల్లాహ్ ఏమంతున్నాడో చూడండి.

بَلَىٰ مَنْ أَسْلَمَ وَجْهَهُ لِلَّهِ وَهُوَ مُحْسِنٌ فَلَهُ أَجْرُهُ عِندَ رَبِّهِ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ

"బాగా తెలుసుకోండి! ఎవడైతే 1) ఆచరణలో అత్యుత్తమ రీతిని అవలంబించి, 2) తననుతాన అల్లాహ్ సన్నిధిలో సమర్పించుకుంటాడో, అతనికి తన ప్రభువు వద్ద ప్రతిఫలం ఉంది. అలాంటి వారికి ఎలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండవు" అని ఖురాన్ చెబుతుంది.

ఈ వాక్యం ప్రకారం స్వర్గ ప్రవేశం అన్నది ఏదో ఒక 'మతవర్గము'ను బట్టికాదు, నిత్యం దైవ సన్నిధిలో ఉన్నాననే స్పృహతో 'సత్కర్మల'ను ఆచరించే వారికి మాత్రమే గత తప్పిదాల దుఃఖము మరియు భవిష్యత్తు ఆందోళన లేని ఇహ–పరాల జీవితం పొందగలరని ఖురాన్ తీర్మానిస్తుంది. తరువాత వాక్యం చూడండి.

وَقَالَتِ ٱلْيَهُودُ لَيْسَتِ ٱلنَّصَٰرَىٰ عَلَىٰ شَىْءٍ وَقَالَتِ ٱلنَّصَٰرَىٰ لَيْسَتِ ٱلْيَهُودُ عَلَىٰ شَىْءٍ وَهُمْ يَتْلُونَ ٱلْكِتَٰبَ ۗ كَذَٰلِكَ قَالَ ٱلَّذِينَ لَا يَعْلَمُونَ مِثْلَ قَوْلِهِمْ ۚ فَٱللَّهُ يَحْكُمُ بَيْنَهُمْ يَوْمَ ٱلْقِيَٰمَةِ فِيمَا كَانُوا۟ فِيهِ يَخْتَلِفُونَ

"1) క్రైస్తవులు సత్యంపై లేరని యూదులు అంటున్నారు. 2) యూదులు సత్యంపై లేరని క్రైస్తవులంటున్నారు". 3) మరి వారిరువురూ దైవ గ్రంథాన్నే చదువుతున్నారు. 3) గ్రంథ జ్ఞానం లేనివాళ్ళు కూడా ఇలాంటి మాటే అంటున్నారు. 4) "ఇక ప్రళయదినాన వీళ్ళ భేదాభిప్రాయాల గురించి వీళ్ళ మధ్య అల్లాహ్ తీర్పు చేస్తాడు" అని ఖురాన్ ప్రకటిస్తుంది.

నేటి ఆయా మతవర్గాల వారి మాదిరిగానే ఖురాన్ అవతరణా కాలంలోనూ యూదులూ–క్రైస్తవులు కూడా పరస్పరం మీరు సత్యంపై లేరంటే మీరు సత్యంపై లేరని వాదించుకొనే వారని తెలుస్తుంది. మేము స్వర్గ వాసులంటే మీరు నరక వాసులని ఇహలోకంలోనే పరస్పరం తీర్పులు చేసేవారు.

ఆ నేపథ్యంలో ఖురాన్– "వాస్తవం ఏమిటో చెప్పాడేగాని, మీరిద్దరూ కలసి కూర్చొని ఏకాభిప్రాయానికి రండని చెప్పలేదు" అన్నది గమనార్హం. దానికి బదులు– "ప్రళయదినాన వీళ్ళ భేదాభిప్రాయాల గురించి వీళ్ళ మధ్య అల్లాహ్ తీర్పు చేస్తాడు" అని ఖురాన్ చెప్పటం అత్యంత గమనార్హం.

"క్రైస్తవులు సత్యంపై లేరు!" అన్న ప్రకటనను మరియు "యూదులు సత్యంపై లేరు!"

అన్న ప్రకటనను అల్లాహ్ నిషేధిస్తున్నాడు. ఖురాన్ అందిస్తున్న ఈ సమాచారాన్ని బట్టి ప్రథమికంగా ముస్లిములైన సున్నీలు– "షియాలు సత్యంపై లేరు!" అన్న ప్రకటన చేయటం అలాగే ముస్లిములైన షియాలు– "సున్నీలు సత్యంపై లేరు!" అన్న ప్రకటన చేయటం హరామ్ అవుతుందన్న సంగతిని గుర్తించి, విడనాడాలి.

ఇంకా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆయా 'బయటి మతవర్గాల' వారికి అలాగే ఆయా 'అంతర్గత మత వర్గాల' వారికి ఇదే విషయాన్ని చెప్పి, వారి మధ్య నైతికతా–మానవత విలువల ప్రాతిపదికన సయోధ్య చేయాలి.

ఎందుకంటే ఆయా మతవర్గాలు అంటే అటు– 'బయటి మతవర్గాల' (External religious groups) మధ్యగాని, ఇటు– 'అంతర్గత మత వర్గాల' (Internal religious groups) మధ్యగాని మత విభేదాలు తొలగి ఏకాభిప్రాయం కుదిరినప్పుడు మాత్రమే ఎదుటి వారిని గౌరవిస్తాం అంటే అది ఎప్పటికీ సాధ్యమయ్యే పని కాదని తేలిపోయింది.

ఎదుటి వారి విశ్వాసాలు తప్పు అనుకున్నప్పుడు ద్వేషించాలా? ప్రేమించాలా?

కాస్త ఇంగితజ్ఞానంతో ఆలోచిస్తే ఒకని తప్పుడు విశ్వాసాల కారణంగా ద్వేషిస్తే ఒకటి– మీరు అతనిని సంస్కరించలేరు. అతడు మీ హితవులను వినటానికి సిద్ధపడలేడు. అదే మీరు అతడిని ప్రేమిస్తే మీరు అతనిని సంస్కరించగలరు. అతడు మీ మాటలకు చెవియొగ్గి వినగలడు. శతృత్వం వలన ఈ గొప్ప అవకాశాన్ని మీరు చేజార్చుకున్నట్లే కదా!

ఈలోకంలో మీకు నచ్చిన విశ్వాసం కలిగి ఉండే హక్కు మీకు ఎంత ఉందో, తనకి నచ్చిన విశ్వాసం కలిగి ఉండే అంతే హక్కు ఎదుటి వానికీ ఉంటుంది కదా! వారిని తప్పుపట్టే హక్కు మీకు ఎవరిచ్చారు!? అయినా ఒకవేళ ఎవరైనా ఎదుటి వారి విశ్వాసాలను బట్టి దూషిస్తున్నారంటే వారికి కనీస ఇంగీతజ్ఞానం లేనట్లే కదా!

అయినప్పటికీ ధార్మిక విభేదాలు ఇక్కడే తేల్చేస్తామని ఎవరైనా అంటున్నారంటే వారికి ఖురాన్ గ్రంథ కనీస జ్ఞానం లేదన్నమాట. ఎందుకంటే వారి మత విభేదాలను తాను పరలోకంలో తీరుస్తానని అల్లాహ్'యే స్వయంగా ప్రకటిస్తున్నాడు. అంటే వాటిని ఇహలోకంలో పరిష్కరించటం సాధ్యం కాదని ఖురాన్ సాక్ష్యం ఇస్తుంది!

దీనికి ప్రధాన కారణం– అల్లాహ్ కోరుకుంటున్న 'ప్రేమా–సద్భావనల'ను విడనాడి, షైతాన్ వాంఛించే 'ఈర్ష్యా–ద్వేషాల'ను గుండెల్లో నింపుకున్న వారి విభేదాలను

పరిష్కరించటం మానవ మాత్రులకు సాధ్యమా? కాదుకదా! అందుకే హృదయ రహస్యాలు ఎరిగిన అల్లాహ్ స్వయంగా తన వద్దకు వచ్చిన తరువాత పరలోకంలో మీ విభేదాలను నేను పరిష్కరిస్తానని అంటున్నాడు. ఇలాంటి ప్రకటనలు పూర్తి ఖురానులో అల్లాహ్ పదకొండు సార్లు చేశాడన్నది అత్యంత గమనార్హం!

ఖురాన్ ప్రకారం- ప్రజలను నిర్బంధం చేసే అధికారం ఎవనికీ లేదు!

ప్రతి వ్యక్తీ సరాసరి దైవానికే జవాబుదారుడు!

యావత్ లోకంలో ఉన్న జడ-చరాల్లో ప్రతీదీ నిర్బంధ సృష్టితాలే! ఒక్క మనిషి మాత్రమే స్వచ్ఛంద జీవి. దేవుని సృష్టి ప్రణాళికలో అత్యంత కీలకమైన విషయం- 'వ్యక్తి స్వేచ్ఛ' (Individual freedom). మనిషి భౌతికంగా బ్రతకటానికి ప్రాణ వాయువు (Oxygen) ఎంత అవసరమో మానసికంగా బ్రతకటానికి 'స్వేచ్ఛ' (Freedom) అంతే అవసరం. అందుకే స్వాతంత్ర్యం పోరాటాల్లో ప్రజలు తమ ప్రాణాలు తృణప్రాయంగా వదులు కుంటూ ఉంటారు! కాబట్టి 'స్వేచ్ఛ'ను హరించే అధికారం ఈలోకంలో ఎవనికీ లేదు.

ఖురాన్ చేయమన్న పోరాటం 'స్వేచ్ఛ' (Freedom)ను సాధించటానికే!

ఖురానులో సాగిన పోరాటమే 'స్వేచ్ఛ' (Freedom) కోసం అంటే అతిశయోక్తి కాదు! ప్రవక్త ముహమ్మద్ నియామకానికి చాలా పూర్వం నుండే ప్రపంచ వ్యాప్తంగా రాచరికాలు నడుస్తున్నాయి. "రాజు విశ్వాసమే రాజ్య విశ్వాసం!" అనే విధానం సాగేది.

అంటే ఒక దేశ రాజు హటాత్తుగా ఏ మత విశ్వాసంలో మారిపోతే ప్రజలూ అదే విశ్వాసంలో మారుమాట్లాడకుండా మారిపోవాలి! లేదంటే ఎవరైనా తమకు నచ్చిన విశ్వాసాన్ని స్వీకరిస్తామంటే అది రాజద్రోహం క్రింద జమకట్టి వారిని న్యాయ విచారణ (Prosecute) చేసేవారు. వారు తిరిగి State beliefలో మారిపోతే సరేసరి లేదంటే మరణ దండనకి సిద్ధపడాలి! ఆనాటి రోము, పర్షా సామ్రాజ్యాల విధానం అదే. దాని ప్రభావమే ప్రవక్త ముహమ్మద్ నీయుక్తులు అయిన అరబ్బు పెద్దల్లోనూ ఉండేది.

రోము, పర్షా సామ్రాజ్యాల్లో, స్వయంగా ప్రవక్త ముహమ్మద్ ప్రభవించిన అరబ్బు దేశంలోనూ 'మతదౌర్జన్యం' (Persecution) తాండవించేది. అందుకే 'ప్రాచీన ఏకేశ్వరోపాస'ను స్వీకరించి, ప్రచారం చేస్తున్న ప్రవక్తనూ ఆయన అనుయాయులను రాచిరంపాన పెట్టేవారు. దానికి సంబంధించిన ఆధారాన్ని చూడండి.

ఖురాన్ 22:39,40– 'أُذِنَ لِلَّذِينَ يُقَٰتَلُونَ بِأَنَّهُمْ ظُلِمُواْ وَإِنَّ ٱللَّهَ عَلَىٰ نَصْرِهِمْ لَقَدِيرٌ' = ‘ఎవరితోనైతే అన్యాయంగా యుద్ధం చేయబడుతుందో, వారికి (కూడా ఆత్మరక్షణకి) అనుమతి ఇవ్వబడుతోంది. ఎందుకంటే వారు పీడితులు. నిశ్చయంగా అల్లాహ్ వారిని ఆదుకోగల శక్తి గలవాడు’. 'ٱلَّذِينَ أُخْرِجُواْ مِن دِيَٰرِهِم بِغَيْرِ حَقٍّ إِلَّآ أَن يَقُولُواْ رَبُّنَا ٱللَّهُ'/ ‘వారు అన్యాయంగా తమ ఇళ్ల నుంచి వెళ్ళగొట్టబడ్డారు. (ఇంతకీ వారు చేసిన నేరం) ఏమిటంటే, “మా ప్రభువు అల్లాహ్” అని పలకటమే’.

‘భావదాస్యం–ఆర్థిక దోపిడి’కి బలమైన ఆలంబనగా నడుస్తున్న ధర్మ విరుద్ధ కాల్పనిక ‘విగ్రహారాధన’ను తిరస్కరించి, ‘ప్రాచీన శాస్త్రీయ ఏకేశ్వరోపాసన’ పునఃస్థాపనా ప్రచారం చేస్తున్న ప్రవక్త ముహమ్మద్’ను, దానిని అంగీకరించిన ఆయన అనుయాయులను చిత్రహింసలు పెట్టటం, గృహాల నుండి వెళ్ళగొట్టటం మాత్రమే కాక, హత్యలు కూడా చేసేవారు. దీనిని బట్టి ఆనాటి అరబ్బు సమాజంలో ‘మత నిర్బంధం’ (Persecution) తప్ప ‘మత స్వేచ్ఛ’ (Freedom of religion) ఉండేది కాదని తెలుస్తుంది.

అలాంటి నేపథ్యంలో అల్లాహ్ ఆజ్ఞ ఏమిటో చూడండి. ఖురాన్ 2:193– 'وَقَٰتِلُوهُمْ حَتَّىٰ لَا تَكُونَ فِتْنَةٌ وَيَكُونَ ٱلدِّينُ لِلَّهِ ۖ فَإِنِ ٱنتَهَوْاْ فَلَا عُدْوَٰنَ إِلَّا عَلَى ٱلظَّٰلِمِينَ'/ “ఫిత్నా’ (మత నిర్బంధం) సమసిపోనంతవరకూ, ‘అద్దీన్’ (అల్లాహ్ ప్రసాదిత స్వేచ్ఛా విధానం) ఏర్పడ నంతవరకూ వారితో పోరాడుతూనే ఉండండి. ఒకవేళ వారు యుద్ధాన్ని విరమిస్తే (మీరూ విరమించండి). మెడలు వంచ వలసింది దౌర్జన్యపరులవే!” అని ఖురాన్ చెబుతుంది.

ఇక్కడ ఖురాన్ ‘ఫిత్నా’ అని చెప్పిన పదానికి ‘మత నిర్బంధం’ (Persecution) అనే అర్థం వస్తుంది. పై వాక్యంలో ఈ ‘మత నిర్బంధము’ను అంతంచేసి, ‘మత స్వేచ్ఛ’ను ఖురాన్ తిరిగి పునఃస్థాపన చేసిందని తెలుస్తుంది.

ఖురాన్ ఇస్తున్న మత స్వేచ్ఛను చూడండి!

సృష్టికర్త స్వయంగా ధర్మంలో నిర్బంధం లేదని ప్రకటించిన తరువాత దానిని కాదనే అధికారం ఈలోకంలో ఎవనికి ఉంటుంది? ఆ దైవమే స్వయంగా 2:256వ వాక్యంలో ప్రకటిస్తున్న విషయాన్ని చూడండి.

لَا إِكْرَاهَ فِي الدِّينِ ۖ قَد تَّبَيَّنَ الرُّشْدُ مِنَ الْغَيِّ ۚ فَمَن يَكْفُرْ بِالطَّاغُوتِ وَيُؤْمِن بِاللَّـهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ الْوُثْقَىٰ لَا انفِصَامَ لَهَا ۗ وَاللَّـهُ سَمِيعٌ عَلِيمٌ

"1) ధర్మం విషయంలో బలవంతం ఏమీ లేదు. 2) ఎందుకంటే, సన్మార్గం మరియు అపమార్గం మనిషి వివేచనకి సుస్పష్టం చేయటం జరిగింది కనుక!" అని సర్వేశ్వరుడైన అల్లాహ్ స్వయంగా ప్రకటిస్తున్నాడు.

మనిషికి నిర్బంధం ఎందుకు చేయరాదంటే దానికి మౌలికంగా రెండు కారణాలు ఉన్నాయి. మనిషికి సహజంగానే ఉన్న 'విచక్షణా జ్ఞానం' అనే మొదటి సామర్థ్యంతో ఏది మంచి ఏది చెడు అన్నది వివేచన చేయలడు. ఇంకా తనకి ఉన్న రెండవ సామర్థ్యమైన 'సంపూర్ణ స్వేచ్ఛ'తో తనకి నచ్చిన దానిని ఐచ్చికం (optional)గా ఎంచుకుంటాడు. ఎందుకంటే రేపు తన కర్మలకి తానే బాధ్యత వహించి, తన సృష్టికర్త నుండి దాని మంచి, చెడు ఫలితాలను తానే అనుభవించవలసి ఉంది కాబట్టి.

ఖురాన్ ప్రకారం– ప్రజలను నిర్బంధం చేసే అధికారం ఎవనికీ లేదు!

ఒకవైపు– ధర్మంలో నిర్బంధం లేదని చెప్పటమే కాక, మరోవైపు– మనిషికి ధర్మం విషయంలో నిర్బంధం చేయవద్దని 18:29వ వాక్యంలో ప్రత్యేకంగా చెప్పటం మరింత విశేషం.

وَقُلِ الْحَقُّ مِن رَّبِّكُمْ ۖ فَمَن شَاءَ فَلْيُؤْمِن وَمَن شَاءَ فَلْيَكْفُرْ

"1) సత్య (బద్ధమైన ఈ ఖురాన్) మీ ప్రభువు తరఫు నుంచి వచ్చింది. 2) కనుక ఇష్టం అయినవారు దీనిని విశ్వసించవచ్చు, 3) ఇష్టం లేనివారు దీనిని నిరాకరించవచ్చు" అని అంటున్నాడు. 39:15వ వాక్యం చూడండి.

فَاعْبُدُوا مَا شِئْتُم مِّن دُونِهِ ۗ

"మీరు ఆయన్ని వదలి ఎవరెవరిని పూజించదలుస్తున్నారో పూజించుకోండి!..." అంటున్నాడు. 76:3వ వాక్యం చూడండి.

إِنَّا هَدَيْنَاهُ السَّبِيلَ إِمَّا شَاكِرًا وَإِمَّا كَفُورًا

"1) మేము అతనికి (మంచి–చేడులకి సంబంధించిన) సరైన మార్గం ఏదో చూపాము. 2) కనుక వాడు (తన సృష్టికర్తకి) 'కృతజ్ఞుడు'గా వ్యవహరించినా లేక 3) 'కృతఘ్నుడు'గా మారినా (వాడి ఇష్టం. మేము వాడికి సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చాము)" అని సృష్టికర్త ప్రకటిస్తున్నాడు.

ఈ వాక్యాల ప్రకారం– ఒక్క 'నైతిక–మానవీయ నియమ–నిబంధనల'లో తప్ప, 'మత విశ్వాసాలూ–ఆరాధనాల' విషయంలో మనిషిని ఎవరూ 'నిర్బంధం' (Compulsion) చేసే అధికారం ఖురాన్ ఎవరికీ ఇవ్వటం లేదనే విషయాన్ని చూశారు కదా!

తన భక్తులపట్ల నియంత కావద్దని అల్లాహ్ ప్రవక్తను హెచ్చరిస్తున్నాడు!

సర్వ మానవులకు కారుణ్యంగా ప్రవక్తను నియమించింది స్వయంగా అల్లాహ్యే. అయినప్పటికీ ఆయన తన భక్తుల విషయంలో ప్రవక్తకి చేస్తున్న హెచ్చరిక ఏమిటో 88:21,22 వాక్యాల్లో చూడండి.

فَذَكِّرْ إِنَّمَآ أَنتَ مُذَكِّرٌ لَّسْتَ عَلَيْهِم بِمُصَيْطِرٍ

"కనుక (ఓ ప్రవక్తా!) 1) నీవు మాత్రం బోధపరుస్తూ ఉండు. 2) (ఎందుకంటే) నీవు హితబోధ చేసేవాడివి మాత్రమే 3) నీవు వారిపై నియంత కావు!" అని హెచ్చరిస్తున్నాడు.

ఈ వాక్యంలో "عَلَيْهِم بِمُصَيْطِرٍ"/"నీవు వారిపై నియంత కావు!" అన్న అల్లాహ్ ప్రకటన అత్యంత గమనార్హం. ప్రవక్త నియంత కావద్దు. మరేమీ కావాలి? అన్న ప్రశ్నకు ఖురాన్ 13:40వ వాక్యం చూడండి.

فَإِنَّمَا عَلَيْكَ ٱلْبَلَٰغُ وَعَلَيْنَا ٱلْحِسَابُ

"(ఓ ప్రవక్తా!) 1) సందేశాన్ని చేరవేయటమే నీ పని. 2) లెక్క తీసుకునే బాధ్యత మాది" అని అల్లాహ్ తేల్చి చెబుతున్నాడు.

అంటే ప్రజలకు ప్రసార–ప్రచురణ, హితవు–ప్రబోధనల ద్వారా ధార్మిక–ఆధ్యాత్మిక విషయాలను అవగతపరిచే ప్రయత్నం మాత్రమే చేయాలి. నిర్బంధం–దౌర్జన్యం చేసి, భయ–భ్రాంతులకు గురిచేసి ఎవరిపైనా ధార్మిక విషయాలను బలవంతంగా రుద్దకూడదని తెలుస్తుంది.

అందుకే ప్రవక్త సంస్కరణా విధానంలో 'సత్కర్మల'కి ఇహ–పరాల్లో కలిగే సత్ఫలితాలు ఏమిటో అలాగే 'దుష్కర్మల'కి కలిగే ఇహ–పరాల్లో సంభవించే దుష్పరిణామాలు ఏమిటో 'తార్కిక–ధార్మిక' ఆధారాలతో అవగత పరచటం జరిగింది. ప్రవక్త ఎవరినీ ఏ విధమైన నిర్బంధమూ చేయలేదు. నిర్బంధం–బలవంతం చేసే అధికారం ప్రవక్తకే లేనప్పుడు ఇక మత బోధకులకు ఎక్కడ ఉంటుంది?

సర్వ మానవులకు దైవం ఇస్తున్న పిలుపు ఏమిటి?

ఖురాను గ్రంథాన్ని కాస్త నిశితంగా అధ్యయనం చేస్తే, వివిధ వర్గాలకు వివిధ పద్ధతుల్లో దైవం సంబోధించినట్లు చూడగలం. ఉదా: సర్వమానవులను ఉద్దేశించి 2:21వ వాక్యంలో ఆయన ఏమంటున్నాడో చూడండి.

يَٰٓأَيُّهَا ٱلنَّاسُ ٱعۡبُدُواْ رَبَّكُمُ ٱلَّذِي خَلَقَكُمۡ وَٱلَّذِينَ مِن قَبۡلِكُمۡ لَعَلَّكُمۡ تَتَّقُونَ

"ప్రజలారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ పుట్టించిన మీ ప్రభువును ఆరాధించండి– తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు!" అని ప్రకటిస్తుంది.

ఇందులో కేవలం ఒక సమాచారం లేదా ఒక సాధారణ ప్రకటన మాత్రమే ఉంది. అంటే ప్రజలకు తప్పనిసరి చేస్తున్న ఎలాంటి విషయమూ ఇందులో లేదు.

దైవం తన విధేయత ఎవరికి తప్పనిసరి చేస్తున్నాడు?

దైవం తన ధర్మాన్ని సర్వ మానవులకు తప్పనిసరి చేస్తున్నాడా? లేక ధర్మాన్ని అర్థం చేసుకొని, దానిని అనుసరిస్తాం అని దేవునితో 'నిబంధన' చేసుకున్న వారిని మాత్రమే తప్పనిసరి చేస్తున్నాడా? అన్నది ప్రశ్న. దానికి ఖురాన్ 5:1వ ఇస్తున్న సమాధానం ఏమిటో చూడండి.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓاْ أَوۡفُواْ بِٱلۡعُقُودِۚ أُحِلَّتۡ لَكُم بَهِيمَةُ ٱلۡأَنۡعَٰمِ إِلَّا مَا يُتۡلَىٰ عَلَيۡكُمۡ غَيۡرَ مُحِلِّي ٱلصَّيۡدِ وَأَنتُمۡ حُرُمٌۗ إِنَّ ٱللَّهَ يَحۡكُمُ مَا يُرِيدُ

"ఓ విశ్వాసులారా! ప్రమాణాలను, ఒప్పందాలను నెరవేర్చండి. మీకు చదివి వినిపించ బడేవి తప్ప మిగిలిన చతుష్పాద పశువులన్నీ మీ కోసం ధర్మసమ్మతం (హలాల్) గావించబడ్డాయి. అయితే మీరు 'ఇహ్రామ్' స్థితిలో ఉన్నప్పుడు వేటను ధర్మసమ్మతంగా పరిగణించకండి. నిశ్చయంగా అల్లాహ్ తాను కోరినది ఆజ్ఞాపిస్తాడు" అని 6వ వాక్యం వరకు మరికొన్ని ఆహార–పానీయాల గురించి, ఆరాధన తదితర ధార్మిక క్రతువుల గురించి చెప్పి, 7వ వాక్యంలో ఏమంటున్నాడో చూడండి.

وَٱذۡكُرُواْ نِعۡمَةَ ٱللَّهِ عَلَيۡكُمۡ وَمِيثَٰقَهُ ٱلَّذِي وَاثَقَكُم بِهِۦٓ إِذۡ قُلۡتُمۡ سَمِعۡنَا وَأَطَعۡنَاۖ وَٱتَّقُواْ ٱللَّهَۚ إِنَّ ٱللَّهَ عَلِيمُۢ بِذَاتِ ٱلصُّدُورِ

"మీపై ఉన్న అల్లాహ్ అనుగ్రహాన్ని, ఆయన మీనుండి తీసుకున్న ప్రమాణాన్ని జ్ఞాపకం ఉంచుకోండి. అప్పుడు మీరు, "మేము విన్నాము, శిరసావహించాము" అని చెప్పి

ఉన్నారు. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మనసుల్లోని విషయాలు సైతం ఎరిగినవాడు" అని అప్రమత్తం చేస్తున్నాడు.

ఈ వాక్యంలో "إِذْ قُلْتُمْ سَمِعْنَا وَأَطَعْنَا"/"మేము విన్నాము, శిరసావహించాము అని చెప్పి ఉన్నారు" అన్నది గమనార్హ వాక్య భాగం. అంటే మీరు స్వయంగా మీ ఇచ్ఛా పూర్వకంగా మీదైవంతో మేరే 'ఒడంబడిక' చేసుకున్నారు. కాబట్టి దైవ నిర్దేశిత విధి-నిషేధాలకి కట్టుబడి ఉండటం తప్పనిసరి చేస్తున్నాడు.

ముస్లిములు తమ ధర్మాన్ని విడనాడకూడదని ఖురాన్ నిరబంధిస్తుందా!?

ఈ ఒప్పందాన్ని చేసుకున్న వారు అంటే ముస్లిములు. వారిలో ఎవరైనా ఒకవేళ ధర్మం (ఇస్లాం) తిరస్కరించి బయటకు పోయే పరిస్థితి ఏర్పడితే!? అలాంటి వారి గురించి ఖురాన్ ఏమంటుందో చూడండి. ముందుగా 5:54వ వాక్యం...

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا مَن يَرْتَدَّ مِنكُمْ عَن دِينِهِ فَسَوْفَ يَأْتِي اللَّـهُ بِقَوْمٍ يُحِبُّهُمْ وَيُحِبُّونَهُ أَذِلَّةٍ عَلَى الْمُؤْمِنِينَ أَعِزَّةٍ عَلَى الْكَافِرِينَ يُجَاهِدُونَ فِي سَبِيلِ اللَّـهِ وَلَا يَخَافُونَ لَوْمَةَ لَائِمٍ ۚ ذَٰلِكَ فَضْلُ اللَّـهِ يُؤْتِيهِ مَن يَشَاءُ ۚ وَاللَّـهُ وَاسِعٌ عَلِيمٌ

"ఓ విశ్వాసులారా! (ముస్లిములారా!) మీలో ఎవరయినాసరే తమ ధర్మం (ఇస్లాం) నుంచి తిరిగిపోతే (పోవచ్చు), అల్లాహ్ త్వరలోనే మరో జాతి వారిని తీసుకువస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు, వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు..." అని ఖురాన్ ప్రకటిస్తుంది.

ఈ విధంగా దైవంతో నిబంధన లేదా ఒప్పందం చేసుకున్న వారు దానిని తిరస్కరించి బయటకు పోయే సంపూర్ణ స్వేచ్ఛను కూడా ఖురాన్ ఇస్తుందని తెలుస్తుంది.

ధర్మాన్ని విడనాడితే శిక్ష విధించేది మనుషులా? దేవుడా?

దొంగతనం, హత్యాకాండ తదితర ధార్మిక నేరాలకు ఖురాన్ కొన్ని శిక్షలను నిర్ధారిస్తుంది. వాటిని కొందరు ప్రభుత్వ అధికారులు అమలు పరుస్తారు. అలాగే కొన్ని రకాల నేరాలకు ఇహ-పరాల్లో దైవమే స్వయంగా అమలు పరుస్తాడు. అయితే ఇస్లాం ధర్మం నుండి బయటకు పోయిన వారికి శిక్షించే బాధ్యత ధార్మిక పెద్దలకు ఇచ్చాడా? లేక అల్లాహ్ స్వయంగా తానే పరలోకంలో శిక్షిస్తానని చెబుతున్నాడా? ఈ ప్రశ్నకు ఖురాన్ ఇస్తున్న సమాధానం ఏమిటో 3:86వ వాక్యం చూడండి.

كَيْفَ يَهْدِى ٱللَّهُ قَوْمًا كَفَرُوا۟ بَعْدَ إِيمَٰنِهِمْ وَشَهِدُوٓا۟ أَنَّ ٱلرَّسُولَ حَقٌّ وَجَآءَهُمُ ٱلْبَيِّنَٰتُ ۚ وَٱللَّهُ لَا يَهْدِى ٱلْقَوْمَ ٱلظَّٰلِمِينَ

“(తొలుత) విశ్వసించి, ఈయన ప్రవక్త అనే విషయం సత్యమేనని సాక్ష్యం (కూడా) యిచ్చి, తీరా తమ వద్దకు స్పష్టమైన సూచనలు వచ్చేసిన మీదట అవిశ్వాసులైపోయిన వారికి అల్లాహ్ సన్మార్గం ఎలా చూపుతాడు? అల్లాహ్ ఇటువంటి దుర్మార్గులకు దారి చూపడు” అని హెచ్చరిస్తున్నాడు. 3:87వ వాక్యం చూడండి.

أُوْلَٰٓئِكَ جَزَآؤُهُمْ أَنَّ عَلَيْهِمْ لَعْنَةَ ٱللَّهِ وَٱلْمَلَٰٓئِكَةِ وَٱلنَّاسِ أَجْمَعِينَ

“వారి పాపఫలంగా వారిపై అల్లాహ్ శాపం, దూతల, సమస్త జనుల శాపం పడుతుంది” అని హెచ్చరిస్తున్నాడు. 3:88వ వాక్యం చూడండి.

خَٰلِدِينَ فِيهَا لَا يُخَفَّفُ عَنْهُمُ ٱلْعَذَابُ وَلَا هُمْ يُنظَرُونَ

“ఈ (శాపగ్రస్త) స్థితిలో వారు కలకాలం ఉంటారు. వారి శిక్షను తగ్గించటంగానీ, వారికి గడువు ఇవ్వటంగానీ జరగదు” అని ఖురాన్ హెచ్చరిస్తుంది. 3:90వ వాక్యం చూడండి.

إِنَّ ٱلَّذِينَ كَفَرُوا۟ بَعْدَ إِيمَٰنِهِمْ ثُمَّ ٱزْدَادُوا۟ كُفْرًا لَّن تُقْبَلَ تَوْبَتُهُمْ وَأُوْلَٰٓئِكَ هُمُ ٱلضَّآلُّونَ

అంటే “ఎవరు విశ్వసించిన మీదట అవిశ్వాస వైఖరికి ఒడిగడతారో, ఆ తరువాత అవిశ్వాసంలో మరింత పెచ్చరిల్లుతారో వారి పశ్చాత్తాపం సుతరామూ స్వీకరించబడదు. అపమార్గం పాలైన వారంటే వీరే”. 3:91వ వాక్యం చూడండి.

إِنَّ ٱلَّذِينَ كَفَرُوا۟ وَمَاتُوا۟ وَهُمْ كُفَّارٌ فَلَن يُقْبَلَ مِنْ أَحَدِهِم مِّلْءُ ٱلْأَرْضِ ذَهَبًا وَلَوِ ٱفْتَدَىٰ بِهِۦٓ ۗ أُوْلَٰٓئِكَ لَهُمْ عَذَابٌ أَلِيمٌ وَمَا لَهُم مِّن نَّٰصِرِينَ

అంటే “మరెవరు అవిశ్వాసానికి ఒడిగట్టి, అవిశ్వాసులుగానే మరణించారో వారిలో ఎవరయినాసరే భూమి నిండా బంగారం సమర్పించినా, తమ పాపానికి పరిహారంగా ఇచ్చినాసరే అది స్వీకారయోగ్యం అవదు. వ్యధాభరితమైన శిక్షకు పాత్రులయ్యే వారంటే వీరే. వీరిని ఆదుకునే వాడెవడూ ఉండడు” అని ఖురాన్ ఒక సమాచారాన్ని ఇస్తుంది. 4:137వ వాక్యాన్ని గమనించండి.

إِنَّ ٱلَّذِينَ ءَامَنُوا۟ ثُمَّ كَفَرُوا۟ ثُمَّ ءَامَنُوا۟ ثُمَّ كَفَرُوا۟ ثُمَّ ٱزْدَادُوا۟ كُفْرًا لَّمْ يَكُنِ ٱللَّهُ لِيَغْفِرَ لَهُمْ وَلَا لِيَهْدِيَهُمْ سَبِيلًا

“ఎవరు విశ్వసించి మళ్ళీ తిరస్కారులు అయ్యారో, మళ్లీ విశ్వసించి మళ్లీ తిరస్కార వైఖరికి ఒడిగట్టారో, ఆపైన తమ తిరస్కార వైఖరిలో పెచ్చరిల్లి పోయారో అలాంటి వారిని అల్లాహ్ ఎసేమిరా క్షమించడు. అటువంటి వారికి సన్మార్గం కూడా చూపడు”. 63:3వ వాక్యం చూడండి.

ذَٰلِكَ بِأَنَّهُمْ آمَنُوا ثُمَّ كَفَرُوا فَطُبِعَ عَلَىٰ قُلُوبِهِمْ فَهُمْ لَا يَفْقَهُونَ

"ఎందుకంటే వారు (మొదట) విశ్వసించి, ఆ తరువాత అవిశ్వాసానికి పాల్పడ్డారు. అందువల్ల వారి హృదయాలపై సీలు వేయబడింది. ఇక వారు ఏమీ అర్థం చేసుకోలేరు".

పైన పేర్కొన్న ఏడు వాక్యాల్లో నాలుగు గమనార్హ విషయాలు ఉన్నాయి. వాటిలో...

1. ఇస్లాం స్వీకరించి, తిరస్కరించిన వారి గురించి చెప్పబడిందన్నది,

2. 'అలాంటి వారిని అల్లాహ్ క్షమించడు, సన్మార్గం కూడా చూపడని హెచ్చరించటం,

3. ఇస్లాం తిరస్కారులకి పరలోక శిక్షల గురించి మాత్రమే హెచ్చరించటం.

ఈ ఏడు వాక్యాల ప్రకారం– పూర్వం నుండి ఇస్లాంలో ఉన్నవారే కాక, క్రొత్తగా ఇస్లాం స్వీకరించిన ముస్లిముల్లో ఎవరైనా ఇస్లాం నుండి బయటకి పోయినా వారికి ఇహలోక శిక్షను కాక, పరలోక శిక్షను గురించి మాత్రమే అల్లాహ్ చెప్పటం అత్యంత గమనార్హం.

ఖురాన్ శిక్షా స్మృతిలో ఇస్లాం ధరం తిరస్కారులకి 'మరణ దండన' వంటి అతి పెద్ద శిక్ష విధించాలని ఖురానులో ఏకోశానా పేర్కొనకపోవటం గమనార్హం. చివరికి అతిచిన్న శిక్ష అయిన ఏడు కొరడా దెబ్బలు కొట్టాలనే ఆదేశమూ లేకపోవటం మరింత గమనార్హం!!

ఖురాన్ ఇస్తున్న ఈ సమాచారం ప్రకారం– ధర్మాన్ని తిరస్కరించిన వారిని శిక్షించే అధికారం ఒక్క దైవానికి తప్ప, ధార్మిక చిన్నలకుగాని, పెద్దలకుగాని లేదని తేలిపోయింది.

లౌకిక చట్టాల ప్రకారం– మనుషులు చేసే సత్కర్మలకి సన్మానం, దుష్కర్మలకి దండన ఉంటుందన్నది అందరికీ తెలిసిందే. అదే ధార్మిక గ్రంథాల ప్రకారమైతే పాప–పుణ్యాలకి శిక్షా–బహుమానాలు ఇహంతోపాటు, పరంలోనూ ఉంటాయి.

అలాగే ఇస్లామీయ ధర్మశాస్త్రమైన షరియత్ కూడా కొన్ని రకాల పాప–పుణ్యాలకి ఇహలోకంలోనే శిక్షా–బహుమానాలు అమలు చేస్తుంది. దానికి సంబంధించి ఇస్లామీయ శిక్షాస్మృతిలో ఏవిధమైన నేరాలకి ఎలాంటి శిక్ష విధించాలో సుస్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. వాటిలో సాధారణ కొరడా దెబ్బల నుండి మరణ దండన వరకూ ఉన్నాయి.

గమనిక: కేవలం అవిశ్వాసానికి, మతత్యాగానికి, బహుదైవోపాసనకి విధించాల్సిన నిర్దిష్ట శిక్షను ఖురాన్ స్పష్టంగా నిర్దేశించలేదన్నది అత్యంత గమనార్హం!

ధర్మాన్ని ప్రజల నెత్తిన బలవంతంగా రుద్దాలా?

లేక

మనస్సులో దిగేలా మృదువుగా బోధించాలా?

ఇప్పటి వరకూ పరిశీలించిన ఖురాన్ ప్రబోధనలను బట్టి ఒక నిజమైన ధార్మికుడు విభేదాలను ఇహలోకంలోనే తొలగించి తీరాలని అనుకోకూడదు. సకల విభేదాల వాస్తవ పరిష్కారం పరలోకంలో అల్లాహ్ స్వయంగా చేస్తాడని ఖురాన్ సుస్పష్టంగా ప్రకటిస్తుంది. అంటే విభేదాలు తొలగించటం దైవం బాధ్యత. మరి విశ్వాసుల బాధ్యత ఏమిటి? అన్నది ప్రశ్న. దానికి ఖురాన్ ఇస్తున్న సమాధానం ఏమిటో 4:63వ వాక్యంలో చూడండి.

أُوْلَٰٓئِكَ ٱلَّذِينَ يَعْلَمُ ٱللَّهُ مَا فِى قُلُوبِهِمْ فَأَعْرِضْ عَنْهُمْ وَعِظْهُمْ وَقُل لَّهُمْ فِىٓ أَنفُسِهِمْ قَوْلًۢا بَلِيغًا

"వారి హృదయాలలో ఉన్నదంతా అల్లాహ్కు బాగా తెలుసు. కనుక (ఓ ప్రవక్తా!) వారిని (వారి అనుచిత మాటలను) పట్టించుకోకు. కాకపోతే వారికి బోధపరుస్తూ ఉండు. వారి ఆంతర్యాలు ఆమోదించేలా ప్రబోధిస్తూ ఉండు" అని అల్లాహ్ స్వయంగా తనకు దూరంగా ఉన్న దాసులకు తనకు దగ్గరగా ఉన్నదాసులు తన సందేశాన్ని ఏవిధంగా అందించాలో ఆజ్ఞాపిస్తున్నాడు.

ఒక విజయవంతమైన ప్రబోధకుని అంతిమ లక్ష్యం– తన ప్రబోధిత సత్యం ఎదుటివాడు అంగీకరించటం. దానికి విషయాన్ని ఎదుటివాని ఆంతర్యం అంగీకరించాలి. అందుకే దైవం విషయాన్ని ఆంతర్యాలు ఆమోదించేలా బోధించమంటున్నాడు. ఆంతర్యాలు ఎప్పుడు ఆమోదిస్తాయి? అన్నది ప్రశ్న.

దానికి సమాధానం చాలా వివరంగా చెప్పాల్సి ఉంటుంది. అయితే కొన్ని మౌలిక విషయాలు చెబుతున్నాను. మొదటిది– బోధకునిలో శ్రోతలపట్ల అపారమైన 'గౌరవ భావం' ఉండాలి. రెండు– తమ మేలుపట్ల అతనిలో 'చిత్తశుద్ధి' చూడాలి. మూడు– వాని ప్రబోధన 'తార్కికం'గా ఉండాలి. నాలుగు– 'ధార్మికం'గానూ ఉండాలి. అప్పుడు మాత్రమే విషయాన్ని శ్రోతల హృదయాలు ఆమోదిస్తాయి.

సకల ధార్మికుల తక్షణ కర్తవ్యం ఏమిటి?

ధార్మిక భేదాభిప్రాయాలు పూర్తిగా తొలగి ఏకాభిప్రాయం కుదిరితేనే ఎదుటి వారిని ప్రేమిస్తాం అనే ఆలోచన ఖురాన్ ప్రకారం నేరమని తేలిపోయింది. ఎదుటివారి ధార్మిక

విశ్వాసాలు ఎలా ఉన్నా మనం వారి పట్ల "బేషరతు" ప్రేమ కలిగి ఉండాలి. ఎదుటి వారు ఒకవేళ తప్పుడు విశ్వాసాలు కలిగి ఉంటే అది వారి సృష్టికర్తకు వ్యతిరేకంగానీ, మనకు వ్యతిరేకం కాదుకదా! అటువంటప్పుడు మనం ఎందుకు రగిలిపోవాలి?

మనం వారితో బేషరతు ప్రేమ కలిగి ఉంటే, దాని ఆధారంగా ఏర్పడిన సాన్నిహిత్యాన్ని బట్టి హితవు పూర్వకంగా అభిప్రాయ మార్పిడి చేసుకునే అవకాశం కూడా లభించవచ్చు కదా! ఆ సంభాషణలో మనం చెప్పింది సత్యమైతే వారు అంగీకరించవచ్చు, లేదా అంగీకరించక పోవచ్చు. అలాగే ఒకవేళ వారు చెప్పిందే సత్యమైతే మనకు ఇష్టమైతే మనం ఇంగీకరించవచ్చు లేదా అంగీకరించకపోవచ్చు. మన మధ్య మానవతా సంబంధాలు చెడిపోకుండా పరస్పరం సద్వర్తనులుగా మసలుకుంటే సరిపోతుంది కదా! ఇదే సకల ధార్మికుల తక్షణ కర్తవ్యం!

మనం అలా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఒక్క "సత్కర్మ"ల్లో పోటీ పడటం తప్ప, "మత సంబంధమైన విభేదాల పరిష్కారం" బాధ్యత అల్లాహ్ మనపై పెట్టకుండా తనపైనే పెట్టుకున్నాడు. మా షా అల్లాహ్! ఇది మానవాళి పట్ల అల్లాహ్ కారుణ్యానికి ప్రబల నిదర్శనం!

ఈ వాస్తవాన్ని గుర్తించకుండా విభేదాల పరిష్కారం కోసం ప్రయత్నించటం పరిష్కారం కాకపోతే పరస్పరం శతృత్వాలు పెంచుకొని ఇటు– ప్రజల దృష్టిలో, అటు– దేవుని దృష్టిలో నెరస్థులవుతున్నాం. దైవం మనందరికీ మన పరిధి (Domain)లో తప్ప, తన పరిధి (Domain)లో జోక్యం చేసుకొనే ఘోరనేరం నుండి కాపాడు గాక ఆమీన్ యా రబ్బిల్ ఆలమీన్!

భారత జాతి వికసించాలి! ప్రపంచ శాంతి వర్ధిల్లాలి!!

జై హింద్!

సజ్జన్ సమాజ్ స్థాపనకు తప్పనిసరి వ్యక్తిగత-సామూహిక విలువలు ఇవే!

I. వ్యక్తిగత నైతిక విలువలు (Personal Moral Values):

1. నిజాయితీ–సత్యసంధత (Honesty and Truthfulness): ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా నిజం మాట్లాడటం, వంచనకు దూరంగా ఉండటం.
2. ఆత్మనిగ్రహం–సహనం (Self-control and Forbearance): స్వార్థం, దురాశ, తుచ్ఛమైన కోరికలు మరియు కోపాన్ని అదుపులో ఉంచుకోవడం.
3. జవాబుదారీతనం–బాధ్యత భావం (Accountability and Responsibility): తను చేసే మంచి-చెడు చేష్టలకు తనే బాధ్యుడనే పూర్తిస్పృహ కలిగి ఉండటం.
4. ఆత్మావలోకనం–ఆత్మ విమర్శ (Introspection and Self-criticism): నిత్య జీవితంలో తన ప్రవర్తనను తనే బేరీజు వేసుకుంటూ, తప్పులను సరిదిద్దుకునే గుణం.
5. వినమ్రత–విధేయత (Humility and Obedience): అహంకారానికి దూరంగా ఉంటూ, తోటివారితో గౌరవంగా మరియు ప్రేమగా ప్రవర్తించడం.

II. సామూహిక మానవతా విలువలు (Collective Humanitarian Values):

1. సహానుభూతి–దయ (Empathy and Compassion): ఎదుటివారి కష్టాలను, బాధలను మనవిగా భావించి స్పందించడం, తోటివారికి సాయం చేయడం.
2. సమానత్వం–సమ్మిళితత్వం (Equality and Inclusivity): మనుషులందరినీ కుల, మత, వర్గ భేదాలు లేకుండా సమానంగా చూడటం, అందరి క్షేమాన్ని కోరడం.
3. సహకారం–సహజీవనం (Cooperation and Coexistence): ఎవరికీ ఎలాంటి హాని తలపెట్టకుండా, అందరి హక్కులను గౌరవిస్తూ ప్రశాంతంగా జీవించడం.
4. సఖ్యత–ఐక్యత (Harmony and Unity): సమాజ శ్రేయస్సు కోసం, విపత్కర పరిస్థితుల్లోనే కాక, సాధారణ పరిస్థితుల్లో సైతం అందరూ కలిసికట్టుగా ఉండటం.
5. న్యాయము–నిష్పక్షపాతము (Justice and Fairness): ఎవరికీ అన్యాయం చేయకుండా, సమాజంలో ధర్మానికి మరియు నిబద్ధతకు కట్టుబడి ఉండటం.

ఈ విలువలను ఆచరణలో పెడితేనే వ్యక్తి ఆంతర్యం నుండి, అంతర్జాతీయం వరకూ సకల మానవ జీవన రంగాల్లో శాంతీ–సుస్థిరతలు సాధించటం సుసాధ్యమౌతుంది.